సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 21

గురువారం 13-4-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

హస్తకళ

ఒక చదరపు అంగుళం తివాచీ అల్లాలంటే 197 దారపు ముడులు వేయాలి. ఓపికతో నిండిన ఈ పనిని స్త్రీలే నేర్చుకున్నారు. 'జైపూర్ రగ్స్' ఇవాళ 40 వేల మంది నేత కార్మికులతో రగ్గులు తయారు చేయిస్తుంటే వారిలో 30 వేల మంది స్త్రీలే ఉన్నారు. కోడలుగా ఆ ఇంట అడుగుపెట్టిన రుత్వి చౌదరి ఈ సంస్థను కొత్త పుంతలు తొక్కిస్తున్నారు.

స్త్రీల సారథ్యంలో స్త్రీలు నేసే తివాచీలు



రుత్వి చౌదరి

'ఇంట అడుగు పెట్టిన కోడలికి ఇంటి సభ్యుల కన్నా ఎక్కువ బాధ్యత ఉంటుంది. ఇంటి ఘనతను కోడలు నిలబెట్టగలదా లేదా అందరూ గమనిస్తారు. మా మామగారు ఎస్.కె.చౌదరి మొదలెట్టిన జైపూర్ రగ్స్ సంస్థలో డైరెక్టర్‌గా అడుగు పెడుతున్నప్పుడు అదేం సామాన్యమైన బాధ్యతని అనిపించలేదు. కాని సాధించగలననే అనుకున్నాను' అంటుంది రుత్వి చౌదరి. ఆడపడుచులు ఆశ, అర్చనలు అమెరికాలో జైపూర్ రగ్స్ సంస్థను నడుపుతుంటే మన దేశంలో భర్త యోగేష్ చౌదరితో కలిసి సంస్థను ముందుకు తీసుకెళుతోంది రుత్వి చౌదరి. 'నేను మొదటగా చెప్పాలనుకుంటున్నది ఏమంటే మాది విమెన్ సెంట్రిక్ ఆర్గనైజేషన్. మా సంస్థలో ప్రధాన బాధ్యతలన్నీ స్త్రీలే నిర్వహిస్తారు. మా దగ్గర అల్లే ప్రతి తివాచీ స్త్రీ తన బిడ్డను సింగారించినట్టే ఉంటుంది. చేతి అల్లికతో తయారయ్యే తివాచీలు ఇవి' అంటుందామె.





■ తొమ్మిది మందితో మొదలయ్యి

రుత్వి చౌదరి మామగారు ఎస్.కె.చౌదరి 1978లో కేవలం ఇద్దరు నేతగాళ్లతో, రెండు మగ్గాలతో, ఐదు వేల రూపాయల పెట్టుబడితో జైపూర్ రగ్స్‌ను స్థాపించాడు. చాలా కాలం వరకు ఇది కేవలం విదేశాలకే రగ్గులు పంపేది. 2006లో కొడుకు యోగేష్ చౌదరి పగ్గాలు స్వీకరించాక దేశీయ మార్కెట్‌లోకి అడుగుపెట్టింది.

రుత్వి చౌదరి వచ్చాక సంప్రదాయిక డిజైన్లకు డిజైనర్ల సృజన జత చేయడంతో కొత్త తరాన్ని ఆకట్టుకునేలా ఇవి తయారవుతున్నాయి. 'ఐదు రాష్ట్రాల్లో 600 గ్రామాల్లో దాదాపు 30 వేల మంది మహిళా నేత కార్మికులు తివాచీలు తయారు చేస్తారు. రాజస్తాన్‌లాంటి చోట దేశీయ తివాచీ డిజైన్లు అద్భుతంగా ఉంటాయి. కాని చాలామటుకు మూసగా కనిపిస్తాయి. నేను ఈ సాంప్రదాయికతను చెడగొట్టదలుచుకోలేదు. కాని డిజైనర్ల సృజన జత చేయాలనుకున్నాను. హిరేన్ పటేల్, ఆషిష్ షా, శాంతను గార్గ్‌లాంటి వాళ్ల చేత కొత్త డిజైన్లు, పాట్రన్లు ఈ దేశవాళి డిజైన్లకు జత చేశాను. మా మహిళా నేతగత్తెలు వాటిని వెంటనే అందుకున్నారు. ఈ కాలపు యూత్‌ను కూడా ఆకర్షించేలా తయారు చేశారు' అంది రుత్వి.

■ స్త్రీలకు దక్కిన మర్యాద

'తివాచీ ఇంటిని దగ్గరగా కూడేలా చేస్తుందంటారు పర్షియన్లు. ఆ సంగతి ఏమో కాని వేల మంది స్త్రీలను మేము ఒక కుటుంబంగా చేయగలిగాము. రాజస్థాన్‌లో తివాచీల నేత వల్ల స్త్రీలకు గౌరవం పెరిగింది. అన్నింటి కంటే ముఖ్యం వలసలు ఎంతో తగ్గాయి. భార్య సంపాదిస్తూ ఉండటంతో భర్త కూడా బుద్ధిగా పని చేయడం మొదలెట్టాడు. ఈ అన్ని కారణాల వల్ల మా నేతమ్మలు మా సంస్థను ఎంతో ప్రేమిస్తారు. మేము కూడా వారిని ఎక్కువ విసిగించం. మెటీరియల్ ఇచ్చి సరుకును బదులుగా తీసుకుంటాం. వర్క్ ఫ్రమ్ హోమ్. వారికి వీలున్నప్పుడే పని చేయొచ్చు. అంతర్గతంగా ఏదైనా సమస్య వస్తే చర్చించుకోవడానికి పరిష్కరించుకోవడానికి 'తనా-బనా' అనే సొంత యాప్ ఉంది. అందులో సత్వర పరిష్కారాలు చెబుతాం' అంటుంది రుత్వి.

■ జర్మనీలో అవార్డ్

జైపూర్ రగ్స్ సంస్థ తాను ఇచ్చే డిజైన్లనే కాక మహిళలను వారి మనసుకు నచ్చిన డిజైన్లతో వినూత్నమైన తివాచీలను అల్లే వీలు కల్పిస్తుంది. వీటిని 'మన్‌చాహా' తివాచీలు అంటారు. ఇలాంటి తివాచీలకు ఎక్కువ సమయం (కొత్త డిజైన్ ఆలోచించాలి కనుక) పడుతుంది కాబట్టి ఎక్కువ మంది ట్రై చేయరు. కాని ప్రతిభ ఉన్న మహిళలు పాశ్చాత్యులను సైతం అబ్బురపడేలా డిజైన్లు చేస్తారు. వీటి ధర కూడా ఎక్కువే ఉంటుంది. 2018లో బిమలా దేవి అనే నేతమ్మ అల్లిన తివాచీకి ఫ్రాంక్‌ఫర్ట్‌లో 'జెర్మన్ డిజైన్ అవార్డ్' దక్కింది. 'మన వారి ప్రతిభను అలా ప్రపంచ దేశాలకు చాటుతున్నాం. మా మహిళలు తయారు చేస్తున్న తివాచీలు ఇప్పుడు 80 దేశాలకు ఎగుమతి అవుతున్నాయి' అని తెలిపింది రుత్వి.

ఈ సంస్థలో ఒకసారి కొంతమంది స్త్రీలు 30 అడుగుల పొడవు 40 అడుగుల వెడల్పు తివాచీని అల్లారు. దీని కోసం కోటీ 40 లక్షల దారపు ముడులను వేయాల్సి వచ్చింది. 'మేము తయారు చేసిన వాటిలో అది అత్యంత ఖరీదైనది. దానిని సౌది రాజుకు అమ్మాం' అని తెలిపింది రుత్వి. 'దళారులను తొలగించి వారి కమీషన్ కూడా స్త్రీలకే అప్పజెప్పడం వల్ల వారూ మేమూ సంతృప్తిగా ఉన్నాం' అని ముగించిందామె.

ఆమె... ఒక్క మాటతో పొట్ట చెక్కలయ్యేలా చేయగలదు. ఒక్క పాటతో కళ్లు కన్నీటి చెరువయ్యేలా చేయగలదు. అదే పాటతో హుషారు ఉత్తుంగ తరంగమయ్యేలా చేయగలదు. ముంబైకి చెందిన 24 సంవత్సరాల సృష్టి తవాడే రైటర్, పోయెట్, ర్యాపర్, సెటైరిస్ట్‌గా తన ప్రత్యేకతను చాటుకుంటోంది...

పేరు వినిపిస్తే చాలు...



● మల్టీ టాలెంట్

సృష్టి తవాడే తల్లికి కీర్తనలు అంటే ఎంతో ఇష్టం. పాడడమే కాదు రాసేది కూడా. డైరీల నిండా ఆమె రాసిన కీర్తనలే కనిపించేవి. ఒకసారి తల్లి రచనలో నిమగ్నమై ఉన్నప్పుడు...

'ఇలా రాస్తే ఏం వస్తుంది?' అని అడిగింది సృష్టి.

'నువ్వు రాస్తే తెలుస్తుంది' అని చెప్పి తన రచనలో నిమగ్నమైపోయింది తల్లి.

కోవిడ్ సమయంలో సృష్టికి బోలెడు తీరిక దొరికింది. ఇంగ్లీష్ సాహిత్యంలో పోస్ట్-గ్రాడ్యుయేషన్ చేసిన సృష్టి పాత పాఠ్యపుస్తకాలను పదే పదే తిరగేసింది. ఒకరోజు తనకు కూడా రాయాలనిపించింది. అంతే...అప్పుడు పట్టుకున్న కలాన్ని మళ్లీ వదలలేదు. రచన చేయడంలో ఉండే మజా ఏమిటో సృష్టికి స్వయంగా తెలిసి వచ్చింది.

'మనల్ని మనం వ్యక్తీకరించుకోవడానికి కవిత్వం, కథలు బలమైన సాధనాలు' అనే వాస్తవం బోధపడింది.

కవిత్వం, వచనం, పాట, సెటైర్... ఇలా ఎన్నో రాసింది. ఆమె మాటల్లో చెప్పాలంటే 'ఏదీ వదలలేదు!'

అయితే సృష్టి రాసిన పాటలు ఇంటి నాలుగు గోడలకే పరిమితం కాలేదు. చిల్లీ కిండా గై, మై నహీతో కౌన్... మొదలైన పాటలతో ఇంటర్నెట్ సెన్సేషనల్‌గా మారింది సృష్టి.

మై నహీతో కౌన్... పాటను హిందీతో పాటు ఇంగ్లీష్, మరాఠీ, బెంగాలీ, హర్యాన్వీ భాషల్లోనూ పాడింది.

ముంబైలోని నేషనల్ ఇంగ్లీష్ హైస్కూల్, ఎస్ఎన్‌డీటీ కాలేజీలో చదువుకున్న సృష్టికి ర్యాప్ అండ్ పాప్ కల్చర్ కొత్త కాదు.

> **ఆమె పాడుతుందా, సెటైర్‌లతో నవ్విస్తుందా, డ్యాన్స్‌తో షేక్ చేస్తుందా? అనేది ఎవరికీ తెలియదు. అయితే అందరిలోనూ ఒక ఎనర్జీ వస్తుంది. అదే... సృష్టి తవాడే విజయం.**

తన పాటలతో సృష్టి ఇంటర్నెట్‌లో ప్రాచుర్యం పొందడం ఒక ఎత్తయితే ఎంటీవీలో అవకాశం మరో ఎత్తు.

మన దేశంలోని తొలి ర్యాప్, హిప్-హాప్ రియాల్టి షో ఎంటీవీ హాజిల్‌తో సృష్టి తవాడే పేరు అంతర్జాతీయ స్థాయికి వెళ్లింది. ఇది తనకు ఊహించని గుర్తింపు!

'ఆరోజుల్లో పాటలు ఎంత బాగుండేవో! అనే మాట తరచుగా వినిపిస్తూ ఉంటుంది. దీనికి కారణం ఆ రోజుల్లో రచన ప్రక్రియ అనేది ఒక యజ్ఞంలా సాగేది. ఇప్పుడు డెడ్‌లైన్‌లే పాటలు రాయిస్తున్నాయి. అందుకే ఆలస్యం అయినా సరే బాగా ఆలోచించాకే పాట రాయాలని నిర్ణయించుకున్నాను. అది సత్ఫలితాన్ని ఇస్తోంది' అంటున్న సృష్టి దగ్గర పాటకు సంబంధించిన బోలెడు ఐడియాలు ఉన్నాయి.

అయితే అన్ని ఐడియాలను తప్పనిసరిగా ర్యాప్ అండ్ పాప్‌లోనే జోడించాలనుకోవడం లేదు. ఫన్నీ ర్యాపర్‌గా ప్రయాణం మొదలు పెట్టిన సృష్టి సామాజిక అంశాలను కూడా పాటల్లోకి తీసుకువస్తోంది. మ్యూజిక్ ప్యారడీలలో కూడా పనికొచ్చే మాటలను జత చేస్తుంది.

డ్యాన్స్ నుంచి ఉపన్యాసం వరకు... సృష్టి చిన్నప్పటి నుంచే స్టేజీ పర్సన్. స్టేజీ ఫియర్ అనేది ఆమె నిఘంటువులోనే లేదు. తన భయమల్లా...'షో విఫలమైతే!' అనేది. సృష్టికి అలాంటి సందర్భం ఇంతవరకు ఎదురు కాలేదు. సృష్టి పేరు వినిపిస్తే, స్టేజీ మీద కనిపిస్తే... సెల్ఫ్-టాట్ ర్యాపర్, కామెడిక్ గ్యాంగ్‌స్టర్‌లాంటి మెచ్చుకోళ్లు ప్రేక్షకుల నుంచి వినిపిస్తాయి.

ఆమె పాడుతుందా, సెటైర్‌లతో నవ్విస్తుందా, డ్యాన్స్‌తో షేక్ చేస్తుందా? అనేది ఎవరికీ తెలియదు. అయితే అందరిలోనూ ఒక ఎనర్జీ వస్తుంది. అదే... సృష్టి తవాడే విజయం. కొత్త అంశాలను పాటలో ఆవిష్కరించడం ఆమె బలం.

సమ్మర్ టిప్స్

ఎండాకాలం వచ్చిందంటే స్విమ్మింగ్ పూల్స్ నిండుగా కనిపిస్తాయి. ఈత దేహానికి చక్కటి వ్యాయామం మాత్రమే కాక ఎండ నుంచి చక్కటిసాంత్వన కూడా కలుగుతుంది. పైగా పిల్లలకు సెలవులు వచ్చేస్తాయి. ఇవన్నీ కలిసి అందరినీ స్విమ్మింగ్ పూల్స్ వైపు అడుగులు వేయిస్తాయి. జాగ్రత్తలు తీసుకోకుంటే కొన్ని ప్రత్యేకమైన రుగ్మతల బారిన పడే ప్రమాదముంది.

- పూల్‌లోని నీటిని మింగకూడదు. పిల్లలు నీటిలో ఉక్కిరిబిక్కిరి అయినప్పుడు నీటిని మింగేస్తారు. అలా జరిగిన రోజే డాక్టరును సంప్రదించి ఇన్‌ఫెక్షన్ సోకకుండా ముందస్తుగా వేసుకునే మందులు వాడాలి.



- డయేరియా వంటి వ్యాధులున్నప్పుడు, వచ్చి తగ్గిన వెంటనే కూడా స్విమ్మింగ్ చేయకూడదు. సంబంధిత బ్యాక్టీరియా నీటిలో చేరి తర్వాత పూల్‌లో దిగిన వాళ్లకు సోకే అవకాశం ఉంటుంది.

అవును... మిద్దెలపై డబ్బులు కాస్తాయి!!

గ్రీన్ లైఫ్



● రమాదేవి

ఆరోజు మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు కొని ఇంటికి తీసుకువచ్చింది కేరళలోని కొట్టాయంకు చెందిన రెమాదేవి. కూరగాయలను కడుగుతున్నప్పుడు ఒకరకమైన రసాయనాల వాసన వచ్చింది. ఆ సమయంలో పిల్లలు, వారి భవిష్యత్ గుర్తుకు వచ్చింది. అదే సమయంలో తాను ఒక నిర్ణయం తీసుకుంది...

'ఇంటికి అవసరమైన కూరగాయలు ఇంటిదగ్గరే పండించుకుంటాను'

అలా మిద్దెతోటకు శ్రీకారం చుట్టింది రెమాదేవి. అమ్మమ్మ రంగంలోకి దిగింది. సేంద్రియ వ్యవసాయంలో అమ్మమ్మది అందెవేసిన చేయి. ఆమె సలహాలు, సూచనలతో మిద్దెతోట పచ్చగా ఊపిరిపోసుకుంది. కొంత కాలానికి... ఇంటి అవసరాలకు పోగా మిగిలిన కూరగాయలను అమ్మడం మొదలుపెట్టారు. తమకు ఉన్న మరో రెండు ఇండ్లలోనూ మిద్దెతోట మొదలుపెట్టింది రెమాదేవి. అలా ఆదాయం పెరుగుతూ పోయింది.

మిద్దెతోటపై ఆసక్తి ఉన్న వాళ్లు రెమాను రకరకాల సలహాలు అడిగేవారు. ఇలాంటి వారిని దృష్టిలో పెట్టుకొని 'రెమాస్ టెర్రస్ గార్డెన్' పేరుతో యూట్యూబ్ చానల్ మొదలుపెట్టింది. 'మిద్దెతోటకు పెద్దగా ఖర్చు అక్కర్లేదు' అని చెబుతూ ఆ తోటపెంపకానికి సంబంధించిన ఎన్నో విషయాలను అరటిపండు వలిచి చేతిలో పెట్టినట్లు చెబుతుంది. వంటగది వ్యర్థాలతో మనకు కావల్సిన ఎరువులు ఎలా తయారు చేసుకోవచ్చో వీడియోల ద్వారా చూపుతుంది. దీంతోపాటు సోషల్ మీడియా ఫార్మింగ్ గ్రూప్స్ ద్వారా విత్తనాలు అమ్ముతుంది రెమాదేవి. కేవలం విత్తనాల అమ్మకం ద్వారానే నెలకు 60,000 రూపాయల ఆదాయం అర్జిస్తుంది.

రెమాదేవిని అనుసరించి ఎంతోమంది మిద్దెతోటలను మొదలుపెట్టి రసాయన-రహిత కూరగాయలను పండించడమే కాదు, తగిన ఆదాయాన్ని కూడా గడిస్తున్నారు. మంచి విషయమే కదా!

బ్యూటిప్

వార్ధక్యమా... అప్పుడేనా!

వార్ధక్యం దగ్గరవుతోందని తొలి హెచ్చరిక జారీ చేస్తూ, వార్ధక్య లక్షణాలకు అద్దం పట్టే తొలి అవయవం చర్మమే. అందుకే వార్ధక్యాన్ని దూరం చేసే ట్రీట్‌మెంట్‌లు మొదట చర్మానికే చేయాలి. ఇంట్లోనే చేసుకోగలిగిన ట్రీట్‌మెంట్‌ను చూద్దాం.

రెండు టీ స్పూన్‌ల బొప్పాయి గింజలను పేస్ట్ చేసి అందులో టీ స్పూన్ కొబ్బరి నూనె, టీ స్పూన్ తేనె, అర టీ స్పూన్ నిమ్మరసం కలపాలి. ముఖాన్ని సబ్బుతో శుభ్రంగా కడిగి తేమ ఆరిన తరవాత ఈ ప్యాక్‌ను ముఖానికి పట్టించాలి. పది లేదా పదిహేను నిమిషాలకు పూర్తిగా ఆరిపోతుంది. ఆరిన తర్వాత గోరువెచ్చటి నీటితో శుభ్రం చేయాలి. ఈ మిశ్రమాన్ని చేతులకు కూడా రాసుకోవచ్చు. బొప్పాయి గింజలు కొలాజెన్ నిర్మాణానికి దోహదం చేస్తాయి, కాబట్టి ముఖం మీద ముడతలను తొలగించడంలో బాగా పనిచేస్తాయి. ఈ ప్యాక్ రోజంతా ముఖాన్ని తేమగా, తాజాగా ఉంచుతుంది.



సైబర్ టాక్

డేటా జాగ్రత్త!

సుస్మిత (పేరు మార్చడమైనది)కు తను ఏ లావాదేవీ చేయకుండానే తన అకౌంట్ నుంచి డబ్బు డెబిట్ అయినట్టుగా మెసేజ్ రావడంతో షాక్ అయ్యింది. ఇంట్లో వాళ్లకి చెబితే తిడతారని భయపడింది. కానీ, నెల నెలా కొద్ది కొద్దిగా పోగయిన మొత్తం ఒకేసారి పోవడంతో స్నేహితురాలికి చెప్పి బాధపడింది. డబ్బు డెబిట్ అవడానికి ముందు ఏం జరిగిందో చెప్పమని అడిగితే సుస్మిత తనకు సంబంధించిన డేటా మోసగాళ్లకు ఎలా అందించిందో తెలిసిపోయింది. సుస్మిత ఫోన్‌కు ఏదో లాటరీ గెలుచుకున్నట్టు మెసేజ్ రావడంతో అదృష్టాన్ని పరీక్షించుకుందామని ఆ మెసేజ్‌ను ఓపెన్ చేసి తన పేరు, ఫోన్ నెంబర్.. వంటి వివరాలు ఇచ్చింది. అదే ఆమెకు సంబంధించిన డేటా మోసగాళ్లకు దొరికేలా చేసింది.

•••

సుస్మితలాగ ఇలా అపరిచిత మెసేజ్‌లకు స్పందించడమే కాకుండా కొందరు సరైన జాగ్రత్తలు తీసుకోకుండా ఆన్‌లైన్ ద్వారా కూడా తమ డేటాను మోసగాళ్లకు అందిస్తుంటారు. లేదా మోసగాళ్లే బాధితుల డేటా రాబట్టడానికి లేదా ఉల్లంఘనలకు పాల్పడుతుంటారు. డేటా రక్షణ చర్యలు తీసుకోకపోతే ఆర్థిక నష్టాలే కాదు పరువు నష్టానికి కూడా దారితీయవచ్చు.

ఇటీవల వ్యక్తిగత, సంస్థల డేటాకు సంబంధించిన మోసాలు పెరుగుతున్నాయని సైబర్‌క్రైమ్ నివేదిస్తుంది.

అందుకని, తమ డేటా బహిర్గతమైందని గుర్తించి వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయడం తప్పనిసరి. జీడీపీఆర్ (జనరల్ డేటా ప్రొటక్షన్ రెగ్యులేషన్) ప్రకారం డేటాకు సంబంధించిన ఏదైనా మోసం జరిగితే అందుకు తగిన జరిమానా, శిక్షలు కూడా అమలు చేసే అధికారం చట్టానికి ఉంది.



ప్రతీకాత్మక చిత్రం

కంపెనీలు సేకరించే డేటా...

- ఆన్‌లైన్ షాపింగ్ ద్వారా మనకు ఈ విషయం స్పష్టమవుతుంది.ఆన్‌లైన్ షాపింగ్ సైట్‌లో మన పేరు, ఇమెయిల్, డెలివరీ చిరునామా, ఫోన్ నంబర్, క్రెడిట్‌కార్డ్ వివరాలు, ఐపీ అడ్రస్, కొనుగోలు చేసిన వస్తువులు, అత్యధికంగా బ్రౌజ్ చేయబడిన ఉత్పత్తులు... ఇలా మన డేటా కంపెనీలకు చేరుతుంది.
- డేటింగ్ యాప్‌లో చేరితే... అందులో.. వయస్సు, లింగం, లైంగిక ధోరణి, ఫోన్‌నెంబర్, ప్రైవేట్ చాట్‌లు, పొలిటికల్ వ్యూస్, ప్రైవేట్ ఫొటోలు, ఇష్టాలు, డిజిటల్ పరికరం సమాచారం, ఐపీ అడ్రస్ వంటివి సేకరిస్తాయి.
- సోషల్ మీడియాలో పోస్ట్‌లు, ఫొటోలు, వీడియోలు, సందేశాలు, ఫైల్స్, ఫోన్ పరిచయాలు, పేరు, జెండర్, ఇమెయిల్, ప్లేస్, ఫోన్ నెంబర్, పుట్టిన తేదీ, రిలేషన్స్, ఫ్రెండ్స్, గ్రూప్స్, గ్రూప్ చాట్స్, పోస్ట్‌లు, ట్యాగ్ చేసిన ఫొటోలు, వీడియోలు .. ఇవన్నీ మీ వ్యక్తిగత డేటా కిందకు వస్తాయి.
- ఆన్‌లైన్‌లో సమాచారం కోసం సెర్చ్ చేస్తుంటాం. దీంట్లో బ్రౌజింగ్ హిస్టరీ, ఆన్‌లైన్ ఇష్టాలు, షాపింగ్ అలవాట్లు, ఐపీ చిరునామా, ప్లేస్, పాస్‌వర్డ్‌లు, క్రెడిట్‌కార్డ్‌లు, పరికరం సమాచారం, డౌన్‌లోడ్ చేసిన ఫైల్స్... వంటివి మోసగాళ్లకు చేరుతుంటాయి.

సరైన రక్షణ ఇలా..

వ్యక్తిగత సమాచారాన్ని షేర్ చేసేటప్పుడు అప్రమత్తత అవసరం.

- అల్ఫాన్యూమరిక్, ప్రత్యేక అక్షరాలను చేర్చి, స్ట్రాంగ్ పాస్‌వర్డ్‌లను ఉపయోగించాలి.
- వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్ (విపిఎన్)ని ఉపయోగించాలి.
- పేరొందిన యాంటీవైరస్, యాంటీ మాల్వేర్ సాఫ్ట్‌వేర్‌నే ఉపయోగించాలి.
- ఫిషింగ్ స్కామ్‌ల పట్ల జాగ్రత్త వహించాలి. షార్ట్ లింక్‌లపై ఎప్పుడూ క్లిక్ చేయవద్దు.
- సాఫ్ట్‌వేర్ /యాప్స్‌ను చట్టబద్ధమైన మూలాల నుండి మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- బ్రౌజర్‌ని అప్‌డేట్ చేయాలి. https:// తో మొదలయ్యే సురక్షిత వెబ్‌సైట్‌లను మాత్రమే యాక్సెస్ చేయాలి.
- https://mxtoolbox.com/EmailHeaders.aspx ని ఉపయోగించి వచ్చిన మెయిల్ హెడర్ సరైనదా కాదా అని నిర్ధారించుకోవాలి.
- మీరు ఉపయోగించే యాప్స్ మీ డేటాను ఎలా యాక్సెస్ చేస్తున్నాయో చెక్ చేయండి. ఇందుకు.. https://reports.exodus-privacy.eu.org/en/ ద్వారా చెక్ చేయాలి.
- https://smsheader.trai.gov.in/ ఉపయోగించి అనధికారక ఎసెమ్మెస్ పంపేవారి గురించి తెలుసుకోవచ్చు.

డేటాకు సంబంధించిన చట్టబద్ధత, న్యాయబద్ధత, పారదర్శకమైన ప్రయోజనాల గురించి తెలుసుకోవడమే కాదు, మీ చుట్టూ ఉన్న వ్యక్తులకు కూడా తెలియజేయాలి.

మీ డేటా సురక్షితంగా ఉందో లేదో తెలుసుకోవాలంటే..

ఈ కింది వెబ్‌సైట్‌లలో మీ ఇమెయిల్ లేదా ఫోన్‌నెంబర్ ద్వారా తెలుసుకోవచ్చు.

(a) https://amibeingpwned.com
(b) https://snusbase.com
(c) https://leakcheck.net
(d) https://leaked.site
(e) https://leakcorp.com/login
(f) https://haveibeensold.app

డేటా రక్షణ కోసం చట్టం

- భారతదేశంలో ఉన్న ఏకైక డేటా రక్షణ చట్టం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్, 2000(ఐటీ యాక్ట్). ఈ చట్టం ప్రకారం డేటా రక్షణం కోసం ఉపయోగించే కొన్ని సెక్షన్లు (ఎ) సెక్షన్ 69 (బి) సెక్షన్ 69ఎ (సి) సెక్షన్ 69బి.



ఇన్‌పుట్స్: **అనీల్ రాచమల్ల,**
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 21

గురువారం 13-4-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'



చెన్నైకు చెక్...

రాణించిన అశ్విన్, చహల్. మూడు పరుగులతో రాజస్తాన్ విజయం -12లో



7 వారాల గరిష్టానికి సూచీలు

సెన్సెక్స్ 245 పాయింట్లు ప్లస్.. ఐటీ, ఫార్మా, ఆటోషేర్లకు డిమాండ్ -13లో



సమైక్యంగా ఎన్నికలకు..

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఎదుర్కొనేందుకు రాహుల్, ఖర్గేతో నితీశ్ కుమార్, తేజస్వీ యాదవ్ కలసి సమాలోచనలు చేశారు

వివరాలు 6లో ▸



కర్ణాటక బీజేపీలో అసమ్మతి

బీజేపీ తొలి జాబితాలో కొత్త వారికి టికెట్లు లభించడంతో లక్ష్మణ్ సవాది, దొడ్డప గౌడ పాటిల్‌లు రాజీనామా అస్త్రం సంధించారు.

వివరాలు 6లో ▸



పంజాబ్‌లో కాల్పుల కలకలం

ఆగంతకుల కాల్పులతో పంజాబ్‌లోని భటిండా సైనిక శిబిరంలో శతఘ్ని దళానికి చెందిన నలుగురు జవాన్లు మరణించారు.

వివరాలు 6లో ▸



25న కోర్టుకు హాజరుకండి

'మోదీ ఇంటిపేరు వివాదం' కేసులో ఏప్రిల్ 25న కోర్టుకు హాజరవ్వాలని రాహుల్‌ని పట్నా కోర్టు బుధవారం ఆదేశించింది.

వివరాలు 6లో ▸

అక్కా.. ఇచ్చేశా..

లిక్కర్ స్కామ్‌లో మరో సంచలన లేఖ విడుదల చేసిన సుకేశ్





ఎమ్మెల్సీ కవితతో వాట్సాప్ చాట్ అంటూ స్క్రీన్ విడుదల

చాటింగ్‌లలోని కోడ్ నేమ్‌లతో వ్యక్తుల పేర్ల ప్రస్తావన

ఏకే అంటే కేజ్రీవాల్.. ఎస్‌జే అంటే సత్యేంద్రజైన్..

మనీశ్ అంటే మనీశ్ సిసోడియా.. ఏపీ అంటే అరుణ్ పిళ్లై

కేజ్రీవాల్, సత్యేంద్ర జైన్‌ల సూచన మేరకే కవితకు హైదరాబాద్‌లో రూ.15 కోట్లు ఇచ్చాను

నా దగ్గర 703 స్క్రీన్‌షాట్లు ఉన్నాయి.. రెండే విడుదల చేస్తున్నా..

దీనిపై దర్యాప్తు చేయాలని సీజేఐ, కేంద్ర హోంమంత్రి, సీబీఐ, ఈడీ డైరెక్టర్లకు విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: మనీలాండరింగ్ కేసులో జైలులో ఉన్న సుకేశ్ చంద్రశేఖర్.. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌కు సంబంధించి మరో సంచలన లేఖ విడుదల చేశారు. హైదరాబాద్‌లోని బీఆర్‌ఎస్ ప్రధాన కార్యాలయంలో ఏపీ అనే వ్యక్తికి రూ.15 కోట్లు అందజేశానంటూ గతంలో లేఖ రాయగా.. తాజాగా నేరుగా పేర్లను ప్రస్తావిస్తూ మరో లేఖను, వాట్సాప్ చాటింగ్‌ల స్క్రీన్ షాట్లను విడుదల చేశారు. ఆ సొమ్ము అందజేసే క్రమంలో ఎమ్మెల్సీ కవితతో పలుసార్లు కోడ్ పేర్లతో వాట్సాప్ చాటింగ్ చేశానని లేఖలో పేర్కొన్నారు. అంతేగాకుండా ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఆప్ నేతలకు, ఎమ్మెల్సీ కవితకు మధ్య ఆర్థిక సంబంధాలకు సంబంధించి తాను బయటపెట్టే అంశాల ఆధారంగా.. దర్యాప్తులో మరిన్ని విషయాలు వెలుగు చూస్తాయని వెల్లడించారు. తన దగ్గరున్న 703 వాట్సాప్ స్క్రీన్ షాట్‌లలో.. రెండింటిని విడుదల చేస్తున్నానని.. వీటిపై దర్యాప్తు చేయాలని సుప్రీం సీజే, కేంద్ర హోంమంత్రి, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్, సీబీఐ, ఈడీ డైరెక్టర్లను కోరారు.

సుకేశ్ లేఖలో పేర్కొన్న అంశాలివీ..

''ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన, అధికారంలో ఉన్న వ్యక్తులతోపాటు అవినీతిపై పలు ఏజెన్సీలు దర్యాప్తు చేస్తున్న

మిగతా 2వ పేజీలో ▶



బాణసంచా అంటుకుని కాలిపోతున్న గుడిసె.. (ఇన్‌సెట్లో) పేలిన సిలిండర్

కాళ్లు తెగి ముక్కలై..

బతుకుల్లో నిప్పు పెట్టిన బాణసంచా

వంటగ్యాస్ సిలిండర్ పేలి ముగ్గురు మృతి..

చీమలపాడులో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం వద్ద ప్రమాదం

- బాణసంచా పేల్చడంతో గుడిసెకు అంటుకున్న నిప్పు
- మంటలు ఆర్పేందుకు యత్నించిన కార్యకర్తలు, గ్రామస్తులు
- ఒక్కసారిగా పేలిన సిలిండర్.. అతివేగంగా దూసుకొచ్చిన శకలాలు
- ఏడుగురికి తెగిపోయిన కాళ్లు.. ముగ్గురు మృతి..
- ప్రభుత్వం నుంచి మృతుల కుటుంబాలకు రూ.10లక్షలు, క్షతగాత్రులకు రూ.2లక్షలు సాయం
- బీఆర్‌ఎస్ నుంచి రూ.5లక్షలు, రూ.2 లక్షలు ఇస్తామన్న ఎంపీ నామా
- ఘటనపై సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దిగ్భ్రాంతి

2లో



రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం తరపున ఎల్బీ స్టేడియంలో బుధవారం ఇచ్చిన ఇఫ్తార్ విందు సందర్భంగా చిన్నారులకు కానుకలు అందజేస్తోన్న సీఎం కేసీఆర్. చిత్రంలో హోంమంత్రి మహమూద్ అలీ తదితరులు

గంగాజమున సంస్కృతిని ఎవరూ మార్చలేరు

- ప్రయత్నించిన వారు అంతమవుడు ఖాయం
- దేశం సరైన నాయకుడు, పార్టీ కోసం చూస్తోంది
- పరిస్థితులను మార్చేందుకే దేశ రాజకీయాల్లోకి..
- రాష్ట్ర ప్రభుత్వ ఇఫ్తార్ విందులో సీఎం కేసీఆర్

- వివరాలు 3లో

కాటేస్తున్న కల్తీ కల్లు

మూడుకు చేరిన మృతుల సంఖ్య

- వణికిపోతున్న ఉమ్మడి పాలమూరు జిల్లా
- ఇప్పటికే కోడూరు వాసి మృతి.. తాజాగా ఇద్దరి మరణం.. మహబూబ్‌నగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మరికొందరు
- పరిస్థితి విషమించడంతో ఓ మహిళను నిమ్స్‌కు తరలింపు

- వివరాలు 5లో

కళ్లుండీ చూడలేని కబోదులు

ప్రతిపక్ష నేతలపై మంత్రి కేటీఆర్ ధ్వజం

- 8 ఏళ్ల కిందట ఈ సాగర్లు, రిజర్వాయర్లు ఉన్నాయా?
- లక్షల ఎకరాలు పచ్చగా ఉంటే కనిపించడం లేదా?
- అసలు కేసీఆర్ అంటేనే కాల్వలు, చెరువులు, రిజర్వాయర్లు.. మూడోసారి సీఎంగా కేసీఆర్ హ్యాట్రిక్ సాధించడం ఖాయం
- జిల్లెల్లలో వ్యవసాయ డిగ్రీ కళాశాల ప్రారంభం



సిరిసిల్ల: కాళేశ్వరం ప్రాజెక్టుతో ఒక్క ఎకరానికైనా నీరు ఇచ్చారా? అని ప్రతిపక్ష నేతలు అంటుంటే నవ్వొస్తోందని.. వారు కళ్లుండీ చూడలేని కబోదులు అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎనిమిదేళ్ల కిందట కొండపోచమ్మ సాగర్, మల్లన్న సాగర్, రంగనాయక సాగర్, అన్నపూర్ణ రిజర్వాయర్, రాజరాజేశ్వర రిజర్వాయర్ ఉన్నాయా? అని ప్రశ్నించారు. ఇవన్నీ నిండి లక్షల ఎకరాలకు నీళ్లు వచ్చి పొలాలు పచ్చగా ఉంటే.. వారికి కనిపించడం లేదా? అని నిలదీశారు. అసలు కేసీఆర్ అంటేనే కాల్వలు, చెరువులు, రిజర్వాయర్లు అని కేటీఆర్ అభివర్ణించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలో వ్యవసాయ డిగ్రీ కళాశాలను శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి ఎస్.నిరంజన్‌రెడ్డిలతో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. ముస్తాబాద్ మండలం

మిగతా 11వ పేజీలో ▶

'మార్గదర్శి' మోసాలివిగో

- చట్ట ఉల్లంఘనలపై దర్యాప్తు చేయండి..
- జాతీయ దర్యాప్తు సంస్థలకు సీఐడీ సూచన
- చిట్‌ఫండ్ ముసుగులో జరుగుతున్న అతిపెద్ద ఆర్థిక మోసాన్ని అడ్డుకున్నాం
- చందాదారుల సొమ్మును అక్రమంగా మళ్లించారు
- మార్గదర్శి వ్యవహారాలు సత్యం, శారద, సహారాకు ఏమాత్రం తీసిపోలేదు..
- మోసపూరిత ఆర్థిక సంస్థలను ఏమాత్రం ఉపేక్షించొద్దు
- గతంలోనే రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించిన 'సుప్రీం'

'చెక్కు'తో చిక్కారు!

- ఏటా మార్చి 31న రూ.వందల కోట్ల చెక్కులు చూపిస్తున్న మార్గదర్శి
- బ్యాలన్స్ షీట్‌లో కనిపించిన చెక్కులు
- 90 రోజులు దాటినా నగదుగా మారని వైనం

పిటిషనే లేకుండా వాదనలా?

- మార్గదర్శి మౌఖిక ప్రస్తావనను తప్పుబట్టిన ధర్మాసనం
- తనిఖీలపై ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమన్న తెలంగాణ హైకోర్టు

- వివరాలు 10లో ▶

విద్య అంతా ఇక క్రెడిట్సే

ఏ కోర్సు చేసినా ఏదో ఒక క్రెడిట్

- పాఠశాల విద్య నుంచీ ఇదే పద్ధతి.. జాతీయ స్థాయిలో క్రెడిట్ బ్యాంక్.. అదనపు కోర్సులు చేస్తే స్థాయిలో మార్పు
- అంతర్జాతీయ విధానంతో ముందుకు
- క్రెడిట్ ఫ్రేమ్ వర్క్‌పై యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ జగదీశ్‌కుమార్

- వివరాలు 14లో ▶

న్యూస్‌రీల్

ఐదంచెల దరఖాస్తు వ్యవస్థ



గురుకుల విద్యా సంస్థల్లో ఉద్యోగాల భర్తీకి సంబంధించి టీటీఆర్ఈఐఆర్‌బీ తీసుకొచ్చిన వన్ టైమ్ రిజిస్ట్రేషన్ (ఓటీఆర్) ప్రక్రియ బుధవారం నుంచి అందుబాటులోకి వచ్చింది. ఈ ఉద్యోగాలకు దరఖాస్తు ప్రక్రియ ఐదు అంచెల్లో కొనసాగనుంది.

- వివరాలు 14లో▶

ఏపీ రికార్డులు దాస్తోంది



'పోలవరం' బ్యాక్ వాటర్ ప్రభావంతో ముంపునకు గురయ్యే ప్రాంతాల విషయంలో ఏపీ ప్రభుత్వం వాస్తవాలను దాస్తోందని, అందువల్లే రికార్డులివ్వడం లేదని తెలంగాణ సర్కారు ఆరోపించింది. సీడబ్ల్యూసీ ఆదేశించినా రికార్డులు ఇవ్వడంలో జాప్యం చేయడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది.

- వివరాలు 11లో▶

అధికార ప్రతినిధులకు ఇంటర్వ్యూలు!



కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధులను ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేయాలని ఏఐసీసీ నిర్ణయించింది. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే 14న మంచిర్యాలకు వచ్చి వెళ్లిన తర్వాత ఈ నియామక ప్రక్రియ జరగనున్నట్లు తెలుస్తోంది.

- వివరాలు 3లో▶

దేశంలో సెకనుకో సైబర్ దాడి

దేశంలో ప్రతి సెకన్‌కో సైబర్ దాడి జరుగుతోందని సైబర్ క్రైమ్ నిపుణుడు పెండ్యాల కృష్ణశాస్త్రి పేర్కొన్నారు.

- వివరాలు 14లో▶

ఇదండీ జగత్



కష్టాల్లో ఉన్నాం.. పెళ్లొద్దు కానీ ఆ డబ్బులేవో మాకే ఇవ్వండని యువరైతులొచ్చార్సార్!!

నేడు, రేపు భగభగలే...!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగాయి. పలుచోట్ల 40 డిగ్రీల సెల్సియస్ కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉష్ణోగ్రతలు కాస్త తక్కువగా ఉన్నప్పటికీ మిగతా ప్రాంతాల్లో మాత్రం భానుడి ప్రతాపం కొనసాగింది. గురు, శుక్రవారాల్లో కూడా పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్ నుంచి 43 డిగ్రీల సెల్సియస్ మధ్యన ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. బుధవారం రాష్ట్రంలో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే... గరిష్ట ఉష్ణోగ్రత ఆదిలాబాద్‌లో 41.8 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 22.0 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది.

తెలంగాణ, ఏపీల్లోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	44.2	25.6
ఆదిలాబాద్	41.8	24.7
అనంతపురం	41.6	22.6
భద్రాచలం	41.0	26.5
విజయవాడ	41.0	25.0
రామగుండం	41.0	25.0
నిజామాబాద్	40.7	25.4
ఖమ్మం	40.6	23.6
మహబూబ్‌నగర్	40.5	24.4
నల్లగొండ	40.5	22.4
తిరుపతి	40.0	23.0
మెదక్	39.6	22.0
హనుమకొండ	38.5	23.5
హైదరాబాద్	38.2	23.9
హకీంపేట్	38.0	24.6
దుండిగల్	38.0	24.1

క్లుప్తంగా...

బొమ్మగాని మృతిపట్ల సురవరం సంతాపం

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి నల్లగొండ జిల్లా సూర్యాపేటకు చెందిన సీపీఐ సీనియర్ నాయకులు, స్వాతంత్య్ర సమరయోధుడు బొమ్మగాని వెంకటయ్య మృతిపై సీపీఐ అగ్రనాయకులు సురవరం సుధాకరరెడ్డి సంతాపం తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పార్టీ, గీత కార్మిక సంఘం బలోపేతానికి బొమ్మగాని వెంకటయ్య కృషి చేశారని గుర్తు చేశారు. నిజాం వ్యతిరేక పోరాటంలో సూర్యాపేట ఏరియా దళ కమాండర్‌గా పనిచేశారని, కొంత కాలం అజ్ఞాతంలో గడిపారన్నారు. తన సోదరుడు దివంగత బొమ్మగాని ధర్మభిక్షంతో కలిసి పార్టీ, ప్రజా సంఘాలలో పనిచేశారన్నారు.

'దిశ' కేసులో పోలీసులకు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: 'దిశ' హత్యాచార కేసు నిందితుల ఎన్‌కౌంటర్ వ్యవహారంలో 10 మంది పోలీసులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. నాటి సైబరాబాద్ సీపీ సజ్జనార్‌కు కూడా నోటీసులిచ్చింది. తదుపరి విచారణను జూన్ 21కి వాయిదా వేసింది. 2019, డిసెంబర్ 6న జరిగిన 'దిశ' కేసు నిందితుల ఎన్‌కౌంటర్‌కు సంబంధించి దాఖలైన పిటిషన్లపై హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎన్.తుకారాంజీల ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులపై సెక్షన్ 302 ప్రకారం కేసు పెట్టాలని పిటిషనర్ల తరపు న్యాయవాది కృష్ణమాచార్య వాదనలు వినిపించారు. పోలీస్ అధికారుల సంఘం తరపున సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు.

బీఆర్‌ఎస్ గుర్తింపు రద్దు చేయండి

సీఈసీకి రఘునందన్ రావు ఫిర్యాదు



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ పార్టీ గుర్తింపును రద్దుచేయాలని చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు బీజేపీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్ రావు ఫిర్యాదు చేశారు. మనీ లాండరింగ్ కేసులో కస్టడీలో ఉన్న సుఖేశ్ చంద్రశేఖరన్ లాయర్ ద్వారా చెప్పిన వివరాలను పరిగణనలోకి తీసుకుని చర్యలు చేపట్టాలని కోరారు. ఈ మేరకు ఈసీకి రఘునందన్‌రావు లేఖ రాశారు. ఢిల్లీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్ ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లోనే పార్టీ ఎమ్మెల్సీ స్టిక్కర్ ఉన్న 6060 వాహనంలో అరుణ్ పిళ్లై అనే పార్టీ నాయకుడికి పెద్దమొత్తంలో డబ్బు ఇచ్చారని ఆరోపించారు. ఇది మనీ లాండరింగ్ కిందకు వస్తుంది కాబట్టి లోతుగా దర్యాప్తు చేయాలని కోరారు.

ఈడీ అధికారులు ఢిల్లీకి సమాచారమిస్తామన్నారు

బీఆర్‌ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్ ఆవరణలో మనీలాండరింగ్ ద్వారా భారీ స్థాయిలో డబ్బులు చేతులు మారినందున దీనిపై తగిన విచారణ జరిపి బాధ్యులను ప్రాసిక్యూట్ చేయాలని హైదరాబాద్ జోన్ డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు రఘునందన్‌రావు ఫిర్యాదుచేశారు. బుధవారం అధికారులను కలిసి వచ్చాక ఈడీ ఆఫీసు బయట మీడియాతో మాట్లాడారు. సుఖేశ్‌కి, ఎమ్మెల్సీ కవితకి మధ్య జరిగిన వాట్సాప్ చాట్ ప్రింట్లు అందించామని, తన ఫిర్యాదుపై ఈడీ అధికారులు సానుకూలంగా స్పందించారని, ఢిల్లీ ఈడీ అధికారులకు సమాచారం ఇస్తామన్నారని చెప్పారు. తెలంగాణ భవన్‌లోకి ఎన్ని సార్లు 6060 రేంజ్ రోవర్ కార్ వచ్చిందో సీసీ టీవీ కెమెరాల దృశ్యాలను విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒకవేళ అదంతా అబద్ధం అయితే బయటికి వచ్చిన వాట్సాప్ చాటింగ్ నిజం కాదని పాలకులు ఎందుకు చెప్పట్లేదని ప్రశ్నించారు.



ఖమ్మం ఆస్పత్రిలో క్షతగాత్రుల బంధువుల రోదనలు..





భర్త గాయపడ్డాడని తెలిసి సొమ్మసిల్లిన సందీప్ భార్య



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

కాళ్లు తెగి ముక్కలై..

సిలిండర్ పేలి ముగ్గురు మృతి.. మరికొందరికి తీవ్ర గాయాలు | చీమలపాడులో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం వద్ద ఘోర ప్రమాదం

సాక్షిప్రతినిధి, ఖమ్మం/ కారేపల్లి: బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి ఏర్పాట్లు సిద్ధమయ్యాయి.. కార్యకర్తలు ఉత్సాహంగా ర్యాలీ తీశారు.. డప్పు చప్పుళ్లు, పూలు, బాణసంచా మధ్య సభావేదిక వద్దకు వచ్చారు.. కానీ బాణసంచా నిప్పురవ్వలు సమీపంలోనే ఉన్న పూరి గుడిసెపై పడ్డాయి. కాసేపటికే అగ్నికీలలు లేచాయి. కొందరు కార్యకర్తలు, విలేకరులు, పోలీసులు పరుగెత్తి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు.. అంతలోనే ఒక్కసారిగా భారీ పేలుడు.. కన్నుమూసి తెరిచేలోపే తెగిపడిన కాళ్లు, పాదాలు.. మాంసపు ముద్దలు.. రక్తపు మరకలు.. బాధితుల ఆర్తనాదాలు.. ఖమ్మం జిల్లా కారేపల్లి (సింగరేణి) మండలం చీమలపాడులో బుధవారం ఈ విషాద ఘటన జరిగింది. గుడిసెలోని సిలిండర్ పేలి ఆ శకలాలు అతివేగంగా దూసుకురావడంతో.. ఏడుగురికి కాళ్లు తెగిపోగా, మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి.

అంతా పది నిమిషాల్లోనే..

బుధవారం వైరా నియోజకవర్గం కారేపల్లి మండలం చీమలపాడులో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఎంపీ నామా నాగేశ్వర్‌రావు, వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ దీనికి హాజరవుతుండటంతో ఘనంగా స్వాగతం పలికేందుకు సిద్ధమయ్యారు. సభా ప్రాంగణానికి కొంతదూరం నుంచే డప్పు చప్పుళ్లతో ర్యాలీ నిర్వహించారు. ఉదయం 11.20 గంటలకు అంతా ప్రాంగణం వద్దకు వచ్చారు. ఈ సమయంలో కొందరు కార్యకర్తలు ఉత్సాహంగా బాణసంచా పేల్చారు. సుమారు వంద మీటర్ల దూరంలోని రాజన్న రాములుకు చెందిన గుడిసెపై నిప్పురవ్వలు పడ్డాయి. మెల్లగా అంటుకుని 11.30 గంటల సమయంలో ఒక్కసారిగా అగ్నికీలలు లేచాయి. అది చూసిన నేతలు, కార్యకర్తలు, విలేకరులు, పోలీసులు సుమారు 50 మంది గుడిసె వద్దకు చేరుకున్నారు. అప్పటికే సభా ప్రాంగణంలో ఉన్న ట్యాంకర్ నుంచి నీళ్లు పడుతూ గుడిసెపై చల్లడం మొదలుపెట్టారు. మంటలు కాస్త తగ్గినట్టే కనిపించినా.. 11.40 గంటలకు గుడిసెలోని సిలిండర్ పెద్ద శబ్దంతో పేలింది.

సిలిండర్ కింది ప్లేట్ దూసుకొచ్చి..

సిలిండర్ పేలి ముక్కలవడంతో దాని అడుగున ఉండే మందపాటి ప్లేట్ అత్యంత వేగంతో చక్రంలా గాల్లో ఎగురుతూ సభా ప్రాంగణంవైపు దూసుకొచ్చింది. దాని ధాటికి గుడిసె సమీపంలో ఉన్న కొందరికి కాళ్లు తెగి ముక్కలయ్యాయి. మరి కొందరికి లోతుగా తెగి మాంసం ఊడిపడింది. సుమారు 100 మీటర్ల పరిధిలో మాంసం ముద్దలు, రక్తం వెదజల్లినట్టుగా పడి భీతావహంగా మారింది. అంతా కొన్ని సెకన్లలోనే జరిగిపోయింది. కాళ్లు తెగి పడిన వారు హాహాకారాలు చేస్తున్న దృశ్యాలు అందరినీ కలచివేశాయి. పేలుడు జరిగినప్పుడు ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్యే రాములు నాయక్ కూడా స్టేజీపైనే ఉన్నారు. ఘటనా స్థలంలో ఉన్న పోలీసులు, కార్యకర్తలు వెంటనే గాయపడినవారిని పోలీసు, ప్రైవేటు వాహనాల్లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి, సంకల్ప ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

ముగ్గురు మృతి.. నలుగురి పరిస్థితి విషమం

ఈ దుర్ఘటనలో మొత్తం 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. అందులో ముగ్గురు మృతి చెందగా, నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. మరో నలుగురికి స్వల్పగాయాలు అయ్యాయి. మృతి చెందినవారిలో అజ్మీరా మంగు చీమలపాడు గ్రామపంచాయతీ 5వ వార్డు మెంబర్, బానోతు రమేశ్, ధర్మసోతు లక్ష్మా ఇద్దరూ బీఆర్‌ఎస్ కార్యకర్తలు. ఇక తీవ్రంగా గాయపడ్డవారిలో తేజావత్ భాస్కర్, అజ్మీరా హరిబాబు, నరాటి వెంకన్నలు బీఆర్‌ఎస్ కార్యకర్తలు. మిగతావారిలో ముగ్గురు విలేకరులు, ఒకరు సీఐ డ్రైవర్, మరొకరు మహారాష్ట్ర వలస కూలీ ఉన్నారు. క్షతగాత్రుల్లో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం.

ఖమ్మం ఆస్పత్రిలో మిన్నంటిన రోదనలు..

క్షతగాత్రులు, మృతుల కుటుంబీకులు, బంధువుల రోదనలతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి దద్దరిల్లిపోయింది. కాళ్లు తెగిపోవడంతో వ్యవసాయ కూలీలమైన తమకు జీవనాధారం ఎవరంటూ బాధితులు భోరుమన్నారు. ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు రాములునాయక్, సండ్ర వెంకటవీరయ్య, ఎమ్మెల్సీ తాతా మధు తదితరులు ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి క్షతగాత్రులను, మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. మరోవైపు బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలంటూ.. ఆస్పత్రి వద్ద ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు ఆందోళనకు దిగారు. దీంతో చాలాసేపు గందరగోళం నెలకొంది.

తీవ్ర గాయాలైనవారు

- సందీప్ (35), బాజుమల్లాయ్‌గూడెం, మహారాష్ట్ర వలస కూలీ (రెండు కాళ్లు పూర్తిగా పోయాయి. హైదరాబాద్‌లో చికిత్స)
- తేజావత్ భాస్కర్ (27), తవిసిబోడు (ఒక కాలు పోయింది. హైదరాబాద్‌లో చికిత్స)
- ఆంగోత్ రవి కుమార్(25), వెంకిట్యా తండా (కాలు తొలగించారు. హైదరాబాద్‌లో చికిత్స)
- దాసా నవీన్ (43), ముస్తఫానగర్, ఖమ్మం, కారేపల్లి సీఐ డ్రైవర్ (కాలు పూర్తిగా పోయింది. ఖమ్మంలో చికిత్స)

స్వల్ప గాయాలైన వారు

- తేళ్ల శ్రీనివాస్, రిపోర్టర్
- బండి రామారావు, రిపోర్టర్
- అజ్మీరా హరిబాబు, మూడ్‌తండా
- నరాటి వెంకన్న, చీమలపాడు

(వీరంతా ఖమ్మం, కారేపల్లి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు).



బానోత్ రమేశ్



అజ్మీరా మంగు



ధర్మసోతు లక్ష్మా

ప్రమాదంలో మృతులు

- బానోత్ రమేశ్ (39), స్టేషన్ చీమలపాడు (కాళ్లు తెగిపోయాయి. ఆస్పత్రిలో మృతి)
- అజ్మీరా మంగు (38), చీమలపాడు (కాళ్లు తెగిపోయాయి. ఆస్పత్రిలో మృతి)
- ధర్మసోతు లక్ష్మా (56), గేటు రేలకాయలపల్లి (కాలికి గాయంతో హైదరాబాద్ తరలిస్తుండగా మృతి)



ఎమ్మెల్యే రాములు నాయక్‌ను నిలదీస్తున్న క్షతగాత్రుల బంధువులు

కేసీఆర్, కేటీఆర్ దిగ్భ్రాంతి

సాక్షి, హైదరాబాద్: చీమలపాడు ఘటనపై బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంత్రి పువ్వాడ అజయ్, ఎంపీ నామాలకు ఫోన్ చేసి ఘటన వివరాలు తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఇక ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు, క్షతగాత్రులకు అండగా ఉంటామని మంత్రి కేటీఆర్ ప్రకటించారు. క్షతగాత్రులకు వారికి మెరుగైన చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని పార్టీ నేతలను ఆదేశించారు.

మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు: మంత్రి పువ్వాడ

కారేపల్లి మండలం చీమలపాడు ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, క్షతగాత్రులకు రూ.2లక్షల చొప్పున ఆర్థికసాయం ప్రభుత్వం తరఫున అందజేస్తున్నట్లు చెప్పారు. అలాగే క్షతగాత్రులు కోలుకునే వరకు పూర్తిగా ఉచిత వైద్యం అందిస్తామని పేర్కొన్నారు. కాగా, ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి పువ్వాడ.. జిల్లా నాయకులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అలాగే, క్షతగాత్రులకు అందుతున్న వైద్యంపై వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, వైద్యులతో మాట్లాడారు.

బీఆర్‌ఎస్ రూ.5 లక్షల సాయం

చీమలపాడు ఘటన బాధాకరమని ఎంపీ నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. పార్టీ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు.. బీఆర్‌ఎస్ తరఫున మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్టు ప్రకటించారు. అలాగే నామా ముత్తయ్య ట్రస్ట్ నుంచి మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ఇస్తున్నట్టు చెప్పారు. ఇక మృతుల కుటుంబాలకు రూ.2లక్షలు, గాయపడ్డవారికి రూ.లక్ష చొప్పన తాను వ్యక్తిగతంగా ఆర్థిక సాయం అందిస్తానని ఎమ్మెల్యే రాములునాయక్ ప్రకటించారు. దుర్ఘటన నేపథ్యంలో ఖమ్మం జిల్లాలో మూడు రోజులు సంతాప దినాలుగా పాటించనున్నట్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు తెలిపారు.

అక్కా.. ఇచ్చేశా..

▶ మొదటి పేజీ తరువాయి

వ్యక్తులకు మధ్య జరిగిన వాట్సాప్ చాటింగ్‌ల స్క్రీన్‌షాట్లను మీ దృష్టికి తీసుకొచ్చాను. నేను విజిల్ బ్లోయర్‌గా ఉండి ఇప్పటికే స్టేట్‌మెంట్లు ఇచ్చాను. నా దగ్గరున్న 703 వాట్సాప్ స్క్రీన్‌షాట్ల నుంచి రెండింటిని అందిస్తున్నా. దీనిపై లోతుగా దర్యాప్తు చేయాలని కోరుతున్నా. ఢిల్లీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్, మాజీ మంత్రులు సత్యేంద్ర జైన్, మనీశ్ సిసోడియా, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత, కైలాశ్ గెహ్లోత్‌లతో 2015 నుంచీ పలు లావాదేవీల్లో భాగస్వామిని అయ్యాను. దర్యాప్తు చేయదగిన పత్రాల్లో నేను చెప్తున్న అంశాలు కూడా కీలకమైనవే. అరవింద్ కేజ్రీవాల్, ఆయన సహచరులు.. సౌత్ గ్రూపు, ఇండోస్పిరిట్స్ సంస్థ యజమానులు అరుణ్ పిళ్లై, ఎమ్మెల్సీ కవితలతో చురుకుగా సంప్రదింపులు చేసినట్టు స్పష్టమవుతోంది. 2020లో కేజ్రీవాల్, సత్యేంద్ర జైన్‌ల సూచన మేరకు హైదరాబాద్‌లోని నా సిబ్బంది ద్వారా బీఆర్‌ఎస్‌కు చెందిన కవితకు డెలివరీ చేసిన లావాదేవీ చాటింగ్‌లు ఇవి. సత్యేంద్ర జైన్‌తో నా చాట్ వివరాలు జత చేశాను. కేజ్రీవాల్, సత్యేంద్ర జైన్‌ల సూచన మేరకు ఎమ్మెల్సీ కవితకు హైదరాబాద్‌లో రూ.15 కోట్లు ఇచ్చిన దానికి చెందిన చాటింగ్‌లు ఇవి. ఢిల్లీ మద్యం లైసెన్సుల నిమిత్తం కేజ్రీవాల్‌తో కవిత ఆర్థిక లావాదేవీలు జరిగాయి. కిక్‌బ్యాక్ అయిన మొత్తం హైదరాబాద్ నుంచి హవాలా రూపంలో పలు ఆసియా దేశాలకు (ఆప్‌కు అనుకూలంగా ఉన్న) పంపారు. ఢిల్లీ నుంచి ఎలాంటి లావాదేవీలు నిర్వహించరాదని కేజ్రీవాల్ ప్రత్యేకంగా పేర్కొన్నారు. దీంతో అన్ని క్యాష్ లావాదేవీలు కరోనా కాలంలో హైదరాబాద్ నుంచి చేపట్టారు'' అని సుకేశ్ తన లేఖలో పేర్కొన్నారు.

నాపై ఒత్తిడి ఉంది.. వెంటనే దర్యాప్తు చేయాలి..

ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ మంత్రి సత్యేంద్ర జైన్‌ల నుంచి తనపై, తన కుటుంబంపై తీవ్ర ఒత్తిడి ఉందని.. అందువల్ల తాను వెల్లడించిన అంశాలపై వెంటనే దర్యాప్తు చేయాలని సుకేశ్ లేఖలో కోరారు. దర్యాప్తునకు తాను పూర్తిగా సహకరిస్తానన్నారు. తనకు, ఆమ్‌ఆద్మీ పార్టీ, అర్వింద్ కేజ్రీవాల్‌కు మధ్య అనేక రకాల ఒప్పందాలు, వ్యాపార లావాదేవీలు ఉన్నాయన్నారు. ఢిల్లీ మద్యం విధానంపై దర్యాప్తు కొనసాగుతున్నందున.. అందులో ప్రమేయమున్న ఆప్, కేజ్రీవాల్, ఎమ్మెల్సీ కవిత మధ్య సంబంధాలను ఈ చాటింగ్ వివరిస్తుందని.. దర్యాప్తునకు తోడ్పడుతుందని వివరించారు. ఆప్ సీనియర్ నేతలతో జరిపిన అన్ని లావాదేవీల వాయిస్ రికార్డులు, ఇతర చాటింగ్‌లను అందించడానికి సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. ఎలాంటి ఒత్తిడి లేకుండా సొంతంగానే చాటింగ్‌ల వివరాలు అందిస్తున్నాని.. దీనిపై జోక్యం చేసుకోవాలని సీజేఐ, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్, కేంద్ర హోంమంత్రి, సీబీఐ, ఈడీ డైరెక్టర్లకు విజ్ఞప్తి చేశారు.

సత్యేంద్ర జైన్‌తో సుకేశ్ చాటింగ్‌గా పేర్కొన్న సంభాషణ ఇదీ

- బోలో

సుకేశ్: బ్రదర్ ఇంకో నంబర్ సరిగ్గా పనిచేయడం లేదు

- బ్యాటరీ లో

సుకేశ్: ఓకే బ్రో.. బ్రో నెయ్యి టిన్ రెడీ

- ఫుల్ కదా

సుకేశ్: ఎస్ బ్రో.. 15 కేజీలు

- దాన్ని హైదరాబాద్ సిస్టర్‌కు పంపించు

సుకేశ్: బ్రో ఢిల్లీలో కాదా?

- కాదు కాదు హైదరాబాద్‌లో..

సుకేశ్: ఓకే బ్రో.. పంపిస్తా..

- టైమ్?

సుకేశ్: రెండు గంటలు టైమ్ ఇవ్వండి

- సాయంత్రం ఐదు గంటలకల్లా ఇవ్వాలి

సుకేశ్: ఓకే బ్రో.. మరి బిగ్ బ్రోకు కూడా ఇన్‌ఫార్మ్ చేయండి.. లేదా నన్నే చేయమంటారా?

- ఏకే భాయ్‌కు తెలుసు.. ఆయన ఫేస్ టైమ్‌లో 3 గంటలకు మాట్లాడతారు

సుకేశ్: ఓకే మై బ్రో..



సుకేశ్ విడుదల చేసిన ఓ స్క్రీన్‌షాట్

కవితతో సుకేశ్ చాటింగ్‌గా పేర్కొన్న సంభాషణ ఇదీ

సుకేశ్: అక్కా మిమ్మల్ని డిస్టర్బ్ చేస్తున్నా.. కొన్ని వివరాలు కావాలి.

- హాయ్.. ఇపుడే మెసేజ్ చూశాను

సుకేశ్: ఇబ్బందేమీ లేదు అక్కా.. ఏకే ప్యాకేజీని మీకు ఇవ్వాల్సి ఉంది. నా దగ్గర సిద్ధంగా ఉంది.

- ఎస్.. ఓకే

సుకేశ్: దీన్ని జేహెచ్ ఇంటికి పంపించనా?

- వద్దు వద్దు. అరుణ్‌కు నేను ఫోన్ చేసి నీతో మాట్లాడుమని చెప్తా. దీన్ని ఆఫీస్‌కు పంపాల్సి ఉంటుంది.

సుకేశ్: ఓకే అక్కా.. మీరు చెప్పినట్లే చేస్తా..

- అతను కొద్దిసేపట్లో ఫోన్ చేస్తాడు.

సుకేశ్: సరే అక్కా.. ఎస్‌జే బ్రదర్ ఈ రోజే మీకు అందజేయాలని చెప్పారు.

- ఎస్

సుకేశ్: నేను కో–ఆర్డినేట్ చేసుకుంటా అక్కా.

- మీ వైపు నుంచి అంతా ఓకే కదా.. మీ డాడీకి ఆరోగ్యం ఎలా ఉంది?

సుకేశ్: డాడీ గురించి అడిగినందుకు కృతజ్ఞతలు అక్కా.. ప్రస్తుతం కీమో థెరపీ చేస్తున్నారు.

- ఆయన త్వరగా కోలుకుని రావాలని కోరుకుంటున్నా..

సుకేశ్: ఎస్ అక్కా.. దేవుడు కూడా అదే చేస్తాడని అనుకుంటున్నా..

- టేక్ కేర్.. నేను మళ్లీ మాట్లాడుతా..

సుకేశ్: ఒకే అక్కా మీ ఇష్టం ఎప్పుడైనా చేయండి. కేసీఆర్ గారిని అడిగినట్టు చెప్పండి

- నమస్తే (ఎమోజీ)

సుకేశ్: అక్కా డెలివరీ చేసేశాను

- ఓకే

సుకేశ్: అక్కా.. ఏకే గారికి లేదా ఎస్‌జేకు ఇన్‌ఫార్మ్ చేయండి

- మనీశ్‌తో మాట్లాడాను

సుకేశ్: ఓకే అక్కా.. థ్యాంక్స్

సుకేశ్ చాటింగ్‌లలో పేర్కొన్న కోడ్‌ల పేర్లు

చాట్-1లో..

ఏకే బ్రో: అరవింద్ కేజ్రీవాల్
ఎస్‌జే బ్రో: సత్యేంద్ర జైన్
మనీశ్: మనీశ్ సిసోడియా
అరుణ్: అరుణ్ పిళ్లై
జేహెచ్: జూబ్లీహిల్స్‌లోని కవిత నివాసం
ఆఫీస్: బీఆర్‌ఎస్ ప్రధాన కార్యాలయం
ప్యాకేజీ: రూ.15 కోట్ల నగదు

చాట్-2లో..

బ్రో: సత్యేంద్ర జైన్
15 కేజీల నెయ్యి: రూ.15 కోట్ల క్యాష్
25 కేజీల నెయ్యి: రూ.25 కోట్ల క్యాష్
హెచ్‌వైడీ: హైదరాబాద్
సిస్టర్: కవిత
ఏకే భాయ్: అరవింద్ కేజ్రీవాల్

ఆత్మీయ సమ్మేళనాల పేరుతో ఆటలాడకండి

- చీమలపాడు ఘటనపై రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి
- బాధితులను ఆదుకోండి: మాజీ ఎంపీ మల్లురవి



సాక్షి, హైదరాబాద్: ఆత్మీయ సమ్మేళనాల పేరుతో ప్రజల ప్రాణాలతో ఆటలాడొద్దని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి హితవు పలికారు. ఖమ్మం జిల్లా చీమలపాడులో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం సదర్భంగా జరిగిన దుర్ఘటనలో ముగ్గురు మృతి చెందడంపై రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనలో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుకున్నారు. ఈ ఘటనలో గాయపడిన వారికి మంచి వైద్య సేవలు అందించాలని, మృతుల కుటుంబాలను బీఆర్‌ఎస్ పార్టీ అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

చీమలపాడు ఘటనపై జిల్లా కలెక్టర్ సమగ్ర నివేదిక తెప్పించుకోవాలని, అసలు కారణాలను తెలుసుకుని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లు రవి డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆత్మీయ సమ్మేళనాల పేరిట భారీ ఎత్తున డబ్బు ఖర్చు పెడుతూ ఎన్నికల ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి, గాయపడిన వారికి రూ.25లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలన్నారు.


కారేపల్లి ఘటనపై బీజేపీ నేతల దిగ్భ్రాంతి

- బాధితుల కుటుంబాలను ఆదుకోవాలి
- బీఆర్‌ఎస్ నేతలపై హత్యాయత్నం కేసుపెట్టాలని డిమాండ్

సాక్షి, హైదరాబాద్: ఖమ్మం జిల్లా కారేపల్లి ఘటనపై బీజేపీ నేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధ్యులైన బీఆర్‌ఎస్ నేతలపై హత్యాయత్నం కేసు పెట్టాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, పార్టీనేతలు డీకే అరుణ, పొంగులేటి సుధాకరరెడ్డి, ఈటల రాజేందర్ వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా ఆత్మీయ సమ్మేళనాల సందర్భంగా బాణాసంచా పేల్చడంపై వారు మండిపడ్డారు. బీఆర్‌ఎస్ నేతల ఆనందం కోసం సామాన్య ప్రజల ప్రాణాలతో చెలగాటమాడతారా? అని బండి సంజయ్ ప్రశ్నించారు. మహబూబ్ నగర్ జిల్లాలో కల్తీ కల్లువల్ల కూడా ఒకరు మృతి చెందారని, పలువురు ప్రాణాపాయ స్థితిలో ఉన్నారని, ఇదంతా కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యమేనని విమర్శించారు. ఆత్మీయ సమ్మేళనాల పేరుతో ప్రజల ప్రాణాలు తీసే హక్కు బీఆర్‌ఎస్ నేతలకు ఎవరిచ్చారని డీకే అరుణ నిలదీశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కారేపల్లి ప్రమాదంలో మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను ఆదుకోవాలని ఈటల రాజేందర్, పొంగులేటి సుధాకరరెడ్డి డిమాండ్ చేశారు. చనిపోయిన వారి కుటుంబానికి, శాశ్వత అంగవైకల్యం పొందిన వారికి రూ.50 లక్షలు, గాయపడిన వారికి రూ.25 లక్షల నష్ట పరిహారం అందించాలన్నారు.

ఏడాదిలో రూ.212 కోట్ల ఆస్తులు బుగ్గిపాలు

- రెండేళ్లలో 70 మంది అగ్నికి ఆహుతి
- అగ్నిమాపకశాఖ డీజీ నాగిరెడ్డి వెల్లడి
- రేపటి నుంచి 20 వరకు అవగాహన కార్యక్రమాలు



సాక్షి, హైదరాబాద్: ప్రమాదాల కారణంగా 2022లో రాష్ట్రవ్యాప్తంగా రూ.212.36 కోట్ల విలువైన ఆస్తులు అగ్నికి ఆహుతైనట్టు అగ్నిమాపకశాఖ డీజీ నాగిరెడ్డి తెలిపారు. అదే ఏడాదిలో జరిగిన ప్రమాదాల్లో 45 మంది ప్రాణాలు కోల్పోయినట్టు వెల్లడించారు. 2021, 2022లో రాష్ట్రవ్యాప్తంగా నమోదైన అగ్నిప్రమాదాలు, జరిగిన ప్రాణ, ఆస్తి నష్టం.. ఫైర్ సిబ్బంది కాపాడిన క్షతగాత్రులు, ఆస్తుల వివరాలను బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 14న ఫైర్ సర్వీసెస్ డేను పురస్కరించుకుని వారం రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఈనెల 14 నుంచి 20 వరకు జరిగే కార్యక్రమాల్లో అగ్నిప్రమాదాల నుంచి బయటపడటమెలా అనే విషయమై అవగాహన కల్పించనున్నట్లు నాగిరెడ్డి తెలిపారు.

రెండేళ్లలో అగ్నిప్రమాదాల వివరాలు

అంశం	2021	2022
అన్ని రకాల అగ్నిప్రమాద ఘటనలు	7224	7942
ప్రాణాలు కోల్పోయిన వారు	25	45
ప్రాణాలతో బయటపడ్డ వారు	19	213
ఆస్తినష్టం (రూ.కోట్లలో)	200.88	212.36
అగ్ని ప్రమాదం నుంచి కాపాడిన ఆస్తులు (రూ.కోట్లలో)	996.75	723.14



కేసీఆర్‌కు భారీ చిత్రపటం బహూకరిస్తున్న ముస్లిం నేతలు



బుధవారం ఎల్బీ స్టేడియంలో జరిగిన ఇఫ్తార్ విందులో సీఎం కేసీఆర్. చిత్రంలో బాక్సర్ నిఖత్ జరీన్, సీఎస్ శాంతికుమారి, ఎంపీ అసదుద్దీన్, మంత్రి మహమూద్ అలీ తదితరులు

గంగాజమున సంస్కృతిని ఎవరూ మార్చలేరు

- ప్రయత్నించిన వారు అంతమవుడు ఖాయం
- దేశం సరైన నాయకుడు, పార్టీ కోసం వేచి చూస్తోంది... పరిస్థితులను మార్చేందుకే దేశ రాజకీయాల్లోకి ప్రవేశించా
- రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఇఫ్తార్ విందులో సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: 'ఈ దేశం మనందరిది. ఇక్కడి గంగాజమున సంస్కృతిని, ఆచార, సంప్రదాయాలను ఎవరూ మార్చలేరు. అలా ప్రయత్నించిన వారు అంతమవుతారు. దేశం మాత్రం నిలిచే ఉంటుంది'అని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఉద్ఘాటించారు. సమయం వచ్చినప్పుడు దేశాన్ని రక్షించుకోవడానికి శక్తిని కాకుండా యుక్తిని ప్రయోగించాలని పిలుపునిచ్చారు. ప్రతియేడు తరహాలోనే రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం తరపున నగరంలోని ఎల్బీ స్టేడియంలో సీఎం కేసీఆర్ బుధవారం ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఉర్దూలో మాట్లాడుతూ, తెలంగాణ కోసం పోరాడినట్లుగానే ఉజ్వల భారతం కోసం చివరి రక్తపు బొట్టువరకు పోరాడితే విజయం తథ్యమన్నారు. 'అల్లా కే ఘర్ దేర్ హై, లేకిన్ అంధేర్ నహీ'(దేవుడి ఆశీస్సులు ఆలస్యం కావచ్చు.. అంధకారం ఉండదు) అని ముక్తాయించారు. గట్టి సంకల్పంతో కార్యాన్ని ప్రారంభిస్తే గమ్యం చేరుకోవడానికి కొన్ని సందర్భాల్లో కొంచెం ఆలస్యం అవ్వొచ్చుగానీ, గమ్యాన్ని చేరుకోవడం మాత్రం ఖాయమని స్పష్టం చేశారు. 'దేశం అగమ్యగోచర స్థితిలో ఉన్నది. సరైన నాయకుని కోసం, పార్టీ కోసం వేచి చూస్తున్నది. దేశాన్ని రక్షించుకునేందుకు శాయశక్తులా కృషి చేద్దాం. మీ సహకారం ఉంటే చివరి వరకు పోరాడగలం. ఇది తాత్కాలిక దశ. తుదకు న్యాయమే గెలుస్తుంది. ప్రస్తుత దేశ రాజకీయాలను మార్చేందుకే నేను దేశ రాజకీయాల్లోకి ప్రవేశించాను. బీఆర్‌ఎస్ పార్టీకి మహారాష్ట్ర ప్రజలు ఘనంగా స్వాగతం పలుకుతున్నారు. నా అంచనాలకు మించి ప్రజాధారణ లభిస్తున్నది'అని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు.

అనాథ విద్యార్థులతో సీఎం ముచ్చట్లు

ఇఫ్తార్ విందుకు ముందు సీఎం కేసీఆర్ అనాథ పిల్లలతో కాసేపు ముచ్చటించారు. ఇంగ్లిష్‌లో సంభాషిస్తున్న విద్యార్థులను ఆయన అభినందించారు. బాగా చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని భుజం తట్టారు. కార్యక్రమంలో మంత్రులు మహమూద్‌అలీ, కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, సత్యవతి రాథోడ్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, క్రీడాకారులు సానియా మీర్జా, నిఖత్ జరీన్ పాల్గొన్నారు

రాష్ట్రం పురోగమనంలో.. దేశం తిరోగమనంలో..

'తొమ్మిది, పదేళ్ళ కింద మనల్ని వెనుకబడినవారిగా పరిగణించేవారు. కానీ నేడు అల్లా దయతో, మీ అందరి ప్రార్థనలతో మన రాష్ట్రానికి దేశంలోనే పోటీ లేదు. పార్లమెంటు వేదికగా కేంద్ర ప్రభుత్వమే ఈ విషయాన్ని వెల్లడించింది. రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 3,17,115కు, తలసరి విద్యుత్ వినియోగం 2,100 యూనిట్లకు పెరిగింది. పరిశ్రమలు, ఐటీ రంగంలో పురోగమిస్తున్న తీరును అందరూ గమనిస్తూనే ఉన్నారు. అసదుద్దీన్ ఒవైసీ తదితరులు కోరిన మేరకు అనీస్ ఉల్ గుర్బా(అనాథశ్రమం)ను అత్యద్భుతంగా నిర్మించుకున్నాం. మైనారిటీల సంక్షేమానికి కాంగ్రెస్ పదేళ్లలో రూ.1,200 కోట్లను ఖర్చు చేస్తే, బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.12,000 కోట్లు ఖర్చు చేసింది. ఇప్పుడు రైతుల ఆత్మహత్యలు లేవు. వలస వెళ్లిన రైతులు ఊళ్లకు తిరిగొచ్చారు. రాష్ట్రంలో 94 లక్షల ఎకరాల్లో వరి పంటను పండించుకుంటున్నామని గర్వంగా చెప్తున్నా. మొత్తం దేశంలో వరి సాగు విస్తీర్ణం కంటే ఒక్కతెలంగాణ వరి సాగు విస్తీర్ణం చాలా ఎక్కువ. తాగునీరు, కరెంటు సమస్యలు నేడు లేవు. నిరుద్యోగ సమస్యను కూడా మెల్లమెల్లగా అధిగమిస్తున్నాం. రాష్ట్రం ముందుకు సాగుతోంది. దేశం వెనుకబడిపోతున్నది. తెలంగాణ ప్రభుత్వం తీరుగా కేంద్రం శ్రమిస్తే దేశ జీడీపీ కనీసం మరో 3 లక్షల నుంచి 4 లక్షలు పెరిగేది'అని సీఎం కేసీఆర్ అన్నారు.

బీఆర్‌ఎస్‌లో మహారాష్ట్ర నేతల చేరిక



పార్టీలో చేరిన మహారాష్ట్రకు చెందిన నేతలతో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్ర స్థానిక సంస్థల్లో పోటీ చేస్తామని బీఆర్‌ఎస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రకటించిన నేపథ్యంలో వివిధ పార్టీల నేతలు బీఆర్‌ఎస్‌లో ముమ్మరంగా చేరుతున్నారు. తాజాగా మహారాష్ట్రకు చెందిన నాయకులు, వివిధ రంగాలకు చెందిన వృత్తి నిపుణులు బుధవారం సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన నేతలకు సీఎం గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. నాసిక్‌కు చెందిన వైద్యులు లక్ష్మణ్ సబలే, బిలాల్ షేక్, అడ్వొకేట్ ఎస్. కె. మహాజన్, క్రిస్టియన్ ట్రైబల్ కమ్యూనిటీ స్టేట్ ప్రెసిడెంట్ సందీప్ దేవ్రే, లాథూర్ లోని దేవ్నీ కార్పొరేటర్ సూర్యవంశి అమిత్ విజయ్ ప్రకాశ్, భుసావల్‌కు చెందిన నితిన్ తయాడే, స్వాభిమాని షేట్కారి సంఘటన్ నాయకుడు సోమ్‌నాథ్ బోరడే ఇందులో ఉన్నారు. వీరితో పాటు గంగాఖేడ్ మున్సిపాలిటీ కార్పొరేటర్లు తుకారాం తాండడే, బాలాసాహెబ్ రేక్, పాలం మున్సిపాలిటీ కార్పొరేటర్లు బబ్లూ సైయ్యద్, చాంద్ పఠాన్, బీడ్ కోఆపరేటివ్ బ్యాంక్ సభ్యుడు శివాజీ రావ్ ఘోడకే, స్వాభిమాని పక్ష్ జిల్లా అధ్యక్షుడు కుల్దీప్ కర్పే, బీడ్ సేవా సెహకారి సంస్థ చైర్మన్ కమలాకర్ లాండే, స్వాభిమాన్ పక్ష్ తాలూకా ప్రెసిడెంట్ లాహు గైక్వాడ్ తదితరులకు కేసీఆర్ గులాబీ కండువా కప్పారు.

చేరికలపై బీజేపీ కసరత్తు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో ఆపరేషన్ ఆకర్ష్‌కు బీజేపీ కసరత్తు వేగవంతం చేసింది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల్లోని అసంతృప్తులను తమవైపు తిప్పుకొనేందుకు పావులు కదుపుతోంది. అంతేగాక తెలంగాణ ఉద్యమకారులను బీఆర్‌ఎస్ పార్టీ చిన్నచూపు చూస్తోందని పెద్దఎత్తున విమర్శలు వస్తున్న నేపథ్యంలో వారికి సముచిత స్థానం కల్పించాలని యోచిస్తోంది. ఇప్పటికే చేరికల కమిటీ కన్వీనర్ ఈటల రాజేందర్ ఢిల్లీలో మకాం వేయగా, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ బుధవారం హస్తినకు చేరుకున్నారు. దీంతో చేరికల అంశం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేందుకు అవసరమైన ప్రణాళికలకు ఢిల్లీలో పార్టీ పెద్దలు పదునుపెడుతున్నారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్‌లు తరుణ్ ఛుగ్, సునీల్ భన్సల్‌లతో పాటు ఇతర కీలక నేతలతో చేరికలపై రాష్ట్ర నాయకుల చర్చలు జరుగుతున్నాయని తెలిసింది.

అధికార ప్రతినిధులకు ఇంటర్వ్యూలు!

ఏఐసీసీ కొత్త విధానం... ఇంటర్వ్యూ తర్వాతే ఎంపిక

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధుల ఎంపికకు కొత్త పద్ధతి రానుంది. ఇంటర్వ్యూల ద్వారా వీరిని ఎంపిక చేయాలని ఏఐసీసీ నిర్ణయించింది. రాష్ట్రానికి సంబంధించి టీపీసీసీ ప్రతిపాదించిన అధికార ప్రతినిధులకు ఏఐసీసీ అధికార ప్రతినిధి పవన్‌ఖేరా ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు తెలుస్తోంది. గతంలో లాగా టీపీసీసీ ప్రతిపాదించిన అందరినీ అధికార ప్రతినిధులుగా నియమించే అవకాశం లేదని, ఇంటర్వ్యూల అనంతరం ఐదుగురు సీనియర్ అధికార ప్రతినిధులు, ఏడుగురు అధికార ప్రతినిధుల పేర్లను ఏఐసీసీనే అధికారికంగా ప్రకటిస్తుందని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రం నుంచి అధికార ప్రతినిధుల జాబితాను ఏఐసీసీకి పంపగా, త్వరలోనే తాము వచ్చి ఇంటర్వ్యూలు నిర్వహించిన అనంతరం అధికారికంగా ప్రకటిస్తామని ఏఐసీసీ నుంచి సమాచారం వచ్చింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈనెల 14న మంచిర్యాలకు వచ్చి వెళ్లిన తర్వాత ఈ నియామక ప్రక్రియ జరుగుతుందని సమాచారం. అధికార ప్రతినిధులతో పాటు ముగ్గురి నుంచి ఐదుగురు ఉపాధ్యక్షులు, 12 మంది ప్రధాన కార్యదర్శులను కూడా ప్రకటించనున్నారు. అప్పుడే సూర్యాపేట, రంగారెడ్డి, భూపాలపల్లి, జనగామ, హనుమకొండ, ఆసిఫాబాద్, సికింద్రాబాద్, సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులను కూడా ప్రకటించే అవకాశాలున్నాయి. కోఆప్షన్ శాతాన్ని 25కు పెంచడంతో ఏఐసీసీ సభ్యులుగా ఈసారి రాష్ట్రం నుంచి ఐదుగురికి అదనంగా అవకాశం లభించనుంది.

క్లుప్తంగా...

కాంగ్రెస్ నేత జానారెడ్డికి అస్వస్థత

గుండె రక్తనాళానికి స్టెంట్ వేసిన వైద్యులు



సాక్షి, హైదరాబాద్/హాలియా: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కె. జానారెడ్డి స్వల్ప అస్వస్థత కారణంగా హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చేరారు. కొన్నాళ్లుగా మోకాలి నొప్పితో బాధపడుతున్న జానారెడ్డి.. ఛాతీనొప్పితో బుధవారం తెల్లవారుజామున యశోద ఆస్పత్రికి వెళ్లారు. జానారెడ్డికి వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆయన గుండె రక్తనాళంలో బ్లాక్ ఉందని గుర్తించారు. దీంతో యాంజియోగ్రామ్ పరీక్ష నిర్వహించిన డాక్టర్లు ఆసుపత్రి సీనియర్ వైద్యుడు ప్రమోద్‌కుమార్ పర్యవేక్షణలో జానారెడ్డికి స్టెంట్ వేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు.

బీజేపీలో చేరేందుకు కడియం ప్రయత్నించారు

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

హనుమకొండ: మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి బీజేపీలో చేరేందుకు ప్రయత్నించారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం హనుమకొండలో నిరుద్యోగ మార్చ్ వాల్‌పోస్టర్, పాటల సీడీని ప్రేమేందర్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గతంలో బీజేపీలో చేరేందుకు కడియం ఎన్నో ప్రయత్నాలు చేశారని తెలిపారు. ఈ అంశాన్ని పక్కదారి పట్టించేందుకే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిపై ఇష్టమొచ్చినట్లు నోరు పారేసుకుంటున్నారన్నారు. బీజేపీలో చేరడం లేదని చెప్పుకోవడానికే నిరుద్యోగ మార్చ్‌పైన పరుష పదజాలాన్ని వాడుతున్నారని ఆరోపించారు.

సీఎం కేసీఆర్ దళిత ద్రోహి

అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే హక్కు ఆయనకు లేదు: బీజేపీ

సాక్షి, హైదరాబాద్: తొమ్మిదేళ్ల పాలనలో దళితులను మోసం చేసిన సీఎం కేసీఆర్ దళిత ద్రోహిగా మిగిలిపోతారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి మండిపడ్డారు. గతంలో అంబేడ్కర్ జయంతి, వర్ధంతుల్లో పాల్గొని నివాళులర్పించని కేసీఆర్‌కు అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే హక్కు లేదని బీజేపీ భావిస్తోందన్నారు. బుధవారం పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుబాషా, ఎస్సీమోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, పార్టీనేత, మాజీ డీజీపీ కృష్ణప్రసాద్‌లతో కలిసి బంగారు శ్రుతి మీడియాతో మాట్లాడారు. విగ్రహాలు పెట్టినంత మాత్రాన కేసీఆర్ అంబేడ్కరిస్టు కాలేరని, అంబేడ్కర్ ఆలోచనా విధానాన్ని అమలు చేయాలని ఎస్.కుమార్ అన్నారు. దళితులను కేసీఆర్ మరోసారి మోసం చేసేందుకు సిద్ధమవుతున్నారని కొప్పు బాష విమర్శించారు. దళితబంధు పథకంతో ఎంత ప్రయోజనం చేకూర్చారో శ్వేతపత్రం విడుదల చేయా లని మాజీ డీజీపీ కృష్ణప్రసాద్ డిమాండ్ చేశారు.

'హోదా' రద్దు చేసినా పోరాటాలు ఆగవు: చాడ

హుస్నాబాద్: సీపీఐకి జాతీయ పార్టీ హోదా రద్దు చేయడం కుట్రలో భాగమేనని, హోదా రద్దు చేసినా మా పోరాటాలు ఆగవని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల విధానంలో లోపాలు ఉన్నాయని, 35 శాతం ఓట్లతో కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నా, 65 శాతం ఓటర్లు బీజేపీకి వ్యతిరేకమే అని తెలిపారు. దామాషా పద్ధతిలో ఎన్నికల విధానం ఉండాలన్నారు. చట్ట సభల్లో దాదాపు 597 మంది నేరపూరిత వ్యక్తులు ఎంపీలు, ఎమ్మెల్యేలుగా ఉండటం ప్రజాస్వామ్యానికే తలవంపు అని పేర్కొన్నారు.

స్టీల్‌ప్లాంట్ సందర్శించిన సింగరేణి అధికారులు

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని విభాగాలను తెలంగాణకు చెందిన సింగరేణి అధికారులు బుధవారం సందర్శించారు. స్టీల్‌ప్లాంట్ విడుదల చేసిన ఈవోఐ అంశంపై మంగళవారం స్టీల్‌ప్లాంట్‌కు వచ్చిన సింగరేణి డైరెక్టర్లు, జీఎంల బృందం ఉక్కు డైరెక్టర్లతో సమావేశమైన విషయం విదితమే. రెండో రోజు పర్యటనలో భాగంగా వారు స్టీల్‌ప్లాంట్ ఈడీ (వర్క్స్) బిల్డింగ్‌లోని మోడల్ రూమ్, అవార్డు గ్యాలరీలను తిలకించారు. పీపీఎం విభాగాధిపతి డాక్టర్ జి.రమాదేవి వారికి ప్లాంట్ లే అవుట్, ముడి పదార్థాలు, ఉత్పత్తుల రవాణా గురించి వివరించారు. అనంతరం కోక్‌ఓవెన్స్, బ్లాస్ట్‌ఫర్నేస్, స్టీల్ మెల్ట్ షాప్-2 విభాగాల్లో పర్యటించి అక్కడ ఉత్పత్తి ప్రక్రియను గమనించారు. ఈ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీజీఎం స్వామి తదితరులు పాల్గొన్నారు.

'టెక్నాలజీ 4.0తో భవిష్యత్'

సాక్షి, న్యూఢిల్లీ: సాంకేతిక అన్వేషణ దిశగా తాము చేపట్టిన 4.0 టెక్నాలజీతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని హైదరాబాద్‌కు చెందిన నెక్స్ట్‌వేవ్ ప్రతినిధులు తెలిపారు. ఇటీవల దుబాయ్‌లో జరిగిన 4.0 టెక్ క్యాంపులో దేశంలోని 27 మంది విద్యార్థులు పాల్గొన్నారని ఒక ప్రకటనలో తెలిపారు. ఐఐటీ పూర్వ విద్యార్థులైన శశాంక్ రెడ్డి గుజ్జుల, అనుపమ్ పెదర్ల, రాహుల్ అట్లూరి ఈ సంస్థను ప్రారంభించారు. ఏఐలో ఆసక్తి ఉన్న యువతకు తమ సంస్థ ద్వారా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

బయ్యారం, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీలపై కేంద్రం కుట్ర

- మంత్రి పువ్వాడ అజయ్ ధ్వజం
- గుజరాత్‌లోని ముంద్రాలో ఏర్పాటుకు ప్రయత్నం
- బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ పెడితే 20 వేల మందికి ఉపాధి



సాక్షి, హైదరాబాద్: బయ్యారం, విశాఖపట్నం ఉక్కు ఫ్యాక్టరీలను కనుమరుగు చేసి 1,800 కి.మీ దూరంలో ఉన్న గుజరాత్‌లోని ముంద్రాలో ఉక్కు ఫ్యాక్టరీ పెట్టాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. విశాఖపట్నం ఉక్కు ఫ్యాక్టరీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవపై కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఇష్టారీతిన మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీలు మాలోత్ కవిత, వద్దిరాజు రవిచంద్రతో కలసి బుధవారం ఆయన బీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తెరచాటు ఒప్పందాలు చేసుకుని తెలంగాణకు అన్యాయం చేస్తున్నాయని మంత్రి విమర్శించారు. తెలంగాణ, ఏపీలో ఉక్కు ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర పునర్విభజన చట్టంలో పేర్కొన్న విషయాన్ని గుర్తు చేస్తూ, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇనుప ఖనిజం విరివిగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం మాత్రం ఇనుప ఖనిజం లభ్యత లేదని సాకుగా చూపుతోందని, బైలదిల్లా నుంచి ఐరన్‌ఓర్‌ను తరలిస్తే బయ్యారంలో ఫ్యాక్టరీ ఏర్పాటు సాధ్యమేనని పువ్వాడ అన్నారు.

అదానీకి లాభం చేసేందుకే: ఎంపీ కవిత

బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ పలుమార్లు ప్రధానిని స్వయంగా కోరినా, అదానీకి లాభం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిని కేంద్రం పట్టించుకోవడం లేదని ఎంపీ మాలోత్ కవిత అన్నారు. బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీని సాధించేందుకు అన్ని పార్టీలు కలిసి రావాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు.

ఈవీఎంల భద్రతపై నివేదిక ఇవ్వండి

ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: జగిత్యాల జిల్లా ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గానికి 2018లో జరిగిన ఎన్నికలకు చెందిన ఫైళ్లు, ఈవీఎంలు భద్రం చేసిన ఒక స్ట్రాంగ్ రూం లాకర్ తాళాలు కనిపించకుండాపోవడంపై దర్యాప్తు చేసి నివేదిక అందజేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ నెల 26న నివేదిక అందజేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. 2018 ఎన్నికల్లో ధర్మపురి నియోజకవర్గం నుంచి కొప్పుల ఈశ్వర్ ఎమ్మెల్యేగా గెలుపొందడాన్ని సవాల్ చేస్తూ ఆయనపై కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన అడ్లూరి లక్ష్మణ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వీవీప్యాట్ స్లిప్స్‌లో తేడాలున్నాయని, రీకౌంటింగ్‌కు ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ బుధవారం విచారణ చేపట్టారు. కనిపించని తాళాల వ్యవహారంపై 2018 నుంచి విచారణ చేస్తున్నామని ఈసీ తరపు న్యాయవాది చెప్పారు. దీంతో స్ట్రాంగ్ రూం భద్రత లోపాలపైన, తాళాలు కనిపించకుండాపోవడంపైన నివేదిక ఇవ్వాలని కేంద్ర ఎన్నికల సంఘం, జిల్లా ఎన్నికల అధికారిని న్యాయమూర్తి ఆదేశించారు. తదుపరి విచారణను ఈ నెల 18కి వాయిదా వేశారు.

ఏలేటి... ఎటువైపు?

- కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారిన మహేశ్వర్‌రెడ్డి వ్యవహారం
- పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ టీపీసీసీ షోకాజ్ నోటీస్
- ఖర్గేను కలిసి తేల్చుకుంటానన్న మహేశ్వర్‌రెడ్డి
- బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారనే ప్రచారం



సాక్షి, హైదరాబాద్: నిర్మల్ మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వ్యవహారం కాంగ్రెస్‌లో రోజుకో చర్చకు దారితీస్తోంది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో నెలకొన్న విభేదాల నేపథ్యంలో తరచూ వార్తల్లో నిలుస్తున్న ఆయన ఈసారి ఏకంగా పార్టీ మారబోతున్నారన్న ప్రచారం ఊపందుకుంది. ఇప్పటికే బీజేపీ నేతలతో టచ్‌లోకి వెళ్లినందునే నియోజకవర్గ కార్యకర్తలతో మహేశ్వర్‌రెడ్డి భేటీ అయ్యారన్న వార్తలు విస్తృతంగా ప్రచారమయ్యాయి. ఈ పరిస్థితుల్లో టీపీసీసీ ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేయగా, తనకు షోకాజ్ ఇచ్చే అధికారం టీపీసీసీ లేదని ఏలేటి వ్యాఖ్యానించడం ఉత్కంఠ రేపుతోంది.

షోకాజ్.. గంటలో సమాధానం

'మీరు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ శ్రేణుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. మీరు బీజేపీకి దగ్గరవుతున్నారని, ఈ నేపథ్యంలో రాష్ట్ర కాంగ్రెస్ కమిటీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని కూడా తెలుస్తోంది. ఈ షోకాజ్ నోటీసు ఇచ్చిన గంటలోపు వివరణ ఇవ్వాలి. లేదంటే పార్టీ నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది'అని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ జి.చిన్నారెడ్డి ఈ నోటీసు జారీ చేశారు. అయితే, నోటీసు ఇచ్చిన గంటలోగా ఏలేటి టీపీసీసీకి ఎలాంటి సమాధానం ఇవ్వకపోగా, ఏకంగా టీపీసీసీనే తనకు వివరణ ఇవ్వాలని వ్యాఖ్యానించడం గమనార్హం.

మీరెలా ఇస్తారు?

టీపీసీసీ తనకు షోకాజ్ జారీచేసిన కొద్దిసేపటికే ఏలేటి హైదరాబాద్‌లోని తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు నోటీస్ ఇచ్చినట్టు ఇప్పుడే తెలిసిందని, అయినా తనకు షోకాజ్ ఇచ్చే అధికారం టీపీసీసీకి ఎక్కడ ఉందని ప్రశ్నించారు. నోటీసు ఎందుకివ్వాల్సి వచ్చిందో టీపీసీసీనే వివరణ ఇవ్వాలన్నారు. విశ్వసనీయత లేని నాయకులు, పార్టీలు మారి వచ్చిన వాళ్లు తనకు నోటీసులివ్వడమేంటని నిలదీశారు. తానెప్పుడూ పార్టీ లైన్ దాటలేదని, అనైతికంగా వ్యవహరించలేదని, రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా బహిరంగంగా మాట్లాడలేదని చెప్పుకొచ్చారు. తాను పార్టీలో కొనసాగడం ఇష్టం లేని కొందరు బయటకు పంపాలని చూస్తున్నారని వ్యాఖ్యానించారు. తాను బీజేపీ నాయకులతో టచ్‌లోకి వెళ్లినట్టు చెబుతున్నారని, అలాంటి ఆధారాలేవైనా ఉంటే బయటపెట్టాలని డిమాండ్ చేశారు. అసలు తాను పార్టీలో ఉండాలో వద్దో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే వద్దనే తేల్చుకుంటానని, ఆయన్ను కలిసి జరిగిన పరిణామాలను వివరిస్తానని చెప్పారు. టీపీసీసీ పీఏసీలో తన వైఖరిపై చర్చించి ఎలాంటి నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటానన్నారు.

అడ్డగోలుగా కేసీ అండ్ సీఎస్‌కు నిర్మాణ అనుమతులు

- జూబ్లీహిల్స్‌లో 4 అంతస్తులు భూమి లోపల, 16 అంతస్తులు భూమి పైన కట్టుకునే విధంగా...
- అందుకు ప్రతిఫలంగా దామోదర్‌రావు పేరిట 2,704 గజాల భూమి రాసిచ్చారు
- కేసీఆర్ విధ్వంసాన్ని ఈ రోజు 11 గంటలకు మీడియాకు చూపిస్తా: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్



సాక్షి, హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ (జీహెచ్‌ఎంసీ) పరిధిలో గత 60 ఏళ్లలో ఎన్నడూ జరగని విధ్వంసం బీఆర్‌ఎస్ హయాంలో జరిగిందని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి ఆరోపించారు. నిజాం కూడా ఇంత విధ్వంసం చేయలేదని, తెలంగాణ తెచ్చుకుంది కేసీఆర్ కుటుంబం కోసమేనా అన్నట్టు దోపిడీ జరుగుతోందని బుధవారం గాంధీభవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన వ్యాఖ్యానించారు. కేసీఆర్ కుటుంబ స్వార్థానికి హైదరాబాద్ నగరాన్ని బలి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగరంలో అత్యంత ఖరీదైన జూబ్లీహిల్స్ ప్రాంత నైసర్గిక స్వరూపం నేపథ్యంలో ప్రత్యేక నిబంధనలు ఉన్నాయని, ఇక్కడ ఇళ్లు, వ్యాపార సంస్థల నిర్మాణానికి 5 అంతస్తులకు మాత్రమే అనుమతి ఉంటుందని చెప్పారు.

16 అంతస్తులకు ఎలా అనుమతులు

కానీ, కేఎస్ అండ్ సీఎస్ డెవలపర్స్ అనే సంస్థకు 16 అంతస్తులు కట్టుకునేలా అనుమతినిచ్చారని రేవంత్ చెప్పారు. కేబీఆర్ పార్కు సమీపంలో కేఎస్ అండ్ సీఎస్ డెవలపర్స్ సంస్థ 7,416 గజాల స్థలంలోని ఓ హెరిటేజ్ భవనాన్ని నిజాం నవాబుల నుంచి కొనుగోలు చేసిందనీ, అందులో రోడ్డు వెడల్పు పోగా 6,900 గజాలు మిగిలిందని, అందులోనూ 1,200 గజాలు గ్రీన్ బెల్ట్ కింద పోనూ 5,800 గజాలు మాత్రమే నిర్మాణానికి అనుమతి ఉంటుందని వివరించారు. ఈ 5,800 గజాల్లో 60 వేల చదరపు అడుగులకు మాత్రమే అనుమతి ఇవ్వాల్సి ఉంటుందని, కానీ ఆ స్థలంలోని 2,704 చదరపు గజాలను కేసీఆర్ సన్నిహితుడు దామోదర్‌రావుకు అప్పనంగా ఇచ్చారని, ఆ స్థలాన్ని రాసిచ్చిన తర్వాత కేఎస్‌అండ్ సీఎస్ సంస్థకు 4 అంతస్తులు భూమి లోపల, 16 అంతస్తులు భూమిపైన కట్టుకునే విధంగా 4,78,825 చదరపు అడుగుల నిర్మాణానికి అనుమతినిచ్చారని రేవంత్ ఆరోపించారు.

40 కోట్లు ఇస్తే.. ఆ భూమిని ఇస్తారా?

అక్కడ రూ.100 కోట్ల విలువైన 2,704 గజాల భూమిని కేవలం రూ.17 కోట్లు చెల్లించి తీసుకున్నారని రేవంత్ నిందించారు. రూ.40 కోట్లు ఇస్తే ఆ భూమిని కేసీఆర్ ఇవ్వగలడా అని సవాల్ విసిరారు. కేసీఆర్ అండ్ కో బెదిరించి భూములు రాయించుకున్నారడానికి ఇంతకంటే నిదర్శనం లేదని, దోపిడీ అనే పదం కూడా కేసీఆర్ దోపిడీ ముందు చిన్నబోతుందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ చేసిన విధ్వంసాన్ని గురువారం ఉదయం 11 గంటలకు మీడియాను తీసుకెళ్లి చూపిస్తానని చెప్పారు. డీ9 గ్యాంగ్ రాష్ట్రాన్ని దోచుకుంటోందని, వీరిలో ఎవరినీ వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు.



దావలికపు మౌనం హేయమైనది.
నిశ్శబ్ద సత్యాలన్నీ విషతుల్యమే.
- జరాతుష్ట్ర

సాక్షి

గురువారం, 13 ఏప్రిల్ 2023

'జ్యూస్' అన్వేషణకు అంకురార్పణ

ఈ విశాల విశ్వంలో మనం ఒంటరివాళ్లమా లేక మనలాగే మనుగడసాగించే బుద్ధిజీవులు వేరే గ్రహాలపై కూడా ఉన్నారా అన్న విచికిత్స ఈనాటిది కాదు. ఆ ప్రయత్నంలో గురువారం మరో అడుగు ముందుకుపడబోతోంది. యూరొపియన్ స్పేస్ ఏజెన్సీ(ఈఎస్ఏ) నేతృత్వంలో రూపొందిన 'జ్యూస్' (జూపిటర్ అయిసీ మూన్స్ ఎక్స్‌ప్లోరర్) అంతరిక్ష నౌక దక్షిణ అమెరికాలోని కౌరు దీవి నుంచి ఎనిమిదేళ్ల సుదీర్ఘ ప్రస్థానాన్ని ప్రారంభించబోతోంది. 2031లో అక్కడికి చేరుకున్నాక గురుగ్రహానికున్న లెక్కకు మిక్కిలి చందమామల్లో మూడింటిని ఎంచుకుని వాటిల్లో జీవుల ఉనికి సంగతిని తేల్చడం ఈ అంతరిక్ష నౌక లక్ష్యం. అంగారక గ్రహం ఆవల జీవం ఉండటానికి ఏమాత్రం అవకాశం లేదని ఒకప్పుడు ఖగోళ శాస్త్రవేత్తలు నిర్ధారణకొచ్చారు. కానీ అంతటితో ఆగిపోతే మానవ జిజ్ఞాసకు అర్థం లేదు. 'వేరెక్కడో ఒక మహాద్భుతం తనను తాను వ్యక్తపరుచుకోవటానికి వేచిచూస్తూ వుండొచ్చ'ని ప్రముఖ ఖగోళ శాస్త్రవేత్త కార్ల్ సెగాన్ ఒక సందర్భంలో అన్నారు. ఒక్క ఖగోళ శాస్త్రం అనేమిటి...సమస్త రంగాల్లోనూ మానవాళి సాధిస్తున్న విజయపరంపరకు ఈ భావనే మూలం. 1990లో అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా గురుగ్రహంపైకి ప్రయోగించిన గెలీలియో ఉపగ్రహం, ఈమధ్యకాలంలో శనిగ్రహానికి పోయిన కేసినీ ఉపగ్రహం శాస్త్రవేత్తల అంచనాలను తలకిందులు చేశాయి. గురుడు, శుక్రుడు, బుధుడు వంటి ఇతరేతర గ్రహాలపై జీవం ఉండక పోవచ్చుగానీ, గురుడు, అంగారకుడు మధ్య కనబడుతున్న చందమామలపై ఏదోమేర, ఏదో రూపంలో జీవం ఉండటానికి అవకాశం ఉన్నదని అవి పంపిన డేటా ఆధారంగా నిర్ధారణకొచ్చారు. ఆ తర్వాతే ఈ మూడు చందమామలనూ అన్వేషించాలన్న నిర్ణయానికొచ్చారు.

గ్రహాలన్నిటిలోనూ గురుగ్రహం చాలా పెద్దది. సంక్లిష్టమైనది కూడా. ఎందుకంటే దీనికి ఒకటీ రెండూ కాదు...ఏకంగా 92 చందమామలున్నాయి. వీటిలో కొన్ని వ్యతిరేక కక్ష్యలో కూడా తిరుగుతుంటాయి. అలాంటి చందమామల్లో పెద్దగా ఉండే యూరోపా, క్యాలిస్టో, గానిమీడ్ అనే మూడింటిని ఎంచుకుని వాటిచుట్టూ జ్యూస్ 35 ప్రదక్షిణలు చేస్తుంది. ఆ తర్వాత 2034లో గానిమీడ్ చుట్టూ నిర్దేశిత కక్ష్యలో కుదురుకుంటుంది. ఈ మూడు చందమామలూ మంచుతో నిండివున్నాయి. ఆ పొరల వెనక మహా సముద్రాలు నిక్షిప్తమైవున్నాయని శాస్త్రవేత్తల అంచనా. అదే నిజమైతే ఏదో రూపంలో అక్కడ జీవం ఉండటానికి ఆస్కారం ఉంటుంది. ముఖ్యంగా గానిమీడ్‌పై లవణసముద్రం ఉన్నదని గుర్తించారు. నిజానికి సూర్యకాంతి పడే అవకాశం లేదు గనుక ఈ మూడు చందమామల్లో జీవం ఉనికికి అవకాశం లేదు. కానీ గురుగ్రహానికుండే గురుత్వాకర్షణ ఆ లోటు తీరుస్తోంది. ఈ చందమామల్లోని సముద్రాలు వేడెక్కడానికి దోహదపడుతోంది. గురుగ్రహానికి మన దగ్గర బృహస్పతి అనే నామాంతరం ఉంది. పురాణాల్లో బృహస్పతి దేవగురువు. యాదృచ్ఛికమే కావొచ్చు గానీ... బృహస్పతికి ప్రీతిపాత్రమైన గురువారం రోజునే గురుగ్రహానికి జ్యూస్ ప్రయాణం కడుతోంది. నిజానికి ఇంతవరకూ గురుగ్రహం గురించి మానవాళికి తెలిసింది గోరంతే. దాన్ని దట్టంగా చుట్టుముట్టివుండే వాయుమేఘాలే అందుకు కారణం. అందులో అత్యధికం, అంటే...90 శాతం హైడ్రోజన్ అయితే, మిగిలిన పదిశాతంలో హీలియం, మీథేన్, గంధకం, అమోనియా వంటివి ఉన్నాయి. అయితే ఈ మూలకాల్లో ఎన్ని వాయురూపంలో ఉన్నాయో, మరెన్ని ఘనరూపం దాల్చాయో శాస్త్రవేత్తలు ఇంకా తేల్చలేదు. అసలు గురుగ్రహం నెన్నొసట సిందూరంలా ఎర్రగా మెరిసే బింబం ఒకటుంటుంది. దాని పరిమాణమే మన భూమి కన్నా మూడింతలు కాగా, అది కుదురుగా ఒకచోట ఉండక తిరుగాడుతుంటుంది. గురుగ్రహంపై నిత్యం రేగే పెను అలజడే ఇలా కనబడుతోందని శాస్త్రవేత్తలంటారు.

మనం భూమ్మీద క్షేమంగా ఉండగలుగుతున్నామంటే అది గురుగ్రహం చలవే. ఎందుకంటే భూమివైపు దూసుకొచ్చే గ్రహశకలాల్లో, ఉల్కల్లో చాలాభాగాన్ని గురుగ్రహం తనవైపు ఆకర్షించుకుని వాటివల్ల కలిగే కష్టనష్టాలను తానే భరిస్తుంటుంది. నిజానికి గురుగ్రహం చుట్టూ తిరుగాడుతున్న చందమామల్లో అనేకం అటువంటి గ్రహశకలాలే. ఇందులో ఒకటైన గానిమీడ్‌కు అయస్కాంత క్షేత్రం ఉన్నా, అది బుధుడి కన్నా చాలా పెద్దదైనా గురుడి ప్రభావానికి లోనై చందమామగానే మిగిలిపోయింది. గురుగ్రహం ఆనుపానులు రాబట్టేందుకు ఇంతవరకూ 4 అంతరిక్షనౌకలు వెళ్లాయి. 1972 మార్చిలో ప్రయోగించిన పయొనీర్-10 గురుగ్రహం చుట్టూ 2003 వరకూ చక్కర్లు కొడుతూనే ఉంది. ఆ తర్వాత దాన్నుంచి సంకేతాలు లేవు. మన సౌర వ్యవస్థను దాటి ముందు కెళ్లడానికి 1977లో ప్రయోగించిన వాయేజర్ గురుగ్రహాన్ని దాటుకుంటూ వెళ్తూ దాని ఛాయా చిత్రాలు పంపింది. ఆ తర్వాత 1990లో వెళ్లిన గెలీలియో, 2000లో వెళ్లిన కేసినీ వ్యోమనౌకలు సైతం గురుగ్రహ ఛాయాచిత్రాలు పంపాయి. ఇక 2016లో నాసా ప్రయోగించిన జునో అంతరిక్ష నౌక నిరుడు యూరోపా ఛాయాచిత్రాలు పంపింది. ఇప్పుడు జ్యూస్ ప్రదక్షిణలు చేయబోయే 3 చందమామల్లో యూరోపా ఒకటి. అది 2031-34 మధ్య యూరోపాను రెండుసార్లు, క్యాలిస్టోను 21సార్లు, గానిమీడ్‌ను 12 సార్లు చుట్టివస్తుంది. అంతరిక్ష నౌకలు పంపే డేటాలో కేవలం రంగుల పొందికే ఉంటుంది. వీటి ఆధారంగా అక్కడ ఏమేం వాయువులున్నాయో, మూలకాలున్నాయో అంచనా కొస్తారు. విశ్వరహఃపేటిక తెరుచుకోవాలంటే నిత్యం ప్రయోగాలు కొనసాగుతూనే ఉండాలి. ఖగోళ శాస్త్ర ఆవిష్కరణలు విశ్వానికి సంబంధించిన మన జ్ఞానాన్ని ఎప్పటికప్పుడు విస్తృతపరుస్తుంటాయి.

యోధుడొకరు... విప్లవ వీరుడొకరు

సందర్భం



తండ సదానందం

భారతదేశ చరిత్రలో ఏప్రిల్ 14 ఒక మైలురాయి వంటిది. సమాజంలో మార్పు కోసం, సమాజ అభివృద్ధి కోసం మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రీబాయి పూలే, భగత్ సింగ్, సుభాష్ చంద్రబోస్, బాబూ జగ్జీవన్‌రామ్ వంటి ఎందరో మహనీయులు తమ జీవితాలను త్యాగం చేశారు. ఆ కోవకు చెందినవారే అయిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి ఏప్రిల్ 14. ఈ తేదీకే ఇంకో ప్రాముఖ్యం కూడా ఉంది. యూనివర్సిటీలలోనే సమాజం మార్పుకు నాంది పడాలని విద్యార్థులను చైతన్య పరచిన విద్యార్థి నాయకుడు జార్జిరెడ్డి అమర వీరుడైన రోజు కూడా ఇదే! ఇద్దరి ఆశయం సమాజంలోని అసమానతల్ని నిర్మూలించడమే! అంతరాలు లేని మానవీయ సమాజాన్ని నిర్మించడమే! ప్రయాణించిన మార్గాలు వేరైనా, ఇద్దరూ అడుగడుగునా సమాజ హితం కోసం పోరాడిన వారే! అందుకే ఈ రోజుకు ఇంత ప్రాధాన్యం. చరిత్రపుటల్లో ఇంతటి ప్రత్యేక స్థానం.

సమాజంలోని కుల వివక్ష, అంటరానితనం నిర్మూలనకు అహోరాత్రులు శ్రమించి బడుగు బలహీన వర్గాలకు సమన్యాయం జరిగేందుకు అవసరమైన హక్కులను భారత రాజ్యాంగంలో పొందుపరిచినవారు అంబేడ్కర్. స్వతంత్ర భారతంలో సామాన్య ప్రజలకు స్వేచ్ఛా ఫలాలు అందకుండా పోతున్న సమయంలో సమాజంలోని అపసవ్య ధోరణులను అధ్యయనం చేస్తూ లాటిన్ అమెరికా దేశాల విప్లవ వీరుడు చేగువేరా స్ఫూర్తిగా యూనివర్సిటీలలోనే సమాజ మార్పుకు నాంది పడాలని విద్యార్థులను చైతన్య పరిచే పోరాటంలో మతోన్మాదుల చేతిలో బలి అయిన ఉస్మానియా అరుణతార జార్జిరెడ్డి. నేటి 'ప్రగతిశీల ప్రజాస్వామిక విద్యార్థి సంఘం' (పీడీఎస్‌యూ) స్థాపక కారకులు జార్జిరెడ్డి అమరుడైన రోజు, సామాజిక న్యాయం కోసం పరితపించిన రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జన్మదినం ఒకే రోజు కావడం యాదృచ్ఛికమే అయి నప్పటికీ.. స్ఫూర్తి చేతనలను ప్రేరేపించే ఒక ప్రత్యేక సందర్భం ఇది. అంబేడ్కర్ సమసమాజ స్థాపన కోసం పాటు పడితే, జార్జిరెడ్డి సామాజిక న్యాయం కోసం పోరాడిన విప్లవ వీరుడు. అంబేడ్కర్ ఒక ధ్రువతార అయితే, జార్జిరెడ్డి ఒక అరుణతార. ఇద్దరూ చరిత్రపుటల్లో ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్న వారే. ప్రజల గుండెల్లో నిలిచి పోయినవారే. ఇద్దరి ఆశయాలు సమాజంలోని సమానత కోసమే, అంతరాలు లేని మానవీయ సమాజం కోసమే. ఇద్దరూ ప్రపంచ స్థాయి మేధావులే. ప్రజల బాగోగుల కోసం, సంక్షేమం కోసం వారి అభివృద్ధి కోసం నిరంతరం ఆలోచించిన ఆలోచనాపరులే. సమాజ హితం కోసం అడుగడుగునా పోరాడిన వీర యోధులే.

ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14 నాలో ఒక సంఘర్షణను రేపుతుంది. ఒక సామాజిక విప్లవకారుని జననం, మరొక విప్లవకారుడు నేల కొరిగిన దినం! ఒకరిది పుట్టుక, ఒకరిది మరణం. ఇద్దరినీ ఒకే రోజు స్మరించుకోవడం సంఘర్షణ కాదా? 'సమీకరించు, బోధించు, పోరాడు'.. అన్న నినాదంతో చైతన్యం కోసం పాటుపడిన వారు ఒకరు; 'జీనా హైతో మర్‌నా సీఖో... కదం కదం పర్ లడ్నా సీఖో' అనే నినాదం ఇచ్చి విప్లవ ఆదర్శాలను అందించిన సాహసోపేతమైన శక్తి ఒకరు. పుట్టినవారు మరణించక తప్పదు అని తెలిసినా, ఆ ఆలోచనకు ఒకింత బాధ కలుగుతూనే ఉంటుంది. కానీ అమరత్వం రమ్యమైనది. మనిషి తన కోసమే పుట్టి తన కోసమే మరణించడం సహజం. కానీ సమాజం కోసం, సమాజంలోని బాధితుల తరపున గళమెత్తి, కలమెత్తి పోరాడి, పరుల కోసం మరణించడం రమ్యమైన అమరత్వం కాక మరేమవుతుంది? ఈ ఇద్దరు మహనీయులు కూడా ఉన్నత చదువులను అభ్యసించి ప్రతి క్షణం పేదవారి గురించే ఆలోచించి, ఏ మాత్రం స్వార్థం లేకుండా తమ అమూల్యమైన జీవితాలను ప్రజల కోసం త్యాగం చేశారు. ఇరువురి దారులు వేరైనా అంతిమ లక్ష్యం ఒక్కటే... మతోన్మాద మనువాద సంస్కృతికి వ్యతిరేకంగా పోరాటం సాగించడం. ''మతములన్నియు మాసిపోవును, జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును..'' అని గురజాడ గారన్నట్లు జ్ఞానం ద్వారానే జీవితానికి వెలుగు అని, విద్య ద్వారానే అసమానతలు, అంతరాలు తొలగిపోతాయని ఇద్దరూ నమ్మారు. రిజర్వేషన్ ఫలాలు అందించి అణగారిన వర్గాలు విద్యాగంధానికి నోచుకునేలా అంబేడ్కర్ కృషి చేశారు.



కులం అణచివేతలు, కుల దురహంకార పీడనలు లేని ఆత్మగౌరవ సమాజం కోసం పోరాడిన సాంఘిక విప్లవకారుడు అంబేడ్కర్. దోపిడీ, పీడన లేని సమసమాజాన్ని కలలుగన్న విప్లవ స్వాప్నిక కార్యశీలి జార్జిరెడ్డి. ఇద్దరి జీవితం ప్రస్తుత సమాజానికి ఆదర్శ ప్రాయం, అనుసరణీయం. ఒకరు బాధిత కులంలో పుట్టి అన్యాయాలను, అక్రమాలను, అవమానాలను భరించి... కుల ఆధిపత్యానికి, మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడడానికి తమ జాతిని, బాధితులను పీడితులను చైతన్య పరిచారు. మరొకరు మధ్యతరగతి వర్గంలో జన్మించి, సౌకర్యవంతమైన జీవితాన్ని గడిపే అవకాశం ఉన్నప్పటికీ పేదల, శ్రామికవర్గ, గ్రామీణ కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థుల బాధలను అవగాహన పరచుకునేందుకు వారి స్థాయికి దిగి సాధారణ జీవితాన్ని అనుభవించిన విద్యార్థి.

1972లో కామ్రేడ్ జార్జిరెడ్డిని 'సంఘ్ పరివార్'లోని కొన్ని మతోన్మాద హిందుత్వ శక్తులు హత్య చేశాయి. నాటి పరిస్థితులే నేటికీ సమాజంలో కనిపిస్తున్నాయి. అంతేకాదు, పరిస్థితులు రోజురోజుకు దిగజారుతున్నాయి. నేడు కూడా మత మౌఢ్యాన్ని, మూఢనమ్మకాలను వ్యతిరేకిస్తూ ప్రజాస్వామిక భావాలను పెంపొందింప చేయడానికి ప్రయత్నించిన, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించిన ప్రజాస్వామిక వాదులను కాల్చి చంపిన సందర్భాలు ఉన్నాయి. యూనివర్సిటీలలో అణగారిన వర్గాల విద్యార్థులు ఉన్నత స్థాయి పరిశోధనలు జరపడానికి లేకుండా వారిని అడ్డుకుంటూ, మానసిక క్షోభకు గురిచేసి బలవన్మరణానికి పాల్పడేలా ప్రేరేపించడం జరుగుతోంది. అదే సమయంలో సమాజాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలు పెరిగిపోతున్నాయి. విద్యను కాషాయీకరణ, వ్యాపారీకరణ చేసేందుకు ప్రభుత్వాలు ఆతురతను కనబరుస్తున్నాయి. అందుకే అన్నట్టుగా ఆగమేఘాల మీద జాతీయ విద్యా విధానం ప్రవేశపెట్టి ప్రైవేటీకరణ విధానాలను ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టడం జరిగింది. ఆ విధానాలను సవరించాలని విద్యావేత్తలు, మేధావులు, ప్రజాస్వామిక వాదులు కోరినప్పటికీ వాటిని పెడచెవిన పెట్టి ఏకపక్షంగా బలవంతంగా అశాస్త్రీయ విద్యా విధానాన్ని అమలు చేయాలని ప్రయత్నించడం వల్ల బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు విద్యకు దూరమయ్యే అవకాశాలు చాలా ఎక్కువగా కనిపిస్తున్నాయి.

రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్, విద్యార్థి నాయకుడు జార్జిరెడ్డి ఆశించినట్టుగా ప్రజాస్వామిక, ప్రజాతంత్ర, శాస్త్రీయ విద్యా విధానం అమలు కావడం లేదు, అమలు చేసే పరిస్థితులు కూడా లేవు. అమలు చేయాలని అడిగే విద్యార్థిలోకం కూడా నేడు బలంగా లేదు. అయినా నిరుత్సాహ పడనవసరం లేదు. ప్రజాస్వామిక, మానవీయ విలువలు పెంపొంది ఆదర్శవంతమైన సమాజం రూపుదిద్దుకోవాలంటే అంబేడ్కర్, జార్జిరెడ్డిల ఆశయాలు నెరవేర్చే అవకాశం ప్రగతి శీలులందరికీ ఉంటుంది. చదువే ఆయుధంగా ప్రపంచ మేధావిగా గుర్తింపు పొంది బడుగువర్గాల బాగోగుల కోసం నిరంతరం శ్రమిస్తూ అవిరళ కృషి చేసిన అంబేడ్కర్ జీవితాన్ని; అన్యాయాలకు అక్రమానికి వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేసే స్వభావం, తప్పులేనప్పుడు ఎవరినైనా ఎదిరించే సత్తా, తోటి వారి కోసం తన ప్రాణాలను సైతం అర్పించే త్యాగగుణం, సమ సమాజం కోసం పరితపించే మనస్తత్వం గల జార్జిరెడ్డి పంథాను ఆదర్శంగా తీసుకుని అనుసరించాలి. జార్జిరెడ్డి ఆందోళన, పోరాటాలతోపాటు నిరంతర అధ్యయనశీలిగా గడిపారు. పాతికేళ్ల జీవితంలో ప్రపంచ విప్లవాలను పట్టుదలతో పరిశీలించి విప్లవ మార్గాన్ని అనుసరించారు. ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ వంటి ప్రజ్ఞ కలిగిన అపర మేధావి అతడు. భౌతిక శాస్త్రంలో గోల్డ్ మెడల్ సాధించి స్కాలర్ అయిన జార్జి రెడ్డి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని, అంబేడ్కర్ ప్రబోధించిన విలువలతో నేటి యువత సామాజిక ప్రజా సమస్యల పట్ల అవగాహన పెంచుకోవాలి. శాస్త్రీయ విద్యా విధానం కోసం, ప్రజాతంత్ర విద్య కోసం పోరాడాలి. ఈ ఇద్దరు వీరులకు మనం ఇవ్వగలిగిన నిజమైన, ఘనమైన నివాళి ఇదే!

వ్యాసకర్త టి.పి.టి.ఎఫ్. రాష్ట్ర కౌన్సిలర్
మొబైల్: 99895 84665

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మిల్లీ బాబీ బ్రౌన్



ఆ పిల్లకు 19. అప్పుడే ఎంగేజ్‌మెంట్ అయిపోయింది! నాకు 24. బెడ్ మీద పడుకుని బనానా చిప్స్ తింటూ, 'షి ఈజ్ 19' హ్యాష్‌ట్యాగ్‌తో ఇండియాలో ట్రెండ్ అవుతున్న ట్వీట్స్ చూస్తున్నాను. ('స్ట్రేంజర్ థింగ్స్' నటి మిల్లీ బాబీ బ్రౌన్‌కు తన ప్రియుడు జేక్‌తో నిశ్చితార్థం జరిగిందన్న వార్తపై).

– రియా చోప్రా, కాలమిస్ట్

ఇంట్లో పెంచొచ్చు



భూతాపాన్ని నిరోధించడానికి చెట్లు, మొక్కలను నాటడమొక్కటే మార్గం. ఇంటి బయట మీకు తగినంత స్థలం లేకుంటే కనీసం ఇంటి లోపలైనా అలో వెరా, మాన్‌స్టెరా, మనీ ప్లాంట్ వంటి కొన్ని మొక్కలు పెంచండి.

– రితుపర్ణారాయ్, పర్యావరణ కార్యకర్త

ఎప్పుడూ వినే మాటలే!



నలంద, ససారాంలో ముస్లిం వ్యతిరేక హింసకు బీజేపీయే కారణం అని నితీశ్ కుమార్, తేజస్వీ యాదవ్ అంటున్నారు. మరి బిహార్ ప్రభుత్వం బీజేపీ / హిందుత్వ నాయకులపై ఏ విధమైన చర్యలు తీసుకుంది? వారిలో అరెస్టు చేసిన వ్యక్తుల జాబితాను వెల్లడించగలదా?

– ఆసిఫ్ ఖాన్, భారతీయ ముస్లిం

వచ్చీ రాగానే...



జపాన్ పర్యటన నుండి తిరిగి వచ్చిన ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఏ మాత్రం కాలయాపన చేయకుండా వెంటనే పనిలోకి దిగిపోయారు! వేడిగాలులు, ప్రజారోగ్య పరిస్థితులపై అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు.

– డా॥ గోపబంధు దాస్, సీఎం ఓఎస్డీ

అతి తెలివి



భారీ ఎదురు దెబ్బ తగిలాక బాలీవుడ్ గాయకుడు లక్కీ అలీ తన వివాదాస్పద ఎఫ్‌బీ పోస్టుకు క్షమాపణలు చెప్పాడు. 'బ్రాహ్మణ' అనే పదం 'అబ్రహాం' లేదా 'ఇబ్రహీం' నుండి వచ్చిందని, బ్రాహ్మణులు ఇబ్రహీం వంశం వారని అలీ ఆ పోస్ట్‌లో రాశాడు.

– దీక్షా నేగీ, జర్నలిస్ట్

ఇన్‌బాక్స్

సింగరేణి ఎన్నికలు జరపాలి

ప్రభుత్వాలకు పార్లమెంట్, అసెంబ్లీలకు ఎన్నికలను నిర్వహించడం పట్ల ఉన్న శ్రద్ధ... గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికల నిర్వహణ పట్ల లేదు. రకరకాల సాకులు చూపించి వాటి ఎన్నికలను వాయిదా వేయడానికే పాలకులు ప్రయత్నిస్తుంటారు. అందుకు ఉదాహరణ సింగరేణి కాలరీస్‌కు చెందిన గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికల పట్ల చూపుతున్న సాచివేత ధోరణి. కార్మిక సంఘం ఎన్నికలను నిర్వహించాలని కేంద్ర కార్మిక శాఖ అధికారులకు కార్మిక సంఘాలు అనేక విజ్ఞప్తులు చేశాయి. దీంతో సెంట్రల్ ఇండస్ట్రియల్ రిలేషన్ మెషినరీ (సీఐఆర్ఎం) డిప్యూటీ డైరెక్టర్ స్పందించి, క్రమశిక్షణ నియమావళి ప్రకారం రెండు సంవత్సరాల వ్యవధిలో సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. ప్రాంతీయ లేబర్ కమిషనర్ (సెంట్రల్) తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘాని(టీబీజీకేఎస్)కి రెండు సంవత్సరాల కాలానికి గుర్తింపు ఇవ్వాలని సింగరేణి సంస్థ సీఎమ్‌డీకి సూచిస్తూ ఓ లేఖ రాశారు. ఇదే సమయంలో సింగరేణి సీఎమ్‌డీ మాత్రం ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి ఒక లేఖ ద్వారా కోవిడ్ మహమ్మారి కారణంగా సకాలంలో ఎన్నికలు నిర్వహించలేదని తెలిపారు. కానీ అదే కోవిడ్ సమయంలో తెలంగాణలో హుజూరాబాద్, మునుగోడు శాసనసభకు ఎన్నికలు నిర్వహించిన విషయాన్ని ఆయన మరచిపోవడం గమనార్హం.

నిజానికి 2023 ఏప్రిల్ 2న ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర కార్మిక శాఖ ప్రకటించింది. కానీ సింగరేణి యాజమాన్యం ఎన్నికలను ఇప్పుడే నిర్వహించలేమని హైకోర్టులో కేసు దాఖలు చేసింది. గత సింగరేణి కార్మిక సంఘం ఎన్నికల సమయంలో టీఆర్ఎస్‌కు చెందిన టీబీజీకేఎస్‌ను గెలిపించుకోవడానికి కేసీఆర్ ఇచ్చిన హామీలు ఇప్పటికీ నెరవేర్చలేదు. ఈ పరిస్థితుల్లో 2023 డిసెంబర్‌లో జరగాల్సిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించినట్లయితే టీబీజీకేఎస్‌కు ప్రతికూల పరిస్థితులు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయని బీఆర్ఎస్ భావిస్తోంది. ఎందుకంటే గత సింగరేణి కార్మిక సంఘ ఎన్నికల్లో టీఆర్ఎస్ ఇచ్చిన హామీలు నెరవేరలేదు. అందుకే ఒక వేళ ఈ ఎన్నికల్లో తమ సంఘం ఓడిపోతే కోల్ బెల్ట్ జిల్లాల్లో ఉన్న శాసనసభ నియోజకవర్గాలైన బెల్లంపల్లి, చెన్నూరు, మంచిర్యాల, రామగుండం, మంథని, భూపాలపల్లి, పినపాక, కొత్తగూడెం, సత్తుపల్లి, ఇల్లందుల ఎన్నికలపై తీవ్ర ప్రభావం ఉంటుందని బీఆర్ఎస్ భావిస్తున్నది. అందుకే సింగరేణి యాజమాన్యంతో ఇప్పుడు ఎన్నికలను నిర్వహించలేమని హైకోర్టులో కేసు దాఖలు చేయించిందని కార్మికుల భావన. అందులో నిజానిజాలేమో కానీ, సత్వరమే కార్మిక సంఘాల ఎన్నికలు జరపాలి.

– మేరుగు రాజయ్య,
కేంద్ర కార్యదర్శి, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్

విత్తనాల దగ్గరే దోపిడీ ఆరంభం

అభిప్రాయం



సారంపల్లి మల్లారెడ్డి

ఈ ఎండాకాలం ముగుస్తూనే వానాకాలం సాగు ప్రారంభమవుతుంది. దీనిని గమనించి కార్పొరేట్ సంస్థలు విత్తనాల ధరలను పెంచివేశాయి. కార్పొరేట్ సంస్థలు విత్తన అమ్మకాలపైననే లాభాలు సంపాదించాలని 2000 సంవత్సరం నుండి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అప్పుడు కొత్తగా ప్రవేశపెట్టిన బీటీ పత్తి విత్తనాల ప్యాకెట్‌కు రూ. 1830 నిర్ణయించి అమ్మారు. రెండు సంవత్సరాలు రైతుసంఘాలు పోరాటం చేసి ఎంఆర్‌పీ ద్వారా ధరలు తగ్గించుకున్నాయి. ప్యాకెట్‌కు 2020-21లో రూ. 730 ఉన్న ధరను నేడు రూ. 853కు పెంచారు. అధిక సాంద్రత గల పంట వేయాలంటే ఎకరాకు కనీసం 5 ప్యాకెట్లు కావాలి. హైబ్రిడ్ మాదిరి నాటువేసినప్పటికీ 2 ప్యాకెట్లు అవసరం.అందువల్ల కోట్ల రూపాయల భారం రైతులపై పడుతోంది. ధర నిర్ణయంలో ప్రభుత్వం చొరవలేదు. అదే విధంగా మొక్కజొన్నలు, జొన్న, వేరుసెనగ, కందులు, పెసళ్ళు, వరిధాన్యం ధరలను కూడా విపరీతంగా పెంచి వేశారు. రైతులు కొనుగోలు శక్తిలేక, మంచి విత్తనాలను కొనలేక అందుబాటులో ఉన్న విత్తనాలను వేసి దిగుబడులు తగ్గడంతో నష్టపోతున్నారు.

కల్తీ విత్తనాల వ్యాపారులు వ్యవస్థీకృతంగా ఏర్పడి ఏటా వేల క్వింటాళ్ళు అమ్మి రైతులను నష్టపరుస్తున్నారు. ప్రభుత్వ నివేదిక ప్రకారం 2021-22లో 220 కేసులను రిజిస్టర్ చేసి 45 వేల క్వింటాళ్ళ వరి, పత్తి, మిరప, సోయా, పప్పుధాన్యాలకు చెందిన కల్తీ విత్తనాలు పట్టుకొన్నారు. తిరిగి గత ఏడాది జూన్ నాటికి ఎనభై కేసులు రిజిస్టర్ చేసి 35 వేల క్వింటాళ్ళ పత్తి, సోయా పట్టుకున్నారు. అయినా ఏ ఒక్క కంపెనీ లైసెన్సునూ రద్దు చేయలేదు. పీడీ యాక్ట్ పెడతామని ఫీంకరించారే తప్ప ఎవరికీ శిక్షలు పడలేదు. కానీ రైతులు ఏటా నాలుగైదు లక్షల ఎకరాలలో పంటలు నష్టపోతున్నారు. పెట్టిన పెట్టుబడులైనా రాక దివాళా తీస్తున్నారు.

భారత విత్తన ఉత్పత్తిలో తెలంగాణ అరవై శాతం వాటా కలిగి ఉంది. ఇందులో హైబ్రిడ్ విత్తనాల వాటా నలభై శాతంగా ఉంది. రాష్ట్ర అవసరాలకు 20 వేల క్వింటాళ్ళ అవసరం కాగా అంతకు మించి విత్తనాలు ఉత్పత్తి చేస్తున్నారు. రాష్ట్రం నుండి థాయ్, చిలీ, ఇటలీ, అమెరికా, చైనా, నెదర్లాండ్స్, ఫ్రాన్స్, దక్షిణ కొరియాలకు ఎగుమతి చేస్తున్నాం. విత్తనోత్పత్తి చేస్తున్న రాష్ట్రంలో రైతులు విత్తన సమస్యను ఎదుర్కోవడం విషాదకరం.

దేశంలో ఉత్పత్తి అవుతున్న విత్తనాలు ప్రపంచ ఉత్పత్తిలో ఆరు శాతంగా ఉన్నాయి. విత్తనోత్పత్తిని నియంత్రించడానికి నేషనల్ సీడ్ కార్పొరేషన్‌ను 1963లో ఏర్పాటు చేశారు. 1966లో దిగుమతి విత్తన చట్టం తెచ్చారు. మారిన పరిస్థితుల్లో దేశం నుండి ఎగుమతులవుతున్నందున తిరిగి విత్తన చట్టం తేవాలి. అందుకనుగుణంగా 2004లో పార్లమెంటులో విత్తన చట్టాన్ని ప్రవేశపెట్టారు. కార్పొరేట్ సంస్థల ఒత్తిడితో చట్టాన్ని ఆమోదించకుండా పెండింగులో పెట్టారు. తెలంగాణ ప్రభుత్వం కాంగ్రెస్ హయాంలో ఒకసారి, ప్రస్తుత టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2017లో మరోసారి చట్టాలు తెచ్చింది. కానీ కేంద్రం వాటిని ఆమోదించకుండా అడ్డు పడింది. మొత్తానికి విత్తన చట్టం లేకపోవడంతో కార్పొరేట్ సంస్థలు వేల కోట్ల లాభాలు ఆర్జిస్తున్నాయి. మొత్తం దేశంలో విత్తన వ్యాపారం రూ.18 వేల కోట్లకు పెరిగింది. ఇందులో రూ. 10.4 వేల కోట్ల విలువగల విత్తనాలను ఎగుమతులు చేస్తున్నాం.



దేశంలో విత్తనాల వినియోగం క్రమక్రమంగా పెరుగుతున్నది. ఆహార పంటలకు బదులు వాణిజ్య పంటల వైపు సాగువిస్తీర్ణం పెరుగుతున్నది. వాణిజ్య పంటలకు కావలసిన విత్తనాలను, నర్సరీని ఇతర దేశాల నుండి దిగుమతులు చేసుకుంటున్నాం.

మొత్తం మీద రాష్ట్రంలో కల్తీ విత్తనాల బెడదకు, విత్తన ధరలు పెరగానికి రాష్ట్రప్రభుత్వ నిర్లక్ష్యమే ప్రధాన కారణం. అధికారుల అండతోనే వ్యవస్థీకృతంగా కల్తీ వ్యాపారం సాగుతున్నది. కార్పొరేట్ సంస్థలు ధరలు విపరీతంగా పెంచివేసి, వేలకోట్ల లాభాలు ఆర్జిస్తున్నాయి. నిషేధించబడిన విత్తనాలను అమ్మినప్పటికీ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం వల్ల వారి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉంది.

అత్యంత వెనుకబడిన జిల్లా ఆదిలాబాద్‌లో సోయా పంట విస్తీర్ణం బాగా పెరిగింది. దానిని ప్రభుత్వం మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. కాగా అక్కడ జరుగుతున్న కల్తీవ్యాపారంతో రైతులు పెద్దయెత్తున నష్టపోతున్నారు. పత్తి ఉత్పత్తిలో కూడా ఆదిలాబాద్ జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. ఆ జిల్లాలో ప్రత్యేకంగా లాబొరేటరీ ఏర్పాటు చేసి విత్తనాలను సర్టిఫై చేశాకనే విడుదల చేసే విధానాన్ని ప్రవేశ పెట్టాలి. స్వదేశీ, విదేశీ కార్పొరేట్ సంస్థలు విత్తనాల ధరలను పెంచి వేల కోట్ల లాభాలు ఆర్జిస్తుండగా... ప్రభుత్వం రైతులను ఆదుకోకుండా వారి మానాన వారిని వదిలివేయడం అత్యంత దారుణం.

అన్ని దేశాలలో ప్రభుత్వాలు విత్తన రంగంలో చాలా నిక్కచ్చిగా నియంత్రణ చర్యలు చేపడుతున్నారు. వేరే దేశపు విత్తనాలు వచ్చినపుడు 21 రోజులు క్వారంటైన్‌లో పెట్టి పరిశీలనలు జరిపి తరువాత స్వచ్ఛమైనవిగా గుర్తించబడితే దేశంలోకి విడుదల చేస్తున్నారు. కానీ మన దేశంలో ఇటువంటి నిబంధనలు పాటించడం లేదు. రక్షిత విత్తనాలను రైతులకు సరఫరా చేసినపుడే వ్యవసాయ ఉత్పత్తులు పెరిగే ఆస్కారం ఉంటుంది. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులను ఆదుకొనే చర్యలు తీసుకుంటుందని ఆశిద్దాం.

వ్యాసకర్త వ్యవసాయరంగ నిపుణులు

ధర్మ రక్షణ

ఒకసారి రాక్షస రాజు ప్రహ్లాదుని కొడుకు విరోచనుడు, అంగీరస ముని కుమారుడు సుధన్వుడు ఒక కన్యను పొందడానికి, 'నేను శ్రేష్ఠుడినంటే నేను' అని వాదించుకుని ప్రాణాలను పణంగా పెట్టుకొని పందెం వేసుకున్నారు. తమలో శ్రేష్ఠుడెవరో తీర్పు చెప్పమని ప్రహ్లాదుణ్ణి కలిశారు.

ఒకవైపు కొడుకు, మరోవైపు ధర్మం ఉన్నాయి కాబట్టి సులువుగా నిర్ణయించకుండా కశ్యపుని కలుసుకుని 'ధర్మ సంకటంలో ఇరుక్కున్నాను. ఏదైనా ప్రశ్నకు సమాధానం ఇవ్వక పోవడం వలన, తెలిసి తెలిసీ ఏదో ఒక సమాధానం చెప్పడం వల్ల ఎటువంటి గతి కలుగుతుందో చెప్పమని' కోరాడు ప్రహ్లాదుడు.

'తెలిసి కూడా రాగద్వేషాలకు, భయానికి లోనై సరైన సమాధానం చెప్పని వాడు, సాక్ష్యం చెప్పడంలో వెనుకంజ వేసే సాక్షి, ఏదో ఒకటి చెప్పేవాడు వరుణుని సహస్ర పాశాలలో చిక్కుకుంటారు. ఏడాదికొక్క పాశం ముడి మాత్రమే వీడుతుంది. కాబట్టి నిజం స్పష్టంగా తెలిసినవాడు, సత్యాన్ని చెప్పి తీరాలి. ఎక్కడైనా సభలో అధర్మం ధర్మాన్ని అణచివేసినప్పుడు అక్కడి సభ్యులు అధర్మాన్ని తొలగించకపోతే సభాసదులకు కూడా పాపం అంటుకుంటుంది. సభలో నిందితునికి శిక్ష వేయకపోతే సభాపతికి అధర్మఫలంలో సగభాగం, చేయించిన వాడికి నాలుగో వంతు, ఇతర సభ్యులకు నాలుగో వంతు పాపం చుట్టుకుంటుంది. నిందితునికి తగిన శిక్ష విధించబడితే సభాపతికి, సదస్సులకు పాపం అంటకుండా నిందితునికే మొత్తం చెందుతుంది. తెలిసికూడా ప్రశ్నకు ధర్మ విరుద్ధంగా సమాధానం చెబితే అతనికి ముందు వెనుకల ఏడు తరాలకు శ్రౌతస్మార్తాది శుభకర్మలు నశించి పోతాయి' అన్నాడు కశ్యపుడు.

జ్యోతిర్మయం

ధర్మమార్గంలో నిలవాలనుకున్న ప్రహ్లాదుడు, తన కొడుకు ప్రాణాలకు ప్రమాదమని తెలిసీ, విరోచనుడి కంటే సుధన్వుడు శ్రేష్ఠుడని తీర్పు చెప్పాడు. పుత్రప్రేమకు లోబడని ప్రహ్లాదుని ధర్మరక్షణ నిరతికి మెచ్చుకుని విరోచనుడు వందేళ్ళు జీవిస్తాడని ఆశీర్వదించి వెళ్ళిపోయాడు సుధన్వుడు.

– అమ్మాజీ ఉమామహేశ్వర్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, తిథి: బ.అష్టమి రా.12.24 వరకు, తదుపరి నవమి, నక్షత్రం: పూర్వాషాఢ ఉ.9.51 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం: సా.5.20 నుండి 6.50 వరకు, దుర్ముహూర్తం: ఉ.9.55 నుండి 10.44 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.43 వరకు, అమృతఘడియలు: లేవు ; రాహుకాలం: ప.1.30 నుండి 3.00 వరకు, యమగండం: ఉ.6.00 నుండి 7.30 వరకు, సూర్యోదయం: 5.49, సూర్యాస్తమయం: 6.11.

కాటేస్తున్న కల్తీ కల్లు..

మూడుకు చేరిన మృతుల సంఖ్య

- వణికిపోతున్న ఉమ్మడి పాలమూరు జిల్లా
- ఇప్పటికే కోడూరు వాసి మృతి.. తాజాగా ఇద్దరి మరణం
- మహబూబ్‌నగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మరికొందరు
- ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ 50 మంది వరకు బాధితులు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: కల్తీ కల్లు ఉమ్మడి పాలమూరు జిల్లాను వణికిస్తోంది. ఇప్పటికే మహబూబ్‌నగర్ రూరల్ మండలం కోడూరుకి చెందిన హరిజన ఆశన్న (58) మృతిచెందగా.. బుధవారం మరో మహిళ, మరో యువకుడు మరణించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతున్న ఓ మహిళ పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు.

చికిత్స చేసినా ఫలితం లేక..

మహబూబ్‌నగర్ పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన విష్ణుప్రకాశ్ (29) ఈ నెల ఏడో తేదీన వింతగా ప్రవర్తిస్తూ జిల్లా ఆస్పత్రిలో చేరారు. చికిత్స అనంతరం వెంటనే అతడిని వైద్యులు ఇంటికి పంపించారు. అయితే తెల్లారి కూడా అదేవిధంగా ప్రవర్తించడంతో బంధువులు మళ్లీ ప్రభుత్వాస్పత్రి లో చేర్పించారు. అప్పట్నుంచీ ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ బుధవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో మృతి చెందాడు. విష్ణుప్రకాశ్ భూత్పూర్ మండలం అమిస్తాపూర్ గ్రామంలో పోస్టల్ శాఖ ఏబీపీఎంగా ఉద్యోగం చేస్తున్నాడు. తల్లి చిన్నతనంలోనే చనిపోగా.. తపాలా శాఖలో నే పనిచేసే తండ్రి కూడా కొన్నాళ్ల క్రితమే మరణించాడు. తండ్రి స్థానంలో విష్ణుప్రకాశ్ ఉద్యోగంలో చేరాడు. అయి తే అతనికి పెళ్లి కాకపోవడం, ఒంటరితనంతో మందు కల్లుకు బానిస అయినట్లు తెలుస్తోంది. అయితే ఫిట్స్ (మూర్ఛ) రావడంతో విష్ణుప్రకాశ్‌ను ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు అతని మేనత్త భువనేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇలావుండగా జిల్లా ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్న మహబూబ్‌నగర్ రూరల్ మండలం దొడ్డలోనిపల్లికి చెందిన రేణుక (55) కూడా బుధవారం రాత్రి మృతి చెందింది. మరోవైపు జడ్చర్ల మండలం మల్లెబోనిపల్లికి చెందిన రేణుక పరిస్థితి విషమంగా ఉండడంతో నిమ్స్‌కు తరలించారు. కాగా జనరల్ ఆస్పత్రిలోని సాధారణ వార్డుల్లో మరో పది మంది వరకు కల్తీ కల్లు బాధితులు చికిత్స పొందుతున్నట్లు సమాచారం. మృతి చెందిన వారిలో మెటబాలిక్ ఎన్సెఫ లోపతి లక్షణాలు ఉన్నాయని.. పోస్టుమార్టం అనంతరం నమూనాలను హైదరాబాద్ ల్యాబ్‌కు పంపనున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకిషన్ తెలిపారు.



ఆస్పత్రిలో చేరాలంటే చెప్పినట్లు వినాలి..!

కల్తీ కల్లు అలవాటుతో మహబూబ్‌నగర్ మండలంలోని దొడ్డలోనిపల్లి, తిమ్మసానిపల్లి, కోయనగర్, అంబేడ్కర్ నగర్ కాలనీలతో పాటు జడ్చర్ల, నవాబ్‌పేట మండలాలకు చెందిన పలువురు అస్వస్థతకు గురై చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రికి వ చ్చారు. తలవెనక్కి వాలడం, నాలుక బయటకు రావడం, నత్తి, శరీరంలో చలనం లేక పోవడం వంటి లక్షణాలు వారిలో ఉ న్నాయి. ఇది గమనించిన వైద్యులు బాధితులతో వచ్చిన సహా యకులకు ముందస్తు సూచనలు చేసినట్లు సమాచారం. 'ఎవరడిగినా కల్తీ కల్లు కాదు.. ఎండదెబ్బ తాకింది.. కడుపునొప్పి, ఫిట్స్‌తో వచ్చినట్లు చెప్పాలి.. అలా అయితేనే చికిత్స అందజేస్తాం.. లేకుంటే వేరే హాస్పిటల్‌కు వెళ్లొచ్చు..'అని హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఆశన్న, విష్ణుప్రకాశ్ బంధువులు కూడా డాక్టర్ల సూచన మేరకే పోలీసులకు ఫిర్యాదు ఇచ్చినట్లు తెలుస్తోంది.

ప్రైవేట్ ఆస్పత్రుల్లోనూ బాధితులు!

కల్తీ కల్లుకు అలవాటు పడిన పలువురు ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, కిందిస్థాయి సిబ్బంది 40 నుంచి 50 మంది వరకు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వాస్పత్రిలో చేరితే బయటకు తెలుస్తుందని.. పరువు పోతుందనే కారణంతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స తీసుకుంటున్నట్లు తెలిసింది.

కల్తీ అని తేలితే పీడీ యాక్ట్ నమోదు చేస్తాం

- ప్రజల ఆరోగ్య సంరక్షణే మా లక్ష్యం
- ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): కల్తీ కారకులు ఎంతటి వారైనా ఉపేక్షించమని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కల్తీకల్లుతో అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ ఇద్దరు వ్యక్తులు మృతిచెందారని వార్తలు వచ్చిన నేపథ్యంలో బుధవారం జనరల్ ఆస్పత్రిలో మంత్రి విలేకరులతో మాట్లాడారు. అంతకుముందు ఆయా వార్డులలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే వారిని ఉపేక్షించబోమని, దేనిని కల్తీ చేసినా వదిలిపెట్టబోమని అన్నారు. ఇప్పటివరకు 64 మందికి సంబంధించిన శాంపుల్స్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. ఎవరైనా కల్తీకల్లు వల్ల చనిపోయారని తెలిస్తే అందుకు కారణమైన వారిపై క్రిమినల్ కేసులు, పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని వెల్లడించారు. కాగా, చనిపోయిన ఇద్దరిలో ఒకరు ప్రమాదానికి గురయ్యాడని, లివర్ పాడైపోవడంతోపాటు, వివిధ కారణాల వల్ల చనిపోయాడని, ఇంకొక వ్యక్తి అనాథ అని, అతనికి తరచూ ఫీట్స్ వచ్చేవని, శరీరంలో చాలా అవయవాలు దెబ్బతిన్నందువల్ల చనిపోయాడని ప్రాథమికంగా తెలుస్తోందని పేర్కొన్నారు. మృతుల సంబంధీకులు కూడా ఇదే చెపుతున్నారన్నారు. తమ ప్రభుత్వం నిక్కచ్చిగా పని చేస్తుందని అన్నారు. ప్రజల ఆరోగ్యాలను కాపాడటమే తమ లక్ష్యమని చెప్పారు. మహబూబ్‌నగర్ ప్రభుత్వాసుపత్రిలో ఎంతో మార్పు వచ్చిందని, వైద్య సదుపాయాలు మెరుగుపడ్డాయని తెలిపారు. ఆయా ప్రసార సాధనాల్లో వచ్చిన కథనాలపై ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో పాటు ఎక్సైజ్ సూపరింటెండెంట్‌తో విచారణ చేయిస్తామని అన్నారు. ప్రజల ప్రాణాల పరిరక్షణలో భాగంగా కల్తీ కల్లు అన్నది లేకుండా చెట్లు అధికంగా పెంచడంతో పాటు నీరా పాలసీని తీసుకొచ్చామన్నారు. జిల్లాలో కల్తీకల్లు వల్ల జనం చనిపోతే మంత్రి స్పందించడం లేదన్నది అబద్ధమని, రిపోర్టులు వచ్చిన తర్వాత పకడ్బందీ చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకిషన్, డాక్టర్ జీవన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

ఆ మరణాలకు మంత్రిదే బాధ్యత

- కల్తీ కల్లు ఘటనపై డీకే అరుణ

మహబూబ్‌నగర్ న్యూటౌన్: మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో కల్తీ కల్లు మరణాలకు బాధ్యత వహిస్తూ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ రాజీనామా చేయాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ డిమాండ్ చేశారు. బుధవారం ఆమె తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. తన సొంత నియోజకవర్గం ప్రజలు కల్తీ కల్లు సేవించి ఆస్పత్రిపాలై చనిపోతున్నా... ఏడు రోజులుగా ఇబ్బందులు పడుతున్నా సంబంధిత శాఖకు మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీనివాస్‌గౌడ్ ఘటనపై స్పందించకపోవడం సిగ్గు చేటని విమర్శించారు. టీఎస్‌పీఎస్సీ పరీక్ష పేపర్లను అమ్ముకునే స్థితికి బీఆర్‌ఎస్ నాయకులు దిగజారడం సిగ్గు చేటన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్‌పై మంత్రులెవరూ మాట్లాడలేదని, మొత్తం కేటీఆర్ వ్యవహారం నడిపించారని ఎద్దేవా చేశారు. విషయాన్ని పక్కదారి పట్టించేందుకు కేటీఆర్ ఎన్నో కుట్రలు చేసినా నిరుద్యోగులు అన్నీ గమనిస్తున్నారన్నారు. ఖమ్మంలో బాణాసంచా పేల్చడంతో ఇంటిపై నిప్పు పడి సిలిండర్ పేలిన ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, క్షతగాత్రులకు ఒక్కొక్కరికి రూ.50లక్షల పరిహారం ఇవ్వాలని డీకే అరుణ డిమాండ్ చేశారు. ప్రమాదానికి కారకులైన బీఆర్‌ఎస్ నాయకులపై వెంటనే అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలన్నారు.



'ఇక పంటలకు సుడిదోమ సమస్యలుండవు'



సుడిదోమ నివారణ మందుల పరిశ్రమను ప్రారంభిస్తున్న హీరోయుకి

జహీరాబాద్: నిచినో ఇండియా కర్మాగారం నూతన ఆవిష్కరణలతో భారత దేశంలోని రైతాంగానికి మరింత సేవలందించనుందని జపాన్ సంస్థ నిహాన్ నోహ్యాకు గ్లోబల్ ప్రెసిడెంట్ హీరోయుకి ఇవాటాశాన్ అన్నారు. జహీరాబాద్ సరిహద్దు, కర్ణాటకలోని హుమ్నాబాద్‌లో నిచినో ఇండియా అగ్రో కెమికల్స్ కంపెనీని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పదేళ్ల పరిశోధనల అనంతరం నిచినో ఇండియా ఆవిష్కరించిన బెంజో పైరిమాక్సన్‌తో సుడిదోమ నిర్మూలన సులభమవుతుందన్నారు.

అంబేడ్కర్ అందరివాడు

- బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం



సన్మాన గ్రహీతలతో బుర్రా వెంకటేశం, జూలూరు గౌరీశంకర్, ఆయాచితం శ్రీధర్ తదితరులు

చిక్కడపల్లి (హైదరాబాద్): అంబేడ్కర్ ఒక కులం, లేదా ఒక వర్గానికి ప్రతినిధి కాదని, ఆయన అందరివాడని బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా గ్రంథాలయ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనాల కార్యక్రమాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అర్థం చేసుకునే విధానంలో మార్పు రావాలని అన్నారు. రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ భారీ అంబేడ్కర్ విగ్రహం ప్రతి ఒక్కరిలోనూ స్ఫూర్తి కలిగిస్తుందని అన్నారు. గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఆయాచితం శ్రీధర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నూతన సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టడం, భారీ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా 15 మంది కవులను సత్కరించారు.

రెండోవిడతలో 80 లక్షల గొర్రెల పంపిణీ

సాక్షి, హైదరాబాద్: రెండో విడత ద్వారా రూ.6125 కోట్లతో, 3.5 లక్షల యూనిట్ల ద్వారా లబ్ధిదారులకు సుమారు 80 లక్షల గొర్రెలను పంపిణీ చేయనున్నామని గొర్రెల, మేకల అభివృద్ధి సంస్థ చైర్మన్ దూదిమెట్ల బాలరాజ్ యాదవ్ తెలిపారు. బుధవారం బీఆర్‌కేఆర్ భవన్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో దూదిమెట్ల భేటీ అయ్యారు. రెండో విడత గొర్రెల పంపిణీ పథకం గురించి సీఎస్‌కు వివరించారు. మొదటి విడత గొర్రెల లబ్ధిదారుల నుంచి సమాచారాన్ని సేకరించామని, వారికి మరింత అవగాహన కల్పించేందుకు 'గొర్రెల మంద వద్ద పల్లె నిద్ర'వంటి కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు.



సీఎస్‌ను కలిసిన దూదిమెట్ల బాలరాజ్

పోరుబాటలో 'జూనియర్' కార్యదర్శులు!

- సర్కారు స్పందించకుంటే 28 నుంచి సమ్మె
- ప్రభుత్వానికి జూనియర్ పంచాయతీ కార్యదర్శుల లేఖ
- 11తో పూర్తయిన నాలుగేళ్ల 'ప్రొబేషనరీ'
- ఇంకా కదలని క్రమబద్ధీకరణ ఫైలు

సాక్షి ప్రతినిధి, వరంగల్: మూడేళ్ల ప్రొబేషనరీ పీరియడ్‌తో కొలువులోకి తీసుకున్న ప్రభుత్వం నాలుగేళ్లు గడుస్తున్నా రెగ్యులరైజ్ చేయకపోవడంతో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఆందోళన చెందుతున్నారు. నూతన గ్రామ పంచాయతీల ఏర్పాటు, అనేక గ్రామపంచాయతీల్లో గ్రామ కార్యదర్శుల కొరత ఉందని గ్రహించిన రాష్ట్ర ప్రభుత్వం 2018లో 9,355 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులను నియమించాలని నిర్ణయించింది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా 2018 ఆగస్టులో నోటిఫికేషన్ వెలువరించింది. 2018 అక్టోబర్ 10న పరీక్ష జరిపి ఎంపికైన వారిని ఏప్రిల్ 11, 2019 నుంచి గ్రామ కార్యదర్శులుగా నియమించింది. మూడేళ్ల ప్రొబేషనరీ పీరియడ్‌తో నెలకు రూ.15 వేల గౌరవ వేతనం ప్రకటించింది. నోటిఫికేషన్‌లో ఇచ్చిన దాని ప్రకారం మూడేళ్ల తర్వాత గ్రేడ్- 4 ఉద్యోగులుగా గుర్తించి రెగ్యులరైజ్ చేస్తామని ప్రభుత్వం మాటిచ్చింది. ఈ ఏడాది ఏప్రిల్ 11తోనే గ్రామ కార్యదర్శుల పదవీ కాలం నాలుగేళ్లు పూర్తయ్యింది. ఎన్నికల సమయం కావడం, సెర్ప్ ఉద్యోగులను క్రమబద్ధీకరించడంతో గ్రామ కార్యదర్శులు కూడా ప్రభుత్వ నిర్ణయం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

కార్యదర్శి కొలువు.. కష్టాలకు నెలవు

గ్రామపంచాయతీ పరిధిలో రికార్డులు, బడ్జెట్ నిర్వహణ, జనన మరణ పత్రాల జారీ, ఆస్తిపన్ను వసూలు, వీధి దీపాల నిర్వహణ, పారిశుద్ధ్యం తాగునీటి సరఫరా, మౌలిక సదుపాయాలు, స్వచ్ఛ భారత్ మిషన్, హరితహారం, ఆస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ తదితర 50 రకాల విధులను రోజుకు 10 నుంచి 12 గంటలపాటు నిర్వహిస్తున్నారు. పల్లె ప్రగతిని విజయవంతం చేయడంలో గ్రామ కార్యదర్శులు కీలక పాత్ర పోషించారు. ఇక స్థానిక రాజకీయాలతో నోటీసులు, వేధింపులు భరించలేక ఇప్పటికే రాష్ట్రంలో దాదాపుగా 1500 మంది ఉద్యోగాలు వదిలేశారు. గుండెపోటు ఇతర అనారోగ్య సమస్యలతో 40 మంది వరకు మృతి చెందారు. గత పీఆర్‌సీలో భాగంగా 30శాతం జీతాలు పెంచిన రాష్ట్ర ప్రభుత్వం తమపై కూడా కరుణ చూపించి రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కోరుతున్నారు.

క్రమబద్ధీకరించకుంటే సమ్మె తప్పదు

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించడంలేదు. అందుకే ఈనెల 15న అన్ని జిల్లాల కలెక్టర్లకు సమ్మె నోటీసులు ఇస్తాం. 28 వరకు స్పందించకపోతే నేరుగా సమ్మెలోకి వెళ్తాం. నాలుగేళ్లుగా ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తున్నప్పటికీ ఇప్పటికీ తమను క్రమబద్ధీకరించకపోవడంతో ఉద్యోగభద్రతపై అందరిలోనూ భయాందోళనలు నెలకొన్నాయి.

– జి.రాజేశ్వర్‌రావు, రాష్ట్ర అధ్యక్షుడు, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం

నేర నిరూపణలో వేలిముద్రలు కీలక ఆధారం

- ఫింగర్ ప్రింట్ బ్యూరో అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో డీజీపీ
- ఉత్తమ పనితీరు కనబరిచిన సిబ్బందికి అవార్డుల ప్రదానం

సాక్షి, హైదరాబాద్: నేర పరిశోధనలో, నేరాన్ని నిరూపించి నిందితులకు శిక్షను ఖరారు చేయడంలో వేలిముద్రలు తిరుగులేని ఆధారంగా పనిచేస్తాయని డీజీపీ అంజనీకుమార్ అభిప్రాయపడ్డారు. రాష్ట్ర పోలీస్ శాఖలో తొలిసారిగా రాష్ట్రస్థాయిలో ఫింగర్‌ప్రింట్ బ్యూరో అధికారులతో డీజీపీ అంజనీకుమార్ బుధవారం ప్రత్యేకంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఐడీ అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమీక్షలో రాష్ట్రవ్యాప్తంగా 41 యూనిట్ల నుంచి ఫింగర్‌ప్రింట్ బ్యూరో అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, అనాథ శవాల గుర్తింపులోనూ వేలిముద్రలు ఎంతో కీలకమని అన్నారు. హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్లు, ములుగు జిల్లా పరిధిలో కలిపి కొత్తగా ఏర్పాటు చేసిన జోన్లలో ఏర్పాటు చేయనున్న నూతన క్లూస్ టీంలకు ఫింగర్‌ప్రింట్ బ్యూరో అధికారులు రెండు వారాల శిక్షణ ఇస్తారని డీజీపీ తెలిపారు. మహేశ్ భగవత్ నేతృత్వంలో ఫింగర్‌ప్రింట్ బ్యూరో అద్భుతంగా పనిచేస్తోందని డీజీపీ అభినందించారు. 2023 ఏడాది మొదటి త్రైమాసికంలో అత్యుత్తమ పనితీరు కనబర్చినందుకుగాను 5 పోలీస్ ఫింగర్‌ప్రింట్ యూనిట్లు, సంబంధిత యూనిట్ల అధికారులకు డీజీ పీ అవార్డులు అందజేశారు. ఉత్తమ పనితీరు కనబరిచే ప్రతి అధికారికి తగిన గుర్తింపు దక్కుతుందని మహేశ్ భగవత్ అన్నారు. సమీక్షలో సీఐడీ అడ్మిన్ ఎస్పీ ఎం.నారాయణ, ఫింగర్‌ప్రింట్ బ్యూరో డైరెక్టర్ తాతారావు పాల్గొన్నారు.

ఎరుకల నాంచారమ్మ తల్లి జాతర పోస్టర్ ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి సమీపంలో నిర్వహించే 'ఎరుకల నాంచారమ్మ తల్లి జాతర'పోస్టర్‌ను రాష్ట్ర గిరిజన, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ఆవిష్కరించారు. బుధవారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల సంస్కృతిని పరిరక్షిస్తోందని, ఇందులో భాగంగా గిరిజనుల జాతరలను అత్యంత వైభవంగా నిర్వహిస్తోందని తెలిపారు.

క్లుప్తంగా...

కింది ఉద్యోగితో షూ మోయించిన కలెక్టర్!



కళ్లకురిచి(తమిళనాడు): తమిళనాడులో ఓ జిల్లా కలెక్టర్ అధికార దర్పం ప్రదర్శిస్తూ కిందిస్థా యి ఉద్యోగితో షూ మోయించారనే వార్త చర్చ నీయాంశమైంది. వేలాదిమంది లింగమార్పిడి (ట్రాన్స్‌జెండర్) వర్గీయులు సమూహంగా వేడుక జరుపుకునే ప్రముఖ కోవాంగం కుతం దవార్ ఆలయం వద్ద ఈ ఘటన జరిగింది. ఆలయంలో కోవాంగం వేడుక ఏర్పాట్లను సమీక్షించేందుకు కళ్లకురిచి కలెక్టర్ శ్రవణ్‌కుమార్ జతావత్ అక్కడికి చేరుకున్నారు. ఆలయంలోకి వెళ్లేప్పుడు ఆయన షూ విప్పివెళ్లారు. ఆ సందర్భంగా తన షూ చేతపట్టుకుని వెంట రావాలని కింది స్థాయి ఉద్యోగిని ఆదేశించడం.. అతను షూ మోస్తున్నట్లు చూపే వీడియో ఒకటి ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా షేర్ అవుతోంది. దీంతో 'కలెక్టర్ అధికారదర్పం' అంటూ పలువురు నెటిజన్లు విమర్శలు ఎక్కుపెట్టారు. దీనిపై కలెక్టర్‌ను వివరణ కోరగా.. ' షూ తీసుకుని రావాలని అతనికి నేనస్సలు చెప్పలేదు. అది నకిలీ వీడియో. ఎవరో కావాలని ఎడిట్ చేసి షేర్‌చేశారు' అని అన్నారు.

ఎంవీఏ ఐక్యంగా సాగాలి: పవార్



ముంబై: భిన్నాభిప్రాయాలు, అభిప్రాయ భేదాలున్నా వాటిని పక్కన పెట్టి మహా వికాస్ అగాఢీ సంకీర్ణం కలసికట్టుగా పని చేయాలని భాగస్వామ్య పార్టీ ఎన్సీపీ అధినేత శరద్‌పవార్ పిలుపునిచ్చారు. సంకీర్ణంలోని మిగతా పక్షాలైన కాంగ్రెస్, శివసేన (యూబీటీ) మధ్య సావర్కర్ విషయమై రగడ జరగడం తెలిసిందే. అంతేగాక అదానీ ఉదంతంపై అవి రెండూ సంయుక్త పార్లమెంటరీ సంఘం విచారణకు డిమాండ్ చేస్తుండగా పవార్ మాత్రం సుప్రీంకోర్టు కమిటీ మేలని అభిప్రాయపడి కలకలం సృష్టించారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ''అగాఢీ ఐక్యతపై శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రేతో మాట్లాడాను. ఆ దిశగా కొన్ని కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించాం. వాటిలో మూడు పార్టీలూ పాల్గొంటాయి'' అని వివరించారు.



కర్ణాటక ఎన్నికలంటే వంశపారంపర్య రాజకీయాలే కళ్లముందు కదలాడుతాయి. జేడీ(ఎస్) కుటుంబానికి కుటుంబం ఎన్నికల్లో పోటీ చేసి పదవులు దక్కించుకోవడం, కాంగ్రెస్‌తో పాటు బీజేపీ కూడా వారసులకి టికెట్లు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. రెండో తరం, మూడో తరం కూడా తండ్రులు, తాతల పేర్లు చెప్పుకొని రాజకీయాల్లోకి ఎంట్రీ ఇస్తున్నారు. తండ్రి కోసం కొడుకు, కొడుకు కోసం తండ్రి చేసిన త్యాగాలు, తల్లిపైనున్న అసంతృప్తిని మోయడానికి సిద్ధమైన కొడుకు, భార్య టికెట్ కోసం ఏకంగా కుటుంబంపైనే తిరుగుబాటు సిద్ధమైన వారితో రాజకీయం రసకందాయంలో పడింది. - సాక్షి, నేషనల్ డెస్క్

వారసుల పోరు

కన్నడ నాట పొలిటికల్ చిత్రమ్

ప్రియాంక్ ఖర్గే.. లిట్మస్ టెస్ట్



➤ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే కుమారుడైన ప్రియాంక్ ఖర్గే చిత్తపూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారు. తండ్రి కాంగ్రెస్ అధ్యక్షుడయ్యాక సొంత రాష్ట్రంలో జరుగు తున్న తొలి ఎన్నికల కావడంతో ఈ స్థానం నుంచి గెలిచి తీరాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత ఎన్నికల్లో ప్రియాంక్ 4 వేల కంటే తక్కువ ఓట్లతో నెగ్గారు. పోలీసు రిక్రూట్‌మెంట్ కుంభకోణాన్ని వెలుగులోకి తెచ్చి బసవరాజ్ బొమ్మై ప్రభు త్వాన్ని ఇరకాటం పెట్టడంలో విజయం సాధించారు. ఈసారి కాంగ్రెస్‌కు 140 సీట్లు ఖాయమని ప్రియాంక్ అంటుంటే, 'ప్రియాంక్ ఖర్గే కనబడుట లేదు' అంటూ ఆయన నియోజకవర్గంలో బీజేపీ పోస్టర్లు ఏర్పాటు చేసింది!

అమ్మ కొడుకు



➤ హెచ్.డి. కుమారస్వామి కుమారుడు నిఖిల్ పోటీపడుతున్న రామనగర్ నియోజకవర్గం పై ఇప్పుడు అందరి దృష్టి ఉంది. ఇన్నాళ్లూ కుమారస్వామి భార్య అనిత కుమారస్వామి ఆ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆమె తన కొడుకు కోసం ఆ స్థానం నుంచి తప్పుకున్నారు. ఇటీవల నిఖిల్ రామనగర్‌లో పర్యటనకు వెళ్లినప్పుడు ఆయనకు చేదు అనుభవాలు ఎదురయ్యాయి. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంతో తల్లి వైఫల్యాలు ఇప్పుడు కుమారుడి భవిష్యత్‌ను ఎటు తీసుకువెళతాయా అన్న సందేహాలున్నాయి. మౌలిక సదు పాయాలు, తాగు నీటి సౌకర్యం కూడా లేకపోవ డంతో స్థానికులు నిఖిల్‌ను నిలదీస్తున్నారు. మరి ఈ స్థానం నుంచి నిఖిల్ నెగ్గుతారా లేదా అన్నది సందేహంగానే మారింది.

కుమారునికి యడ్డీ అండ



➤ వంశ పారంపర్య రాజకీయాలపై కాంగ్రెస్‌ను మొదట్నుంచి చీల్చి చెండాడుతున్న బీజేపీ కూడా కర్ణాటకలో బీఎస్ యడియూరప్ప ఒత్తిడికి తలొగ్గక తప్పలేదు. యడ్డీ 1983 నుంచి రికార్డు స్థాయిలో ఏడుసార్లు నెగ్గిన శివమొగ్గలో షికారిపుర నుంచి ఈ సారి విజయేంద్ర పోటీ పడుతున్నారు. ఎన్నికల వ్యవహారాలను తన భుజస్కంధాలపై మోస్తున్న యడియూరప్ప తన కుమారుడు విజయేంద్ర కోసం తాను స్వయంగా ఎన్నికల బరి నుంచి తప్పుకోవడంతో విజయేంద్రకు టికెట్ దక్కింది. బీజేపీ యువమోర్చా ప్రధాన కార్యదర్శిగా, కర్ణాటక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నప్పటికీ విజయేంద్రకి గతంలో రెండు సార్లు టికెట్ రాక నిరాశ చెందారు. ముచ్చటగా మూడో సారి ప్రయత్నం ఫలించడంతో ఇక ఎన్నికల్లో గెలుపుపై ఆయన దృష్టి సారించారు.

తండ్రి కోసం యతీంద్ర త్యాగం



➤ మహాభారతంలో భీముడు, ఘటోత్కచుడు బంధం ఎలాగుంటుందో కర్ణాటక రాజకీయాల్లో కాంగ్రెస్ నాయకుడు సిద్ధరామయ్య, ఆయన కుమారుడు యతీంద్ర మధ్య సంబంధం అలాగే ఉంటుందని చెప్పుకుంటారు. యతీంద్ర తండ్రికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండడానికి తన భవిష్యత్‌ను కూడా పణంగా పెట్టారు. ఈ సారి ఎన్నికల్లో వరుణ అసెంబ్లీ సీటుని తన తండ్రి కోసం త్యాగం చేశారు. గత ఎన్నికల్లో 45 వేల ఓట్ల భారీ మెజార్టీతో వరుణ నుంచి నెగ్గిన యతీంద్ర కాంగ్రెస్ పార్టీ గెలిస్తే సిద్దరామయ్య సీఎం అవడం కోసం ఈ సీటుని వదులుకున్నారు. కాంగ్రెస్‌లో సిద్దరామయ్య, డికె. శివకుమార్ ఇద్దరూ సీఎం పదవి ఆశిస్తూ ఉండడంతో సిద్దరామయ్యని ఓడిస్తారన్న ప్రచారం జరుగుతోంది..వరుణ నియోజక వర్గం నుంచి పోటీపడితే సిద్దరామయ్యకి తిరుగుండదని యతీంద్ర పోటీ నుంచి తప్పుకున్నారు.

జేడీ(ఎస్)లో హాసన్ ప్రకంపనలు



రేవన్న దంపతులు
ప్రజ్వల్
సూరజ్

➤ కుటుంబ పార్టీగా ముద్ర పడిన జేడీ(ఎస్)లో ఈ సారి ఎన్నికలు కుటుంబంలో చీలికకు దారి తీసే అవకాశాలు కనిపిస్తున్నాయి. హెచ్.డీ. దేవెగౌడ పెద్ద కుమారుడు రేవణ్ణ తన భార్య భవానీ రాజకీయ ఎంట్రీకి ఇదే తగిన సమయమని భావిస్తున్నారు. హాసన్ నియోజకవర్గం నుంచి ఆమెకి టిక్కెట్ ఇవ్వాలని పట్టుబడుతున్నారు. మరోవైపు హెచ్.డి. కుమారస్వామి హాసన్ స్థానాన్ని తన వదినకు ఇవ్వలేమని హెచ్‌పి. స్వరూప్‌కే ఇస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే హెచ్‌డి రేవణ్ణ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన కుమారులు ప్రజ్వల్ రేవణ్ణ హాసన్ నుంచి ఎంపీగా ఉంటే, మరో కుమారుడు సూరజ్ రేవణ్ణ ఎమ్మెల్సీగా ఉన్నారు. ఇప్పుడు భవానీకి కూడా టిక్కెట్ ఇస్తే వారి కుటుంబం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన ఎనిమిదో వ్యక్తి అవుతారు. ఇది ఎన్నికల్లో తీవ్ర ప్రభావం కనిపించే అవకాశం ఉంది. ఒకవేళ టిక్కెట్ దక్కకపోతే తాను, తన భార్య స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తామని హెచ్‌డి రేవణ్ణ బెదిరింపులకు దిగడం పార్టీలో కలకలానికి దారి తీస్తోంది.

కర్ణాటక బీజేపీలో భగ్గుమన్న అసమ్మతి

- అభ్యర్థుల తొలి జాబితా ప్రకంపనలు
- పార్టీకి సావాది, దొడ్డప్ప గుడ్‌బై
- మంత్రి అంగారా రాజకీయ సన్యాసం

బెంగళూరు: కర్ణాటక బీజేపీలో అసమ్మతి భగ్గుమంది. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 52 కొత్త ముఖాలకు టిక్కెట్‌లు ఇస్తూ విడుదల చేసిన తొలి జాబితా పార్టీలో ప్రకంపనలు సృష్టిస్తోంది. టికెట్ రాని అసంతృప్త నాయకులు ఒక్కొక్కరుగా పార్టీకి గుడ్ బై కొడుతున్నారు. మరికొందరు పార్టీ నుంచి వెళ్లి పోతామంటూ బెదిరింపులకి దిగుతున్నారు. ఆశావహుల మద్దతుదారులు బీజేపీ కార్యాలయం వద్ద నిరసనలకు కూడా దిగారు. సీనియర్ నేత లక్ష్మణ్ సావాది, మాజీ ఎమ్మెల్యే దొడ్డప్పగౌడ పాటిల్ నారిబోల్‌లు పార్టీకి బుధవారం గుడ్‌బై కొట్టేశారు. సలియా నియోజకవర్గం నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా నెగ్గి ప్రస్తుతం మంత్రిగా ఉన్న ఎస్. అంగారా టికెట్ రాకపోవడంతో ఏకంగా రాజకీయ సన్యాసం స్వీకరిస్తున్నట్టుగా ప్రకటించారు. లక్ష్మణ్ సావాది మాజీ సీఎం బీఎస్ యడ్డీయూరప్పకి అత్యంత విధేయుడు, శక్తిమంతమైన లింగాయత్ నాయకుల్లో ఒకరు. 2018 ఎన్నికల్లో ఓటమిపాలైనప్పటికీ, ఆ తర్వాత ఇతర పార్టీల నుంచి ఫిరాయింపుదారుల్ని ఆకర్షించడంలో పకడ్బందీగా వ్యూహాలు పన్నారు. ఈసారి టికెట్ రాకపోవడంతో సావాది తాను ఎవరినీ బిచ్చమడగనని, తనకి ఆత్మ గౌరవం ఉందని వ్యాఖ్యానించారు. పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఆయన కాంగ్రెస్‌లోకి వెళతారంటున్నారు. మాజీ ఎమ్మెల్యే దొడ్డప్ప గౌడ కూడా రాజీనామా చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగదీశ్ షెట్టార్ పేరు తొలిజాబితాలో లేకపోయేసరికి ఆగ్రహావేశాలతో ఢిల్లీకి వెళ్లి బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాను కలిశారు. టికెట్ వస్తుందని ఆశాభావంతో ఉన్నారు. ఇక మంత్రి అంగారా పార్టీ తనను తీవ్రంగా అవమానించిందంటూ రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్టుగా ప్రకటించారు.

బీజేపీ 'వన్ నేషన్ వన్ మిల్క్'ను తిప్పికొడతాం : కాంగ్రెస్

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల్లో డెయిరీ కోఆపరేటివ్‌లపై కన్నేసిందని కాంగ్రెస్ ఆరోపించింది. ప్రతీ రాష్ట్రంలోని పాల ఉత్పత్తుల సహకార సంఘాలను తన నియంత్రణలోకి తీసుకురావాలని చూస్తోందని మండిపడింది. ఇవాళో రేపో వన్ నేషన్ వన్ డెయిరీ అనే నినాదాన్ని తెరపైకి తెస్తుందని, తాము ఎట్టి పరిస్థితుల్లోనూ దానికి అంగీకరించే ప్రసక్తే లేదని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ అన్నారు. డెయిరీ సహకార సంఘాలను కూడా కేంద్రం తన పరిధిలోకి తీసుకునే ప్రయత్నాలు చేస్తోందని మండిపడ్డారు. గుజరాత్‌కు చెందిన అమూల్ తాము కర్ణాటకలో కూడా పాల సరఫరా చేయబోతున్నామంటూ చేసిన ట్వీట్ రాజకీయ వివాదానికి దారి తీసింది. కర్ణాటక రాష్ట్ర పాల సహకార సంఘం నందినిని అమూల్‌కు కట్టబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ కాంగ్రెస్ ఆరోపణలు గుప్పించింది.

'డోక్లాం' దేశ భద్రతకు పెనుముప్పు: కాంగ్రెస్

న్యూఢిల్లీ: భారత సరిహద్దు ప్రాంతం డోక్లాం పీఠభూమి దగ్గర చైనా నిర్మాణాలు కొనసాగిస్తుండటంపై కాంగ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తంచేసింది. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ బుధవారం ఒక ప్రకటన విడుదలచేశారు. ''డోక్లాం పీఠభూమికి అత్యంత సమీపంలో చైనా మిలటరీ నిర్మాణాలపై భారత సైన్యం తాజాగా మరింత ఆందోళన వ్యక్తంచేసింది. ఒక్క అంగుళం భూమి కూడా ఎవరికో వదులుకునే ప్రసక్తి లేదని అమిత్ ప్రకటించారు. కానీ 2020 మే తర్వాత 2,000 కిలోమీటర్ల భారత భూభాగాన్ని గస్తీకాసే అవకాశాన్ని చైనా బలగాలు పోగొట్టాయి. మన డెప్సాంగ్, డెమ్‌చోక్, హాట్‌స్ప్రింగ్(కుగ్‌గ్రాంగ్ నళా), గోగ్రా పోస్టు వంటి పెట్రోలింగ్ పాయింట్లకు మన బలగాలు వెళ్లకుండా చైనా సైన్యం అడ్డుతగులుతోంది. దీనిపై మోదీ మౌనం వీడాలి'' అని డిమాండ్ చేశారు.

మళ్లీ కోవిషీల్డ్ ఉత్పత్తి

న్యూఢిల్లీ: తగిన డిమాండ్ లేకపోవడం, కోవిడ్ ఉధృతి తగ్గుముఖం పట్టడంతో గతంలో ఆగిన కోవిషీల్డ్ కోవిడ్ టీకా ఉత్పత్తిని తాజాగా పునఃప్రారంభించామని దాని తయారీసంస్థ సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సీఈవో అదర్ పూనావాలా బుధవారం ప్రకటించారు. కొత్తగా కోవిడ్ కేసుల సంఖ్య రోజురోజుకూ ఎక్కువవుతుండటంతో వ్యాక్సిన్ ఉత్పత్తి మొదలుపెట్టినట్లు ఆయన వెల్లడించారు. ' ఇప్పటికే 60 లక్షల కోవోవ్యాక్స్ బూస్టర్ డోసులు అందుబాటులో ఉన్నాయి. వయోజనులు కచ్చితంగా బూస్టర్ డోసులు తీసుకోవాలి. ముందస్తు జాగ్రత్తగా ప్రజలు తమ ఐచ్ఛికంగా కోవిషీల్డ్‌నూ తీసుకోవచ్చు. వచ్చే 90 రోజుల్లో 60–70 లక్షల డోసుల కోవిషీల్డ్ అందుబాటులో ఉండేలా చూస్తాం. డిమాండ్‌కు తగ్గట్లు స్టాక్‌ను పెంచేందుకు తొమ్మిది నెలల సమయం పట్టొచ్చు' అని పూనావాలా చెప్పారు. చివరిసారిగా కోవిషీల్డ్ ఉత్పత్తిని సీరమ్ సంస్థ 2021 డిసెంబర్‌లో నిలిపేసింది.

సమైక్యంగా ఎన్నికలకు!

కాంగ్రెస్, జేడీ(యూ), ఆర్జేడీ నిర్ణయం

- ఖర్గే, రాహుల్‌తో నితీశ్, తేజస్వి భేటీ
- సంయుక్తంగా మీడియా ముందుకు
- చరిత్రాత్మక భేటీగా పేర్కొన్న రాహుల్
- విపక్షాలన్నింటినీ కూడగడతాం: ఖర్గే
- విపక్షాల ఐక్యత దిశగా కీలక అడుగులు



భేటీ సందర్భంగా ఢిల్లీలో తన నివాసంలో నితీశ్, తేజస్వీ, రాహుల్‌లతో ఖర్గే

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు ఏడాదే ఉన్న నేపథ్యంలో విపక్షాల ఐక్యత దిశగా కీలక అడుగులు పడుతున్నాయి. బిహార్‌లో అధికారంలో ఉన్న మహాఘట్‌బంధన్ భాగస్వామ్య పక్షాల అధినేతలు, ముఖ్య నేతల మధ్య బుధవారం కీలక సమావేశం జరిగింది. బిహార్ ముఖ్యమంత్రి, జేడీ(యూ) నేత నితీశ్‌కుమార్, ఉప ముఖ్యమంత్రి, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీతో భేటీ అయ్యారు. బీజేపీని కలసికట్టుగా ఎదుర్కోవడంతో పాటు పలు అంశాలపై లోతుగా చర్చలు జరిపారు. అనంతరం నేతలంతా సంయుక్తంగా మీడియా ముందుకొచ్చారు. విభేదాలను పక్కన పెట్టి కలసికట్టుగా ముందుకు సాగాలని నిర్ణయించుకున్నట్టు చెప్పారు. విపక్ష కూటమికి ఎవరు నాయకత్వం వహిస్తారన్న మీడియా ప్రశ్నలకు మాత్రం నేతలు సమాధానం దాటవేశారు! మోదీ మేజిక్‌ను ఎదర్కోవడానికి ఒక ఉమ్మడి నాయకున్ని ప్రకటించే ఎన్నికల బరిలో దిగడం మేలని విపక్ష నేతల్లో కొందరంటుండగా అది అంతిమంగా తమకే చేటు చేయవచ్చని మరికొందరు భావిస్తుండటమే దీనికి కారణమని చెబుతున్నారు.

కీలక ముందడుగు: రాహుల్

తమ భేటీని చరిత్రాత్మక సమావేశంగా రాహుల్ అభివర్ణించారు. ''ఈ భేటీ విపక్షాల ఐక్యత దిశగా కీలక ముందడుగు. ఎన్నో అంశాలపై చర్చించుకున్నాం. అన్ని పార్టీలనూ ఒక్కతాటిపైకి తీసుకొచ్చి లోక్‌సభ ఎన్నికలను సమైక్యంగా ఎదుర్కోవాలని నిర్ణయించుకున్నాం. ఇప్పట్నుంచే అందరమూ ఆ దిశగా పని చేస్తాం. మాది సైద్ధాంతిక పోరాటం. విపక్షాల ఉమ్మడి విజన్‌ను త్వరలో ప్రజల ముందుంచనున్నాం'' అని వెల్లడించారు. ఎన్ని విపక్షాలు కలిసి రానున్నాయని ప్రశ్నించగా అందరినీ ఒక్కతాటిపైకి తీసుకొచ్చే ప్రయత్నాలింకా కొనసాగుతున్నాయని రాహుల్ బదులిచ్చారు. ''ఒక్కటిగా నిలబడ్డాం. దేశం కోసం ఒక్కటిగా పోరాడతాం'' అంటూ అనంతరం ట్వీట్ చేశారు. రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణకు, దేశానికి నూతన దిశానిర్దేశం చేసేందుకు కలసికట్టుగా సాగుతామని ఖర్గే ప్రకటించారు. నితీశ్, తేజస్వి తదితరులతో భేటీ చాలా బాగా జరిగిందంటూ ట్వీట్ చేశారు. విపక్షాలను ఒక్కతాటిపైకి తెచ్చేందుకు కాంగ్రెస్ చేస్తున్న ప్రయత్నాల్లో ఇది తొలి సమావేశం. ఖర్గే నివాసంలో జరిగిన ఈ సమావేశంలో జేడీ(యూ) అధ్యక్షుడు లాలన్‌సింగ్, బిహార్‌పీసీసీ చీఫ్ అఖిలేశ్ ప్రసాద్‌సింగ్, ఆర్జేడీ నేత మనోజ్ ఝూ తదితరులు పాల్గొన్నారు. దీనికి కొనసాగింపుగా ముమ్ముందు మరిన్ని విపక్షాలతో ఖర్గే భేటీ కానున్నారు. డీఎంకే అధినేత, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్, శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే తదితరులతో ఇటీవలే ఆయన సమావేశమై చర్చించారు. ఇటీవలే ముగిసిన పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ సారథ్యంలో 19 విపక్షాలు సమైక్యంగా నిరసనలు, ఆందోళనల్లో పాల్గొనడం తెలిసిందే.

పార్టీలన్నింటినీ కలుపుకుంటాం: నితీశ్

దేశంలోని విపక్ష పార్టీలన్నింటినీ కలుపుకుని పోయేందుకు అన్నివిధాలా ప్రయత్నిస్తామని నితీశ్ ప్రకటించారు. ''అంతా కలిసి పని చేయాలని భేటీలో నిర్ణయం తీసుకున్నాం. అందుకోసం అందరమూ కూర్చుని మాట్లాడుకుంటాం. భావి కార్యాచరణను నిర్ణయించుకుంటాం. అది త్వరలోనే జరుగుతుంది. ఆ దిశగా ముందుకు సాగనున్నాం'' అని వెల్లడించారు. విపక్షాల ఐక్యతను సాధించే కీలక శక్తిగా నితీశ్ నిలవనున్నారంటూ జేడీ(యూ) ట్వీట్ చేసింది.

బందిపోట్ల కూటమి: బీజేపీ

కాంగ్రెస్, జేడీ(యూ), ఆర్జేడీ నేతల భేటీని రాజకీయ గిమ్మిక్కుగా బీజేపీ అభివర్ణించింది. ''అదో బందిపోట్ల కూటమి. నిండా అవినీతిలో కూరుకుపోయిన వాళ్లంతా చట్టం బారి నుంచి తమను తాము కాపాడుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలివి. ఇలాంటి విన్యాసాలతో వారి అవినీతి దాగబోదు'' అని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ దుయ్యబట్టారు. 2014, 2019 ఎన్నికల్లో వారిని ప్రజలు వరుసగా తిరస్కరించారన్నారు. ఈసారి కూడా అదే ఫలితం పునరావృతమవుతుందని, మోదీ సారథ్యంలో బీజేపీ ఘనవిజయం ఖాయమని జోస్యం చెప్పారు.

నితీశ్‌కు పూర్తి మద్దతు: కేజ్రీ



కాంగ్రెస్ నేతలతో భేటీ అనంతరం నితీశ్, తేజస్వీ బుధవారం సాయంత్రం ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌తో ఆయన నివాసంలో సమావేశమయ్యారు. తర్వాత కేజ్రీ మీడియాతో మాట్లాడారు. విపక్షాల సమీకరణకు నితీశ్ ప్రయత్నాలను ప్రశంసించారు. వాటికి తన పూర్తి మద్దతుంటుందని ప్రకటించారు. ''దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉంది. కేంద్రంలో ప్రస్తుతమున్నది బహుశా దేశ చరిత్రలోనే అత్యంత అవినీతిమయ ప్రభుత్వం! దాని దెబ్బకు సామాన్యుని బతుకు దుర్భరంగా మారింది. బీజేపీ సర్కారుపై విపక్షాలన్నీ సమైక్యంగా పోరాడి దాన్ని కూలదోయడం అత్యవసరం'' అని అభిప్రాయపడ్డారు. నితీశ్‌ను ప్రధాని అభ్యర్థిగా భావిస్తున్నారా అని ప్రశ్నించగా, కేవలం ఒక్క భేటీతో ఇలాంటి వాటికి సమాధానం చెప్పలేమని కేజ్రీవాల్ అన్నారు. గురు, శుక్ర వారాల్లో మరికొందరు విపక్ష నేతలతో కూడా నితీశ్ భేటీ అవుతారని సమాచారం. మంగళవారం ఆయన ఆర్జేడీ అధినేత లాలుప్రసాద్ యాదవ్‌తోనూ సమావేశమయ్యారు.

రాజకీయ క్రీడాస్థలిగా రైల్వే

గత ప్రభుత్వాలపై మోదీ ఆరోపణ
రాజస్థాన్‌లో 'వందేభారత్' ప్రారంభం



జైపూర్: కేంద్రంలో గత ప్రభుత్వాలు రైల్వే వ్యవస్థను రాజకీయ క్రీడాప్రాంగణంగా వాడుకుని దుర్వినియోగం చేశాయని ప్రధాని నరేంద్ర మోదీ నిప్పులు చెరిగారు. బుధవారం రాజస్థాన్‌లో తొలి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన ప్రారంభించారు. ఇది దేశంలో 15వ వందేభారత్ ఎక్స్‌ప్రెస్. అజ్మీర్, ఢిల్లీ కంటోన్మెంట్ స్టేషన్ల మధ్య ప్రయాణిస్తుంది. ఈ సందర్భంగా మోదీ మాట్లాడారు. ''రాజకీయ లాభమనే సంకుచిత దృక్పథంలోనే గత ప్రభుత్వాల ఆలోచనలు సాగాయి. అందుకే రైల్వే ఆధునీకరణ పట్టాలెక్కలేదు. ఎవరు రైల్వే మంత్రి కావాలి, ఏ స్టేషన్ గుండా ఏ రైలు వెళ్లాలనే అంశాలూ రాజకీయ లబ్ధి కోణంలోనే నిర్ణయమయ్యేవి. 2014లో సుస్థిర ప్రభుత్వం వచ్చాక రైల్వేల పరిస్థితే మారిపోయింది. రాజకీయ జోక్యం పోయింది'' అన్నారు.

గహ్లోత్ జీ, థ్యాంక్యూ

రాజస్తాన్ కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలు జరుగుతున్న వేళ కూడా సీఎం అశోక్ గహ్లోత్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నందుకు ధన్యవాదాలని మోదీ అన్నారు. ''గహ్లోత్ నాకు మంచి మిత్రుడు. రైల్వే మంత్రి, రైల్వే బోర్డు చైర్మన్ రాజస్థానీలే. అలా మీ చేతిలో రెండు లడ్డూలున్నాయి'' అన్నారు.

నవ్య భారత్ కోసమే

భోపాల్: 'అధునాతన, అభివృద్ధి చెందిన భారత్' కోసమే నూతన జాతీయ విద్యావిధానం తెచ్చినట్టు మోదీ చెప్పారు. భోపాల్‌లో నూతన ఉపాధ్యాయుల నియామక కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన వీడియో సందేశమిచ్చారు. ''విజ్ఞానం, నైపుణ్యం, సంస్కృతి, భారతీయ విలువలను చిన్నారి విద్యార్థుల్లో ఇనుమడింపజేయడంలో ఎన్ఈపీ ఎంతో దోహదపడనుంది'' అన్నారు.

25న కోర్టుకు హాజరుకండి

మోదీ ఇంటి పేరు కేసులో రాహుల్‌కు పట్నా కోర్టు సమన్లు

పట్నా: మోదీ ఇంటిపేరు వివాదంలో బీజేపీ రాజ్యసభ సభ్యుడు, బిహార్ మాజీ ముఖ్యమంత్రి సుశీల్ కుమార్ మోదీ వేసిన పరువునష్టం కేసులో ఏప్రిల్ 25న కోర్టు ఎదుట హాజరవ్వాలని రాహుల్‌గాంధీని బిహార్ కోర్టు బుధవారం సూచించింది. ఎంపీ/ఎమ్మెల్యే కోర్టులో వేసిన పిటిషన్ విచారణను బుధవారం కోర్టు ప్రత్యేక జుడీషియల్ మేజిస్ట్రేట్ ఆది దేవ్ చేపట్టారు. ఏప్రిల్ 12వ తేదీనే హాజరవ్వాలని గత నెల 18న ఆయన ఆదేశాలివ్వడం తెల్సిందే. హాజరుపై రాహుల్ తరఫు లాయర్లు తమ వాదనలు వినిపించారు. సూరత్ కోర్టు కేసులో రాహుల్ తరఫు లాయర్ల బృందం తలమునకలైనందున రాహుల్ హాజరవాల్సిన తేదీని మార్చాలని కోరారు. అందుకు అంగీకరించిన మేజిస్ట్రేట్ రాహుల్‌ను 25వ తేదీన హాజరుకావాలంటూ సమన్లు జారీచేశారు. మోదీ ఇంటిపేరుపై అనుచిత వ్యాఖ్యల కేసులో రాహుల్‌కు సూరత్ కోర్టు రెండేళ్ల జైలు విధించడం, ఎంపీగా అనర్హత వేటు పడటం తెలిసిందే.

మత వైషమ్యాలను ఎగదోస్తోంది

బీజేపీపై సీతారాం ఏచూరి ధ్వజం

కోల్‌కతా: సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గరపడుతుండటంతో మతాల మధ్య మరింత చిచ్చు పెట్టి మతసామరస్యాన్ని కూలదోసే కుట్రకు బీజేపీ తెగిస్తోందని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆరోపించారు. బుధవారం కోల్‌కతాలో పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో వేర్వేరు రాష్ట్రాల్లో ఇటీవల శ్రీరామ నవమి వేడుకల సందర్భంగా భిన్న వర్గాల మధ్య జరిగిన ఘర్షణ ఘటనలను ఈ సందర్భంగా ఏచూరి ప్రస్తావించారు. ' 2024 లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో మత విద్వేషాలను పెంచే కుతంత్రాలకు బీజేపీ పదునుపెడుతోంది. బీజేపీ ఎన్నికల, రాజకీయ సమీకరణాలకు ఇదే ప్రధానాస్త్రం' అని ఆరోపించారు.



బూడిద వర్ణచిత్రం

రష్యాలోని కమ్‌చట్కా ద్వీపకల్పంలోని షివేలూచ్ అగ్నిపర్వతం బద్దలై భారీస్థాయిలో ధూళిని ఇలా సమీపప్రాంతాలపై దులిపేసింది. పేలినపుడు అగ్నిపర్వత దుమ్ము, ధూళి, బూడిద ఆకాశంలోకి ఏకంగా 65,600 అడుగుల ఎత్తుదాకా ఎగసిపడింది.

పంజాబ్‌లో కాల్పుల కలకలం

ఆగంతకుల కాల్పుల్లో నలుగురు జవాన్ల మృతి • భటిండా సైనిక శిబిరంలో ఘటన

భటిండా/న్యూఢిల్లీ: గుర్తు తెలియని ఆగంతకుల కాల్పులతో పంజాబ్‌లోని భటిండా సైనిక శిబిరంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. శిబిరంలోని శతఘ్ని దళానికి చెందిన జవాన్లు నివసించే ఆర్మీ స్టేషన్‌లోని ప్రాంతంలో కాల్పుల ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. బుధవారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో భోజనశాల పక్కనే ఉన్న బ్యారక్‌లలో నిద్రిస్తున్న నలుగురు జవాన్లపై ఆగంతకులు కాల్పులు జరిపారు. ఉగ్రవాదులు దాడి చేశారా? మరొకరి పనా ? అనేది భారత సైన్యం ఇంకా స్పష్టంచేయలేదు. ఘటన విషయం తెల్సిన వెంటనే సత్వర స్పందన దళం రంగంలోకి దిగి ఆ ప్రాంతాన్ని జల్లెడపడుతోంది. సాధారణ దుస్తులు, ముఖానికి ముసుగు ధరించిన ఇద్దరు వ్యక్తులు కాల్పుల ఘటన తర్వాత ఆ బ్యారక్ నుంచి బయటికొచ్చి అటవీ ప్రాంతం వైపు పారిపోయారనే ప్రత్యక్ష సాక్షి అయిన ఒక జవాను చెప్పారు. ఈ మేరకు ఎఫ్ఐఆర్ నమోదుచేసిన పోలీసులు, సైన్యం.. ఆగంతకుల కోసం వేట మొదలుపెట్టారు. ఘటనాస్థలిలో ఇన్సాస్ రైఫిల్‌కు చెందిన 19 ఖాళీతూటాలు లభించాయి. రెండ్రోజుల క్రితం ఇక్కడే ఇన్సాస్ రైఫిల్‌తోపాటు 28 రౌండ్ల తుపాకీ గుళ్ల చోరీ ఘటనకు, ఈ దాడికి సంబంధం ఉందా అనే కోణంలోనూ దర్యాప్తును చేస్తున్నట్లు ఆర్మీ నైరుతి కమాండ్ తెలిపింది. ఘటన తాలూకు సమగ్ర వివరాలను సైన్యాధ్యక్షుడు జనరల్ మనోజ్ పాండే రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు వివరించినట్లు తెలుస్తోంది. ''ఇది ఉగ్రదాడి కాదు. 'బయటివాళ్ల' పని అస్సలు కాదు. ఆర్మీతో సమన్వయంతో ఈ ఘటనపై శోధిస్తున్నాం'' అని పంజాబ్ అదనపు డీజీపీ పార్మర్ చెప్పారు. ఈ ఘటనలో ఇప్పటిదాకా ఎవరినీ అరెస్ట్‌చేయలేదని భటిండా పోలీస్ కంటోన్మెంట్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్ గుర్మీత్ సింగ్ స్పష్టం చేశారు. ' ఇది అంతర్గత వ్యక్తుల దాడిలా తోస్తోంది. ఫోరెన్సిక్ బృందం సంబంధిత ఆధారాలను సేకరిస్తోంది. లోతైన దర్యాప్తు కొనసాగిస్తాం' అని భటిండా సీనియర్ ఎస్పీ గుల్నీత్ సింగ్ ఖురానా మీడియాతో చెప్పారు. చోరీకి గురైన రైఫిల్ దొరికినట్లు సమాచారం. మరణించిన జవాన్లలో ఇద్దరు కర్ణాటకకు చెందినవారు కాగా మరో ఇద్దరు తమిళనాడుకు చెందినవారు. ఘటనాస్థలిలోకి ఎవరూ రాకుండా ఆర్మీ నిషేధ ఆంక్షలు విధించింది.

సాక్షి
కరీంనగర్
గురువారం । 13 । ఏప్రిల్ । 2023



రాజన్న హుండీ లెక్కింపు..

వేములవాడ: రాజన్న హుండీ ఆదాయాన్ని ఆలయ ఈవో కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం గుడి ఓపెన్‌స్లాబ్‌లో లెక్కించారు. రూ.36.22 లక్షలు వచ్చినట్లు ఈవో తెలిపారు.



ఆ పార్టీలది ఏడడుగుల బంధం

గన్నేరువరం: బీజేపీ, బీఆర్‌ఎస్‌లది ఏడడుగుల బంధమని, ఈ అవినీతి ప్రభుత్వాల పాలనకు, ఆ పార్టీలకు ప్రజలు చరమగీతం పాడాలని ములుగు ఎమ్మెల్యే సీతక్క అన్నారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
40.0/23.0

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి పూట ఉక్కపోతగా ఉండి, వేడి తీవ్రత పెరుగుతుంది.



న్యూస్‌రీల్

పేపర్ల లీకేజీపై సీబీఐతో విచారణ జరపాలి



వినతి పత్రం అందిస్తున్న నాయకులు

కొత్తపల్లి(కరీంనగర్): టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీపై సీబీఐతో విచారణ జరిపి, నిరుద్యోగులకు న్యాయం చేయాలని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా.నగేశ్, జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు టీ–సేవ్‌లో భాగంగా బుధవారం కలెక్టరేట్ ఇన్‌వార్డులో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ వ్యవహారంలో దోషులందరినీ కఠినంగా శిక్షించాలన్నారు. నిరుద్యోగులందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ వెంటనే విడుదల చేయాలని కోరారు. నాయకులు వరాల శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, రజితారెడ్డి, శ్రీనివాస్, రాజ్‌కుమార్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలోనే టీచర్ల పదోన్నతులు చేపట్టాలి



కరీంనగర్: వేసవి సెలవుల్లోనే టీచర్ల పదోన్నతులు చేపట్టాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి, రాష్ట్ర కార్యదర్శి గోల్కొండ శ్రీధర్‌లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కరీంనగర్‌లోని సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ముక్కల కుమార్ అధ్యక్షతన జరిగిన జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. ఏడేళ్లుగా పదోన్నతులు, ఐదేళ్లుగా బదిలీలు లేక వేలాది సబ్జెక్టు పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. 17 ఏళ్లుగా ఎంఈవో, డిప్యూటీ డీఈవో పోస్టుల భర్తీల లేక పర్యవేక్షణ కొరవడిందన్నారు. హైస్కూల్స్‌లో సబ్జెక్టు టీచర్ల కొరత తీవ్రంగా ఉందని, ఉపాధ్యాయులు లేక పలు ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయని తెలిపారు. టీచర్ల బదిలీల కేసును కోర్టు జూన్ 12కు వాయిదా వేసిందని, పదోన్నతులకు మాత్రం ఎలాంటి ఆటంకాలు లేనందున వేసవి సెలవుల్లో చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జావిద్, మహిళా ఉపాధ్యక్షురాలు బబిత, కార్యదర్శులు రాజమౌళి, శ్యాం కుమార్, కల్యాణి, జిల్లా ఆఫీస్ బేరర్లు, సభ్యులు పాల్గొన్నారు.

జిల్లాలో నేటి కంటి వెలుగు శిబిరాలు

కరీంనగర్‌టౌన్: జిల్లాలో గురువారం 47 ప్రాంతాల్లో కంటి వెలుగు శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ సాజిదా ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ పట్టణంలోని 3, 9, 14, 19, 20, 21, 25, 29, 34, 48, 50, 58వ డివిజన్లలో, హుజూరాబాద్ పట్టణంలోని 19, 25వ వార్డుల్లో, మండలంలోని మందాడిపల్లి, పోతిరెడ్డిపేట గ్రామాల్లో, జమ్మికుంట పట్టణంలోని 13వ వార్డు, శాయంపేట, మండలంలోని అంకుసాపూర్, వీణవంక మండలంలోని గన్ముక్కుల, దేశాయిపల్లి, హిమ్మత్‌నగర్‌లలో, చిగురుమామిడి మండలంలోని బొమ్మనపల్లి, ఓగులాపూర్ గ్రామాల్లో, చొప్పదండి మండలంలోని ఆర్నకొండ, సాంబయ్యపల్లి, కురుమపల్లెల్లో, ఇల్లందకుంట మండలంలోని గడ్డివానిపల్లె, గంగాధర మండలంలోని లక్ష్మీదేవిపల్లి, రంగారావుపల్లిల్లో, రామడుగు మండలంలోని వెలిచాల, రంగసాయిపల్లిల్లో, కొత్తపల్లి మండలంలోని బొమ్మకల్, మల్కాపూర్, బద్దిపల్లి గ్రామాల్లో, కరీంనగర్ రూరల్ మండలంలోని చేగుర్తి, నగునూర్‌లలో, మానకొండూరు మండలంలోని వన్నారం, కొండపల్కల, కల్లెడ గ్రామాల్లో, సైదాపూర్ మండలంలోని వెన్కేపల్లి, బొమ్మకల్ గ్రామాల్లో, కేశవపట్నం మండలంలోని మక్త, కరీంపేట, ఆముదాలపల్లిల్లో, తిమ్మాపూర్ మండలంలోని పోలంపల్లి, పర్లపల్లిల్లో, గన్నేరువరం మండలంలోని కాసింపేట కంటి వెలుగు బృందాలు పని చేస్తాయని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నాలుగు తరాలు | నిర్వాసితులే..

ఉప్పర మల్యాల, రంగారావుపల్లి, కాసారం, తాడిజెర్రిలో విచిత్రం

- వరద కాలువ, అదనపు టీఎంసీ కాలువలో భూములు కోల్పోయిన ఎల్‌ఎండీ నిర్వాసితులు
- తాజాగా కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వేలైన్ కోసం భూసేకరణ
- 2016లో సరిహద్దు రాళ్లు పాతినా నేటికీ అందని పరిహారం
- భారీ ఆందోళనలకు సిద్ధమవుతున్న అన్నదాతలు



పరిహారం కోసం వేడుకుంటున్న పాశం రవి



వినోద్‌కుమార్‌తో సమావేశమైన నిర్వాసితులు (ఫైల్)

సాక్షిప్రతినిధి, కరీంనగర్: దురదృష్టం అంటే బహుశా వారిదేనేమో! 1980వ దశకంలో లోయర్ మానేరు డ్యాం నిర్మాణం సమయంలో ఉన్న ఊరును కోల్పోయి గంగాధర మండలానికి వలస వచ్చారు. కనీ పెంచిన ఊరిని మరిచి స్థిరపడ్డ చోటుకు మెల్లిగా అలవాటుపడుతున్న క్రమంలో వీరు మరోసారి 2006లో వరద కాలువ పేరిట భూములు కోల్పోవాల్సి వచ్చింది. పోనీలే.. ఏదో తమ గ్రహచారం అని సరిపెట్టుకున్నారు. తరువాత 2022లో అదనపు టీఎంసీ కాలువ పేరిట మూడోసారి భూసేకరణ జరిగింది. విధి ఆడిన వింత నాటకంలో తాము సమిధలవుతున్నామని బాధను పంటి బిగువన భరించారు. తాజాగా 2023 జనవరిలో కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వే లైన్ పేరిట నాలుగు తరాలు.. నాలుగోసారి భూమిని కోల్పోవాల్సిన పరిస్థితి తలెత్తింది. దయలేని దేవుడా.. ఇంకెన్నిసార్లు తమ భూములు లాక్కుంటావయ్యా? అని మౌనంగా దైవానికి తమ గోడు చెప్పుకుంటున్నారే తప్ప.. ఏనాడూ పరిహారం కోసం రోడ్డెక్కిన దాఖలాలు లేవు. కానీ.. తాజాగా కొత్తపల్లి – మనోహరాబాద్ రైల్వే లైన్ విషయంలో ఆ రైతు కడుపు మండింది. కన్నెర్ర జేసి తమకు రావాల్సిన పరిహారం కోసం ఆందోళనలకు సిద్ధమవుతున్నారు.

గంగాధర మండలంలో వింత!

గంగాధర మండలంలోని ఉప్పర మల్యాల, రంగారావుపల్లి, తాడిజెర్రి, కాసారం గ్రామాలలో విచిత్ర పరిస్థితి నెలకొంది. ఈ నాలుగు గ్రామాల మీదుగా తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టాత్మక ప్రాజెక్టు కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వే లైన్ కోసం 2016లో తొలుత సర్వే చేసిన అధికారులు రాళ్లను సరిహద్దులుగా పాతారు. ఇందులో అధికశాతం వ్యవసాయ భూములు ఉండగా.. కొన్ని నివాస ప్రాంతాలు సైతం ఉన్నాయి. రైల్వే లైన్ కావడంతో ఊరి రూపురేఖలు మారుతాయని, తమ జీవనాధారమైన పొలాలను, ఎంతో ఇష్టంగా కట్టుకున్న ఇళ్లను ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఇటీవల డిసెంబరు 2022లో వచ్చి మరోసారి శాశ్వత సరిహద్దురాళ్లను ఏర్పాటుచేశారు. వీరిలో తొలిసారి భూమిని కోల్పోతున్న వారే కాకుండా.. నాలుగోసారి కోల్పోతున్న వారు కూడా ఉండటం వారి దయనీయ పరిస్థితికి అద్దం పడుతోంది. 2016 నుంచి సరిహద్దురాళ్లు పాతిన భూముల్లో సాగు లేదు. వీటిని అమ్ముకోలేరు. మరోవైపు పరిహారం రాక పస్తులుండాల్సిన పరిస్థితి. ఈ భూములకు ప్రత్యామ్నాయంగా మరోచోట వ్యవసాయ భూములు, నివాస స్థలాలు కొన్న రైతులంతా అప్పులు కట్టలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. పిల్లల పెళ్లిళ్లు చేసేందుకు కూడా చేతిలో చిల్లిగవ్వలేక అల్లాడుతున్నారు.

జనవరిలోనే సంతకాలు..!

జనవరిలో నిర్వాసితులను అందరినీ కరీంనగర్‌లోని కలెక్టరేట్‌లోని ఆర్డీవో కార్యాలయానికి తరలించి, అక్కడ భూములు అప్పగిస్తున్నట్లు రైతులతో సంతకాలు తీసుకున్నారు. కానీ.. ఇప్పటికీ ఎవరికి ఎలాంటి పరిహారం అందలేదు. దీంతో రైతులంతా ఆందోళన చెందుతున్నారు. తాజాగా రైతులంతా కలెక్టరేట్‌కు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమకు వెంటనే డబ్బులు ఇవ్వకపోతే ఆందోళనబాట పడుతామని రైతులు స్పష్టం చేస్తున్నారు. కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వే లైన్ వెళ్తున్న అన్ని గ్రామాలకు పరిహారం ఇచ్చి తమకు మాత్రం ఎందుకు ఇవ్వడం లేదన్నదే వీరి ప్రశ్న. గంగాధరకు వెనకవైపు ఉన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలో నిర్వాసిత గ్రామాలకు పరిహారం ఇచ్చారు. గంగాధర మండలానికి ముందు వైపు ఉన్న వెదిర, దేశరాజ్‌పల్లి, కొండన్నపల్లి గ్రామాల నిర్వాసితులకు పరిహారం ఇచ్చారు. తమకు కూడా వెంటనే పరిహారం ఇవ్వకపోతే ఆందోళన బాట పడతామని రైతులంతా ముక్తకంఠంతో చెబుతున్నారు.

ఏ గ్రామంలో ఎంత భూమి సేకరించారు?

గ్రామం	భూమి
ఉప్పరమల్యాల	11 ఎకరాలు
రంగారావుపల్లి	53 ఎకరాలు, 36 నివాసాలు
తాడిజెర్రి	30 ఎకరాలు
కాసారం	38 ఎకరాలు

(నోట్: గ్రామస్తులు చెప్పిన వివరాల ప్రకారం..)

నాలుగు సార్లు నష్టపోయా



మాది కొండాపూర్ గ్రామం. అక్కడ భూములన్నీ ఎల్‌ఎండీలో మునిగిపోతే బతుకుదెరువు కోసం రంగారావుపల్లి గ్రామానికి వలస వచ్చాం. ఇక్కడ నాలుగు సార్లు నష్టపోయా. వరదకాలవలో పోయింది. డి ఫోర్ కెనాల్ భూసేకరణలో భూమి పోయింది. అదనపు టీఎంసీ కాల్వ నిర్మాణంలో 1.12 ఎకరాల భూమి పోయింది. ఇప్పుడు కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వే నిర్మాణంలో ఇల్లు భూమి పోతోంది.

– పాశం రవి, రంగారావుపల్లి

వెంటనే పరిహారం ఇవ్వాలి



కొత్తపల్లి– మనోహరాబాద్ రైల్వేలైన్ కోసం మా భూములను మార్కింగ్ చేశారు. దీంతో మేం మరోచోట అప్పులు చేసి భూములు కొని వ్యవసాయం చేస్తున్నాం. ఇంతవరకూ పరిహారం అందకపోవడంతో వడ్డీలు కట్టలేక నానా ఇబ్బందులు పడుతున్నాం. పరిహారం వస్తే పిల్లల చదువులు, పెళ్లిళ్లకు ఖర్చు చేద్దామనుకుంటున్నారు. రైల్వే లైన్ వెళ్తున్న అన్ని గ్రామాలకు పరిహారం ఇచ్చి.. మా నాలుగు గ్రామాలకు మొండి చేయి చూపడం సరికాదు. త్వరలోనే ఆందోళనలను ఉధృతం చేస్తాం.

– సందెబోయిన తిరుపతి, రంగారావుపల్లి

నేటి నుంచి ఎస్‌ఎస్‌సీ స్పాట్

- ఏర్పాట్లు పర్యవేక్షించిన డీఈవో జనార్దన్‌రావు
- 13 జిల్లాలకు చెందిన 2,35,333 జవాబుపత్రాల మూల్యాంకనం
- స్పాట్ విధులకు 8 ఏసీవోలు, 1,250 మంది ఉపాధ్యాయులు



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న డీఈవో జనార్దన్‌రావు

కరీంనగర్: పదో తరగతి పరీక్ష జవాబు పత్రాలను మూల్యాంకనం చేసేందుకు విద్యాశాఖ అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. జిల్లా కేంద్రంలోని సెయింట్ జాన్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఏర్పాటు చేసిన స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాన్ని డీఈవో జనార్దన్‌రావుతోపాటు పలువురు అధికారులు బుధవారం సందర్శించారు. ఎలాంటి ఇక్కట్లు లేకుండా స్పాట్ కొనసాగేందుకు సిబ్బందికి దిశానిర్దేశనం చేశారు. నేటి నుంచి ఈనెల 21వ తేదీ వరకు స్పాట్ వాల్యుయేషన్ నిర్వహించనున్నారు.

- మరోవైపు పది పరీక్షల ప్రశ్నపత్రాలు లీక్ కావడంతో స్పాట్‌లో ఎలాంటి అవకతవకలు జరగకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, ప్రతీ ఉపాధ్యాయుడు విధిగా గుర్తింపు కార్డు (ఐడీకార్డు)తో రావాలని, మాస్క్ ధరించాలని, ఎవరు కూడా సెల్‌ఫోన్లు వినియోగించరాదని ఆదేశాలు జారీ చేశారు.
- ఉపాధ్యాయులంతా ఉదయం ఎనిమిది గంటలకు క్యాంపు ఇన్‌చార్జికి రిపోర్టు చేయాలి. వారికి ఏసీవోలు ఒక్కొక్కరికి ఉదయం 20 పేపర్ల జవాబుపత్రాలు ఇచ్చి వాటిని రిటర్న్ చేసిన తర్వాత మధ్యాహ్నం 20 పేపర్ల జవాబుపత్రాలను మూల్యాంకనం కోసం ఇస్తారు. సాయంత్రం 5 గంటల వరకు వాటిని తిరిగి ఇచ్చి వెళ్లాల్సి ఉంటుంది.
- టీచర్స్ ఇతరులతో కలిసి వేరే గదుల్లోకి వెళ్లకూడదని.. నిబంధనలు పాటించని ఉపాధ్యాయులపై 25 యాక్ట్ ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
- సెయింట్ జాన్స్ స్కూల్లో రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన 2,35,333 జవాబు పత్రాల మూల్యాంకనం జరగనుంది.
- డీఈవో క్యాంపు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఎనిమిది మంది సీనియర్ ఉపాధ్యాయులను ఏసీవోలుగా నియమించారు. వీరి ఆధ్వర్యంలో 1,250 మంది ఉపాధ్యాయులు వారివారి సబ్జెక్టులకు సంబంధించిన జవాబుపత్రాలను మూల్యాంకనం చేస్తారు.

మొదటి రోజు..

గురువారం తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గణితం, భౌతిక శాస్త్రం సబ్జెక్టుల జవాబుపత్రాలు మూల్యాంకనం ప్రారంభమవుతాయి. జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రం సబ్జెక్టులకు ఈ నెల14 నుంచి మూల్యాంకనం ప్రారంభం కానుంది. జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రాలకు వచ్చే చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు, స్పెషల్ అసిస్టెంట్లు ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు మూల్యాంకనంలో పాల్గొంటారు.

దళితబంధు భావితరానికి వెలుగు



ఉత్తమ పారిశ్రామిక వేత్తలుగా సన్మానం పొందిన లబ్ధిదారులతో మంత్రి కమలాకర్, ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, కలెక్టర్ కర్ణన్, మేయర్ వై.సునీల్‌రావు తదితరులు

- మంత్రి గంగుల కమలాకర్
- ఉత్తమ పారిశ్రామికవేత్తలకు సన్మానం

కరీంనగర్: దళితులను సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఉన్నత స్థానానికి ఎదిగేలా చేసిన దళితబంధు పథకం భవిష్యత్తు తరాలలో వెలుగులు నింపనుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో దళితబంధు పథకం ద్వారా లబ్ధి పొంది ఉత్తమ పారిశ్రామికవేత్తలుగా ఎదిగిన వారిని సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రం ఆవిర్భావానికి పూర్వం దళితుల జీవితాలను సామాజికంగా, ఆర్థికంగా రాజకీయంగా అభివృద్ధి చేస్తామనే మాటలు మాత్రమే వినపడేవని, దళితులు అప్పు కోసం వెళ్లితే కుదువ పెట్టడానికి ఏదైనా ఆస్తిగానీ, పూచీకత్తు గానీ ఉండాల్సిన పరిస్థితి అని అన్నారు. ఇప్పుడు అంబేడ్కర్ కలలను సాకారం చేయాలని, దళితుల జీవితాలను ఉన్నతస్థాయికి చేర్చాలనే సదుద్దేశంతో సీఎం కేసీఆర్ ఈ పథకం ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. ఇప్పటికే హుజూరాబాద్ నియోజకవర్గంలో 100 శాతం పథకాన్ని వర్తింపజేసినట్లు వివరించారు. ఈనెల 14న అంబేడ్కర్ జయంతిన 125 అడుగుల భారీ విగ్రహం ఆవిష్కరించనున్నామని తెలిపారు. పథకాన్ని విజయవంతం చేసిన కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు. ఎమ్మెల్సీ ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ పథకంతో దళితుల జీవితాలు ఒక్కసారిగా ఉన్నతవర్గాలుగా అభివృద్ధి చెందాయన్నారు. ఈ సందర్భంగా జమ్మికుంటకు చెందిన లబ్ధిదారురాలు ఆరెపల్లి ప్రవ తన అభిప్రాయాన్ని వెల్లబుచ్చారు. తన పెళ్లైన ఎనిమిదేళ్ల వరకు తన భర్త శ్రీనివాస్ బ్యాటరీ షాపులో పనిచేశాడని, కలలో కూడా సాధ్యపడని సొంత షాపు ఆలోచన ఈ పథకం ద్వారా నెరవేరిందని అన్నారు. అనంతరం దళితబంధు ఉత్తమ పారిశ్రామికవేత్తలు, లబ్ధిదారులను మంత్రి సన్మానించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, నగర మేయర్ వై.సునీల్ రావు, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, సుడా చైర్మన్ రామక్రిష్టారావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైలెన్స్..!

సౌండ్ పొల్యూషన్ సైలెన్సర్‌లను రోలర్‌తో తొక్కిస్తున్న పోలీసులు

- సౌండ్ పొల్యూషన్‌పై పోలీసుల నజర్
- శబ్దకాలుష్యం చేస్తున్న వాహనాల సైలెన్సర్‌ల తొలగింపు
- రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం
- కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్



కరీంనగర్‌క్రైం: భరించలేని శబ్దాలు చేసే వాహనాల సైలెన్సర్‌లపై పోలీసులు దృష్టి పెడుతున్నారు. చెవులు దద్దరిల్లేలా సైలెన్సర్‌లతో శబ్దాలు, మితిమీరిన వేగం, ఇష్టారాజ్యంగా సైరన్‌లతో సౌండ్ పొల్యుషన్‌కు పాల్పడతామంటే ఇక కుదరదు. కరీంనగర్ కమిషనరేట్ వ్యాప్తంగా బైక్‌ల సైలెన్సర్‌లు, అనధికారిక సైరన్‌లు అమర్చుకుంటున్న వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు దృష్టి పెట్టారు. ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి వాహనాలను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు సైలెన్సర్‌లు, సైరన్‌లను తొలగిస్తున్నారు.


రోలర్‌తో తొక్కించిన పోలీసులు

కరీంనగర్ వ్యాప్తంగా సౌండ్ పొల్యూషన్‌లు చేస్తూ వెళ్తున్న వాహనాలపై పోలీసులు స్పెషల్ ఫోకస్ పెట్టారు. వాహనదారులు తమ బైకులకు సహజమైన సైలెన్సర్‌లు కాకుండా ఎక్స్‌ట్రా ఫిట్టింగ్ చేసుకొని అధిక శబ్దం వచ్చేలా మార్చుకుంటున్నారు. ఇందులో ముఖ్యంగా యువత.. అందులోనూ కళాశాల విద్యార్థులు ఎక్కువగా ఉంటున్నారు. వాహనాలతో పోటీ పడుతూ, వేగం పెంచుకుంటూ, సౌండ్ చేసుకుంటూ రోడ్లపై వెళ్తుండడంతో ప్రజల చెవులకు చిల్లులు పడుతున్నాయి. ఇటీవల సుమారు 400 వాహనాల శబ్దకాలుష్యం చేసే ఆల్ట్రేషన్ సైలెన్సర్‌లను తీసివేసి కమిషనరేట్‌లో రోడ్డు రోలర్‌తో తొక్కించారు. ఇందులో నగరానికి చెందిన 180 వాహనాలు పట్టుబడ్డాయి. సదరు వాహనదారులపై కేసు నమోదు చేసి జరిమానా విధించారు. ఇంకోసారి పట్టుబడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మెకానిక్‌లకు కౌన్సెలింగ్

పలువురు యువత బైకులు కొనుగోలు చేసిన తర్వాత నేరుగా మెకానిక్‌ల వద్దకు వెళ్లి ఎక్కువ శబ్దం వచ్చే సైలెన్సర్‌లు అమర్చుకుంటున్నారని పోలీసుల దృష్టికి వచ్చింది. మెకానిక్‌లు కూడా వారికి సహకరిస్తూ సైలెన్సర్‌లను అమర్చుతున్నారు. దీంతో ఇటీవల జిల్లావ్యాప్తంగా ఉన్న మెకానిక్‌లను కమిషనరేట్‌కు పిలిపించి శబ్దకాలుష్యం చేసే సైలెన్సర్‌లు అమర్చితే చర్యలు తప్పవని సీపీ సుబ్బారాయుడు హెచ్చరించారు. తనిఖీల్లో వాహనాలు పట్టుపడినప్పుడు వాహనదారులతో పాటు సైలెన్సర్‌లు అమర్చిన మెకానిక్‌లపై చర్యలు తీసుకుంటామని చెప్పి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

సౌండ్ పొల్యూషన్ చేసే వాహనదారులపై చర్యలు



అధిక శబ్దాలు చేస్తూ సౌండ్ పొల్యూషన్ చేసే వాహనాలను పట్టుకునేందుకు సీపీ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాం. ఇటీవల పట్టుబడిన వాహనాల సైలెన్సర్‌లను తొలగించి ధ్వంసం చేశాం. ఇంకోసారి సౌండ్ పొల్యూషన్ చేయకూడదని హెచ్చరించాం. అలాంటి సైలెన్సర్‌లు అమర్చవద్దని మెకానిక్‌లకు సీపీ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ కూడా అందించాం.

– విజయ్‌కుమార్, ట్రాఫిక్ ఏసీపీ

నలుగురు పోలీసుల సస్పెన్షన్

కరీంనగర్‌క్రైం: జమ్మికుంట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ నాగ వెంకట్‌రెడ్డి, పీసీలు తిప్పారపు విద్యాసాగర్, అప్పల సత్యనారాయణ, రహీం కొంతకాలంగా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పై అధికారుల సూచనలు పాటించడం లేదు. దీంతో వారిపై విచారణ జరిపిన సీపీ సుబ్బారాయుడు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. పోలీసు అధికారులు, సిబ్బంది విధేయతతో ఉండాలన్నారు.

సమ్మర్ క్యాంపులు ఉన్నట్టా.. లేనట్టా?

- సన్నాహాలు చేయని క్రీడాశాఖ, నగర పాలకసంస్థ
- క్రీడా శిక్షణ శిబిరాలపై సందేహం



ఫుట్‌బాల్‌లో శిక్షణపొందుతున్న చిన్నారులు (ఫైల్)

కరీంనగర్‌స్పోర్ట్స్: వార్షిక పరీక్షలు పూర్తవుతున్నాయి. ఇప్పటికే ఇంటర్, పదోతరగతి విద్యార్థుల పరీక్షలు ముగిశాయి. 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఈనెల 20తో విద్యాసంవత్సరం ముగుస్తుంది. వేసవి సెలవుల్లో పిల్లలు ఇంటిపట్టునే ఉంటూ ఉదయం, సాయంత్రం ఆసక్తిఉన్న క్రీడాంశాల్లో శిక్షణ పొందేలా తల్లిదండ్రులు తమ పిల్లలను సిద్ధం చేస్తున్నారు. ఏటా జిల్లా క్రీడాశాఖ, కరీంనగర్ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తారు. ఈసారి క్యాంపులపై సందిగ్ధం నెలకొంది. రెండుశాఖలు ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో క్యాంపులు ఉంటాయా? ఉండవా అనే అనుమానం వ్యక్తం అవుతోంది.

- సమ్మర్‌క్యాంప్‌లు అంటేనే నగరపాలక సంస్థ గుర్తుకు వస్తుంది. 2017నుంచి నగర పాలకసంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు భారీ స్పందన వస్తోంది. 2022 క్యాంప్‌లో 3వేలకుపైగా చిన్నారులు శిక్షణ తీసుకున్నారు.
- 2023 సంవత్సరానికి సంబంధించి సమ్మర్ క్యాంప్‌లపై నేటివరకు నగరపాలక సంస్థ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో అసలు సమ్మర్ క్యాంప్‌లు ఈసారి ఉంటాయా అనే అనుమానం వ్యక్తం అవుతోంది.
- గత సంవత్సరం 28 క్రీడాంశాల్లో సుమారు 70మందికి పైగా కోచ్‌లు సుమారు 3వేల మందికి పైగా చిన్నారులకు శిక్షణ ఇవ్వగా.. వారికి నేటి వరకు ఇస్తామన్న గౌరవవేతనం ఇవ్వడంలో జాప్యం నెలకొన్న సంగతి తెలిసిందే.
- ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా కోచ్‌లకు గౌరవ వేతనం ఇచ్చిన తరువాతనే సమ్మర్ క్యాంప్‌లు నిర్వహించే అవకాశం ఉందని సమాచారం. గౌరవ వేతనం ఇవ్వకుండా క్యాంపులు నిర్వహిస్తే కోచ్‌లు వస్తారో.. లేదోఅన్న సందేహం వ్యక్తమవుతోంది.
- రాష్ట్ర క్రీడాశాఖ ఆదేశాల ప్రకారం ఏటా మే 1 నుంచి 30 వరకు గ్రామీణ ప్రాంతాల్లో ఆదరణ ఉన్న క్రీడల్లో శిక్షణ శిబిరాలు నిర్వహిస్తోంది. 10 క్రీడాంశాల్లో సుమారు 30రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయి.
- ఈ సంవత్సరం నేటి వరకు జిల్లా క్రీడాశాఖ సమ్మర్ క్యాంప్‌లకు సంబంధించి ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వలేకపోవడంతో క్రీడాకారులు, కోచ్‌లు సందేహంలో పడ్డారు.
- మరోవారం రోజులు గడిస్తే పిల్లలందరూ వెళ్లిపోతారు. ఇప్పటివరకు ఎలాంటి సన్నాహాలు ప్రారంభించకపోవడం విశేషం. పక్క జిల్లాల్లో మాత్రం సమ్మర్ క్యాంప్‌లకు సంబంధించి సమావేశాలు నిర్వహించగా.. జిల్లాలో ఎలాంటి ప్రక్రియ ముందుకు సాగడం లేదు.

ఆదేశాలు రాగానే



రాష్ట్ర క్రీడాశాఖ నుంచి ఏటా నిర్వహించనున్న సమ్మర్ క్యాంప్‌లకు సంబంధించి ఎలాంటి ఆదేశాలు నేటి వరకు రాలేదు. ప్రతి సంవత్సరం 10 క్రీడాంశాల్లో గ్రామీణ ప్రాంతాల్లో సీనియర్ క్రీడాకారులు, పీఈటీలతో శిక్షణ శిబిరాలు జరిగేవి. ఆదేశాలు రాగానే సన్నహాలు ప్రారంభిస్తాం.

– కీర్తి రాజవీరు, క్రీడాశాఖ అధికారి

క్లుప్తంగా

మహిళను వేధించిన ట్రాన్స్‌కో ఉద్యోగి రిమాండ్

హుజూరాబాద్‌రూరల్: ఓ మహిళను వేధించిన ట్రాన్స్‌కో ఉద్యోగిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. గోదావరిఖనికి చెందిన మహిళ గత కొంతకాలంగా హుజూరాబాద్‌లో టైలరింగ్ చేస్తూ జీవిస్తోంది. ఈ క్రమంలో పెద్దపాపయ్యపల్లి గ్రామానికి చెందిన ట్రాన్స్‌కో ఉద్యోగి ఎండీ.షాబుద్దీన్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. షాబుద్దీన్ ఆమెకు మాయమాటలు చెప్పి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. అంతేకాకుండా సదరు మహిళ స్నానం చేస్తుండగా, రాత్రివేళల్లో వీడియోలు, ఫొటోలు తీశాడు. వాటిని సోషల్ మీడియాలో పెడతానని బ్లాక్ మెయిల్ చేసి, ఆమె వద్ద ఉన్న డబ్బులు తీసుకున్నాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. బుధవారం షాబుద్దీన్‌ను అరెస్టు చేసి, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. జడ్జి ఎదుట హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఎస్సై రాజన్న తెలిపారు.

పెద్దపల్లి సబ్ రిజిస్ట్రార్..

కరీంనగర్‌క్రైం: అవినీతి కేసులో ఏసీబీ అధికారులకు పట్టుబడిన పెద్దపల్లి సబ్ రిజిస్ట్రార్ నిర్మలను బుధవారం కోర్టులో హాజరుపరిచారు. జడ్జి రిమాండ్ విధించడంతో సాయంత్రం కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు కొత్తపల్లి మండలంలోని నిర్మల ఇంట్లో అధికారులు సోదాలు చేశారు. రూ.10 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

బైక్ అదుపుతప్పి ఒకరి దుర్మరణం

సైదాపూర్: బైక్ అదుపుతప్పి, కింద పడటంతో ఓ వ్యక్తి మృతి చెందినట్లు సైదాపూర్ ఎస్సై ఆరోగ్యం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం .. హుస్నాబాద్‌లోని బాలాజీనగర్‌కు చెందిన మోతె రాహుల్(33)కు భార్య ప్రియాంక, ఏడాది బాబు ఉన్నారు. హుజూరాబాద్ మండలంలోని కందుగులలో బుధవారం ప్రియాంక చెల్లెలు సీమంతం జరగాల్సి ఉంది. ఆమె మంగళవారం ఉదయమే కందుగుల వెళ్లింది. అదే రోజు రాత్రి తన భర్తకు ఫోన్ చేసి, రావాలని చెప్పడంతో 8.30 గంటలకు బైక్‌పై బయలుదేరాడు. దుద్దెనపల్లి బ్రిడ్జి దాటిన తర్వాత వెన్కెపల్లి శివారులోని మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పి, రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో రాహుల్ అక్కడికక్కడే మృతిచెందాడు. మరుసటిరోజు తెల్లవారుజామున వాకింగ్‌కు వెళ్లిన దుద్దెనపల్లి గ్రామస్తులకు ఫోన్ రింగ్ వినిపించింది. దగ్గరికి వెళ్లి చూడగా రాహుల్ చనిపోయి కనిపించాడు. వారు ఫోన్ ఎత్తి, బైక్ ప్రమాదంలో ఒకరు చనిపోయారని తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కర్నాటక దేవదుర్గ్ ఎన్నికల ఇన్‌చార్జిగా ఎస్.కుమార్

గోదావరిఖని(రామగుండం): కర్నాటక రాష్ట్రంలోని దేవదుర్గ్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జిగా బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్‌ను నియమించారు. రాష్ట్రానికి చెందిన 20 మంది బీజేపీ నాయకులకు పలు నియోజకవర్గాల బాధ్యతలు అప్పగించారు.

మరోసారి ఓటర్ల వివరాలు పరిశీలించండి

- జాబితా పక్కాగా రూపొందించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్


వీసీలో పాల్గొన్న కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, అధికారులు

కరీంనగర్ అర్బన్: మరోసారి ఓటర్ల వివరాలను పరిశీలించి, జాబితాను పక్కాగా రూపొందించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్ని జిల్లాల కలెక్టర్లను, అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఫొటో సిమిలర్ ఎంట్రీ కింద ఓటరు జాబితా నుంచి తొలగించిన ఓటర్ల వివరాలను మరోసారి పరిశీలించి, ధ్రువీకరించాలన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లినవారి, మరణించినవారి ఓట్లు, డూప్లికేట్ ఓట్లను జాబితా నుంచి తొలగించామని తెలిపారు. వాటికి సంబంధించిన సంపూర్ణ సమాచారం అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అవసరమైన డాక్యుమెంట్లు ఉన్నాయో లేవో ధ్రువీకరించాలని చెప్పారు. ఓటరు జాబితా రూపకల్పనలో బూత్ స్థాయి అధికారులు కీలక పాత్ర పోషిస్తారని, ప్రైవేట్ వ్యక్తులను బూత్ స్థాయి అధికారులుగా నియమించవద్దన్నారు. ఎక్కడైనా అలా ఉంటే 7 రోజుల్లో తొలగించి, ప్రభుత్వ సిబ్బందిని నియమించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ ఎన్నికల అధికారులతో మాట్లాడారు. ఫొటో సిమిలర్ ఎంట్రీలను మరోసారి పరిశీలించాలని, జాబితా నుంచి తొలగించాల్సిన, సవరించాల్సిన ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలన్నారు. అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్, జెడ్పీ సీఈవో ప్రియాంక, ట్రైనీ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, కరీంనగర్, హుజూరాబాద్ ఆర్డీవోలు ఆనంద్‌కుమార్, హరిసింగ్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

మాలలు ఐక్యంగా పోరాటం చేయాలి

- మహిళలు రాజకీయ శక్తిగా ఎదగాలి
- మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్


మాట్లాడుతున్న దయాకర్

శంకరపట్నం(మానకొండూర్): మాలలు హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాటం చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్ అన్నారు. శంకరపట్నం మండలంలోని కేశవపట్నంలో బుధవారం మాలలు, ఉపకులాల ఆత్మగౌరవ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, జెండా ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. పాలకులు మాలలను ఓటు రాజకీయాల కోసం వాడుకుంటున్నారని ఆరోపించారు. మహిళలు రాజకీయ శక్తిగా ఎదగాలన్నారు. దళిత బంధు పథకం మాలలకు అందడం లేదన్న విమర్శలు వస్తున్నాయని తెలిపారు. ప్రతీ పేద కుటుంబానికి ఎకరం భూమి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒకొక్కరి వద్ద వేల ఎకరాల భూములు ఉన్నాయని, ల్యాండ్ పూలింగ్ చట్టం ఏమైందని ప్రశ్నించారు. ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ బిల్లును చట్ట సభల్లో ప్రవేశపెట్టి, అమలు చేసేవరకు పోరాటం చేయాలని సూచించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలన్నారు. భర్త తన రాజకీయ గురువని జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ అన్నారు. ఆంక్షలు లేకపోవడంతో రాజకీయాల్లో చురుగ్గా పని చేస్తున్నానని చెప్పారు. దళిత బంధు పథకం నియోజకవర్గంలోని మాలలకు అందకుంటే తనకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్, మండల అధ్యక్షుడు కిష్టస్వామి, సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, నాయకులు మేడి అంజయ్య, అజయ్‌వర్మ, ప్రభాకర్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగపై పీడీయాక్టు


జగన్‌సింగ్‌కు పీడీయాక్టు కాపీ అందిస్తున్న సీఐ విజ్ఞాన్‌రావు

కరీంనగర్‌క్రైం: అంతర్ జిల్లా దొంగ ఠాగూర్ జగన్‌సింగ్‌పై కరీంనగర్ రూరల్ పోలీసులు పీడీయాక్టు అమలు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని అశోక్‌నగర్‌లో నివాసముంటున్న జగన్ సింగ్ అలియాస్ దినేష్ సింగ్ అలియాస్ డీజే జాని అలియాస్ దినేష్ గతంలో ఓ పబ్‌లో పనిచేసేవాడు. వచ్చే ఆదాయం జల్సాలకు సరిపోకపోవడంతో పలుచోట్ల చోరీలు చేసి, మూడుసార్లు జైలుకు వెళ్లి వచ్చాడు. ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాల్లో రాత్రి, పగటి పూట తాళం వేసిన ఇళ్లను గమనిస్తూ నిమిషాల వ్యవధిలో దొంగతనాలు చేస్తున్నాడు. ఇప్పటివరకు సుమారు 30కి పైగా చోరీలు చేసి, నగదు, రూ.లక్షల విలువైన వస్తువులు ఎత్తుకెళ్లాడు. కరీంనగర్ రూరల్ ఏసీపీ ఆధ్వర్యంలో పోలీసులు గతేడాది నవంబర్‌లో జగన్‌సింగ్‌ను బొమ్మకల్ బైపాస్ రోడ్డు వద్ద అరెస్టు చేసి, నగదు, ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులు స్వాధీనం చేసుకొని, జైలుకు తరలించారు. వరుస చోరీలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న అతనిపై పోలీసులు పీడీయాక్టు అమలు చేశారు. సంబంధిత కాపీని సీఐ విజ్ఞాన్‌రావు బుధవారం జగన్ సింగ్‌కు అందించారు. అనంతరం కరీంనగర్ నుంచి చర్లపల్లి జైలుకు తరలించారు. ఈ సందర్భంగా సీఐ విజ్ఞాన్ రావు, పీడీ సెల్ ఇన్‌చార్జి పండరీలను సీపీ సుబ్బారాయుడు అభినందించారు.

లంచం కేసులో ఉద్యోగికి నాలుగేళ్ల జైలు

- నేరస్తుడు గతంలో వీఆర్వో.. ప్రస్తుతం జూనియర్ అసిస్టెంట్

కరీంనగర్ క్రైం: పేరు మార్పిడి కోసం రైతు వద్ద లంచం తీసుకుంటూ పట్టుబడిన కేసులో గతంలో వీఆర్వో, ప్రస్తుత జూనియర్ అసిస్టెంట్‌కు నాలుగేళ్ల జైలుశిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ కరీంనగర్ ప్రత్యేక ఏసీబీ కోర్టు న్యాయమూర్తి లక్ష్మీకుమారి తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రానికి చెందిన పెండ్యాల మహిపాల్ రెడ్డి అదే గ్రామానికి చెందిన ఇద్దరి వద్ద కొంత భూమిని కొనుగోలు చేశాడు. దాన్ని తనతోపాటు భార్య పేరిట రిజిస్ట్రేషన్ చేయించాడు. ఈ నేపథ్యంలో పేరు మార్పిడి కోసం తిమ్మాపూర్–1 వీఆర్వో నమిలికొండ వెంకటరమణకు సంబంధిత పత్రాలను ఇచ్చాడు. ఆయన ఎలాంటి పని చేయలేదు. తర్వాత అలుగునూరుకు బదిలీ అయ్యాడు. పత్రాలు వీఆర్వో వద్ద ఉండటంతో మహిపాల్ రెడ్డి వెళ్లి అడగగా రూ.5 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు 2013 ఏప్రిల్ 4న కరీంనగర్ ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. అదే నెల 6న ఉదయం వీఆర్వో వెంకటరమణ తన ఆఫీసులో మహిపాల్ రెడ్డి వద్ద లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అప్పటి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వీరభద్రం కేసు దర్యాప్తు జరిపారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి లక్ష్మీకుమారి వెంకటరమణకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారు. వెంకటరమణ ప్రస్తుతం పెద్దపల్లి డీపీవో ఆఫీసులో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.

రైలు పట్టాలపై పడి ఒకరి మృతి


దయాసింగ్ మృతదేహం

రామగుండం: ఉపాధి నిమిత్తం వచ్చి, స్వస్థలానికి వెళ్తున్న ఓ కార్మికుడు ప్రమాదవశాత్తు మృతిచెందిన ఘటన రామగుండం రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకుంది. జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి గంగారపు తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బలరాంపూర్ జిల్లా పరిధి శాంతిపూర్‌కు చెందిన దయాసింగ్(32) జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్మితమవుతున్న మెడికల్ కళాశాలలో సెంట్రింగ్ రాడ్ బెండింగ్ కార్మికుడిగా నెల రోజుల క్రితం విధుల్లో చేరాడు. ఈ నేపథ్యంలో అర్ధరాత్రి ఒంటి గంటకు వచ్చే రాయ్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లో ఇంటికి వెళ్లేందుకు మంగళవారం రాత్రి రామగుండం రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. కానీ రైలు ఎక్కలేదా? లేకపోతే అతను గమనించకపోయేసరికి వెళ్లిపోయిందా తెలియరాలేదు. బుధవారం వేకువజామున రెండో ప్లాట్‌ఫాం పైనుంచి ప్రమాదవశాత్తు పడటంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహం పట్టాల మధ్యలో ఉండటంతో పైనుంచి పలు రైళ్లు వెళ్లినప్పటికీ అలాగే ఉంది. మృతుడి వద్ద బ్యాగులో లభ్యమైన సెల్‌ఫోన్ ఆధారంగా పోలీసులు ఛత్తీస్‌గఢ్‌లోని అతని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య ఇరుమతియాసింగ్, ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నామని జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి పేర్కొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

సుల్తానాబాద్ రూరల్(పెద్దపల్లి): తాటిచెట్టు పైనుంచి పడి, ఓ గీత కార్మికుడికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. సుల్తానాబాద్‌రూరల్ మండలంలోని నారాయణరావుపల్లి గ్రామానికి చెందిన ఇల్లందుల సంపత్ రోజూ మాదిరిగా బుధవారం తాటి చెట్టు ఎక్కుతుండగా జారి పడ్డాడు. ఈ ఘటనలో అతనికి గాయాలవగా సర్పంచ్ మొలుగూరి వెంకటలక్ష్మి, వార్డు సభ్యులు గుర్రం మల్లేశం, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మొలుగూరి ప్రశాంత్, నాయకులు అంజయ్యగౌడ్, సాయినాథ్‌లు కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

ఏసీటీవోలకు గెజిటెడ్ హోదా కల్పించాలి



హుజూరాబాద్: వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో పని చేస్తున్న ఏసీటీవోలకు గెజిటెడ్ హోదా కల్పించాలని రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ కోరారు. బుధవారం హుజూరాబాద్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా గ్రూప్–2 పరీక్షలో ఎంపికైన డిప్యూటీ తహసీల్దార్, సబ్ ట్రెజరీ అధికారి, కో–ఆపరేటివ్ రిజిస్ట్రార్, మున్సిపల్ కమిషనర్ వంటివారు గెజిటెడ్ హోదాలో కొనసాగుతున్నారని తెలిపారు. అదే గ్రూప్–2లో ఏసీటీవోలుగా నియమితులైన అధికారులు నాన్ గెజిటెడ్‌గా వాణిజ్య పన్నుల శాఖలో పని చేస్తున్నారని అన్నారు. ఈ విషయమై పలుమార్లు మంత్రులు, ఉన్నతాధికారులకు విన్నవించినట్లు చెప్పారు. గత ఏడేళ్లుగా గెజిటెడ్ హోదా కల్పించాలంటూ వినతిపత్రాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


చికిత్స అందిస్తున్న 108 సిబ్బంది

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని కేశవపట్నం అంబేడ్కర్ చౌరస్తాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. నిజామాబాద్ జిల్లాకు చెందిన ఈగ గంగామణి, బేతి విజయ, బిల్ల లక్ష్మిలు బుధవారం వరంగల్ జిల్లా కమలాపూర్ మండలంలోని భీంపల్లిలో జరిగిన దశదిన కర్మకు కారులో వెళ్లారు. కార్యక్రమం అనంతరం తిరిగి వస్తుండగా కేశవపట్నం అంబేడ్కర్ చౌరస్తాలో ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించడంతో ఈఎంటీ సతీశ్‌రెడ్డి వచ్చి, బాధితులకు ప్రథమ చికిత్స అందించారు. అనంతరం అంబులెన్స్‌లో వారిని హుజూరాబాద్ ఆసుపత్రికి తరలించారు.

వ్యాసరచన పోటీలు

రామగిరి(మంథని): సింగరేణి సంస్థ ఆర్జీ–3, ఏపీఏ ఆధ్వర్యంలో బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతిని పురస్కరించుకొని సెంటినరీకాలనీలోని వివిధ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు దేశానికి, సమాజానికి అంబేడ్కర్ అందించిన సేవలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈ నెల 14న నిర్వహించనున్న అంబేడ్కర్ జయంతి వేడుకల్లో బహుమతులు అందజేయనున్నారు.

విజేతలు వీరే..

కృష్ణవేణి టాలెంట్ స్కూల్ నుంచి అమూల్య, అక్షయ, రేవర్షిణి, వాణీ సెకండరీ స్కూల్ నుంచి జశ్వంత్, సాత్విక్, శ్రీవర్ష, హిల్‌పోర్ట్ హైస్కూల్ నుంచి శ్రీవల్లి, చరణ్‌రాజ్, విక్రమ్ తేజ, ప్రగతి హైస్కూల్ నుంచి అఖిల, రామ్ చరణ్, అఖిల ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు.

‘బిశ్వాల్’ సిఫారసులు అమలు చేయాలి


అసిస్టెంట్ కలెక్టర్ నికోలస్‌కు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

కరీంనగర్ అర్బన్: రాష్ట్రంలో నిరుద్యోగం తాండవం చేస్తుంటే మొక్కుబడి ప్రకటనలతో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని వైఎస్సార్‌టీపీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి తడగొండ సత్యరాజ్‌వర్మ ఆరోపించారు. బుధవారం కలెక్టరేట్‌లో అసిస్టెంట్ కలెక్టర్ నికోలస్‌కు వినతిపత్రం అందజేశారు. బిశ్వాల్ కమిటీ రాష్ట్రంలో 1.91 లక్షల ఉద్యోగ ఖాళీలున్నాయని నివేదిక ఇచ్చిందన్నారు. ఆ కమిటీ సిఫారసులు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొత్త మండలాలు, జిల్లాలను ఏర్పాటు చేసిన నేపథ్యంలో 4 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాల్సి ఉండగా ఆ ఊసే లేకపోవడం విడ్డూరమన్నారు. పేపర్ల లీకేజీలతో నిరుద్యోగులను ఆందోళనకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ స్పందించి, ఇప్పటివరకు ఎన్ని పోస్టులను భర్తీ చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పోటీ పరీక్షల్లో సహకారం పెంచాలని కోరారు. నిరుద్యోగ భృతి అమలుతోపాటు ఉన్నత చదువులు చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించాలని విన్నవించారు. నాయకులు రాజేందర్‌రెడ్డి, భూమేశ్, తిరుపతి, రాజిరెడ్డి, నాగరాజురెడ్డి, అరుణ్‌కుమార్ తదితరులున్నారు.

ప్రజాహృదయాల్లో ఎన్టీఆర్

- పేదోళ్ల కడుపు నింపిన వ్యక్తి ఎన్టీఆర్
- టీటీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్


మాట్లాడుతున్న జ్ఞానేశ్వర్

విద్యానగర్(కరీంనగర్): ప్రజాహృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించిన వ్యక్తి ఎన్టీఆర్ అని, పేదోళ్ల కడుపు నింపడానికి రూ.2 కిలో బియ్యం ఇచ్చిన గొప్ప వ్యక్తి అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. బుధవారం కరీంనగర్‌లో టీడీపీ శంఖారావ సభ నిర్వహించారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ.. నాడు ఎన్టీఆర్ నిర్ణయాల వలనే బీసీలకు న్యాయం జరిగిందన్నారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకుడు గంగాధర కనకయ్య, ఆయన సతీమణి గట్టుబూత్కూర్ గ్రామ మాజీ సర్పంచ్ గంగాధర శోభ వందలాది మంది అనుచరులతో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్, బక్కని నర్సింహులు, అరవింద్‌కుమార్, బంటు వెంకటేశ్వర్లు, నాయకులు రవీందర్ రెడ్డి, హరికృష్ణ, అశోక్, వంచ శ్రీనివాస్‌రెడ్డి, కల్యాడపు ఆగయ్య, వెంకటయ్య, అంజయ్య, రాంబాబు, దయాకర్‌రావు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌లది ఏడడుగుల బంధం

- గన్నేరువరం సభలో ఎమ్మెల్యే సీతక్క


పార్టీలో చేరుతున్న శ్రీనాథ్‌రెడ్డి, అనుచరులు

గన్నేరువరం: బీజేపీ, బీఆర్‌ఎస్‌లది ఏడడుగుల బంధమని, ఈ అవినీతి ప్రభుత్వాల పాలనకు, ఆ పార్టీలకు ప్రజలు చరమగీతం పాడాలని ములుగు ఎమ్మెల్యే సీతక్క అన్నారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, ముస్కు ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీకి చెందిన యువజన సంఘాల నాయకుడు అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి మూడు వందల మందితో పార్టీలో చేరగా సీతక్క కండువా కప్పి స్వాగతం పలికారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకుండా బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ‘నీవు తిట్టినట్టు చేయి.. నేను కొట్టినట్టు చేస్తానంటూ’ డ్రామాలు ఆడుతున్నాయని ఆరోపించారు. బహిరంగ సభ నిర్వహించడానికి అడ్డంకులు సృష్టించడం హేయమైన చర్య అన్నారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని, చైతన్యాల అడ్డ నుంచి నీకు గోరి కడుతామని హెచ్చరించారు. టీఎస్‌పీఎస్సీ లీకేజీ వ్యవహారాన్ని ప్రశ్నిస్తే తమకు సంబంధం లేదని మంత్రి కేటీఆర్ పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందని గొప్పలు చెప్పే ఎమ్మెల్యే రసమయి డబుల్ రోడ్డు రహదారిని ఎందుకు చేపట్టలేదని ఎద్దేవా చేశారు. పేదల పెన్నిధి అయిన పొన్నం ప్రభాకర్, కవ్వంపల్లి సత్యనారాయణను ప్రజలు ఆదరించాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ అదానీ కోసం అన్నట్లు వ్యవహరించడం సబబు కాదన్నారు. యువకులను ఇబ్బందులకు గురిచేస్తున్న ఎమ్మెల్యే రసమయికి ఆ యువకులే బుద్ధి చెప్పడం ఖాయమని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేన రెడ్డి హెచ్చరించారు. పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలో వస్తే కరీంనగర్ వెళ్లడానికి చొక్కారావుపల్లె, కాజీపేట మధ్య మానేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణాన్ని చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో కవ్వంపల్లి అనురాధ, శేర్‌లింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి భూపతిరెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పడాల బాబు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘పది’ మూల్యాంకనం నుంచి మినహాయించండి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్: పదోతరగతి మూల్యాంకన విధుల నుంచి మెడికల్ గ్రౌండ్ కలిగిన ఉపాధ్యాయులకు మినహాయింపునివ్వాలని పీఆర్‌టీయూ జిల్లా నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం డీఈవో జనార్దన్‌రావుకు వినతిపత్రం అందించారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముస్కు తిరుపతిరెడ్డి, మర్రి జైపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ.. కరీంనగర్‌లోని సెయింట్ జాన్ స్కూల్‌లో జరిగే పదోతరగతి మూల్యాంకన విధుల నుంచి దీర్ఘకాలిక వ్యాధులు కేన్సర్, బ్యాక్ పెయిన్, హార్ట్‌సర్జరీ, 60 ఏళ్ల వయసు పైబడిన వారికి మినహాయింపునివ్వాలని విన్నవించారు. స్పాట్ వాల్యుయేషన్ విధులు నిర్వర్తించడానికి సిద్ధంగా ఉన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల టీచర్లను అనుమతించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్‌రావు, అన్నాడి మోహన్‌రెడ్డి, మందల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ సెక్యూరిటీగార్డులకు వేతనాలు ఇప్పించండి


ఎస్‌వోటూ జీఎంకు వినతిపత్రం ఇస్తున్న వెంకన్న

రామగిరి(మంథని): సింగరేణి ఆర్జీ–3 పరిధిలో విధులు నిర్వహిస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీగార్డులకు మార్చి నెల వేతనాలు ఇప్పించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న కోరారు. ఈ మేరకు బుధవారం ఆర్జీ–3 ఎస్‌వోటూ జీఎం జి.రఘుపతికి వినతిపత్రం అందించారు. నెల రోజులుగా వేతనాలు చెల్లించకపోవడంతో సెక్యూరిటీగార్డులు కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి, వీలైనంత త్వరగా వేతనాలు చెల్లించేలా చూడాలని విన్నవించారు. కార్యక్రమంలో ప్రైవేట్ సెక్యూరిటీగార్డులు ఉడుత శంకర్, గుర్రం చంద్రశేఖర్, తూటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న జీఎం మనోహర్

గోదావరిఖని(రామగుండం): అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ అన్నారు. బుధవారం తన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. జయంతి వేడుకలకు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఏరియా ఇంజినీర్ నరసింహారావు, వర్క్‌షాప్ డీజీఎం ఎర్రన్న, పర్సనల్ డీజీఎం రాజేంద్రప్రసాద్, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు బదావత్ శంకర్‌నాయక్, బొక్కల శ్రీనివాస్, జె.శ్రీనివాస్, ఎల్.తిరుపతి, సీహెచ్.దుర్గాప్రసాద్, ఎ.చంద్రమౌళి, ఇ.కిష్టయ్య, బాల అంకూస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని(రామగుండం): అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ యూనియన్ న్యూఇయర్ క్యాలెండర్‌ను ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ బుధవారం ఆవిష్కరించారు. జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆర్జీ–1 ఉపాధ్యక్షులు ఈర్ల రాజేశ్, నాయకులు నాగేశ్వరరావు, దొంత వెంకటేశ్వర్లు, కల్వల శంకర్, గడ్డం శంకర్, మిట్టపల్లి కుమార్, మాతంగి రాయమల్లు, జనగాం మల్లేశ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇఫ్తార్ విందులో మంత్రి 'గంగుల'



కరీంనగర్ కల్చరల్: నగరంలోని కార్ఖానాగడ్డ, 27వ డివిజన్‌లో బుధవారం జరిగిన ఇఫ్తార్ విందులో రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ పాల్గొని ముస్లింలకు రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ సునీల్ రావు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, బీఆర్ఎస్ నగర అధ్యకుడు చల్ల హరిశంకర్, బీఆర్ఎస్ మైనారిటీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో కవి సమ్మేళనం



కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు

కరీంనగర్ కల్చరల్: నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధవారం కవి సమ్మేళనం నిర్వహించారు. నూతనంగా నిర్మించిన రాష్ట్ర సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టడం, 125 అడుగుల అంబేడ్కర్ మహా విగ్రహాన్ని ఆవిష్కరించడాన్ని పురస్కరించుకొని సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్, గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు అయాచితం శ్రీధర్ ప్రకటన మేరకు రాష్ట్ర వ్యాప్తంగా కవి సమ్మేళనాలు, వ్యాసరచన పోటీల నిర్వహణలో భాగంగా కవి సమ్మేళనం నిర్వహించినట్లు తెలిపారు. సమ్మేళనంలో పాల్గొన్న కవులను గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ అనిల్ సన్మానించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ సిబ్బంది, కవులు, రచయితలు పాల్గొన్నారు.

అభాగ్యులకు అభయం 'మిషన్ వాత్సల్య'

కరీంనగర్‌టౌన్: తల్లిదండ్రులు లేని చిన్నారులు, ఆర్థికంగా వెనుకబడిన నిరుపేద కుటుంబానికి చెంది నిస్సహాయస్థితిలో ఉన్న చిన్నారులకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ వాత్సల్య వరమని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బొంతల కల్యాణ్ చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. 0–18 ఏళ్ల పిల్లలకు వైద్య, విద్య అభివృద్ధి, అవసరాలు తీర్చేందుకు ఆర్థిక సాయం అందించడానికి కేంద్ర ప్రభుత్వం మిషన్ వాత్సల్య పథకం తీసుకవచ్చిందన్నారు. ఈ పథకం ద్వారా అర్హులైన చిన్నారులకు నెలకు రూ.4వేలు స్కాలర్‌షిప్ అందించనున్నారని తెలిపారు. కేంద్ర, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పథకానికి ఒక కుటుంబంలో ఇద్దరు పిల్లల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సంబురాలు



కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ లక్ష్మయ్య

కరీంనగర్‌రూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విధుల్లో చేరి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం కరీంనగర్ మండల పరిషత్ కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు. కార్యదర్శులతో కలిసి ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. త్వరలోనే ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేసి పేస్కేల్ అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డితో పాటు పలువురు కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం గోపాల్‌పూర్‌లో రెండురోజులుగా ప్రదర్శిస్తున్న శ్రీనల్ల పోచమ్మ యక్షగానం నాటక బృందానికి బుధవారం ఎంపీ బండి సంజయ్‌కుమార్ పంపించిన రూ.10వేల ఆర్థికసాయాన్ని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఊరడి శివారెడ్డి అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఊరడి మంజుల, వైస్ ఎంపీపీ వేల్పుల నారాయణ, దుర్శేడ్ సింగిల్‌విండో మాజీ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, కళాకారులు నాంపల్లి, మల్లయ్య, రాజిరెడ్డి, గోనె శ్రీనివాస్, రమేశ్, ఏసీరెడ్డి, నర్సిరెడ్డి, శంకర్, ఎల్లయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం — కొనసాగుతున్న ఎల్లమ్మతల్లి జోగు



కరీంనగర్‌కల్చరల్: గౌడ కులస్తుల ఆధ్వర్యంలో నిర్వహించే ఎల్లమ్మతల్లి బోనాల జాతరలో భాగంగా జోగు కార్యక్రమం నగరంలో ఘనంగా కొనసాగుతోంది. బుధవారం భగత్‌నగర్ లో ఎస్వీఎస్ గ్రానైట్ అధినేత రాచకొండ తిరుపతిగౌడ్ నివాసంలో జోగు జరిపారు. ఈ సందర్భంగా ఎల్లమ్మతల్లి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోడూరి మహేందర్‌గౌడ్, మాచెర్ల ప్రసాద్, నరేష్, జోగు నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

చిత్ర కథ — ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



కరీంనగర్‌లోని ఆటోనగర్‌లో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా మారాయి. పెద్ద పెద్ద లారీలు వస్తూ పోతుండే ఈ మార్గంలో కిందికి వేలాడుతున్న వైర్లతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

క్యాంపస్ ప్లేస్‌మెంట్‌పై అవగాహన



పాల్గొన్న విద్యార్థులు

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ బైపాస్‌లోని విట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం క్యాంపస్ ప్లేస్‌మెంట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. సాఫ్ట్ స్కిల్స్ ద్వారానే మంచి ఉద్యోగాలు లభిస్తాయని ట్రైనర్ మధు తెలిపారు. గ్రూప్ డిస్కషన్స్, ఇంటర్వ్యూ స్కిల్స్ మెలకువలను వివరించారు. అనంతరం బహుళజాతి కంపెనీ అసెంచర్‌కు 29 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ బి.గోవిందరావు, ప్రిన్సిపాల్ డి. మురళీ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనలోపం.. కిసాన్ నిధికి దూరం

- బ్యాంకుఖాతాకు ఈకేవైసీ లింకేజీలో నిర్లక్ష్యం
- మొదటి విడతలో 6,322 లబ్ధిదారులు
- 13వ విడతలో 2,944 మంది
- తగ్గుతున్న లబ్ధిదారుల సంఖ్య



ఈకేవైసీ నమోదు చేస్తున్న వ్యవసాయాధికారులు(ఫైల్)

కరీంనగర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం 2018 ఫిబ్రవరి 1వ తేదీ నుంచి పీఎం కిసాన్ నిధి సమ్మాన్ పథకాన్ని ప్రారంభించింది. ఏటా ఏప్రిల్–జూలై, ఆగస్టు–నవంబర్, డిసెంబర్–మార్చిలో మూడు విడతలుగా రూ.2 వేల చొప్పున ఎకరానికి రూ.6 వేలు మంజూరు చేస్తోంది. పథకం ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు 13 విడతలుగా నిధులను విడుదల చేశారు. అయితే పలువురు రైతులు బ్యాంకు ఖాతాలకు ఈకేవైసీ లింక్ చేసుకోకపోవడంతో కిస్తికి స్తీకి లబ్ధిదారుల సంఖ్య తగ్గిపోతోంది. ఈకేవైసీ నమోదు చేయించుకోకుంటే రైతులు శాశ్వతంగా ఈ పథకానికి దూరమయ్యే అవకాశముంది. వ్యవసాయాధికారులు వివిధ మాధ్యమాల్లో అవగాహన కల్పించినప్పటికీ పలువురు రైతులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో సాయం పొందలేకపోతున్నారు. ఇటీవల 13వ కిస్తీ నిధులను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. కొత్త రైతుల మాట అటుంచితే పథకంలోని పాత రైతుల్లో పలువురికి డబ్బులు జమకాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

నిబంధనలతో తగ్గుతున్న లబ్ధిదారులు

కరీంనగర్ మండలంలో పీఎం కిసాన్ నిధి ద్వారా 6,322 మంది రైతులు లబ్ధిపొందుతున్నారు. వీరిలో 5,188 మంది ఈకేవైసీ నమోదు చేసుకోగా ఇంకా 1,134 మంది చేసుకోవాల్సి ఉంది. అయితే పలు కారణాలతో లబ్ధిదారుల సంఖ్య క్రమేపీ తగ్గుతోంది. గత సీజన్లలో లబ్ధి పొందిన పలువురు రైతులు ఈకేవైసీని పూర్తి చేసినప్పటికీ 13వ విడత నిధులు మంజూరు కాలేదు. నిధులు విడుదలైనట్లు ప్రధాన మంత్రి పేరిట సెల్‌ఫోన్లకు మెస్సెజ్ వచ్చినప్పటికీ బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదని పలువురు రైతులు వాపోతున్నారు. మరి కొందరు రైతులకు వేరే బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ కావడంతో విషయం తెలియడం లేదు. అయితే కేంద్రం అమలు చేస్తున్న నిబంధనలతో రైతుల సంఖ్య తగ్గుతోంది. ఈకేవైసీ పూర్తిచేయకపోవడంతో పాటు బ్యాంకు ఖాతాలకు ఆధార్ లింక్ చేయని రైతులకు నిధులందలేదు. రేషన్ కార్డుల ఆధారంగా కుటుంబంలో ఒక్క రైతునే పరిగణనలోకి తీసుకోవడం, ఆదాయపు పన్ను చెల్లిస్తున్న రైతులను తొలగిస్తున్నారు. ధాన్యం డబ్బులను పొందడానికి తీసుకున్న బ్యాంకు ఖాతా కోసం పాన్‌కార్డు తీసుకున్నా, గృహ నిర్మాణానికి రుణం కోసం ఐటీ రిటర్న్స్ దాఖలు చేసినా తమకు నిధులు నిలిపివేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా సంస్థల నిర్వాహకులు, రాజ్యాంగ అధిపతులు, చట్టసభల ప్రతినిధులు, మున్సిపల్, కార్పొరేషన్, జెడ్పీల అధ్యక్షులు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు, నెలకు రూ.10వేల కంటే ఎక్కువగా పెన్షన్ పొందుతున్న రిటైర్డు ఉద్యోగులు, డాక్టర్లు, లాయర్లు, ఇంజినీర్లు, సీఏ తదితరులను ఆన్‌లైన్ లింకేజీ ద్వారా గుర్తించి తొలగిస్తుండటంతో లబ్ధిదారుల సంఖ్య తగ్గిపోతుంది. అయితే నిబంధనల పేరిట అనర్హులను తొలగిస్తున్న ప్రభుత్వం కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులకు మాత్రం అవకాశం కల్పించకపోవడంతో నష్టపోతున్నారు.

లబ్ధిపొందిన రైతుల వివరాలు

విడత	రైతులు	విడత	రైతులు
1వ	6,322	7వ	5,516
2వ	6,134	8వ	5,307
3వ	5,953	9వ	5,083
4వ	5,801	10వ	4,644
5వ	5,726	11వ	4,238
6వ	5,653	12వ	2,944
		13వ	2,944

అకౌంట్ మ్యాపింగ్ చేసుకోవాలి

కొన్ని సాంకేతిక కారణాలతో రైతుల బ్యాంకు ఖాతాల్లో 13వ విడత డబ్బులు జమ కాలేదు. బ్యాంకు ఖాతాను ఎన్‌పీసీఐ అకౌంట్‌తో ఆధార్ మ్యాపింగ్ చేసుకోకపోవడంతో 337 మంది రైతులకు డబ్బులు రాలేదు. బ్యాంకు మేనేజర్‌ను రైతులు సంప్రదించి ఆధార్‌కార్డు జిరాక్స్ ఇస్తే మ్యాపింగ్ పూర్తిచేసినట్లయితే 14వ విడతలో డబ్బులు జమవుతాయి.

– బి.సత్యం, మండల వ్యవసాయాధికారి

బావుపేట–హైదరాబాద్ రోడ్డు నిర్మాణానికి కృషి

- రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి కమలాకర్
- బావుపేటలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి

కొత్తపల్లి: మండలంలోని బావుపేట–గన్నేరువరం వరకు మానేరు నదిపై వంతెన నిర్మించి తద్వారా హైదరాబాద్‌కు రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నదే నా కల అని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. బుధవారం కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్(బావులపేట)లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ అభిమానంతో మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అదృష్టవంతుడినని, నియోజకవర్గ ప్రజలందరికీ రుణపడి ఉంటానని అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజలకవసరమైన మౌలిక వసతులు కల్పిస్తూనే గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ పచ్చగా ఉండటాన్ని ఓర్వలేని ప్రతిపక్షాలు ఇక్కడ చిచ్చుపెట్టేందుకు పాదయాత్రలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి శ్రీలత మహేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్‌గౌడ్, ఏఎంసీ చైర్మన్ రెడ్డవేని మధు, వైస్ చైర్మన్ రాజశేఖర్, జెడ్పీ కోఆప్షన్ షబ్బీర్ పాషా, తహసీల్దార్ వెంకటరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, సర్పంచ్ శారద శ్రీనివాస్, ఎంపీటీసీ, వార్డు సభ్యులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రూ.11.73 కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ

బావుపేటలో రూ.11.73 కోట్ల పలు అభివృద్ధి పనులకు మంత్రి కమలాకర్ బుధవారం భూమిపూజ చేశారు. రూ.4.87 కోట్ల సీడీపీ నిధులతో తమిళ కాలనీ నుంచి శ్వేత కాంప్లెక్స్ వరకు నిర్మించే బీటీ రోడ్డు, రూ.6.26 కోట్లతో ఎస్సీ కాలనీ–బావు చెరువు వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, రూ.20లక్షలతో నిర్మించే గ్రామ పంచాయతీ భవన నిర్మాణం పనులకు, అంగడిబజార్‌లో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించే షెడ్డు నిర్మాణ పనులకు, తమిళకాలనీలో మహిళా సంఘం భవన నిర్మాణానికి, ముదిరాజ్ సంఘం భవన నిర్మాణానికి, గౌడ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసారు. అదేవిధంగా రూ.5 లక్షలతో నిర్మించిన ఎస్సీ కాలనీ మహిళా సంఘ భవనాన్ని ప్రారంభించారు.

అల్ఫోర్స్‌లో 'గ్రాడ్యుయేషన్ డే'



విద్యార్థులతో నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి: కరీంనగర్ వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్‌నెక్స్ట్‌లో యూకేజీ విద్యార్థులకు బుధవారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే ఉత్సవాలు ఆనందంగా సాగాయి. యూకేజీ పరీక్షల అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన ప్రతిభాధారిత పత్రాలను అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి అందించి పై చదువులకు అర్హత సాధించినట్లు ప్రకటించారు. ప్రాథమిక దశ నుంచే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారిలో పోటీతత్వాన్ని పెంచేందుకు ఇలాంటి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీటివల్ల విద్యార్థుల్లో నూతనోత్తేజం కలుగుతుందన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్టీఐ బోర్డులు ఏర్పాటు చేయాలి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఆర్టీఐ సూచన బోర్డులు ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం సీసీఆర్ సభ్యులు ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ నారాయణలను కలిసి వినతిపత్రం సమర్పించారు. బోర్డులు ఏర్పాటు చేయడంతో సమాచార హక్కుపై ప్రజలకు అవగాహన కలుగుతుందని సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీఆర్ సభ్యులు బొడ్ల సత్యనారాయణ, మాసం సుధాకర్, గడ్డం అశోక్‌రెడ్డి, సాయివరుణ్, జి.రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భైరెడ్డి రజిత పిల్లలకు రెడ్డి సంఘం నాయకుల ఓదార్పు



రజిత పిల్లలను ఓదార్చుతున్న రెడ్డి సంఘం నాయకులు

విద్యానగర్(కరీంనగర్): ఇటీవల కరీంనగర్‌లోని పద్మనగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు భైరెడ్డి రజిత కుటుంబ సభ్యులను బుధవారం ఉమ్మడి జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు పరామర్శించి ఓదార్చారు. పరామర్శించిన వారిలో రజిత కుమారులు భైరెడ్డి ప్రజ్ఞాథ్ రెడ్డి, రిశిక్ రెడ్డిలను రెడ్డి సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నరహరి జగ్గారెడ్డి, జిల్లా సంఘం కోశాధికారి కాసర్ల మధుకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు గన్ను మహేందర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులు దాసరి రాంరెడ్డి, దారం జగన్నాథరెడ్డి, రెడ్డి సంఘం జిల్లా నాయకులు కోట లక్ష్మారెడ్డి, కొత్త రవీందర్ రెడ్డిలున్నారు.

సిగ్నల్స్ పోల్స్ తొలగింపుపై హర్షం

కరీంనగర్‌లోని ఎస్సారార్ కాలేజీ కూడలిలోని ప్రొఫెసర్ రాంరెడ్డి విగ్రహం ఎదుట ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్ పోల్స్‌ను రెడ్డి సంక్షేమ సంఘం విజ్ఞప్తి మేరకు బుధవారం మున్సిపల్ అధికారులు తొలిగించడంపై ఆ సంఘం నాయకులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కోశాధికారి కాసర్ల మధుకర్‌రెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి దారం జగన్నాథరెడ్డి, కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యులు న్యాలకొండ ప్రసన్న కుమార్ రెడ్డి, నాయకులు భూముపెల్లి రాఘవ రెడ్డి, ఎడబోయిన శ్రీనివాస్ రెడ్డి, చెన్నాడి రాజేశ్వర్ రెడ్డి, రేకులపెల్లి రవీందర్ రెడ్డి, రావుల కిరణ్ రెడ్డి, కంటారెడ్డి శ్రీనివాస్ రెడ్డిలు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంక్ లింక్ ఒలింపియాడ్‌లో ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ భట్టాచార్య

కొత్తపల్లి: ఢిల్లీకి చెందిన ఇంక్ లింక్ ఒలింపియాడ్ ఇటీవల నిర్వహించిన జీకే, డ్రాయింగ్ ఒలింపియాడ్ పోటీలో పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ సంజయ్ భట్టాచార్య తెలిపారు. జీకే ఒలింపియాడ్‌లో ఎ.గౌతమ్ (6వ తరగతి) రాష్ట్రస్థాయిలో 1వ స్థానం , జి.రాంచరణ్(7వ తరగతి) రాష్ట్రస్థాయిలో 3వ స్థానం సాధించారని అన్నారు. ఒలింపియాడ్‌లో రాష్ట్రస్థాయి అవార్డులు పొందిన విద్యార్థులను పాఠశాలల చైర్మన్ ఇ.ప్రసాదరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు రశ్మిత, ప్రసూన, అనూకర్‌రావు, రాకేశ్, వినోద్‌రావు, ప్రసాద్, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ, సమన్వయకర్తలు లక్ష్మీదీప్తి, రబీంద్ర పాత్రో, హరిప్రియ, ప్రదీప్ పాల్గొన్నారు.

ఉద్యోగాలు భర్తీ చేయాలి

మానకొండూర్: వైఎస్సార్‌టీపీ మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి దుబ్బ నీరజ బుధవారం టీ సేవ్ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ఆర్వీ కర్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని కోరారు.

అగ్నిప్రమాదంపై విచారణ



వివరాలు సేకరిస్తున్న తహసీల్దార్ నారాయణ

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బహదూర్‌ఖాన్‌పేటలో జరిగిన అగ్నిప్రమాదంలో కాలిపోయిన కిరాణ దుకాణంపై బుధవారం తహసీల్దార్ నారాయణ విచారణ చేపట్టారు. ప్రమాదం జరిగిన ఇల్లును పరిశీలించి ఇంటి యజమాని మల్లయ్యను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం మంజూరు కోసం జరిగిన నష్టాన్ని అంచనా వేసి కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, ఎంపీటీసీ బుర్ర తిరుపతి, సర్పంచ్ భూమయ్య, ఆర్ఐ రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబాన్ని పరామర్శించిన రోహిత్‌రావు

అగ్నిప్రమాదంలో నష్టపోయిన కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకుడు మెన్నేని రోహిత్‌రావు బుధవారం పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు తిరుపతిగౌడ్, రాంరెడ్డి, నాగప్రసాద్, రాజిరెడ్డి, లక్ష్మణ్, కనుకయ్య, శంకరయ్య, స్వామిగౌడ్, హరీశ్‌గౌడ్ తదితరులున్నారు.

ఐక్యతతో ముందుకుసాగాలి

గంగాధర: సమస్యల పరిష్కారానికి క్రైస్తవులు ఐక్యతతో ముందుకుసాగాలని చొప్పదండి నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎజ్రా మల్లేశం అన్నారు. గంగాధరలో బుధవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రిస్టియన్ అసోసియేషన్ సమావేశానికి హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలో మైనారిటీల కంటే క్రిస్టియన్లు ఎక్కువగా ఉన్నారని, ఇంతవరకు ఏ ప్రభుత్వం క్రిస్టియన్లకు సహకారాలు అందించలేదన్నారు. నాయకులు పీటర్, యాదిప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

14న పాలిసెట్ నమూనా పరీక్ష

కరీంనగర్: పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులకు సాంకేతిక విద్యలో డిప్లొమా చేయడానికి నిర్వహించే అర్హత పరీక్షకు సంబంధించిన నమూనా పరీక్షను నగరంలోని ముకరంపురలోని కిట్స్ అకాడమీలో ఈనెల 14న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9346217513 నంబర్‌లో సంప్రదించవచ్చునని తెలిపారు.

బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

ఇల్లందకుంట: బాల్యవివాహాల నిర్మూలన సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని బాలల పరిరక్షణ కమిటీ సభ్యులు తేజస్విని, రమేశ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని వాగొడ్డురామనపల్లి గ్రామంలో సమగ్ర బాలల పరిరక్షణ విభాగం, శిశుమహిళా బాలల హక్కుల గ్రామ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బాల్యవివాహాలు, లైంగిక వేధింపులు, అక్రమరవాణా, దత్తత, బాలకార్మికులు తదితర అంశాలను వివరించారు. బాలబాలికలు ఏమైనా ఇబ్బందులుంటే చైల్డ్ లైన్ 1098 నంబర్‌కు డయల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పుట్ట రాజు, ఐసీడీఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాతబజార్ శివాలయంలో చోరీ



పగులగొట్టిన హుండీ

కరీంనగర్‌క్రైం:కరీంనగర్‌లోని పాత బజార్ శివాలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని పాతబజార్‌లోని శివాలయంలోకి మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రెండు హుండీలు పగులగొట్టి రూ.3 వేల నగదు ఎత్తుకెళ్లారు. బుధవారం ఉదయం సెక్యూరిటీ గార్డు, ఆలయ సిబ్బంది చూసి అధికారులకు సమాచారమందించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాలు పరిశీలించి నిందితుల ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

‘చెక్కు’తో చిక్కారు!

ఏటా మార్చి 31న రూ.వందల కోట్ల చెక్కులు చూపిస్తున్న మార్గదర్శి

- బ్యాలన్స్ షీట్‌లో కనిపించిన చెక్కులు 90 రోజులు దాటినా నగదుగా మారని వైనం
- దారి మళ్లించిన రామోజీ.. రికార్డులు పరిశీలించేందుకు సమ్మతించని శైలజా కిరణ్
- తాజాగా ప్రధాన కార్యాలయంలో సీఐడీ విస్తృత సోదాలు.. అసలు చెక్కులు వచ్చిందీ లేదు.. నగదుగా మార్చిందీ లేదు
- మరో రూ.500 కోట్లు ఏటా నగదు రూపంలో వసూలు.. బ్రాంచీల బ్యాంకు ఖాతాల్లో జమ చేయకుండా నల్లధనంగా తరలింపు

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమ వ్యవహారాల కేసులో సీఐడీ దర్యాప్తు వేగవంతమైంది. మనీ లాండరింగ్‌కు పాల్పడిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలను ఢిల్లీలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ (సీబీడీటీ) దృష్టికి సీఐడీ తీసుకొచ్చింది. చట్టాలను ఉల్లంఘించి రామోజీరావు, ఆయన కుటుంబం పాల్పడుతున్న ఆర్థిక మోసాలను ఆధారాలతో సహా వివరించింది. మరోవైపు సీఐడీ అధికారులు హైదరాబాద్‌లోని మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రధాన కార్యాలయంలో బుధవారం విస్తృతంగా సోదాలు నిర్వహించారు. అర్ధరాత్రి వరకు కొనసాగిన సోదాల్లో అక్రమ పెట్టుబడులు, చందాదారులు సొమ్ము నిబంధనలకు విరుద్ధంగా బదిలీకి సంబంధించి కీలక ఆధారాలు సేకరించారు. ప్రధానంగా మార్గ దర్శి చిట్‌ఫండ్స్ చైర్మన్ చెరుకూరి రామోజీరావు, మేనేజింగ్ డైరెక్టర్ చెరుకూరి శైలజ కిరణ్, సంస్థ డైరెక్టర్ల పాత్రకు సంబంధించిన కీలక ఆధారాలు సేకరించడం ప్రాధాన్యం సంతరించుకుంది. సంస్థ బ్యాలన్స్ షీట్లు, నగదు–చెక్కు వ్యవహారాలకు సంబంధించిన రికార్డులు, నిధుల మళ్లింపునకు సంబంధించిన రికార్డులను సీఐడీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో మార్గదర్శి బ్రాంచి కార్యాలయాల్లో వెలుగు చూసిన ఆర్థిక అక్రమాలకు మూలం అంతా హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయమేనని వెల్లడైంది.



బెడిసికొట్టిన ఏ-1 రామోజీ, ఏ-2 శైలజ పన్నాగం

ఏ–1గా ఉన్న చెరుకూరి రామోజీరావు, ఏ–2గా ఉన్న చెరుకూరి శైలజ కిరణ్ ఈ కేసు దర్యాప్తును తప్పుదారి పట్టించేందుకు చేసిన ప్రయత్నాలను సీఐడీ తాజా సోదాలతో అడ్డుకుంది. ఈ నెల 3న రామోజీరావును, శైలజను ఈ నెల 6న సీఐడీ అధికారులు విచారించిన విషయం విదితమే. మార్గదర్శి చిట్‌ఫండ్స్ నుంచి నిధుల మళ్లించామని అంగీకరిస్తూనే ఆ వ్యవహారాలతో తనకు సంబంధం లేదని, అంతా బ్రాంచి మేనేజర్లు (ఫోర్‌మెన్) చూసుకుంటారని ఈ సందర్భంగా రామోజీరావు అడ్డగోలుగా వాదించారు. మరోవైపు శైలజా కిరణ్ కూడా అదే రీతిలో విచారణకు సహకరించకుండా సహాయ నిరాకరణ చేశారు.

అక్రమంగా బదిలీ చేసింది వారిద్దరే

మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో చందాదారుల సొమ్మును అక్రమంగా మళ్లించింది సంస్థ చైర్మన్ రామోజీరావు, ఎండీ శైలజా కిరణేనని సీఐడీ సోదాల్లో వెల్లడైంది. ఆ నిధులను రామోజీరావు కుటుంబానికి చెందిన ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, మార్గదర్శి చిట్‌ఫండ్స్(కర్ణాటక)– బెంగళూరు, మార్గదర్శి(తమిళనాడు)–చెన్నై సంస్థల్లోకి మళ్లించారు. కంపెనీ చైర్మన్ హోదాలో రామోజీరావు, ఎండీ హోదాలో శైలజతోపాటు డైరెక్టర్ల ఆమోదంతోనే ఆ నిధులు మళ్లించారనేందుకు కీలక ఆధారాలు సీఐడీకి లభ్యమయ్యాయి. ఈ నేపథ్యంలో సీఐడీ అధికారులు కేసు దర్యాప్తులో కీలక నిర్ణయాలు తీసుకోనున్నారని విశ్వసనీయ సమాచారం.

ఆ చెక్కులు ఎక్కడ..?

ఏటా సరిగ్గా.. మార్చి 31న రూ.వందల కోట్ల విలువైన చెక్కులు వస్తున్నట్టు మార్గదర్శి చిట్‌ఫండ్స్ తన బ్యాలన్స్ షీట్‌లో చూపిస్తోంది. 2022 మార్చి 31న కూడా రూ.550 కోట్ల విలువైన చెక్కులు వచ్చినట్టు చూపించారు. కానీ నిర్ణీత 90 రోజుల్లోగా ఆ చెక్కులను నగదుగా మార్చడం లేదని సీఐడీ అధికారుల సోదాల్లో వెలుగులోకి వచ్చింది. చెక్కుల్లో చూపిస్తున్న నిధులను రామోజీ తన కుటుంబ ప్రయోజనాల కోసం అక్రమంగా తరలిస్తున్నారు. దీనిపైనే సీఐడీ అధికారులు ప్రశ్నించడంతో శైలజా కిరణ్ షాక్‌కు గురయ్యారు. ఆ చెక్కులు నగదుగా మారాయో లేదో రికార్డులు తమ వద్ద లేవని చెప్పడంతో ప్రధాన కార్యాలయానికి వెళ్లి పరిశీలిద్దామని సీఐడీ అధికారులు సూచించారు. అందుకు ఆమె అంగీకరించకపోగా సీఐడీ అధికారులు అక్కడకు వెళ్లేందుకు కూడా సమ్మతించలేదు. ప్రధాన కార్యాలయంలోని కీలక రికార్డులను సీఐడీ పరిశీలించేందుకు శైలజా కిరణ్ ఒప్పుకోకపోవడం ఈ కేసులో కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో సీఐడీ అధికారులు బుధవారం నిర్వహించిన సోదాల్లో ఏటా బ్యాలన్స్ షీట్‌లో చూపిస్తున్న చెక్కులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అసలు చెక్కులు రావడంగానీ, వాటిని నగదుగా మార్చడం గానీ జరగడం లేదని గుర్తించారు.

నగదు రూపంలో ఏటా రూ.500 కోట్లు

మార్గదర్శి చిట్‌ఫండ్స్ నిబంధనలకు విరుద్ధంగా ఏటా రూ.500 కోట్లను నగదు రూపంలో వసూలు చేస్తున్నట్లు బ్రాంచి కార్యాలయాల్లో గతంలో నిర్వహించిన సోదాల్లో వెలుగు చూసింది. కానీ ఆ నిధులను బ్రాంచి కార్యాలయాల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడంలేదు. ఆ నగదు నిల్వలేవీ ప్రధాన కార్యాలయంలోని రికార్డుల్లో కూడా లేనట్లు సీఐడీ అధికారులు గుర్తించారు. అంటే ఆ డబ్బులను నల్లధనం రూపంలో అక్రమంగా తరలిస్తున్నట్లు రూఢీ అయింది. అందుకు సంబంధించిన కీలక ఆధారాలు కూడా సీఐడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.


రామోజీ బెంబేలు

మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలను సీఐడీ ఆధారాలతో సహా జాతీయ దర్యాప్తు సంస్థల దృష్టికి తేవడంతో ఈ కేసులో ఏ–1గా ఉన్న రామోజీరావు బెంబేలెత్తుతున్నారు. సీఐడీ దర్యాప్తుపై మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ వచ్చిన ఆయన తొలిసారిగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ పేరిట తాజాగా పత్రికా ప్రకటన జారీ చేశారు. ఈడీ, సీబీడీటీ దర్యాప్తు తప్పదేమోనన్న ఆందోళన అందులో వ్యక్తమైంది. రాష్ట్రంలో మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యకలాపాలు నిలిచిపోయాయని ఆ ప్రకటనలో అంగీకరించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఏపీలో మార్గదర్శి చిట్‌ఫండ్స్ కొత్త చిట్టీలు ఏవీ ప్రారంభించడం లేదని పేర్కొనడం గమనార్హం.

‘మార్గదర్శి’ మోసాలివిగో

జాతీయ దర్యాప్తు సంస్థలకు సీఐడీ సూచన

సాక్షి, న్యూఢిల్లీ: చట్ట ఉల్లంఘనలకు పాల్పడిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మోసాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు క్షుణ్ణంగా విచారణ జరపాలని ఆంధ్రప్రదేశ్ సీఐడీ విభాగం సూచించింది. మనీ లాండరింగ్, నిధుల స్వాహా, కార్పొరేట్ మోసాలు, బినామీ లావాదేవీలతో పన్ను ఎగవేత లాంటి కీలక అంశాలను తమ విచారణలో కనుగొన్న నేపథ్యంలో మరింత లోతుగా దర్యాప్తు చేయడం అవసరమని పేర్కొంది. సీఐడీ ఏడీజీ సంజయ్ బుధవారం ఢిల్లీలో జాతీయ మీడియాతో మాట్లాడారు. చిట్‌ఫండ్ పేరుతో జరిగిన అతిపెద్ద ఆర్థిక మోసాన్ని ఆంధ్రప్రదేశ్‌లో అడ్డుకున్నట్లు వెల్లడించారు. చట్టవిరుద్ధంగా డిపాజిట్లు స్వీకరించిన చరిత్ర కలిగిన మార్గదర్శి చిట్ గ్రూప్ 1982 చిట్ ఫండ్ చట్టాన్ని ఉల్లంఘించి అమాయక చందాదారులను దోపిడీ చేస్తోందన్నారు. మార్గదర్శి ఉల్లంఘనలన్నీ కేంద్ర దర్యాప్తు సంస్థల పరిధిలో ఉన్నందున రెండు రోజుల పాటు ఢిల్లీలో ఆయా విచారణ సంస్థలను కలుసుకుని వివరాలు అందచేసినట్లు చెప్పారు. మోసపూరిత ఆర్థిక సంస్థలు చట్టాలను ఉల్లంఘిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మౌనంగా ప్రేక్షకపాత్ర వహించరాదని సుప్రీంకోర్టు ఓ కేసు విచారణ సందర్భంగా వ్యాఖ్యానించిన విషయాన్ని గుర్తు చేశారు.



సత్యం, సహారా, శారదా తరహాలో..

మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో ఉల్లంఘనలు, మోసపూరిత పద్ధతులు సత్యం కంప్యూటర్స్, సహారా, శారదా చిట్స్ మోసాలకు చాలా దగ్గరగా ఉన్నట్లు సంజయ్ తెలిపారు. ఈ దోపిడీని అరికట్టేందుకు మార్గదర్శి ఖాతా పుస్తకాలపై లోతైన విచారణ తప్పనిసరి అని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ దిశలోనే తమ దర్యాప్తు కొనసాగుతోందని, తదుపరి వివరాలు తగిన సమయంలో వెల్లడిస్తామన్నారు.

రహస్యంగా నిధుల మళ్లింపు..

డిపాజిట్ల ద్వారా మార్గదర్శి సేకరించిన నిధులను అనుబంధ కంపెనీలు, షేర్ మార్కెట్లు, మ్యూచువల్ ఫండ్స్ లాంటి ఇతర పెట్టుబడులకు రహస్యంగా మళ్లించడంతోపాటు అధిక మొత్తంలో సభ్యత్వాలు స్వీకరిస్తూ మనీలాండరింగ్‌కు పాల్పడుతోందన్నారు. వడ్డీ, భద్రత అందించే పేరుతో చందాదారుల సొమ్మును మార్గదర్శి వద్దే ఉంచాలని బలవంతం చేయడం, ‘చెక్స్ ఆన్‌హ్యాండ్, క్యాష్ ఆన్‌హ్యాండ్’ పేరుతో నగదు నిల్వల్ని పెంచడం లాంటి మోసపూరిత అకౌంటింగ్ పద్ధతుల ద్వారా ఉల్లంఘనలకు పాల్పడుతున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించినట్లు తెలిపారు. ఈమేరకు ఎఫ్ఐఆర్‌లలో ఏ–1గా మార్గదర్శి చైర్మన్ చెరుకూరి రామోజీరావు, ఏ–2గా కంపెనీ ఎండీ శైలజా కిరణ్, ఏ–3గా బ్రాంచి మేనేజర్లు, ఏ–4గా కంపెనీ, ఏ–5గా ప్రిన్సిపల్ ఆడిటర్ కె.శ్రవణ్ పేర్లను నమోదు చేసినట్లు తెలిపారు. ఏ–1 నుంచి ఏ–5 వరకూ అందరినీ ఒక్కోసారి ప్రశ్నించినా తప్పించుకునే సమాధానాలు వచ్చాయని చెప్పారు. అవసరమైన సమాచారం, పత్రాలను చిట్ రిజిస్ట్రార్, సీఐడీకి మార్గదర్శి ఇవ్వడం లేదన్నారు.

‘సుప్రీం’ ఏం చెప్పిందంటే...


‘‘చిట్ ఫండ్స్ చట్టాన్ని ప్రధానంగా చందాదారుల ప్రయోజనాలను కాపాడేందుకు రూపొందించారు. కొన్ని మోసపూరిత ఆర్థిక సంస్థలు చందాదారులు/డిపాజిటర్లను మోసం చేయడమే కాకుండా నిధులను పక్కదారి పట్టించడం లేదా మళ్లించడం చేస్తున్నాయి. ఇలాంటి వాటిని నియంత్రించేందుకు కఠినచర్యలు తీసుకోవడం రాష్ట్ర ప్రభుత్వాల విధి. ప్రజల సంక్షేమానికి సంరక్షకుడిగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం దీనికి పరిష్కారాన్ని కనుగొనకుండా మౌన ప్రేక్షకుడిగా ఉండరాదు’’ అని శ్రీరామ్ చిట్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిందని సంజయ్ తెలిపారు.

సీఐడీ ప్రాథమిక విచారణలో ఏం తేలిందంటే...

- ▲ చిట్‌ఫండ్ చట్టంలోని పలు నిబంధనలను మార్గదర్శి గ్రూప్ ఉల్లంఘించింది.
- ▲ చందాదారుల సొమ్మును హెచ్‌యూఎఫ్ నియంత్రిత సంస్థలకు మళ్లించింది.
- ▲ చట్ట విరుద్ధంగా చందాదారుల సొమ్మును ఎక్కువ రిస్క్ ఉన్న మ్యూచువల్ ఫండ్స్, స్టాక్ మార్కెట్‌కు మళ్లించారు.
- ▲ నాలుగు నుంచి ఐదు శాతం వార్షిక వడ్డీ రేటు అందిస్తూ భవిష్యత్తు సభ్యత్వాల రసీదు ముసుగులో అక్రమ డిపాజిట్లను బలవంతంగా తీసుకుంటోంది.
- ▲ చిట్‌ఫండ్ చట్టం 1982 ప్రకారం కంపెనీ బ్యాలెన్స్ షీట్, ఖాతాల వివరాలను అందించలేదు.
- ▲ ఖాతాలకు మసిపూసి మారేడుకాయ చేస్తూ అవసరమైన సమాచారాన్ని ఇవ్వడం లేదు.
- ▲ నిందితులు విచారణకు సహకరించకుండా వివిధ మార్గాల ద్వారా సీఐడీ పరువు తీయడం, నిందలు మోపేందుకు యత్నిస్తున్నారు.

పిటిషనే లేకుండా వాదనలా?

- మార్గదర్శి మౌఖిక ప్రస్తావనను తప్పుబట్టిన ధర్మాసనం
- తనిఖీలపై ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమన్న తెలంగాణ హైకోర్టు
- విచారణ నేటికి వాయిదా



సాక్షి, హైదరాబాద్: మార్గదర్శి చిట్ ఫండ్స్‌కు తెలంగాణ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ప్రత్యేకంగా పిటిషన్ దాఖలు చేయకుండా మౌఖికంగా రిలీఫ్ కోరడాన్ని తప్పుబట్టింది. అప్లికేషన్ (పిటిషన్) దాఖలు చేస్తేనే వాదనలు వింటామని తేల్చి చెప్పింది. మార్గదర్శి కేంద్ర కార్యాలయంలో కొనసాగుతున్న తనిఖీలను ఆపాలని, బలవంతపు చర్యలు చేపట్టకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ హైకోర్టును మార్గదర్శి ఆశ్రయించింది. బుధవారం ఉదయం జస్టిస్ బి.విజయ్ సేన్‌రెడ్డి ధర్మాసనం ఎదుట ఈ అంశాన్ని ప్రస్తావించగా.. రోజువారీ కేసుల విచారణకు ఇబ్బంది ఎదురవుతుందని, సాయంత్రం 4.30 గంటలకు దీన్ని మెన్షన్ చేయాలని ఆదేశించారు. సాయంత్రం విచారణ ప్రారంభం కాగానే మార్గదర్శి తీరును ఏపీ స్పెషల్ జీపీ గోవింద్‌రెడ్డి తప్పుబట్టారు. ‘ఉద్యోగుల నుంచి ఎలాంటి ప్రత్యేక అప్లికేషన్ లేకుండా రిలీఫ్ పొందాలని భావించడం సరికాదు. ఇది సమాజానికి తప్పుడు సంకేతాలు ఇచ్చినట్లు అవుతుంది. మౌఖికంగా ప్రస్తావించే వాటిని పరిగణనలోకి తీసుకుని ఆర్డర్ ఇవ్వకూడదని గతంలో ఇదే కోర్టు ద్విసభ్య ధర్మాసనం (యూనియన్ ఆఫ్ ఇండియా వర్సెస్ ఎస్ఎం హుస్సేన్ రషీద్ కేసు) తీర్పునిచ్చింది. అత్యవసర పరిస్థితి అంటే.. ఉరితీత, భవనాలను కూల్చడం లాంటివి మాత్రమే. చిన్న అంశాలను మౌఖికంగా మెన్షన్ చేయడం సమర్థనీయం కాదు. తనిఖీలు ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటికే చాలా పిటిషన్లు దాఖలు చేశారు. ప్రభుత్వానికి కౌంటర్ వేసే అవకాశం కూడా ఇవ్వకుండా ఆర్డర్ కోసం పట్టుబడుతున్నారు. చట్టపరంగా తనిఖీలు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం ఉంది. తనిఖీలు కొనసాగుతున్నప్పుడు కోర్టు జోక్యం చేసుకోరాదని సుప్రీంకోర్టు కూడా గతంలో ఆదేశించింది. తనిఖీలు పారదర్శకంగా సాగుతున్నాయి. ప్రజల నుంచి సేకరిస్తున్న నగదు నిర్వహణ నిబంధనల మేరకు జరగాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకూడదనే ఈ చర్యలు చేపడుతున్నాం. పిటిషనర్ చెబుతున్నట్లుగా ఇతర రాష్ట్రాలకు సంబంధించిన ఎలాంటి డేటాను దర్యాప్తు అధికారులు సేకరించడం లేదు. కేసుకు సంబంధించి డేటా మాత్రమే తీసుకుంటున్నారు. గత నెల 21న కోర్టు ఆ పిటిషన్ వేసిన వారికి మాత్రమే రిలీఫ్ ఇచ్చింది. ఇది ఉద్యోగులందరికీ వర్తించదు’ అని వాదనలు వినిపించారు. జీపీ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. ఉద్యోగుల నుంచి ప్రత్యేక అప్లికేషన్‌తో రావాలని ఆదేశిస్తూ విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఈ సమయంలో మార్గదర్శి తరఫు న్యాయవాది జోక్యం చేసుకునే ప్రయత్నం చేయగా.. ‘ఇప్పటికే పలు పిటిషన్లలో అరెస్టు సహా బలవంతపు చర్యల నుంచి ఉపశమనం పొందారు. ఈ మౌఖిక ప్రస్తావనలో ఎలాంటి ఉపశమనం ఇవ్వలేం. పిటిషన్ దాఖలు చేస్తేనే వాదనలు వింటాం’ అని ధర్మాసనం తేల్చిచెప్పింది.

మరోసారి తెరపైకి ‘కుప్టి’



ఈ పరీవాహక ఎగువ ప్రాంతంలోనే కుప్టి ప్రాజెక్ట్ నిర్మాణం

- ఏళ్లుగా నానుతున్న బహుళార్థసాధక ప్రాజెక్టుకు ముందడుగు పడేనా..
- త్వరలో శుభవార్త ఉందంటున్న బోథ్ ఎమ్మెల్యే
- ఇప్పటికే మూడుసార్లు డీపీఆర్.. ఆ తర్వాత ఊసేలేని వైనం
- మళ్లీ అంచనా వ్యయం పెరగొచ్చనే అభిప్రాయం

సాక్షి, ఆదిలాబాద్: ఎన్నికల ఏడాదిలోనైనా కుప్టి బహుళార్థసాధక ప్రాజెక్ట్ నిర్మాణానికి ముందడుగు పడుతుందా.. అంటే బీఆర్ఎస్ వర్గాల నుంచి అవుననే సంకేతాలు వస్తున్నాయి. త్వరలో సీఎం కేసీఆర్ నిర్మల్ జిల్లా పర్యటనకు రానున్నారని, ఈ ప్రాజెక్ట్‌పై శుభవార్త చెబుతారని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ఘంటాపథంగా చెబుతున్నారు. దీంతో ఎనిమిదేళ్లుగా నానుతున్న ఈ ప్రాజెక్ట్ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ఇప్పటికే మూడుసార్లు డిటేల్ ప్రాజెక్ట్ రిపోర్ట్(డీపీఆర్) తయారు చేసిన తర్వాత నిర్మాణ మంజూరు అంశం ఊసే లేకుండా పోయింది. దీని నిర్మాణానికి కాలంతోపాటు అంచనా వ్యయం కూడా అదే రీతిలో పెరుగుతోంది. తాజాగా అంచనా వ్యయం పెరగనున్నట్లు ఎమ్మెల్యే మాటల ద్వారా స్పష్టమవుతోంది.

మొదటినుంచి ఇలా..

2015 జూన్‌లో నేరడిగొండ సమీపంలోని కుప్టి గ్రామం వద్ద బహుళార్థసాధక ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నివేదిక కోరింది. డీపీఆర్ తయారీ కోసం రూ.1.47కోట్లు పరిపాలన ఆమోదం ఇచ్చింది. ఈ పనిని శ్రీరామచంద్ర ఇంజనీరింగ్ సర్వే కన్సల్టెంట్‌లకు అప్పగించారు. ఏజెన్సీ సర్వే పనులు పూర్తి చేసి 2016 ఏప్రిల్‌లో డీపీఆర్ సమర్పించింది. ప్రభుత్వం పరిపాలన పరమైన ఆమోదం అప్పట్లోనే తెలిపింది. దీన్ని కడెం ప్రాజెక్టుకు నిల్వ, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా ఉపయోగించడం కోసం నిర్మించాలని స్పష్టం చేసింది. 2020–21 నుంచి మూడుసార్లు డీపీఆర్ మారుతూ వచ్చింది.

కుప్టి స్వరూపం ఇలా..

నీటి నిల్వ సామర్థ్యం	: 5.30 టీఎంసీలు
నీటిమట్టం	: 394.00 మీటర్లు
జలమార్గం	: 7 రేడియల్ గేట్లు స్పిల్‌వేతో నిర్మాణం

సంవత్సరం	డీపీఆర్ అంచనా వ్యయం(రూ.కోట్లలో)
2020–21	846.737
2021–22	900
2022–23	1100

త్వరలోనే శుభవార్త



బోథ్ నియోజకవర్గ ప్రజలు త్వరలో శుభవార్తను వినబోతున్నారు. సీఎం కేసీఆర్ త్వరలో నిర్మల్‌కు రాబోతున్నారు. అక్కడే ఈ ప్రాజెక్ట్‌పై ప్రస్తావించనున్నారు. దీని అంచనా వ్యయం మరింత పెరగనుంది.

– రాథోడ్ బాపురావు, బోథ్ ఎమ్మెల్యే

ప్రధాన ప్రయోజనాలు..

- మూడు మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తి
- బోథ్ నియోజకవర్గంలో భవిష్యత్‌లో లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల ద్వారా కొత్తనీటి పారుదల సామర్థ్యాన్ని సృష్టించేందుకు అవకాశాలు
- నీటి ప్రవాహం కొనసాగడంతో కుంటాల జలపాతం సహజ సౌందర్యం చాలాకాలం పాటు ఉంటుంది. తద్వారా ప్రభుత్వానికి పర్యాటకుల ద్వారా ఆదాయం లభిస్తుంది.
- కడెం ఆయకట్టు నుంచి గోదావరి నదిలో పునరుత్పత్తి నీటి కారణంగా గూడెం, ధర్మపురి వద్ద గోదావరి నదికి నీరు చేరడం ద్వారా సమీపంలో ఉన్న దేవాలయాలకు ఎక్కువ మంది యాత్రికులు ఆకర్షితులయ్యే అవకాశం ఉంటుంది.

పూర్తిస్థాయిలో కడెం ఆయకట్టు స్థిరీకరించేందుకు..

బచావత్ అవార్డు ప్రకారం కడెం రిజర్వాయర్‌కు 68,150 ఎకరాల ఆయకట్టుకు 13.42 టీఎంసీల నీటిని వినియోగించుకోవచ్చని ఉంది. ఈ ప్రాజెక్టు జూలై నుంచి సెప్టెంబర్‌లో మాత్రమే నీటిని స్వీకరిస్తుంది. అది కూడా 7.20 టీఎంసీలకు మాత్రమే పరిమితమైంది. ఆయకట్టుకు నీటి డిమాండ్ ప్రధానంగా అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు ఉంటుంది. ప్రతీ పంట కాలం ముగిసే సమయానికి నీటి కొరత ఏర్పడుతుంది. ఇది రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య. 42,883 ఎకరాలకు మాత్రమే కడెం ప్రాజెక్ట్ నుంచి ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. మిగతా 25,267 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించేందుకు ఈ ప్రాజెక్ట్ ఎగువన ఉన్నటువంటి పరీవాహక ప్రాంతమైనటువంటి కుప్టి వద్ద బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ప్రతిపాదించారు. కడెం ఆయకట్టుకు అనుబంధంగా ఈ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఉంటుంది.

చరిత్ర ఇదీ..

కడెం ప్రాజెక్టును 1958 సంవత్సరంలో నిర్మించారు. 7.20 టీఎంసీల నీటి సామర్థ్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్టుకు 18 గేట్లు ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లాలోని నేరడిగొండ, ఇచ్చోడ మండలాల మధ్యలో ఉన్న కుప్టి గ్రామం నుంచి నీటి పరీవాహకం ఉంది. ఈ నీరే కడెం ప్రాజెక్టుకు చేరుతుంది. బచావత్ అవార్డు ప్రకారం 13.42 టీఎంసీల నీటిని వినియోగించుకునేందుకు అవకాశం ఉన్నప్పటికీ కడెం వద్ద అటవీ సంపదను దృష్టిలో పెట్టుకొని ప్రాజెక్ట్ సామర్థ్యాన్ని పెంచే అవకాశాలు లేవు. దీంతోనే ప్రభుత్వం ఎగువ ప్రాంతంలో ఉన్నటువంటి కుప్టి వద్ద ప్రాజెక్ట్ నిర్మాణానికి బీజం వేసింది. దాంట్లో భాగంగానే కుప్టి బహుళార్థసాధక ప్రాజెక్టును నిర్మించాలని తలపెట్టారు. ఆయకట్టు స్థిరీకరణ, విద్యుత్ ఉత్పత్తి, తాగునీటి సదుపాయం అందించడం వంటి ప్రయోజనాలతో దీన్ని చేపట్టాలని యోచిస్తున్నారు. కుప్టి ప్రాజెక్టుపై ఇదివరకే అంచనాలు పంపించామని, ప్రభుత్వం నుంచి ఆమోదం లభిస్తే పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని ఆదిలాబాద్ జల వనరుల శాఖ డివిజన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విఠల్ తెలిపారు.

17 నుంచి విద్యుత్ ఉద్యోగుల సమ్మె

- తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ సాయిబాబు
- కరీంనగర్‌లో ఉమ్మడి జిల్లా సన్నాహక సమావేశం



సమ్మె పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేఏసీ నాయకులు

కొత్తపల్లి(కరీంనగర్): విద్యుత్ ఉద్యోగులు, ఇంజినీర్లు, కార్మికులందరూ సమ్మెకు సిద్ధమవ్వాలని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ సాయిబాబు పిలుపునిచ్చారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపని ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ సమ్మెకు వెళ్తున్నట్లు తెలిపారు. దీనివల్ల జరిగే పరిణామాలను వినియోగదారులకు వివరించి, వారచు మనపక్షాన నిలిచేలా క్షేత్రస్థాయిలో ప్రచారం చేయాలని సూచించారు. కరీంనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉద్యోగులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 17 నుంచి సమ్మెకు వెళ్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులపై ప్రభుత్వం ఎస్మా ప్రయోగించినా తగ్గేది లేదన్నారు. వేతన సవరణ 2022, ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్, ఆర్టిజన్ కార్మికుల క్రమబద్ధీకరణ, అన్‌మ్యాన్డ్ కార్మికులకు ఆర్టిజన్‌లుగా గుర్తింపు తదితర సమస్యలు పరిష్కరించాలని యాజమాన్యాన్ని ఏడాదిగా కోరుతున్నా స్పందన లేదని ఆరోపించారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో అన్ని శాఖల ఉద్యోగులు ఇంటికి పరిమితమైతే.. విద్యుత్ ఉద్యోగులు మాత్రం ప్రాణాలు లెక్కచేయకుండా విధులు నిర్వర్తించారని, అనేక మంది కరోనాకు బలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ జోక్యం చేసుకొని, సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదన్నారు. టీఎస్‌పీఈజేఏసీ రాష్ట్ర కన్వీనర్ పి.రత్నాకర్‌రావు, కో–కన్వీనర్లు బీసీ రెడ్డి, శ్రీధర్, వైస్ చైర్మన్లు అనిల్‌కుమార్, వజీర్ తదితరులు మాట్లాడారు. సమావేశంలో నాయకులు వెంకన్నగౌడ్, గోవర్ధన్, ఈశ్వర్‌రావు, అంజయ్య, కంపెనీ జేఏసీ నాయకులు బి.సామ్యానాయక్, శేషగిరిరావు, సుబ్రహ్మణ్యం, మహేందర్ రెడ్డి, ఆనందం, సదానందం, కళాధర్‌రెడ్డి, ఆంజనేయులు, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి సర్కిల్ ఎస్ఈలు వి.గంగాధర్, సత్యనారాయణ, సుదర్శనం, ఉమ్మడి జిల్లా నాయకులు, ఉద్యోగులు, ఇంజినీర్లు, కార్మికులు పాల్గొన్నారు.

‘తాళాలు మాయం’పై బాధ్యులెవరు?

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
- హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసిన నేత

ధర్మపురి: జిల్లాలోని మల్యాల మండలం నూకపల్లి వీఆర్‌కె కళాశాలలో 2018లో జరిగిన ధర్మపురి అసెంబ్లీ ఎన్నికల ఈవీఎంలను భద్రపర్చిన స్ట్రాంగ్ రూం తాళాలు మాయమవడంపై ఎవరు బాధ్యత వహిస్తారని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రశ్నించారు. తాళాలు మాయం కావడానికి బాధ్యులైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. స్ట్రాంగ్‌రూం తాళాలు మాయం కావడంపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని హైకోర్టులో ఆయన మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, కలెక్టర్ సమక్షంలో సోమవారం స్ట్రాంగ్‌రూమ్ తెరిపించేందుకు యత్నించగా, అవి తెరుచుకోలేదని, అధికారుల నిర్లక్ష్యానికి ఇది నిదర్శనమన్నారు. క్యాబినెట్ మంత్రికి సంబంధించిన ఎన్నికల పిటిషన్ కోర్టులో పెండింగ్‌లో ఉండగా, స్ట్రాంగ్‌రూం తాళాలు మాయమవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. దీనికి మంత్రి కొప్పుల ఈశ్వర్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. చట్టంపై ఏమాత్రం గౌరవం ఉన్నా మంత్రి హోదాలో దీనిపైన విచారణకు ఆదేశించాలని కోరారు. విచారణ పూర్తయ్యే వరకూ పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. కోర్టుపై పూర్తినమ్మకం ఉందని, చివరకు న్యాయమే గెలుస్తుందని అడ్లూరి ఆశాభావం వ్యక్తంచేశారు.



మాట్లాడుతున్న లక్ష్మణ్‌కుమార్

కడసారి చూపు కల్పించండి సారూ..

- మస్కట్‌లో రోడ్డు ప్రమాదంలో రుద్రంగి వాసి మృతి
- 29 రోజులకు తెలిసిన మరణవార్త
- మృతదేహాన్ని తెచ్చేందుకు రూ.2 లక్షల ఖర్చు
- ప్రభుత్వ పెద్దలు స్పందించాలని వేడుకోలు



కుర్మ మల్లేశం(ఫైల్)



రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

రుద్రంగి(వేములవాడ): ఉన్న ఊరిలో ఉపాధి కరువై గల్ఫ్‌బాట పట్టిన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో కడసారి చూపు కల్పించాలంటూ కుటుంబ సభ్యులు రోధించిన తీరు కాలనీవాసులను కంటతడి పెట్టించింది. వివరాల్లోకి వెళితే.. రుద్రంగికి చెందిన కుర్మ మల్లేశం(41) గత నాలుగేళ్ల క్రితం బతుకుదెరువు కోసం మస్కట్ వెళ్లాడు. అక్కడ కంపెనీలో మూడేళ్లు పనిచేసి జీతం తక్కువగా ఉండడంతో ఏడాది క్రితం కంపెనీ నుంచి బయటకు వచ్చి పనిచేసుకుంటున్నాడు. మార్చి 15న పనికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మల్లేశం అక్కడికక్కడే మృతిచెందాడు. అక్కడ తెలిసిన వారు ఎవరూ లేకపోవడంతో మరణ వార్త కుటుంబ సభ్యులకు తెలియడానికి 29 రోజులు పట్టింది. ఇప్పటికైన మృతదేహాన్ని త్వరగా ఇంటికి పంపిస్తే చివరిచూపు చూసుకుంటామని కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. మృతదేహాన్ని ఇండియాకు తెచ్చేందుకు రూ.2లక్షల వరకు ఖర్చు అవుతుందంటున్నారని రోదిస్తూ చెప్పారు. అసలే నిరుపేద కుటుంబం కావడంతో అంత ఖర్చు పెట్టుకునే స్తోమత తమకు లేదని ప్రభుత్వమే స్పందించాలని కోరుతున్నారు. మృతుడు మల్లేశంకు తల్లి లచ్చవ్వ, భార్య లత, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

క్లుప్తంగా...

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను తొలగించాలి: ప్రవీణ్



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ సంఘటన నిరుద్యోగుల ఆశలను చిదిమేసిందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్‌లోని పాలమూరు యూనివర్సిటీలో విద్యార్థులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీకి బాధ్యులైన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.

ఒకే రోజు మూడు పరీక్షలెట్ల రాస్తరు?

సాక్షి, హైదరాబాద్: ఒకే క్వాలిఫికేషన్‌తో ఉన్న మూడు ఉద్యోగాల పరీక్షలను ఏప్రిల్ 30వ తేదీనే నిర్వహించడంపై బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్ ట్విట్టర్‌లో మండిపడ్డారు. పోలీస్ కానిస్టేబుల్, కమ్యూనికేషన్ కానిస్టేబుల్, జూనియర్ లైన్‌మెన్ ఉద్యోగాల కోసం ఒకేరోజు రాత పరీక్ష పెట్టడం సమంజసం కాదన్నారు.

లీకేజీ కుంభకోణాన్ని సిట్ నీరుగార్చే యత్నం



సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల కుంభకోణాన్ని సిట్ నీరుగార్చే ప్రయత్నం చేస్తోందని వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల ఆరోపించారు. గతంలో డ్రగ్స్, ఎమ్మెల్యేల కొనుగోలు కేసుల తరహాలోనే దీనిని కూడా చేసేందుకు కుట్ర జరుగుతోందన్నారు. ఈ లీక్ వ్యవహారం కారణంగా రాష్ట్రంలోని 10 లక్షల మంది నిరుద్యోగులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క పేపర్ లీక్ అయితేనే గుట్టు రట్టయ్యే అవకాశమున్న నేపథ్యంలో టీఎస్‌పీఎస్సీ నుంచి ఏకంగా 15 పేపర్లు లీక్ అయ్యే వరకు అసలు విషయం బయటకు రాలేదంటే ఇందులో ప్రభుత్వ పెద్దల ప్రమేయం లేదంటారా అని బుధవారం ట్విట్టర్ వేదికగా నిలదీశారు. నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరుతూ ఈ నెల 17న ఇందిరాపార్క్ వద్ద చేపట్టే నిరాహార దీక్షకు భారీ ఎత్తున విద్యార్థులు పాల్గొని విజయవంతంచేయాలని విజ్ఞప్తి చేశారు.

మాల్ ప్రాక్టీస్ కేసులో మరో ముగ్గురు అరెస్టు

కమలాపూర్, కరీంనగర్ క్రైం: పదో తరగతి హిందీ ప్రశ్నపత్రం లీకేజీ, కాపీకుట్ర కేసులో నిందితులైన కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన పోగు సుభాష్ (41), నేరెళ్లకు చెందిన దూలం శ్రీకాంత్ (20), వంగపల్లికి చెందిన పెరుమాండ్ల శ్రామిక్ అలియాస్ నాని (20)లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు కమలాపూర్ సీఐ సంజీవ్ తెలిపారు. కాగా, ఈ కేసులోనే గతంలో అరెస్టయిన నిందితులు ప్రశాంత్, మహేశ్, గణేశ్ బుధవారం కరీంనగర్ జైలు నుంచి విడుదలయ్యారు.

రైలు కింద పడి తెగిన బాలుడి కాలు



డిచ్‌పల్లి/నిజామాబాద్ సిటీ: రైలు చక్రాల కిందపడి ఓ బాలుడు కాలును పోగొట్టుకున్న ఘటన నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి రైల్వే స్టేషన్‌లో జరిగింది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మారం(బి) గ్రామానికి చెందిన సాజిర, తన కుమారుడు అద్నాన్ (3).అత్త షాహిదతో కలిసి బుధవారం హైదరాబాద్ వెళ్లడానికి డిచ్‌పల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. అదే సమయంలో కాచిగూడ- పెద్దపల్లి (కరీంనగర్) డెము రైలు ప్లాట్‌ఫాంపై ఆగి ఉంది. అద్నాన్‌ను తీసుకుని నానమ్మ షాహిద రైలులోకి ఎక్కింది. ఇంతలోనే రైలు హైదరాబాద్‌కు వెళ్లదని తెలియడంతో అద్నాన్‌ను తీసుకుని షాహిద కిందకు దిగుతుండగానే రైలు కదిలింది. ఈ హడావుడిలో పట్టుతప్పిన అద్నాన్ ప్లాట్‌ఫామ్‌కు రైలుకు మధ్యలో పడిపోయాడు. రైలు చక్రాల కింద పడి అతడి ఎడమకాలు తెగిపోయింది. బాలుడు రైలుకిందపడిన విషయం గమనించిన కొందరు వెంటనే స్టేషన్ మాస్టర్‌ను అప్రమత్తం చేయడంతో లోకోపైలట్‌కు సమాచారం ఇచ్చి రైలును నిలిపివేయించారు.

జలాశయాల ఏరియల్ వ్యూ

హెలికాప్టర్ నుంచి పరిశీలించిన స్పీకర్, మంత్రులు



మధ్యమానేరు జలాశయం

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని జలాశయాలను అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు కె.తారకరామారావు, నిరంజన్‌రెడ్డి, ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ బుధవారం హెలికాప్టర్ ద్వారా పరిశీలించారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి తెలంగాణలోని పలు జలాశయాలను పరిశీలించినట్లు వారు తెలిపారు. తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల వ్యవసాయ డిగ్రీ కాలేజీ ప్రారంభోత్సవానికి ముందే అన్నపూర్ణ (అనంతగిరి), శ్రీరాజరాజేశ్వర (మధ్యమానేరు) జలాశయాలను పరిశీలించారు. హెలికాప్టర్ నుంచే కేటీఆర్, స్పీకర్ సెల్‌ఫోన్‌లో ఆ దృశ్యాలను చిత్రీకరించడం విశేషం.



హెలికాప్టర్ నుంచి జలాశయాన్ని, సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో స్పీకర్ పోచారం, వినోద్

కళ్లుండీ చూడలేని కబోదులు

▶ మొదటి పేజీ తరువాయి

మద్దికుంటలో జరిగిన బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు.

మోదీ చేసిన ఒక్క మంచి పని చెప్పండి

దండగ అన్న వ్యవసాయాన్ని పండుగలా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దని కేటీఆర్ పేర్కొన్నారు. తాము సీఎం కేసీఆర్ చేసిన వంద మంచి పనులు వంద చెపుతామని, ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ఒక్క మంచి పని చెప్పాలని అన్నారు. మోదీ హయాంలో అప్పులు, ధరలు ఆకాశానికి చేరితే.. సామాన్యులు పాతాళానికి చేరారని విమర్శించారు. తాము దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. 60 లక్షల మంది కార్యకర్తల బలంతో మూడోసారి సీఎంగా కేసీఆర్ హ్యాట్రిక్ సాధిస్తారని చెప్పారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఓ పిచ్చోడని, మతాల మధ్య చిచ్చులు పెట్టడం తప్ప, ఎంపీగా ఆయన చేసి ఒక్క మంచి పని ఏంటో చెప్పాలని సవాల్ విసిరారు.

వ్యవసాయ కాలేజీకి జగ్జీవన్‌రామ్ పేరు

జిల్లెల్ల కళాశాల విద్యార్థులు దేశానికే దిశానిర్దేశం చేసే వ్యవసాయ శాస్త్రవేత్తలుగా తయారు కావాలని కేటీఆర్ ఆకాంక్షించారు. జిల్లెల్ల వ్యవసాయ కాలేజీకి డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ కాలేజీగా నామకరణం చేస్తామని, ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. జిల్లెల్లకు పీజీ కాలేజీ, శాటిలైట్ క్యాంపస్, అగ్రిహబ్‌ను మంజూరు చేయాలని వ్యవసాయశాఖ మంత్రిని కోరారు.



జిల్లెల్లలో కోల్డ్ స్టోరేజ్ వివరాలు తెలుసుకుంటున్న పోచారం, కేటీఆర్, నిరంజన్ రెడ్డి, వినోద్

కాంగ్రెస్, బీజేపీలకు డిపాజిట్లు రావు: స్పీకర్

ఏ రాష్ట్రంలో లేని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మన రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇక్కడి పథకాలను చూసి మహారాష్ట్రలోని రైతులు మమ్మల్ని తెలంగాణలో విలీనం చేయాలని కోరుతున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు డిపాజిట్లు కూడా రావన్నారు.

ఎటూ చూసినా పచ్చటి పొలాలు: నిరంజన్‌రెడ్డి

రాష్ట్రంలో ఎక్కడ చూసినా పచ్చటి పొలాలు కనిపిస్తున్నాయని, రాష్ట్రంలో చేను ఖాళీ లేదు.. రైతుల చెయ్యి ఖాళీ లేదని మంత్రి నిరంజన్‌రెడ్డి చెప్పారు. సమైక్య రాష్ట్రంలో ఛిద్రమైన జీవితాలకు సిరిసిల్ల కేంద్రంగా ఉండేదని, కానీ డైనమిక్ మంత్రి కేటీఆర్ సిరిసిల్ల రూపురేఖలు మార్చారన్నారు.

‘విజయ’ పాలకు ఎసరు

అంగన్‌వాడీ కేంద్రాలకు ఇతర రాష్ట్రాల పాలు

- విజయ డెయిరీకి టెండర్ దక్కకుండా కుట్ర
- టెండర్ నిబంధనల్లో మార్పులు చేర్పులు
- ఇతర రాష్ట్రాల డెయిరీ సంస్థలకు దక్కేలా 'మార్పులు'
- ఐసీడీఎస్ అధికారుల నిర్వాకంపై విమర్శలు



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఆధ్వర్యంలోని విజయ డెయిరీ పాల విక్రయాలపై కుట్ర జరుగుతోందా..?. అంగన్‌వాడీ కేంద్రాలకు విజయ పాలు సరఫరా కాకుండా అధికారులే అడ్డుపడుతున్నారా.. ? జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే అవుననే అనాల్సి వస్తోంది. విజయ డెయిరీకి టెండర్ దక్కకుండా అధికారులే నిబంధనలు రూపొందించారన్న ఆరోపణలు వస్తున్నాయి. అంగన్ వాడీ కేంద్రాలకు పాల సరఫరా కోసం ఇటీవల ఐసీడీఎస్ ఆధ్వర్యంలో టెండర్లు ఆహ్వానించారు. కేవలం కర్ణాటక, గుజరాత్‌లకు చెందిన డెయిరీలకే టెండర్ దక్కేలా నిబంధనలు రూపొందించారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవానికి నోడల్ ఏజెన్సీగా ఉన్న హాకా ఆయా టెండర్లు పిలవాల్సి ఉండగా, దాన్ని పక్కన పెట్టి ఐసీడీఎస్ ద్వారా టెండర్లు పిలవడంపై కూడా వివాదం రేగుతోంది.

ఏడాదికి 3 కోట్ల లీటర్ల విజయ పాలకు ఎసరు

రాష్ట్రవ్యాప్తంగా 35,700 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వాటిల్లో 4.57 లక్షల మంది గర్భిణీలు, బాలింతలు ఉన్నారు. 10.34 లక్షల మంది ఏడాది నుంచి నుంచి 3 ఏళ్లలోపు పిల్లలు, 6.67 లక్షలు 3 ఏళ్ల నుంచి ఆరేళ్లలోపు పిల్లలు లబ్ధిపొందుతున్నారు. వీరికి ప్రభుత్వం తరపున పాలు అందజేస్తారు. ఒక్కో తల్లికి 200 మిల్లీలీటర్ల పాలు అందజేస్తారు. అందుకోసం ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు పాలు సరఫరా చేస్తుంది. ఏడాదికి అంగన్‌వాడీ కేంద్రాలకు దాదాపు 3 కోట్ల లీటర్ల టెట్రాప్యాక్ పాలు సరఫరా చేస్తున్నారు. ఈ పాలను రాష్ట్రంలోని విజయ డెయిరీ వంటి సహకార డెయిరీల నుంచి సరఫరా చేయాలని నిర్ణయించారు. వాటికే ప్రాధాన్యం ఇవ్వాలని గతంలో ప్రభుత్వ జీవోలో స్పష్టం చేశారు. అయితే ఇప్పుడు నిబంధనలు మార్చడంతో విజయ డెయిరీకి భారీగా నష్టం వాటిల్లనుంది. దాదాపు రూ.120 కోట్ల విలువైన వ్యాపారానికి గండిపడుతుందనే చెప్పాలి.

సామర్థ్యానికి మించి నిబంధనలు...

20 రోజుల క్రితం హాకా ఆధ్వర్యంలో టెండర్లు పిలిచారు. అప్పుడు సింగిల్ టెండరే వచ్చింది. దీంతో మళ్లీ టెండర్లు వేయాలనుకున్నారు. కానీ ఈసారి హాకాను పక్కనపెట్టి ఐసీడీఎస్ వర్గాలు టెండర్లకు వెళ్లాయి. విజయ డెయిరీ టెట్రాప్యాక్ పాల సామర్థ్యం రోజుకు 50 వేల లీటర్లు కాగా, టెండర్‌లో 3 లక్షల లీటర్ల సామర్థ్యం ఉండాలని పొందుపరిచారు. అలాగే గత మూడేళ్లలో ఏదో ఒక ఏడాది 1.5 కోట్ల లీటర్ల టెట్రాప్యాక్‌లు సరఫరా చేసిన సామర్థ్యం ఉండాలన్న నిబంధనను కూడా విధించారు. ఈ సామర్థ్యం కూడా విజయ డెయిరీకి లేదు. గతంలో ఇలాంటి నిబంధనలను విధించలేదు. కేవలం కర్ణాటక, గుజరాత్‌కు చెందిన డెయిరీలకే అనుకూలంగా నిబంధనలు ఉన్నాయని చెబుతున్నారు. ఈ నెల 20వ తేదీన టెండర్ దాఖలుకు చివరి తేదీ కాగా, నిబంధనలు ఎలా ఉన్నా టెండర్లు వేస్తామని విజయ డెయిరీ వర్గాలు వెల్లడించాయి.

ఖాకీ అంటే మోజు.. సెల్యూట్ అంటే క్రేజు!

- డీఎస్పీ లేదా జైల్ సూపరింటెండెంట్ కావాలన్న లక్ష్యం
- డబుల్ బబ్లింగ్ చేయడంతో చేజారిపోయిన అవకాశం
- అప్పటి నుంచి ప్రశ్నపత్రాల విక్రయంపైనే ప్రవీణ్ దృష్టి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ప్రశ్నపత్రాల లీకేజ్ స్కామ్‌లో సూత్రధారిగా ఉన్న కమిషన్ కార్యదర్శి మాజీ వ్యక్తిగత సహాయకుడు పులిదిండి ప్రవీణ్ కుమార్‌కు పోలీసు డిపార్ట్‌మెంట్ అంటే ఎంతో మోజు.. యూనిఫామ్‌లో వస్తున్న వారిని చూసి ఎదుటి వాళ్లు చేసే సెల్యూట్ అంటే మహా క్రేజ్. అయితే 'ఖాకీ'ఉద్యోగం సంపాదించడానికి కష్టపడకుండా ఇతగాడు అడ్డదారులు తొక్కాడు.



తండ్రి ఖాకీ ఉద్యోగం రాకపోవడంతో..

ప్రవీణ్ తండ్రి ఏపీ రాజమండ్రికి చెందిన పి.హరిశ్చంద్రారావు డీజీపీ కార్యాలయం ప్రెస్‌కు అదనపు ఎస్పీగా పని చేస్తూ అనారోగ్యంతో మరణించారు. కారుణ్య నియామకం కింద తనకు ఆ ఉద్యోగమే వస్తుందని భావించాడు. నిబంధనలు, అతడి అర్హత పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇచ్చింది. అయితే ఎలాగైనా డీఎస్పీ లేదా జైళ్ల శాఖలో సూపరింటెండెంట్ అయి యూనిఫామ్ వేసుకోవాలని భావించిన ప్రవీణ్ కుమార్ గ్రూప్–1 పరీక్షకు దరఖాస్తు చేసుకున్నాడు. రాజశేఖర్‌రెడ్డి సహాయంతో కస్టోడియన్ శంకర లక్ష్మి కంప్యూటర్‌ను యాక్సస్ చేసి గ్రూప్–1 పేపర్ తస్కరించాడు. అయితే ప్రవీణ్ కుమార్ తన ఓఎంఆర్ షీట్‌ను డబుల్ బబ్లింగ్ చేయడంతో తిరస్కరించిన కమిషన్ వాల్యూయేషన్ చేయలేదు.

కనీసం సొమ్మైనా చేసుకుందామని...

డబుల్ బబ్లింగ్‌తో 'ఖాకీ పోస్టుకు'అవకాశం కోల్పోయిన ప్రవీణ్‌కు పేపర్లు అమ్మి సొమ్ము చేసుకోవాలని దుర్బుద్ధి పుట్టింది. ఈ నేపథ్యంలోనే మరో ఐదు పరీక్షలకు సంబంధించిన 14 పరీక్ష పత్రాలను రాజశేఖర్ సాయంతో చేజిక్కించుకున్నాడు. వీటిలో ఏఈ ప్రశ్నపత్రంలో పాటు డీఏఓ పేపర్‌ను ఐదుగురికి రూ.50 లక్షలుకు విక్రయించి రూ.29.45 లక్షలు అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. మిగిలిన పేపర్లు విక్రయించే ప్రయత్నాల్లో ఉండగానే విషయం వెలుగులోకి రావడంతో కటకటాల్లోకి చేరాడు. తన మాదిరిగానే డబుల్ బబ్లింగ్ చేసిన వాళ్లు దాదాపు 8వేలమంది ఉన్నట్టు ప్రవీణ్ గుర్తించాడు. వీరిలో కొందరిని సంప్రదించి సహాయం చేస్తానని నమ్మబలికి వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి టచ్‌లో ఉన్నాడు. సిట్ దర్యాప్తులో ఇవన్నీ వెలుగులోకి వచ్చాయి.

రూపాయికే కార్పొరేట్ వైద్యం

స్పెషలిస్టు డాక్టరయితే చాలు కార్పొరేట్ ఆస్పత్రులు, రూ.వేలల్లో ఫీజులు. ఇటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తూనే అటు ప్రైవేటు సంపాదన. కానీ కొందరుంటారు మనుషులను, వారి బాధలను అర్థం చేసుకున్న వైద్యులు. వారిలో ముందుంటారు ఈ రూపాయి డాక్టర్ జి.హర్షవర్ధన్. ప్రభుత్వ ఆస్పత్రిలో ఆర్థోసర్జన్‌గా పనిచేస్తూనే.. సాయంత్రం తన క్లినిక్‌లో కేవలం రూపాయి ఫీజుతో కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందిస్తూ అందరి మన్ననలు అందుకుంటున్నారు.

- ఇల్లెందు

- ఇల్లెందులో సేవలందిస్తున్న ఆర్థోసర్జన్ హర్షవర్ధన్
- ప్రభుత్వాస్పత్రిలో ఉద్యోగం.. సాయంత్రం క్లినిక్‌లో రూపాయికే వైద్యం
- అవసరమైనవారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా సర్జరీలు



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ హర్షవర్ధన్

ప్రజలకు ఏమీ చేయలేకపోతున్నాననే భావనతో..

ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరుకు చెందిన హర్షవర్ధన్ ఎంబీబీఎస్, ఎంఎస్ ఆర్థోపెడిక్ ఖమ్మంలో పూర్తి చేశారు. కొంతకాలం ఖమ్మంలో పనిచేసిన ఆయన తరువాత ఇల్లెందులో సొంత క్లినిక్ పెట్టారు. ఈలోగా ఇల్లెందు వైద్యశాలను వైద్య విధాన పరిషత్‌లోకి మార్చుతూ అప్‌గ్రేడ్ చేశారు. హర్షవర్ధన్‌కు ఆ ఆస్పత్రిలో సర్జన్‌గా ఉద్యోగం వచ్చింది. ఆయన సతీమణి తేజస్వి కూడా ఆ ఆస్పత్రిలో ఈఎన్‌టీ విభాగంలో డాక్టర్‌గా ఎంపికయ్యారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఉద్యోగం... ఖాళీ సమయంలో ప్రైవేట్ ఆస్పత్రి. సంపాదన బాగానే ఉన్నా ప్రజలకు ఏం చేయలేకపోతున్నామనే అంతర్మథనం మొదలైంది.

పుచ్చలపల్లి సోదరుడే స్ఫూర్తి..

నెల్లూరులో పుచ్చలపల్లి సుందరయ్య సోదరుడు డాక్టర్ పి.రామచంద్రారెడ్డి పీపుల్స్ పాలీ క్లినిక్ పేరిట రూ.10 ఫీజుతో వైద్యం అందించేవారు. నెల్లూరుకే చెందిన హర్షవర్ధన్... రామచంద్రారెడ్డి స్ఫూర్తితో ఏదైనా చేయాలనుకున్నారు. ఇల్లెందు అంబజార్‌లో పెట్టిన సొంత క్లినిక్‌లో రూపాయి ఫీజుకే వైద్యం అందించడం ప్రారంభించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు పూర్తయ్యాక, సాయంత్రం క్లినిక్‌లో సేవలందిస్తున్నారు. ఆపరేషన్లు తప్పనిసరి అనుకున్నవారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఖమ్మంలో శస్త్రచికిత్స కూడా చేస్తున్నారు. గత జనవరి నుంచి ఇప్పటివరకు 35 మందికి ఆపరేషన్లు చేశారు. ఇందులో మోకాలు, తుంటి, కీళ్ల మార్పిడి వంటి ఆపరేషన్లు.. మోకాళ్లు, అరికాళ్ల నొప్పులు, నడుము, మెడనొప్పి, కాళ్ల తిమ్మిర్లు వంటి అనేక సమస్యలకు అత్యాధునిక పద్ధతిలో వైద్యమందించారు.



మోకాలు చిప్ప మార్పిడి చేశారు..

నడవడం ఇబ్బందిగా ఉండడంతో ఓ డాక్టర్ వద్ద పరీక్ష చేయించుకున్నా. మోకాలు చిప్ప అరిగిపోయిందని, మార్చాలంటే సుమారు రూ.2 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పారు. దీంతో ఇల్లెందులో ప్రజా వైద్యం అందిస్తున్న హర్షవర్ధన్‌ను సంప్రదించాను. ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా మోకాలి మార్పిడి ఆపరేషన్ చేశారు. ఇప్పుడు హాయిగా నడవగలుగుతున్నా.

– వి.బాయమ్మ, మామిడిగూడెం, ఇల్లెందు మండలం

పేదలను ఆదుకోవాలని..
డాక్టర్ జి.హర్షవర్ధన్, ఆర్థోపెడిక్ సర్జన్

ప్రస్తుత వైద్యం అత్యంత ఖరీదైంది. సామాన్యులను అందకుండాపోతోంది. అందుకే వారిని ఆదుకునేందుకు రూపాయి ఫీజుతో వైద్యం చేస్తున్నా. ప్రభుత్వ వైద్యులుగా నాకు, నా భార్యకు వచ్చే వేతనం మా కుటుంబానికి సరిపోతుంది. అందుకే క్లినిక్‌లో నామమాత్ర ఫీజుతో వైద్యం చేస్తున్నా.

ఏపీ రికార్డులు దాస్తోంది

- తెలంగాణ సర్కారు ఆరోపణ
- రికార్డులన్నీ తెలంగాణ, సీడబ్ల్యూసీ వద్ద ఉన్నాయి: ఏపీ

సాక్షి, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రభావంతో ముంపునకు గురయ్యే ప్రాంతాల విషయంలో ఏపీ ప్రభుత్వం వాస్తవాలు దాస్తోందని, అందువల్లే రికార్డులు ఇవ్వడం లేదని తెలంగాణ సర్కారు ఆరోపించింది. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆదేశించినా రికార్డులు ఇవ్వడంలో ఏపీ, పోలవరం ప్రాజెక్టు ఆథారిటీ (పీపీఏ)లు తీవ్ర జాప్యం చేయడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. పోలవరం ముంపు అంశంపై పీపీఏ సభ్య కార్యదర్శి ఎం.రఘురాం ఏపీ, తెలంగాణ రాష్ట్రాల అధికారులతో బుధవారం వర్చువల్‌గా నిర్వహించిన సమావేశంలో వాడివేడి చర్చ జరిగింది. ఏపీ, పీపీఏ సహకరించకపోవడంతో జాయింట్ సర్వేలో తీవ్ర ఆలస్యం జరుగుతోందని తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్సీ బి.నాగేంద్రరావు చెప్పారు. ఏపీ అధికారులు రికార్డులు అందజేసిన తర్వాత.. రెండు రాష్ట్రాల అధికారులతో ప్రత్యక్ష సమావేశం నిర్వహించాలని ఆయన కోరగా, పీపీఏ సభ్య కార్యదర్శి ఆమోదించారు. రికార్డులన్నీ సీడబ్ల్యూసీ వద్ద ఉన్నాయని, వాస్తవాలను దాచాల్సిన అవసరం తమకు లేదని పోలవరం సీఈ సుధాకర్‌బాబు తేల్చిచెప్పారు. అయినా రాష్ట్ర విభజన నేపథ్యంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న రికార్డులను సమీకరించి ఈనెల 14లోగా పీపీఏకి అందజేస్తామని చెప్పారు.

తెలంగాణ సంగతి చూసుకో హరీశ్

హరీశ్‌రావు వ్యాఖ్యలపై మంత్రి బొత్స కౌంటర్

- ఏపీకి వస్తే చూపిస్తాం: మంత్రి కారుమూరి
- సంక్షేమ పథకాలు హరీశ్‌కు కనబడటం లేదా: ఎమ్మెల్సీ అప్పిరెడ్డి



బొత్స



కారుమూరి



అప్పిరెడ్డి

సాక్షి, అమరావతి: తెలంగాణ ఆర్థిక శాఖ మంత్రి టి.హరీశ్‌రావు వ్యాఖ్యలపై ఏపీ విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ విషయాలపై మాట్లాడటానికి హరీశ్‌రావు ఎవరని, ముందు తెలంగాణ సంగతి చూసుకుంటే ఆయనకు మంచిదని హితవు పలికారు. బుధవారం ఏపీ సచివాలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని ఎలా పాలిస్తున్నామో ఏపీ ప్రజలకు తెలుసన్నారు. రాజకీయం కోసమే హరీశ్‌రావు అలా మాట్లాడి ఉంటారని అభిప్రాయపడ్డారు.

సవాల్ విసిరిన కారుమూరి

ఏపీకి వస్తే రాష్ట్రంలో ఏం జరుగుతోందో చూపిస్తామని మంత్రి హరీశ్‌రావుకు ఏపీ పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరావు సవాల్ విసిరారు. అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడుతూ.. 'ధనిక రాష్ట్రమైన తెలంగాణను మీ చేతిలో పెడితే ఏం చేశారో తెలియదా'అని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో వర్షమొస్తే ఇళ్ల మీద నుంచి నీళ్లు వెళ్తున్నాయని, చిన్నపాటి వర్షం వచ్చినా హైదరాబాద్ కొలాప్స్ అవుతోందని, హైదరాబాద్‌ను ఘోరంగా చేశారని ఎద్దేవా చేశారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో తెలంగాణ కన్నా చాలా మేలైన పరిస్థితులు ఏపీలో ఉన్నాయన్నారు.

తెలంగాణను దోచుకుంటున్నారు

ఏపీలో అమలవుతున్న నవరత్నాలు సంక్షేమ పథకాలు తెలంగాణ మంత్రి హరీశ్‌రావుకు కనబడటం లేదా అని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మండిపడ్డారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మాట్లాడుతూ.. హరీశ్‌రావు మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉన్నాయన్నారు. తెలంగాణలో ప్రతిపక్షాలను ఎదుర్కోలేక ఏపీ గురించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అల్లుడు, కూతురు, కుటుంబమంతా కలిసి తెలంగాణను దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు.

గంపగుత్తగానే ‘బచావత్’ కేటాయింపులు

- ప్రాజెక్టుల వారీగా జరపలేదు
- బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణ వాదనలు
- పాలమూరు–రంగారెడ్డికి నీటి కేటాయింపుల్లేవన్న ఏపీ

సాక్షి, హైదరాబాద్: బచావత్ ట్రిబ్యునల్ ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులు చేయలేదని, గంపగుత్తగా కేటాయించినట్టు ఆల్మట్టి డ్యామ్ కేసులో సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చిందని తెలంగాణ రాష్ట్రం పేర్కొంది. కృష్ణా జలాలను పునఃపంపిణీ చేయాలని డిమాండ్ చేసింది. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలకు 90 టీఎంసీలను కేటాయిస్తూ తెలంగాణ జారీ చేసిన జీవోను రద్దు చేయాలని ఏపీ దాఖలు చేసిన ఇంటర్ లొకేటరీ అప్లికేషన్ (ఐఏ)పై జస్టిస్ బ్రిజేష్‌కుమార్ అధ్యక్షతన జస్టిస్ రామ్‌మోహన్‌రెడ్డి, జస్టిస్ ఎస్.తాళపత్రలు సభ్యులుగా ఏర్పాటైన ట్రిబ్యునల్ బుధవారం విచారణ చేపట్టింది. ఏపీ ప్రభుత్వం తరపున సీనియర్ కౌన్సిల్ జయదీప్ గుప్తా, తెలంగాణ సర్కార్ తరపున సీనియర్ అడ్వొకేట్ సీఎస్ వైద్యనాథన్ వాదనలు విన్పించారు. బచావత్ ట్రిబ్యునల్ పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలకు ఎలాంటి నీటి కేటాయింపులు చేయలేదని ఏపీ వాదించింది. నీటి కేటాయింపులు లేని ఆ ప్రాజెక్టుకు నీటిని కేటాయిస్తూ తెలంగాణ జారీ చేసిన జీవోను రద్దు చేయాలని కోరింది. బచావత్ ట్రిబ్యునల్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు వాటాగా ఇచ్చిన 811 టీఎంసీలను ప్రాజెక్టుల వారీగా కేటాయించిందని ఏపీ సీనియర్ కౌన్సిల్ జయదీప్ గుప్తా చెప్పారు. ట్రిబ్యునల్ నీటిని కేటాయించని పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలు అక్రమ ప్రాజెక్టేనని ఆయన పేర్కొనగా, తెలంగాణ సీనియర్ అడ్వొకేట్ వైద్యనాథన్ అభ్యంతరం వ్యక్తం చేశారు.

నేడు కూడా వాదనలు: రెండు రాష్ట్రాల వాదనలు విన్న ట్రిబ్యునల్.. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల వివాదాన్ని అపెక్స్ కౌన్సిల్‌లో చర్చించి, పరిష్కరించుకోవాలని 2016లో సుప్రీంకోర్టు సూచించడాన్ని గుర్తుచేసింది. అయితే ఆ అధికారం అపెక్స్ కౌన్సిల్‌కు లేదని ఏపీ స్పష్టం చేసింది. గురువారం వాదనలు వింటామని జస్టిస్ బ్రిజేష్ తెలిపారు.

తెలంగాణలో ఏముందో.. వచ్చి చూస్తే తెలుస్తుంది

- మంత్రి హరీశ్‌రావు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: తెలంగాణలో ఏమున్నదని అంటున్న ఏపీ మంత్రులు ఇక్కడికి వచ్చి చూస్తే తెలుస్తుందని రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు అన్నారు. 'తెలంగాణలో కల్యాణలక్ష్మి ఉంది. షాదీ ముబారక్ ఉంది. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్, కేసీఆర్ కిట్, రైతుబంధు, రైతు బీమా, 26 మెడికల్ కాలేజీలు, 56 లక్షల ఎకరాల్లో వరి పంట, కాళేశ్వరం ప్రాజెక్టు.. ఇలా చెప్పాలంటే ఎంతో చెప్పగలుగుతా'అని అన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా జోగిపేట్‌లో మంత్రి హరీశ్, బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆంధ్రా మంత్రులు అనవసరంగా తమ జోలికి రావద్దని అన్నారు. 'ఏపీ నుంచి వచ్చిన మేస్త్రీలు నిన్న సంగారెడ్డిలో నన్ను కలిశారు.. తాము ఇక్కడే (తెలంగాణలో) ఉంటామని చెబితే.. అక్కడో ఓటు, ఇక్కడో ఓటు వద్దని చెప్పిన. ఇటే ఉండండి అని చెప్పిన. దీంతో ఆంధ్రా మంత్రులు ఎగిరెగిరి పడుతున్నారు'అని హరీశ్‌రావు అన్నారు.



సంగారెడ్డిలో బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

కేంద్రంలోని బీజేపీ సర్కారు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వకుండా ఎగనామం పెట్టినప్పటికీ ఆ రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నించడం లేదని వ్యాఖ్యానించారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని తుక్కుకింద అమ్మినా మాట్లాడలేని పరిస్థితిలో ఉన్నాయన్నారు. 'ఏపీలోని ప్రతిపక్ష పార్టీ, నాడు ప్రత్యేక హోదా కోసం కేంద్రంలోని బీజేపీ నుంచి బయటకు వచ్చింది. ఇప్పుడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రాపకం కోసం పాకులాడుతున్న పరిస్థితి ఉంది'అని అన్నారు.



క్వార్టర్ ఫైనల్లో సాకేత్ జోడీ

నరసోటా ఓపెన్ ఏటీపీ చాలెంజర్-125 టెన్నిస్ టోర్నీలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాకేత్ మైనేని తన భాగస్వామి యూకీ బాంబ్రీతో కలిసి పురుషుల డబుల్స్ విభాగంలో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. ఫ్లోరిడాలో బుధవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో సాకేత్-యూకీ (భారత్) ద్వయం 3-6, 6-4, 10-5తో 'సూపర్ టైబ్రేక్'లో మార్టిన్ డామ్-టోజీ కొడాట్ (అమెరికా) జంటను ఓడించింది. 85 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాకేత్-యూకీ జంట తమ సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి జోడీ సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసింది.

బోపన్న ద్వయం పరాజయం



మోంటెకార్లో ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ పోరాటం ముగిసింది. మొనాకోలో బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ఏడో సీడ్ బోపన్న-ఎబ్డెన్ జంట 4-6, 3-6తో కెవిన్ క్రావిట్జ్-టిమ్ ప్యుయెట్జ్ (జర్మనీ) ద్వయం చేతిలో పరాజయం పాలైంది. బోపన్న-ఎబ్డెన్‌లకు 21,980 యూరోల (రూ. 19 లక్షల 77 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.

భారత రెజ్లర్లకు ఐదు పతకాలు

- అంతిమ్ పంఘాల్‌కు రజతం
- అన్షు, సోనమ్, రీతిక, మనీషాలకు కాంస్యాలు



అంతిమ్

అస్తానా (కజకిస్తాన్): ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళా రెజ్లర్లు తమ సత్తా చాటుకున్నారు. బుధవారం ముగిసిన మహిళా ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో భారత్‌కు ఒక రజతం, నాలుగు కాంస్యాలతో కలిపి మొత్తం ఐదు పతకాలు లభించాయి. గత ఏడాది అండర్-20 ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన అంతిమ్ పంఘాల్ (53 కేజీలు) రజత పతకం నెగ్గగా... అన్షు మలిక్ (57 కేజీలు), సోనమ్ మలిక్ (62 కేజీలు), మనీషా (65 కేజీలు), రీతిక (72 కేజీలు) కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. ఫైనల్ చేరే క్రమంలో తన ప్రత్యర్థులకు కేవలం ఒక పాయింట్ సమర్పించుకున్న అంతిమ్ తుది పోరులో మాత్రం పోరాడినా ఫలితం లేకపోయింది. 2021 ప్రపంచ చాంపియన్ అకారి ఫుజినామి (జపాన్) 10-0తో మూడు నిమిషాల వ్యవధిలో 'టెక్నికల్ సుపీరియారిటీ' పద్ధతిలో అంతిమ్‌పై గెలిచి స్వర్ణ పతకం దక్కించుకుంది. అంతకుముందు అంతిమ్ తొలి రౌండ్‌లో 10-0తో అల్వినా లిమ్ (సింగపూర్)పై, క్వార్టర్ ఫైనల్లో 6-0తో లి డెంగ్ (చైనా)పై, సెమీఫైనల్లో 8-1తో అక్టెంగె కెనిమ్‌జయేవా (ఉజ్బెకిస్తాన్)పై గెలుపొందింది. కాంస్య పతక బౌట్‌లలో అన్షు 10-0తో ఎర్డెన్‌సుడ్ బట్ ఎర్డెన్ (మంగోలియా)పై, సోనమ్ 5-1తో జియోజువాన్ లు (చైనా)పై, మనీషా 8-0తో అల్బీనా కైర్‌జెల్డినోవా (కజకిస్తాన్)పై, రీతిక 5-1తో స్వెత్లానా (ఉజ్బెకిస్తాన్)పై విజయం సాధించారు. రెండు రజతాలు, ఆరు కాంస్యాలతో కలిపి మొత్తం ఎనిమిది పతకాలు నెగ్గిన భారత్ టీమ్ చాంపియన్‌షిప్‌లో మూడో స్థానంలో నిలిచింది.

చెన్నై కోటలో రాయల్స్ గెలుపు

- 2008 తర్వాత చెన్నైలో నెగ్గిన రాజస్తాన్ రాయల్స్
- రాణించిన బట్లర్, అశ్విన్
- 'ఫినిషింగ్'లో ధోని, జడేజా విఫలం




ధోని జడేజా

చెన్నై: వరుసగా మూడో విజయం సాధించి ఈ ఐపీఎల్ సీజన్‌లో 'హ్యాట్రిక్' నమోదు చేయాలని ఆశించిన నాలుగుసార్లు చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు నిరాశ ఎదురైంది. మాజీ విజేత రాజస్తాన్ రాయల్స్ సమష్టి ప్రదర్శనతో చెన్నై జట్టుకు వారి సొంత మైదానంలోనే షాక్ ఇచ్చింది. 2008 తర్వాత చెన్నై వేదికలో చెన్నై జట్టును రాజస్తాన్ ఓడించడం ఇదే తొలిసారి. టాస్ గెలిచి చెన్నై జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా... తొలుత బ్యాటింగ్‌కు దిగిన రాజస్తాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 175 పరుగులు సాధించింది. జోస్ బట్లర్ (36 బంతుల్లో 52; 1 ఫోర్, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీ చేయగా... దేవదత్ పడిక్కల్ (26 బంతుల్లో 38; 5 ఫోర్లు), అశ్విన్ (22 బంతుల్లో 30; 1 ఫోర్, 2 సిక్స్‌లు), హెట్‌మైర్ (18 బంతుల్లో 30 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. ఆకాశ్ సింగ్, తుషార్ దేశ్‌పాండే, రవీంద్ర జడేజా రెండు వికెట్ల చొప్పున తీశారు. 176 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన చెన్నై జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 172 పరుగులు చేసి ఓడిపోయింది. డెవాన్ కాన్వే (38 బంతుల్లో 50; 6 ఫోర్లు), అజింక్య రహానే (19 బంతుల్లో 31; 2 ఫోర్లు, 1 సిక్స్) కీలకదశలో అవుటవ్వగా... చివర్లో రవీంద్ర జడేజా (15 బంతుల్లో 25 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు), ధోని (17 బంతుల్లో 32; 1 ఫోర్, 3 సిక్స్‌లు) మెరిపించి ఆరో వికెట్‌కు ఐదు ఓవర్లలో 59 పరుగులు జోడించినా చెన్నైను విజయతీరానికి చేర్చలేకపోయారు. డెవాన్ కాన్వే అవుటయ్యే సమయానికి చెన్నై స్కోరు 15 ఓవర్లలో 113/6. చెన్నై గెలవాలంటే 30 బంతుల్లో 63 పరుగులు చేయాలి. క్రీజులో జడేజా, ధోని ఉన్నారు. అశ్విన్ వేసిన ఇన్నింగ్స్ 16వ ఓవర్లో 4 పరుగులు... చహల్ వేసిన 17వ ఓవర్లో 5 పరుగులు వచ్చాయి. దాంతో చెన్నై విజయసమీకరణం 18 బంతుల్లో 54 పరుగులుగా మారింది. జంపా వేసిన 18వ ఓవర్లో ధోని, జడేజా 14 పరుగులు... హోల్డర్ వేసిన 19వ ఓవర్లో 19 పరుగులు రాబట్టారు. దాంతో చెన్నై నెగ్గడానికి చివరి ఓవర్లో 21 పరుగులు అవసరమయ్యాయి. చివరి ఓవర్ వేసేందుకు వచ్చిన సందీప్ శర్మ తొలి రెండు బంతులను వైడ్ వేశాడు. ఆ తర్వాతి బంతికి పరుగు ఇవ్వని సందీప్... తర్వాతి రెండు బంతులు ఫుల్‌టాస్ వేయడంతో వాటిని ధోని సిక్స్‌లుగా మలిచాడు. దాంతో చెన్నై గెలవడానికి 3 బంతుల్లో 7 పరుగులు చేయాలి. అయితే సందీప్ శర్మ వేసిన మూడు బంతుల్లో ధోని, జడేజా మూడు పరుగులే చేయడంతో చెన్నై ఓటమి పాలైంది. రాజస్తాన్ స్పిన్నర్లు అశ్విన్ (2/25), యజువేంద్ర చహల్ (2/27) కీలక వికెట్లు తీసి చెన్నైను కట్టడి చేశారు.

నిలబడి...తడబడి...: అంతకుముందు రాజస్తాన్ జట్టుకు ఓపెనర్లు శుభారంభం ఇవ్వలేకపోయారు. తుషార్ వేసిన ఇన్నింగ్స్ రెండో ఓవర్లో యశస్వి జైస్వాల్ (8 బంతుల్లో 10; 2 ఫోర్లు) భారీ షాట్‌కు ప్రయత్నించి మిడ్ ఆఫ్ వద్ద శివమ్ దూబే చేతికి చిక్కాడు. అనంతరం బట్లర్, దేవ్‌దత్ ఇన్నింగ్స్‌ను నిర్మించారు. స్పిన్నర్ తీక్షణ బౌలింగ్‌లో వీరిద్దరు దూకుడుగా ఆడారు. తీక్షణ వేసిన తొలి ఓవర్లో 10 పరుగులు... రెండో ఓవర్లో 17 పరుగులు పిండుకున్నారు. ఆ తర్వాత తుషార్ వేసిన ఇన్నింగ్స్ ఆరో ఓవర్లోని తొలి రెండు బంతులను దేవ్‌దత్ బౌండరీకి తరలించాడు. పవర్‌ప్లే ముగిసేసరికి రాజస్తాన్ 57/1తో నిలిచింది. పవర్‌ప్లే తర్వాత కూడా బట్లర్, దేవదత్ ధాటిగానే ఆడారు. మొయిన్ అలీ వేసిన ఎనిమిదో ఓవర్లో బట్లర్ వరుసగా రెండు సిక్స్‌లు కొట్టడంతో ఈ ఓవర్లో రాజస్తాన్ మొత్తం 18 పరుగులు సాధించింది. సాఫీగా సాగుతున్న రాజస్తాన్ ఇన్నింగ్స్ తొమ్మిదో ఓవర్లో తడబడింది. రవీంద్ర జడేజా మూడు బంతుల వ్యవధిలో దేవదత్‌ను, కెప్టెన్ సంజూ సామ్సన్ (0)ను పెవిలియన్‌కు పంపించాడు. అనంతరం నాలుగు ఓవర్లపాటు రాజస్తాన్ బ్యాటర్లు బట్లర్, అశ్విన్ ఆచితూచి ఆడారు. వీరిద్దరు ఈ నాలుగు ఓవర్లలో ఒక్క బౌండరీ కొట్టలేకపోయారు. ఆకాశ్ సింగ్ వేసిన ఇన్నింగ్స్ 15వ ఓవర్లో అశ్విన్ రెండు వరుస సిక్స్‌లు కొట్టాడు. అయితే ఇదే ఓవర్ చివరి బంతికి అశ్విన్‌ను ఆకాశ్ అవుట్ చేశాడు. దాంతో బట్లర్, అశ్విన్ 47 పరుగుల నాలుగో వికెట్ భాగస్వామ్యం ముగిసింది. 15 ఓవర్లు ముగిసేసరికి రాజస్తాన్ 135/4తో నిలిచింది. చివరి ఐదు ఓవర్లలో చెన్నై బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. ప్రమాదకరంగా మారిన బట్లర్‌తోపాటు ధ్రువ్, హోల్డర్‌లను వెంటవెంటనే అవుట్ చేశారు. చివరి ఐదు ఓవర్లలో చెన్నై కేవలం 40 పరుగులిచ్చి 4 వికెట్లు తీసింది.



కెప్టెన్ ధోని @ 200

రాజస్తాన్ రాయల్స్ మ్యాచ్‌తో ధోని మరో మైలురాయి అందుకున్నాడు. ఐపీఎల్ టోర్నీలో చెన్నై జట్టు కెప్టెన్ హోదాలో అతను 200వ మ్యాచ్ ఆడాడు. అత్యధిక ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడిన క్రికెటర్ల జాబితాలో 238 మ్యాచ్‌లతో ధోని తొలి స్థానంలో ఉన్నాడు. చెన్నై జట్టుపై రెండేళ్లపాటు నిషేధం విధించిన సమయంలో ధోని రైజింగ్ పుణే సూపర్ జెయింట్స్ జట్టు తరఫున రెండు సీజన్‌లు (2016, 2017) ఆడాడు. ఓవరాల్‌గా ధోని ఇప్పటి వరకు 214 మ్యాచ్‌ల్లో కెప్టెన్‌గా వ్యవహరించాడు. మ్యాచ్ ప్రారంభానికి ముందు ధోనిని చెన్నై ఫ్రాంచైజీ యజమాని శ్రీనివాసన్ సన్మానించారు.

స్కోరు వివరాలు

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ (సి) శివమ్ దూబే (బి) తుషార్ దేశ్‌పాండే 10; బట్లర్ (బి) మొయిన్ అలీ 52; దేవదత్ పడిక్కల్ (సి) కాన్వే (బి) జడేజా 38; సంజూ సామ్సన్ (బి) జడేజా 0; అశ్విన్ (సి) మగాలా (బి) ఆకాశ్ సింగ్ 30; హెట్‌మైర్ (నాటౌట్) 30; ధ్రువ్ జురేల్ (సి) శివమ్ దూబే (బి) ఆకాశ్ సింగ్ 4; హోల్డర్ (సి) కాన్వే (బి) తుషార్ దేశ్‌పాండే 0; జంపా (రనౌట్) 1; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు)** 175. **వికెట్ల పతనం:** 1-11, 2-88, 3-88, 4-135, 5-142, 6-167, 7-174, 8-175. **బౌలింగ్:** ఆకాశ్ సింగ్4-0-40-2, తుషార్ దేశ్‌పాండే 4-0-37-2, తీక్షణ 4-0-42-0, రవీంద్ర జడేజా 4-0-21-2, మొయిన్ అలీ 2-0-21-1, సిసాంద మగాలా 2-0-14-0.

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: రుతురాజ్ గైక్వాడ్ (సి) యశస్వి (బి) సందీప్ శర్మ 8; డెవాన్ కాన్వే (సి) యశస్వి (బి) చహల్ 50;, అజింక్య రహానే (ఎల్బీడబ్ల్యూ) (బి) అశ్విన్ 31; శివమ్ దూబే (ఎల్బీడబ్ల్యూ) (బి) అశ్విన్ 8; మొయిన్ అలీ (సి) సందీప్ శర్మ (బి) జంపా 7; రాయుడు (సి) హెట్‌మైర్ (బి) చహల్ 1; జడేజా (నాటౌట్) 25; ధోని (నాటౌట్) 32; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు)** 172. **వికెట్ల పతనం:** 1-10, 2-78, 3-92, 4-102, 5-103, 6-113. **బౌలింగ్:** సందీప్ శర్మ 3-0-30-1, కుల్దీప్ సేన్ 2-0-8-0, హోల్డర్ 3-0-37-0, ఆడమ్ జంపా 4-0-43-1, అశ్విన్ 4-0-25-2, యజువేంద్ర చహల్ 4-0-27-2.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	4	3	1	6	1.588
లక్నో	4	3	1	6	1.048
కోల్‌కతా	3	2	1	4	1.375
గుజరాత్	3	2	1	4	0.431
చెన్నై	4	2	2	4	0.225
పంజాబ్	3	2	1	4	-0.281
బెంగళూరు	3	1	2	2	-0.800
ముంబై	3	1	2	2	-0.879
హైదరాబాద్	3	1	2	2	-1.502
ఢిల్లీ	4	0	4	0	-1.576

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

పంజాబ్ × గుజరాత్ (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

భారత్‌కు రెండో విజయం


రష్మిక

తాష్కెంట్ (ఉజ్బెకిస్తాన్): బిల్లీ జీన్ కింగ్ కప్ ఆసియా ఓసియానియా జోన్ గ్రూప్-1 మహిళల టీమ్ టెన్నిస్ టోర్నీలో భారత జట్టు వరుసగా రెండో విజయం నమోదు చేసింది. ఆతిథ్య ఉజ్బెకిస్తాన్ జట్టుతో బుధవారం జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. తొలి సింగిల్స్‌లో రుతుజా భోస్లే 5-7, 6-2, 6-4తో సబ్రీనా ఒలిమ్‌జనోవాపై నెగ్గడంతో భారత్ 1-0తో ఆధిక్యాన్ని సంపాదించింది. రెండో సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ అంకిత రైనా 6-4, 6-2తో సెవిల్ యుల్డషెవాను ఓడించడంతో భారత్ 2-0తో ఆధిక్యంలోకి వెళ్లడంతోపాటు విజయాన్ని ఖరారు చేసుకుంది. మూడో మ్యాచ్‌గా జరిగిన డబుల్స్ పోరులో భమిడిపాటి శ్రీవల్లి రష్మిక-వైదేహి చౌదరీ జోడీ 6-1, 6-0తో కారమోనోవా-వలిహనోవా జంటను చిత్తుగా ఓడించడంతో భారత్ విజయం పరిపూర్ణమైంది. హైదరాబాద్‌కు చెందిన రష్మిక, గుజరాత్ ప్లేయర్ వైదేహి భారత సీనియర్ జట్టు తరఫున తొలి అంతర్జాతీయ మ్యాచ్ ఆడారు. నేడు జరిగే మ్యాచ్‌లో చైనాతో భారత్ ఆడుతుంది.

శ్రీనిధి ఎఫ్‌సీ సంచలనం

కేరళ బ్లాస్టర్స్‌పై 2-0తో గెలుపు



కోజికోడ్: సూపర్ కప్ జాతీయ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) సంచలనం సృష్టించింది. ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) టోర్నీలో మూడుసార్లు రన్నరప్‌గా నిలిచిన కేరళ బ్లాస్టర్స్ జట్టును ఓడించింది. బుధవారం జరిగిన గ్రూప్ 'ఎ' రెండో లీగ్ మ్యాచ్‌లో శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ 2-0 గోల్స్ తేడాతో కేరళ బ్లాస్టర్స్ జట్టుపై గెలిచి తొలి విజయం నమోదు చేసింది. శ్రీనిధి జట్టు తరఫున రిల్వాన్ హసన్ (17వ ని.లో), కాస్టనెడా (44వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. ఐఎస్‌ఎల్ మాజీ చాంపియన్ బెంగళూరు ఎఫ్‌సీతో జరిగిన తొలి మ్యాచ్‌ను శ్రీనిధి జట్టు 1-1తో 'డ్రా' చేసుకుంది. ఈనెల 16న జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో రౌండ్‌గ్లాస్ పంజాబ్ జట్టుతో శ్రీనిధి జట్టు ఆడుతుంది.

సినిమా

మూడు దశాబ్దాల తర్వాత...

కొన్ని కాంబినేషన్స్ ఎక్కువగా రిపీట్ అవుతుంటాయి. అయితే కొన్ని కాంబినేషన్స్ రిపీట్ కావడానికి దశాబ్దాలు గడిచిపోతాయి. ఇలా మూడు దశాబ్దాల తర్వాత రిపీట్ అవుతున్న కొన్ని కాంబినేషన్స్‌లో రూపొందుతున్న చిత్రాల గురించి తెలుసుకుందాం


రజనీకాంత్


జాకీ ష్రాఫ్

- రజనీకాంత్, జాకీ ష్రాఫ్ మరోసారి స్క్రీన్ షేర్ చేసుకోవడానికి 36 ఏళ్లు పట్టింది. 1987లో ప్రభాత్ ఖన్నా దర్శకత్వంలో వచ్చిన హిందీ చిత్రం 'ఉత్తర్ దక్షిణ్'లో రజనీకాంత్, జాకీ ష్రాఫ్ లీడ్ రోల్స్ చేశారు. మళ్లీ ఈ ఇద్దరు కలిసి ఇప్పుడు తమిళ చిత్రం 'జైలర్'లో నటిస్తున్నారు. 'జైలర్'లో రజనీకాంత్ హీరోగా నటిస్తుండగా, జాకీ ష్రాఫ్ కీ రోల్ చేస్తున్నారు. జాకీది నెగటివ్ క్యారెక్టర్ అని సమాచారం. రమ్యకృష్ణ, తమన్నా, సునీల్, శివ రాజ్‌కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమా ఈ ఏడాదే రిలీజ్ కానుంది.


శారుక్ ఖాన్, సల్మాన్ ఖాన్



రాజేంద్రప్రసాద్, అర్చన

- రాజేంద్రప్రసాద్, అర్చన హీరో హీరోయిన్లుగా వంశీ దర్శకత్వంలో 1986లో వచ్చిన 'లేడీస్ టైలర్' చిత్రం ఎంతటి ఘనవిజయం సాధించిందో తెలిసిందే. ఆ చిత్రం తర్వాత రాజేంద్రప్రసాద్, అర్చన కలిసి స్క్రీన్ షేర్ చేసుకోలేదు. మళ్లీ 36 ఏళ్ల తర్వాత రాజేంద్రప్రసాద్, అర్చన 'షష్టిపూర్తి' చిత్రంలో కలిసి నటిస్తున్నారు. వీరిద్దరూ లీడ్ రోల్స్ చేస్తున్న ఈ చిత్రంలో రూపేష్ కుమార్ చౌదరి, ఆకాంక్షా సింగ్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. న్యూ ఏజ్ ఫ్యామిలీ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రానికి పవన్ ప్రభ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని జూలైలో విడుదల చేయాలనుకుంటున్నారు. మా ఆయి ప్రొడక్షన్స్‌పై రూపేష్ కుమార్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. అలాగే 'లేడీస్ టైలర్' సినిమాకు స్వరాలు అందించిన ఇళయరాజాయే 'షష్టిపూర్తి' చిత్రానికీ బాణీలు సమకూర్చుతుండటం విశేషం.
- బాలీవుడ్ టాప్ స్టార్స్ శారుక్ ఖాన్, సల్మాన్ ఖాన్ హీరోలుగా కలిసి నటించిన హిందీ చిత్రం 'కరణ్ అర్జున్'. హీరో హృతిక్ రోషన్ తండ్రి రాకేష్ రోషన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం 1995లో విడుదలై ఘనవిజయం సాధించింది. కాగా ఆ తర్వాత సల్మాన్ ఖాన్ హీరోగా నటించిన 'ట్యూబ్ లైట్', 'టైగర్ 3' (విడుదల కావాల్సి ఉంది) చిత్రాల్లో శారుక్ ఖాన్ గెస్ట్ రోల్స్ చేశారు. అలాగే శారుక్ ఖాన్ హీరోగా నటించిన 'జీరో', 'పఠాన్' చిత్రాల్లో సల్మాన్ ఖాన్ గెస్ట్ రోల్స్ చేశారు. కానీ సల్మాన్ ఖాన్, శారుక్ ఖాన్ హీరోలుగా కలిసి నటించలేదు. ఆ సమయం ఇప్పుడు ఆసన్నమైంది. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో సల్మాన్ ఖాన్, శారుక్ ఖాన్ హీరోలుగా యశ్ రాజ్ ఫిలింస్ 'పఠాన్ వర్సెస్ టైగర్' అనే సినిమా రూపొందించనుందని బాలీవుడ్‌లో వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా 2025లో సెట్స్‌పైకి వెళ్తుందని బీ టౌన్ టాక్. ఈ లెక్కల ప్రకారం శారుక్ ఖాన్, సల్మాన్ ఖాన్ హీరోలుగా మరో సినిమా రావడానికి 30 ఏళ్లు పట్టింది.

టీజర్ ఆసక్తికరంగా ఉంది

- రానా

''ఉస్తాద్' టీజర్ చాలా ఆసక్తిగా ఉంది. టీమ్ అందరూ కలిసి ఓ మంచి సినిమా తీశారని అనుకుంటున్నాను'' అన్నారు రానా. శ్రీ సింహా కోడూరి, కావ్యా కల్యాణ్ రామ్ జంటగా వారాహి చలన చిత్రం, క్రిషి ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై రజినీ కొర్రపాటి, రాకేష్ రెడ్డి గడ్డం, హిమాంక్ రెడ్డి దువ్వూరు నిర్మిస్తున్న చిత్రం 'ఉస్తాద్'. బుధవారం ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేసిన రానా మాట్లాడుతూ- ''హీరో శ్రీ సింహాతో


కావ్యా కల్యాణ్‌రామ్, రానా, శ్రీ సింహా

సహా దాదాపు 'ఉస్తాద్' చిత్రబృందం అందరితో నాకు మంచి అనుబంధం ఉంది. నిర్మాత రాకేష్ నా నంబర్‌వన్ యారి షో చేశాడు. మరో నిర్మాత హిమాంక్ నా టాలెంట్ ఏజెన్సీని నడిపాడు. ఇక 'బాహుబలి' టైమ్‌లో ఐదేళ్ల పాటు శ్రీసింహాతో కలిసి ట్రావెల్ చేశాను. 'ఉస్తాద్' విజయం సాధించాలి'' అన్నారు. ''ఈ సినిమాలో హీరోకి బైక్ ఎలాగైతే ఉస్తాద్ అయ్యిందో నాక్కూడా అలాగే అయ్యింది. ఎందుకంటే షూటింగ్ సమయంలో బైక్ రైడింగ్ బాగా నేర్చుకున్నాను. టీజర్ అందరికీ నచ్చే ఉంటుందని భావిస్తున్నాను'' అన్నారు శ్రీ సింహా. ''టీజర్‌లో మీరు చూసింది చాలా తక్కువ. సినిమా పెద్ద స్థాయిలో ఉంటుంది'' అన్నారు రాకేష్. ''రెండేళ్ల ముందే ఈ టైటిల్‌ను రిజిస్టర్ చేయించాం. నాతో సహా ఈ సినిమాతో చాలామంది జర్నీని స్టార్ట్ చేశారు'' అన్నారు ఫణిదీప్.


సంజయ్ దత్

ఆ వార్త అవాస్తవం

బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ కన్నడ సినిమా 'కేడీ' షూటింగ్‌లో గాయపడ్డారంటూ బుధవారం సోషల్ మీడియాలో ఓ వార్త వైరల్‌గా మారింది. ధ్రువ సర్జా హీరోగా జోగి ప్రేమ్ దర్శకత్వంలో 'కేడీ: ది డెవిల్' చిత్రం రూపొందుతోంది. బెంగళూరు సమీపంలోని మాగడి వద్ద వేసిన సెట్‌లో ఇటీవల ఫైట్ మాస్టర్ రవి వర్మ ఆధ్వర్యంలో బాంబు బ్లాస్ట్ సీన్స్ తీస్తుండగా సంజయ్ దత్‌కి గాయాలైనట్లు వార్త గుప్పుమంది. అయితే ఈ వార్త నిజం కాదని సంజయ్ దత్ సోషల్ మీడియా ద్వారా స్పష్టం చేశారు. ''నాకు గాయాలైనట్లు వచ్చిన వార్త అవాస్తవం. నేను ప్రస్తుతం 'కేడీ' షూటింగ్‌లో పాల్గొంటున్నాను. యూనిట్ తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు'' అన్నారు సంజయ్ దత్.

దరువెయ్యరా..


గోపీచంద్, డింపుల్

'లక్ష్యం, లౌక్యం' వంటి హిట్ చిత్రాల తర్వాత హీరో గోపీచంద్, దర్శకుడు శ్రీవాస్ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'రామబాణం'. ఈ మూవీలో డింపుల్ హయతీ కథానాయిక. టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ సినిమా మే 5న విడుదల కానుంది. ఈ చిత్రానికి మిక్కీ జె. మేయర్ సంగీతం అందించారు. ఈ చిత్రంలోని రెండో పాట 'దరువెయ్యరా..'ని రేపు (శుక్రవారం) కర్నూల్ అవుట్‌డోర్ స్టేడియంలో జరిగే వేడుకలో విడుదల చేయనున్నట్లు ప్రకటించి, ఓ పోస్టర్‌ని రిలీజ్ చేశారు. ''యాక్షన్ అంశాలతో కూడిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'రామబాణం''' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, కెమెరా: వెట్రి పళనిసామి.

ఆ విషయంలో మన తెలుగు హీరోలు మారాలి!

- గుణశేఖర్

"రుద్రమదేవి'కి నేను ఒక్కణ్ణే నిర్మాత. డైరెక్షన్, ప్రొడక్షన్ రెండూ చూసుకోవడం కష్టంగా అనిపించింది. 'శాకుంతలం' సినిమా ప్రొడక్షన్‌లో 'దిల్' రాజుగారు కూడా భాగం కావడంతో నేను క్వాలిటీపై దృష్టి పెట్టగలిగాను. ఔట్‌పుట్ అద్భుతంగా వచ్చింది. ఈ సినిమా ప్రత్యేక షోలను బుధవారం ఢిల్లీలో, ఇటీవల హైదరాబాద్‌లో వేశాం. చూసినవారు చాలా బాగుందన్నారు. శుక్రవారం మా 'శాకుంతలం' చూసే ప్రేక్షకులు అదే అనుభూతికి లోనవుతారు" అన్నారు గుణశేఖర్. సమంత, దేవ్ మోహన్ జంటగా నటించిన చిత్రం 'శాకుంతలం'. 'దిల్' రాజు సమర్పణలో నీలిమ గుణ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్రదర్శకుడు గుణశేఖర్ చెప్పిన విశేషాలు..



- 'రుద్రమదేవి' తర్వాత 'హిరణ్య కశ్యప' సినిమా స్క్రిప్ట్, ప్రీ ప్రొడక్షన్‌పై ఐదేళ్లు వర్క్ చేశాను. షూటింగ్ ఆరంభించే టైమ్‌లో కోవిడ్ వచ్చింది. దీంతో అప్పుడు మాతో కలిసి ఉన్న ఓ హాలీవుడ్ సంస్థ మరో వర్క్‌పై ఫోకస్ పెట్టింది. ఈ కారణంగా ఆ ప్రాజెక్ట్‌ను హోల్డ్‌లో పెట్టాం.
- లాక్‌డౌన్ టైమ్‌లో కొన్ని పురాణాలు, ఇతిహాసాల కలయికలో ఓ ప్రేమకథ చేద్దామనే ఆలోచన వచ్చింది. ఆ క్రమంలో కాళిదాసు 'అభిజ్ఞాన శాకుంతలం' నాకు నచ్చింది. దాన్ని సోషలైజ్ చేయటమెందుకు.. అలాగే తీస్తే బెటర్ కదా అని 'శాకుంతలం' మొదలు పెట్టాను. సాధారణంగా శకుంతల అనగానే శృంగార శకుంతల గుర్తుకొచ్చేలా ఇప్పటివరకూ చూపించారు. కానీ, ఆమెలో అంతర్గతంగా చాలా శక్తి, ఆత్మాభిమానం ఉంటుందని 'అభిజ్ఞాన శాకుంతలం'లో కాళిదాసు ప్రస్తావించారు. నేను కూడా శకుంతలలోని రెండో కోణంతో కథ అల్లుకుని, 'శాకుంతలం' తీశాను.
- తన ఆత్మాభిమానం కోసం అప్పట్లో రాజు, రాజ్యాలను శకుంతల లెక్క చేయకుండా పోరాడి నిలబడింది. పెళ్లి కాకుండా తల్లి కావటం అనేది అప్పట్లో పెద్ద నేరం. అలాంటి పరిస్థితులను ఆమె ఎలా ఎదురొడ్డి నిలబడిందనేది ఈ చిత్రకథాంశం.
- సమంత చాలా మంచి నటి. అందుకే శకుంతల పాత్రలో రొమాంటిక్ యాంగిల్‌ను సెకండ్రీ చేశా. నటనకు ప్రాధాన్యం ఉండేలా చూపించాను. నేను, అరుణ బిక్షుగారు, సమంతగారు కలిసి మాట్లాడుకుని శకుంతల పాత్రను డిజైన్ చేశాం. సమంత కొత్త హీరోయిన్‌లా అరుణ బిక్షుగారి వద్ద శిక్షణ తీసుకుని నటించింది.
- 'శాకుంతలం'లో దుర్వాస మహామునిగా మోహన్‌బాబుగారు నటించారు. ఆ పాత్రని ఆయన తప్ప మరొకరు చేయలేరు. ఆయన ఒప్పుకోకుంటే ఈ ప్రాజెక్ట్ గురించి నేను ఆలోచనలో పడేవాణ్ణి.
- అమితాబ్ బచ్చన్, సల్మాన్ ఖాన్, శారుక్ ఖాన్.. ఇలా బాలీవుడ్ స్టార్ హీరోలు అతిథి పాత్రలు చేస్తున్నారు. ఆ విషయంలో మన తెలుగు హీరోలు మారాలి. 'రుద్రమదేవి'లో అల్లు అర్జున్‌ది అతిథి పాత్ర అయినా అద్భుతమైన స్పందన వచ్చింది. 'శాకుంతలం'లో దుష్యంతుడి పాత్రలో చాలా కోణాలుంటాయి. ఆ పాత్రని తెలుగు హీరోలు చేస్తారనే నమ్మకం నాకు కలగలేదు. అడిగి లేదనిపించుకోవటం ఇష్టం లేక వారిని సంప్రదించలేదు. దేవ్ మోహన్ 'శాకుంతలం' పూర్తయ్యే వరకు మరో సినిమా చేయనన్నాడు. అతనికి శిక్షణ ఇప్పించి దుష్యంతుడి పాత్ర చేయించుకున్నాను.

చెల్లీ వినవే.. నా తల్లీ వినవే...


విజయ్ ఆంటోని

'బిచ్చగాడు' వంటి సూపర్ హిట్ చిత్రంతో తెలుగులో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు విజయ్ ఆంటోని. ఆ చిత్రానికి సీక్వెల్‌గా తెరకెక్కిన 'బిచ్చగాడు-2' తమిళ, తెలుగు భాషల్లో ఈ వేసవిలో విడుదల కానుంది. విజయ్ ఆంటోని హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ చిత్రంలో కావ్య థాపర్ కథానాయిక. విజయ్ ఆంటోని సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'చెల్లీ వినవే.. నా తల్లీ వినవే, నీ అన్నను కాను అమ్మను నేను, చిట్టీ వినవే.. నా బుజ్జీ కనవే.. నీ పుట్టు మచ్చై ఉంటా తోడు..' అంటూ సాగే పాటని విడుదల చేశారు. ఈ పాటను భాష్య శ్రీ రాయగా అనురాగ్ కులకర్ణి ఆలపించారు. ''ప్రతి ఒక్కర్నీ కదిలించేలా ఈ పాట సాగుతుంది'' అని చిత్రబృందం పేర్కొంది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	235	60,393
నిఫ్టీ ▲	90	17,812

విదేశీ సూచీలు (బుధవారం రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	12,053	▲	22
డోజోన్స్	33,864	▲	179
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,825	▲	39
డాక్స్	15,704	▲	48
షాంఘై	3,327	▲	14
నికాయ్	28,083	▲	159

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)	60,613	▲	223
బంగారం (22 క్యారట్)	60,370	▲	223
వెండి (కిలో)	74,940	▲	524

అనిశ్చితిలోనూ ఎకానమీ శుభ సంకేతాలు

- ఫిబ్రవరిలో పారిశ్రామిక వృద్ధి 5.6%
- విద్యుత్, మైనింగ్, తయారీ.. ఓకే
- మార్చిలో రిటైల్ ద్రవ్యోల్బణం 5.66%
- 15 నెలల కనిష్ట స్థాయి




న్యూఢిల్లీ: ప్రపంచ ఆర్థిక అనిశ్చితి పరిస్థితుల్లోనూ భారత్ ఎకానమీ తగిన సానుకూల గణాంకాలను చూస్తోంది. ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన అధికారిక గణాంకాల ప్రకారం, ఫిబ్రవరిలో పారిశ్రామిక ఉత్పత్తికి సంబంధించిన సూచీ (ఐఐపీ) వృద్ధి రేటు 5.6 శాతంగా (2022 ఫిబ్రవరితో పోల్చి) నమోదయ్యింది. విద్యుత్, మైనింగ్, తయారీ రంగాలు మంచి పనితీరును ప్రదర్శించినట్లు జాతీయ గణాంకాల కార్యాలయం లెక్కలు వెల్లడించాయి. ఇక రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్య పరపతి విధాన సమీక్షకు ప్రాతిపదిక అయిన రిటైల్ ద్రవ్యోల్బణం మార్చిలో 5.66 శాతం పెరిగింది. అంటే 2022 ఇదే నెలతో పోల్చితే ఈ ఉత్పత్తుల బాస్కెట్ ధర 5.66 శాతమే పెరిగిందన్నమాట. గడచిన 15 నెలల్లో ఇంత తక్కువ స్థాయిలో రిటైల్ ద్రవ్యోల్బణం నమోదుకావడం ఇదే తొలిసారి. ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశాల ప్రకారం, రిటైల్ ద్రవ్యోల్బణం 6 శాతం లోపు ఉండాలి. అయితే 2022 నవంబర్, డిసెంబర్ మినహా 2022 జనవరి నుంచి 6 శాతం ఎగువనే కొనసాగుతోంది.

కూరగాయల ధరలు కూల్...

వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత గణాంకాల ప్రకారం మార్చిలో కూరగాయలు, ప్రొటీన్ రిచ్ ఆహార పదార్థాల ధరలు తగ్గాయి. కూరగాయల ధరలు 8.51 శాతం తగ్గాయి (2022 ఇదే నెలతో పోల్చి). ఆయిల్ అండ్ ఫ్యాట్స్ ధరలు 7.86 శాతం దిగిరాగా, చేపల ధర 1.42 శాతం దిగివచ్చింది. అయితే సుగంధ ద్రవ్యాల ధరలు మాత్రం భారీగా 18.2 శాతం ఎగశాయి. తృణ ధాన్యాలు–ఉత్పత్తుల ధరలు 15.27 శాతం ఎగశాయి. పండ్ల ధరలు కూడా పెరిగాయి. ఫుడ్ బాస్కెట్ ద్రవ్యోల్బణం 2023 ఫిబ్రవరిలో 5.95 శాతం వద్ద ఉంటే, మార్చిలో 4.79 శాతానికి తగ్గింది. 2022 ఇదే నెల్లో ఈ ద్రవ్యోల్బణం రేటు 7.68 శాతంగా ఉంది.

ఆటోమొబైల్ కింగ్ కేశుబ్ మహీంద్రా ఇకలేరు



ముంబై: భారత్ ఆటో పరిశ్రమకు మార్గదర్శకులు, మహీంద్రా అండ్ మహీంద్రా గౌరవ చైర్మన్ కేశుబ్ మహీంద్రా బుధవారం ఇక్కడ తుది శ్వాస విడిచారు. 99 సంవత్సరాల కేశుబ్ మహీంద్రా బుధవారం ఉదయం ఇంట్లో ప్రశాంతంగా తుదిశ్వాస విడిచినట్లు కంపెనీ ప్రకటన తెలిపింది. కేశుబ్ మహీంద్రా గ్రూప్‌నకు 48 ఏళ్ల పాటు చైర్మన్‌గా వ్యవహరించారు. ఆటోమొబైల్ పరిశ్రమ నుంచి ఐటీ, రియల్ ఎస్టేట్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఆతిథ్యం వంటి ఇతర వ్యాపార విభాగాలకు గ్రూప్ కార్యకలాపాలను విస్తరించారు. విల్లీస్ కార్పొరేషన్, మిత్సుబిషి, ఇంటర్నేషనల్ హార్వెస్టర్, యునైటెడ్ టెక్నాలజీస్, బ్రిటీష్ టెలికం తదితర అనేక ఇతర ప్రపంచ దిగ్గజ సంస్థలతో వ్యాపార సంబంధాలను ఏర్పరచడంలో అతను కీలక పాత్ర పోషించారు. అక్టోబరు 9వ తేదీ 1923న సిమ్లాలో జన్మించిన కేశుబ్, అమెరికా పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయంలోని వార్టన్‌లో గ్రాడ్యుయేట్ చేసి, 1947లో మహీంద్రా అండ్ మహీంద్రాలో చేరారు. 1963లో చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. స్టీల్ ట్రేడింగ్ కంపెనీ నుండి 15.4 బిలియన్ డాలర్ల వరకూ ఆయన పర్యవేక్షణలో గ్రూప్ వివిధ రంగాలకు విస్తరించింది. మహీంద్రా బోర్డులో డైరెక్టర్లలో ఒకరిగా 64 సంవత్సరాలు కొనసాగిన కేశుబ్ మహీంద్రా 2012లో గ్రూప్ పగ్గాలను ఆయన మేనల్లుడు, అప్పటి వైస్ చైర్మన్, ఎండీ ఆనంద్ మహీంద్రాకు అప్పగించారు.

నైతిక విలువలకు పెద్దపీట

'నైతిక విలువలకు, సూత్రాలకు కట్టుబడి ఉన్న అత్యున్నత వ్యక్తిత్వం ఆయనది. నీతి, విలువలు, మంచి కార్పొరేట్ పరిపాలనకు సంబంధించి మా వ్యవస్థాపకుల వారసత్వాన్ని సంరక్షించడానికి ముందుండి నాయకత్వం వహించారు. చురుకైన వ్యాపార నైపుణ్యతకు ఆయన ప్రతీక. మహీంద్రా భారీ విస్తరణకు ఈ నైపుణ్యత దోహదపడింది. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ఆయన అనుసరించిన విధానాలు ఆయనను ప్రపంచ స్థాయి బిజినెస్ ఐకాన్‌గా మలచడమే కాకుండా, అందరిలో ఆయన పట్ల ప్రేమాభిమానాలు, గౌరవ మర్యాదలు పెరగడానికి దారితీశాయి' అని మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా వ్యాఖ్యానించారు.

'డిఫాల్ట్' చార్జీల వడ్డింపుపై ఆర్‌బీఐ ఆదేశాలు



ముంబై: రుణాలు డిఫాల్ట్ అయిన కస్టమర్లపై బ్యాంకులు అదనపు వడ్డీ, చార్జీలు విధించి దాన్ని అసలుకు కలిపే విధానానికి చెక్ పెట్టేలా రిజర్వ్ బ్యాంక్ ప్రతిపాదనలు చేసింది. జరిమానాగా వడ్డించే చార్జీల పరిమాణం అనేది డిఫాల్ట్ అయిన మొత్తానికి అనుగుణంగా మాత్రమే ఉండాలని సహేతుక రుణ విధానాలపై విడుదల చేసిన ఒక సర్క్యులర్ ముసాయిదాలో పేర్కొంది. తీసుకున్న రుణాన్ని రుణగ్రహీత సక్రమంగా తిరిగి చెల్లించేలా చూడటమే జరిమానాల ప్రధాన ఉద్దేశ్యమని, వాటిని ఆదాయ వనరుగా బ్యాంకులు భావించరాదని సూచించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

13-4-2023	
విశాఖ	420-00
చిత్తూరు	428-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	385-00
విజయవాడ	385-00
రిటైల్ ధర (డజను)	66.00
12-4-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	363-00
వరంగల్	365-00
రిటైల్ ధర	4.25

టీసీఎస్.. భేష్

- క్యూ4 నికర లాభం రూ. 11,392 కోట్లు
- మొత్తం ఆదాయం రూ. 59,162 కోట్లు
- కొత్తగా 10 బిలియన్ డాలర్ల ఆర్డర్లు
- 2022–23లో లాభం రూ. 42,147 కోట్లు

> మరోసారి పటిష్ట ఫలితాలు ప్రకటించినందుకు సంతృప్తిగా ఉన్నాం. మా సర్వీసులకున్న డిమాండును ఆర్డర్‌బుక్ ప్రతిఫలిస్తోంది. రిటైల్, కన్జూమర్, లైఫ్ సైన్సెస్, హెల్త్‌కేర్ విభాగాలు 13–12 శాతం వృద్ధిని సాధించాయి. బీఎఫ్‌ఎస్‌ఐ 9 శాతంపైగా పుంజుకుంది.
> – రాజేష్ గోపీనాథన్, సీఈవో, టీసీఎస్



2022-23 క్యూ4 ఆర్థిక ఫలితాలను వెల్లడిస్తున్న సంస్థకు కాబోయే ఎండీ, సీఈవో కృతివాసన్, (ఎడమ వ్యక్తి), ప్రస్తుత ఎండీ, సీఈవో రాజేష్ గోపినాథన్

ముంబై: సాఫ్ట్‌వేర్ సేవల నంబర్‌వన్ దేశీ దిగ్గజం టీసీఎస్ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన క్యూ4(జనవరి–మార్చి)లో నికర లాభం 15 శాతం ఎగసి రూ. 11,392 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2021–22) ఇదే కాలంలో రూ. 9,959 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 17 శాతం బలపడి రూ. 59,162 కోట్లకు చేరింది. అంతక్రితం రూ. 50,591 కోట్ల ఆదాయం నమోదైంది. రూ. 41,440 కోట్ల ఫ్రీ క్యాష్‌ఫ్లోను ఆర్జించినట్లు కంపెనీ వెల్లడించింది.

పూర్తి ఏడాదికి

మార్చితో ముగిసిన గతేడాదికి టీసీఎస్ 10 శాతం అధికంగా రూ. 42,147 కోట్ల నికర లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం 18 శాతం వృద్ధితో రూ. 2,25,458 కోట్లను తాకింది. కాగా.. కొత్త సీఈవో, ఎండీగా ఎంపికైన కె.కృతివాసన్ ప్రస్తుత సీఈవో రాజేష్ గోపీనాథన్ నుంచి జూన్1న బాధ్యతలు స్వీకరించనున్నట్లు టీసీఎస్ పేర్కొంది.

ఆర్డర్ బుక్ జోరు

గతేడాది ఆర్డర్‌బుక్ 34.1 బిలియన్ డాలర్లకు చేరినట్లు టీసీఎస్ వెల్లడించింది. క్యూ4లో 10 బిలియన్ డాలర్లు జమైనట్లు తెలియజేసింది. చరిత్రాత్మక స్థాయిలో భారీ డీల్స్ సాధించినట్లు పేర్కొంది. 10 కోట్లకుపైగా డాలర్ల క్లయింట్ల సంఖ్య 60కు చేరింది. బ్యాంకింగ్ రంగం సవాళ్లు ఎదుర్కొంటున్నప్పటికీ ఉత్తర అమెరికా నుంచి 15 శాతంపైగా వృద్ధి సాధించినట్లు పేర్కొంది.

ఇతర హైలైట్స్

- షేరుకి రూ. 24 తుది డివిడెండ్ ప్రకటించింది.
- నిర్వహణ లాభ మార్జిన్లు 24.1 శాతం నుంచి 24.5 శాతానికి బలపడ్డాయి.
- నికర మార్జిన్లు సైతం 18.7 శాతం నుంచి 19.3 శాతానికి మెరుగుపడ్డాయి.
- క్యూ4లో నికరంగా 821మందిని, పూర్తిఏడాదిలో 22,600 మందిని జమ చేసుకుంది.
- మొత్తం సిబ్బంది సంఖ్య 6,14,795ను తాకింది. దీనిలో మహిళల వాటా 35.7 శాతం.
- ఉద్యోగ వలసల రేటు 20.1%గా నమోదైంది.
- ఈ ఆర్థిక సంవత్సరం(2023–24) 40,000 మంది ఫ్రెషర్స్‌కు ఉపాధి కల్పించనుంది.

ఫలితాల నేపథ్యంలో టీసీఎస్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 1 శాతం బలపడి రూ. 3,246 వద్ద ముగిసింది.

ఏడువారాల గరిష్టానికి సూచీలు

- సెన్సెక్స్ 235 పాయింట్లు ప్లస్
- 17,800 స్థాయి పైకి నిఫ్టీ
- ఎనిమిదోరోజూ కొనసాగిన ర్యాలీ
- ఐటీ, ఫార్మా, ఆటో షేర్లకు డిమాండ్



ముంబై: ఐటీ, ఫార్మా, ఆటో షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు ఎనిమిదో రోజూ పరుగులు తీశాయి. యూరప్ మార్కెట్ల నుంచి పటిష్ట సంకేతాలు, విదేశీ పెట్టుబడుల నిరంతర రాక, రూపాయి ర్యాలీ అంశాలు సెంటిమెంట్‌ను బలపరిచాయి. అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం ఇన్ఫోసిస్, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ షేర్లు ఒకశాతం వరకు రాణించి సూచీలకు దన్నుగా నిలిచాయి. సెన్సెక్స్ 60,438 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 235 పాయింట్ల లాభంతో 60,393 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 17,826 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని చేరింది. ఆఖరికి 90 పాయింట్లు బలపడి 17,812 వద్ద నిలిచింది. ఈ ముగింపు ఇరు సూచీలకు 7 వారాల గరిష్టం. ఎఫ్‌ఎంసీజీ, యుటిలిటీ, క్యాపిటల్ గూడ్స్, ఇంధన షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,906 కోట్ల షేర్లను కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.225 కోట్ల షేర్లను అమ్మేశారు. ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్లను నిర్ణయించే యూఎస్ రిటైల్ ద్రవ్యల్బోణ డేటా వెల్లడి ముందు అంతర్జాతీయ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- ఐటీ దిగ్గజ కంపెనీ టీసీఎస్ నాలుగో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు మెప్పించవచ్చనే అంచనాలతో ఈ షేరుతో పాటు ఈ సెక్టార్ షేర్లన్నింటికి డిమాండ్ నెలకొంది. ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్, విప్రో, ఎంఫసిస్ షేర్లు 2–1% బలపడ్డాయి.
- మార్చి ఎగుమతి అమ్మకాలు పెరగడంతో దివీస్ ల్యాబ్స్ 10% బలపడి రూ.3212 వద్ద నిలిచింది.
- ఇన్వెస్టర్ల సంపదగా బీఎస్‌ఈలో రూ.1.15 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. గత ఎనిమిది రోజుల్లో సెన్సెక్స్ 2,779 పాయింట్లు, నిఫ్టీ 860 పాయింట్లు చొప్పున పెరిగాయి.

డివిడెండ్ ప్రకటించిన మోల్డ్‌టెక్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్యాకేజింగ్ రంగంలో ఉన్న మోల్డ్‌టెక్ ప్యాకేజింగ్ 2022–23 ఏడాదిగాను రూ.5 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై రూ. 4 మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ఇంజనీరింగ్ సర్వీసుల్లో ఉన్న మోల్డ్‌టెక్ టెక్నాలజీస్ 2022–23 సంవత్సరానికిగాను రూ.2 ముఖ విలువ గల ఒక్కో షేరుపై 100% మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. మే 11లోగా డివిడెండ్ చెల్లించనున్నట్లు ఇరు కంపెనీలు బుధవారం ప్రకటించాయి.

ఇంటర్‌తోనే ఐఐఎంలో ఎంబీఏ

ఆఫ్టర్ ఇంటర్

ఇంటర్‌తోనే మేనేజ్‌మెంట్ విద్యను అభ్యసించాలనుకునే వారికి చక్కటి అవకాశం. అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్(ఐపీఎం) కోర్సుల్లో ప్రవేశానికి ఐఐఎం ఇండోర్ ప్రకటన విడుదల చేసింది. అందుబాటులో ఉన్న మొత్తం సీట్ల సంఖ్య 150. రాత పరీక్ష, ఇంటర్వ్యూల్లో చూపిన ప్రతిభ ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు.

అర్హత

- 2021 లేదా 2022లో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తుకు అర్హులు. ప్రస్తుతం ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. పదో తరగతి, ఇంటర్‌లో కనీసం 60శాతం మార్కులు సాధించడం తప్పనిసరి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులైతే 55 శాతం మార్కులు సాధిస్తే సరిపోతుంది.
- **వయసు:** ఆగస్టు 01, 2003 తర్వాత జన్మించిన వారై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు ఆగస్టు 01, 1998 తర్వాత జన్మించినా దరఖాస్తు చేసుకోవచ్చు.

కోర్సు స్వరూపం

- ఐఐఎం ఇండోర్ ఐదేళ్ల ఐపీఎం కోర్సును 2011 నుంచి అందిస్తోంది. అయిదేళ్ల ఈ కోర్సులో ఏడాదికి మూడు చొప్పున మొత్తం 15 టర్మ్‌లుంటాయి. ఒక్కో టర్మ్ కాలవ్యవధి 3 నెలలు ఉంటుంది. కోర్సులో రెండు భాగాలుంటాయి. మొదటి భాగంలో ఫౌండేషన్ అంశాలపై దృష్టి సారిస్తారు. రెండో భాగంలో మేనేజ్‌మెంట్ విద్యలో మెలకువలను నేర్పిస్తారు. మొదటి మూడేళ్లు భావవ్యక్తీకరణ నైపుణ్యాలు, మేనేజ్‌మెంట్ విద్య బేసిక్స్, నైతిక విలువలను అర్థం చేసుకునే నైపుణ్యం, శారీరక ఆరోగ్యం తదితర అంశాలపై దృష్టి సారిస్తారు. చివరి రెండేళ్లు లక్ష్యం దిశగా బోధన ఉంటుంది.
- ఐదేళ్ల కోర్సును పూర్తిచేసుకున్న వారికి బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్(ఫౌండేషన్ ఆఫ్ మేనేజ్‌మెంట్), మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎంబీఏ) డ్యూయల్ డిగ్రీలను ప్రధానం చేస్తారు. కోర్సు ఫీజు, వసతి, ఇతర సౌకర్యాలు కలుపుకొని మొదటి మూడేళ్లు ఏడాదికి రూ.5లక్షలు. చివరి రెండేళ్లు డిగ్రీ తర్వాత క్యాట్‌తో పీజీపీలో చేరిన వారు చెల్లించే ఫీజును వసూలు చేస్తారు.

ఎంపిక ఇలా

ఆప్టిట్యూడ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూలో సాధించిన స్కోరు ఆధారంగా అడ్మిషన్ లభిస్తుంది. అకడమిక్ సామర్థ్యాలు, కో కరిక్యులర్ యాక్టివిటీస్‌ను పరీక్షిస్తారు. రాత పరీక్షలో ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, ఇంగ్లిష్, మ్యాథ్స్ నైపుణ్యాలు తెలుసుకునేలా ప్రశ్నలు వస్తాయి. ఇందులో అర్హత సాధించిన వారికి ఐఐఎం ప్రొఫెసర్ల ఆధ్వర్యంలో పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది. ఇందులో ప్రధానంగా విద్యార్థుల ఆత్మవిశ్వాసం, అవగాహన సామర్థ్యాలు, భావవ్యక్తీకరణ తదితరాలను పరిశీలిస్తారు.

ఆప్టిట్యూడ్ టెస్ట్

మొత్తం 100 ప్రశ్నలకు పరీక్ష ఉంటుంది. ఇందులో క్వాంటిటేటివ్ ఎబిలిటీ మల్టిపుల్ చాయిస్ విభాగంలో 40 ప్రశ్నలను 40 నిమిషాల్లో పూర్తిచేయాలి. క్వాంటిటేటివ్ ఎబిలిటీ షార్ట్ ఆన్సర్ ప్రశ్నలు 20 వస్తాయి. వీటికి 40 నిమిషాల సమయం ఉంటుంది. వెర్బల్ ఎబిలిటీ మల్టిపుల్ చాయిస్ 40 ప్రశ్నలకు 40 నిమిషాల సమయం ఉంటుంది. మొత్తం 100 ప్రశ్నలను 2 గంటల్లో పూర్తిచేయాలి. ప్రతి ప్రశ్నకు 4 మార్కులు, ప్రతి తప్పు జవాబుకు ఒక మార్కు తగ్గిస్తారు. షార్ట్ ఆన్సర్స్ ప్రశ్నలకు రుణాత్మక మార్కులులేవు.

- అప్టిట్యూడ్ టెస్ట్‌లో సెక్షన్లవారీ అర్హత సాధించిన వారిని ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. ఆప్టిట్యూడ్‌కు 65 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూ 35 శాతం వెయిటేజీ ఉంటుంది. ఈ వెయిటేజీ ప్రకారం -తుది జాబితా రూపొందించి, మెరిట్, రిజర్వేషన్లను అనుసరించి ప్రవేశాలు కల్పిస్తారు.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **దరఖాస్తులకు చివరి తేదీ:** ఏప్రిల్ 14, 2023
- **పరీక్ష తేదీ:** జూన్ 16, 2023
- **వెబ్‌సైట్ :** https://www.iimidr.ac.in

విద్య, ఉద్యోగ సమాచారం

సాహిత్య అకాడమీ, న్యూఢిల్లీలో వివిధ ఉద్యోగాలు

న్యూఢిల్లీలోని సాహిత్య అకాడమీ.. వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 06
- **పోస్టుల వివరాలు:** డిప్యూటీ సెక్రటరీ, రీజనల్ సెక్రటరీ, ప్రోగ్రామ్ ఆఫీసర్.
- **అర్హత:** పీజీ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. వయసు: 40 నుంచి 50 ఏళ్లు ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.56,100 నుంచి రూ.2,08,700 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష/స్కిల్ టెస్ట్/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును సెక్రటరీ, సాహిత్య అకాడమీ, రవీంద్ర భవన్, 35 ఫిరోజ్‌షా రోడ్, న్యూఢిల్లీ–110001 చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** ఉద్యోగ ప్రకటన వెలువడిన 30 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.
- **వెబ్‌సైట్:** www.sahityaakademi.gov.in

ఆర్కిటెక్చర్‌తో.. కెరీర్ నిర్మించుకుంటారా!

బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కోర్సుపై విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతోంది. వీరికి చక్కటి అవకాశంగా నాటాను పేర్కొనొచ్చు. నాటా అంటే.. నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్! నాటా స్కోర్‌తో దేశంలోని టాప్ ఇన్‌స్టిట్యూట్స్‌లో బీఆర్క్ ప్రోగ్రామ్‌లో ప్రవేశించే అవకాశం లభిస్తుంది. ఆ తర్వాత ఆర్కిటెక్చర్ ఇంజనీర్‌గా అద్భుత అవకాశాలు అందుకోవచ్చు. తాజాగా.. 2023 సంవత్సరానికి సంబంధించి నాటా–2023 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. నాటాతో ప్రయోజనాలు, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు తదితర వివరాలు...

- బీఆర్క్ కోర్సులో ప్రవేశానికి నాటా
- సీఓఏ ఆధ్వర్యంలో ఈ ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహణ
- జాతీయ స్థాయిలో 450కు పైగా ఇన్‌స్టిట్యూట్‌లు
- 2023 సంవత్సరం నాటా–2023 ప్రక్రియ ప్రారంభం
- ఈ ఏడాది కూడా మూడుసార్లు నాటా పరీక్ష నిర్వహణ



నాటా 2023

కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్

ఆర్కిటెక్చర్ ఇంజనీరింగ్ వందల ఏళ్ల నుంచి మనుగడలో ఉంది. ఎన్నో చారిత్రక కట్టడాలకు ఆర్కిటెక్చర్ ఇంజనీరింగ్ నైపుణ్యాలే మూలం. ఆధునిక సాంకేతికతలు, పరిస్థితులకు తగ్గట్టు ఆర్కిటెక్చర్ విభాగంలో నిపుణులను తయారు చేసేందుకు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అయిదు దశాబ్దాల క్రితం ఏర్పాటైన సంస్థ.. కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్(సీఓఏ). ఈ సంస్థ జాతీయ స్థాయిలో ఆర్కిటెక్చర్ ఇంజనీరింగ్ విద్య, ఇన్‌స్టిట్యూట్‌ల విషయంలో నియంత్రణ సంస్థగా వ్యవహరిస్తోంది. ఆర్కిటెక్చర్ ఇంజనీరింగ్ కోర్సులు అందించే ఇన్‌స్టిట్యూట్‌లు సీఓఏ గుర్తింపు పొందాల్సి ఉంటుంది. ఈ ఇన్‌స్టిట్యూట్స్‌లో ఆయా కోర్సుల్లో ప్రవేశాలను కూడా సీఓఏ పర్యవేక్షిస్తుంది. బ్యాచిలర్ స్థాయిలో బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఇంజనీరింగ్‌లో ప్రవేశాలకు ప్రత్యేకంగా..జాతీయ స్థాయిలో నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్(నాటా) పేరిట ప్రత్యేక ప్రవేశ పరీక్ష నిర్వహిస్తోంది.

అర్హత

- ఎంపీసీ గ్రూప్‌తో 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత(లేదా)..మూడేళ్ల డిప్లొమాలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి.
- 2023లో చివరి సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

నాటా మార్గం

బీఆర్క్‌లో చేరాలనుకునే విద్యార్థులకు చక్కటి మార్గంగా నిలుస్తోంది.. నాటా. ఈ టెస్ట్‌లో స్కోర్ ఆధారంగా కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్‌లలో బీఆర్క్‌లో ప్రవేశానికి అర్హత లభిస్తుంది. తాజా గణాంకాల ప్రకారం–ప్రస్తుతం జాతీయ స్థాయిలో 450కు పైగా ఇన్‌స్టిట్యూట్‌లు నాటా స్కోర్ ఆధారంగా బీఆర్క్‌లో ప్రవేశం కల్పిస్తున్నాయి.

125 ప్రశ్నలు-200 మార్కులు

మొత్తం 125 ప్రశ్నలతో 200 మార్కులకు నాటా పరీక్ష నిర్వహిస్తారు. నిర్దేశిత విభాగాల నుంచి మల్టిపుల్ ఛాయిస్ కొశ్చన్స్, మల్టిపుల్ సెలక్ట్ కొశ్చన్స్(ఒకటి కంటే ఎక్కువ సమాధానాలు ఉండే ప్రశ్నలు), ప్రిఫరెన్షియల్ ఛాయిస్ టైప్ కొశ్చన్స్, న్యూమరికల్ ఆన్సర్ టైప్ కొశ్చన్స్, మ్యాచ్ ద ఫాలోయింగ్ టైప్ కొశ్చన్స్ అడుగుతారు.

విశ్లేషణ, పరిశీలన

ఆయా విభాగాల్లో సునిశిత పరిశీలన, తార్కిక విశ్లేషణను పరిశీలించేలా ప్రశ్నలు అడుగుతారు. పరీక్షలో కూడా డైనమిక్ రీజనింగ్, న్యూమరికల్ రీజనింగ్, వెర్బల్ రీజనింగ్, ఇండక్టివ్ రీజనింగ్, సిట్యుయేషనల్ జడ్జ్‌మెంట్, లాజికల్ రీజనింగ్, అబ్‌స్ట్రాక్ట్ రీజనింగ్ విభాగాల నుంచి ప్రశ్నలు ఎదురవుతాయి.

నాటా-2023.. మూడు విడతలు

- నాటా–2023ని మూడు విడతలుగా నిర్వహించనున్నారు. అభ్యర్థులు తమకు ఆసక్తి ఉన్న విడత పరీక్షకు హాజరు కావచ్చు. మొత్తం మూడు విడతల పరీక్షలకు కూడా హాజరు కావచ్చు. ఇలా ఒకటి కంటే ఎక్కువసార్లు హాజరయ్యే అభ్యర్థుల స్కోర్ నిర్ధారించేందుకు.. నిర్దిష్ట విధానాలను అవలంబిస్తారు.
- రెండుసార్లు పరీక్షకు హాజరైతే బెస్ట్ స్కోర్ వచ్చిన విడతను పరిగణనలోకి తీసుకుంటారు.
- మూడు విడతలకు హాజరైతే బెస్ట్ స్కోర్ వచ్చిన రెండు విడతలను కలిపి..వాటి సగటు స్కోర్‌ను తుది స్కోర్‌గా పరిగణిస్తారు.
- ఇలా పలు విడతల్లో హాజరయ్యే అవకాశం కల్పించడం ద్వారా ఒక అటెంప్ట్‌లో సరైన ప్రతిభ చూపలేదని భావిస్తే.. మరో అటెంప్ట్‌కు మరింత సమర్థవంతంగా సన్నద్ధమై మరిన్ని మార్కులు, స్కోర్ సొంతం చేసుకునే అవకాశం లభిస్తోంది.

మెరుగైన స్కోర్‌కు మార్గాలివే

దయాగ్రమెటిక్ రీజనింగ్

ఈ విభాగంలో అభ్యర్థుల సృజనాత్మకత, ఊహాత్మక దృష్టిని పరిశీలించేలా ప్రశ్నలు అడుగుతారు. నిర్దిష్టంగా ఒక ఒక సందర్భాన్ని, సన్నివేశాన్ని ఊహించి విశ్లేషించి సమాధానాలు ఇవ్వాల్సిన విధంగా ప్రశ్నలు ఉంటాయి. స్కెచ్ విజువలైజేషన్, క్రియేటివిటీ, స్కేల్ అండ్ ప్రపోర్షన్ ఆఫ్ ఆబ్జెక్ట్, జియోమెట్రిక్ కంపోజిషన్, బిల్డింగ్ ఫామ్స్, ఎలిమెంట్స్, కలర్ టెక్చ్సర్, హార్మోనీ అండ్ కాంట్రాస్ట్, డ్రాయింగ్ ఆఫ్ ప్యాట్రన్, ఫామ్ ట్రాన్స్‌ఫర్మేషన్స్, ఇన్ 2డీ, 3డీ, సబ్‌స్ట్రాక్షన్, రొటేషన్, సర్ఫేసెస్ అండ్ వాల్యుమ్స్, జనరేటింగ్ వంటి అంశాలపై ప్రశ్నలు అడుగుతారు.

న్యూమరికల్ రీజనింగ్

ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీ నుంచి ప్రశ్నలు వచ్చే విభాగం ఇది. ఇందులో రాణించాలంటే.. అభ్యర్థులు జామెట్రీ, ట్రిగ్నోమెట్రీ, కాలిక్యులస్, ఇంటీజర్స్ వంటి మ్యాథమెటిక్స్ అంశాలపై దృష్టి పెట్టాలి. ఫిజిక్స్‌కు సంబంధించి ఎలక్ట్రోస్టాటిస్టిక్స్, కరెంట్ ఎలక్ట్రిసిటీ, మ్యాగ్నటిజం, రే ఆప్టిక్స్, రేడియేషన్, ఆటమ్స్ అండ్ న్యూక్లియస్ వంటి ముఖ్యాంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

వెర్బల్ రీజనింగ్

ఈ విభాగంలో రాణించాలంటే.. అభ్యర్థులు వర్డ్ సీక్వెన్స్, పజిల్స్, సిలాజిజమ్, అనాలజీ, క్లాసిఫికేషన్, బ్లడ్ రిలేషన్, కోడింగ్, డీ–కోడింగ్, క్యాలెండర్, డైరెక్షన్స్ వంటి అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

ఇండక్టివ్ రీజనింగ్

ఈ విభాగంలో డేటా ఆధారిత ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు నిర్దిష్టంగా ఒక డేటా, లేదా టేబుల్స్‌ను పరిశీలించి వాటికి సంబంధించి పలు ప్యాట్రన్‌లను విశ్లేషించాల్సి ఉంటుంది. డేటా ఇంటర్‌ప్రిటేషన్ సంబంధిత అంశాలను ప్రాక్టీస్ చేయడం ఉపయుక్తంగా ఉంటుంది.

సిట్యుయేషనల్ జడ్జ్‌మెంట్

అభ్యర్థుల్లోని ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్‌ను పరిశీలించే విధంగా ఈ విభాగంలో ప్రశ్నలను అడుగుతారు.ఏదైనా ఒక అంశాన్ని లేదా దృశ్యాన్ని చూపించి అందులోని పొరపాట్లు,వాటికి పరిష్కారం చూపే విధంగా సమాధానాల్ని గుర్తించాల్సి ఉంటుంది.

అబ్‌స్ట్రాక్ట్ రీజనింగ్

జనరల్ నాలెడ్జ్‌తోపాటు వర్తమాన అంశాలు, లేదా ఏదైనా ఒక అంశానికి సంబంధించి తాజా పరిస్థితులపై అవగాహనను తెలుసుకునే విధంగా ప్రశ్నలు ఉంటాయి. అభ్యర్థులు స్టాక్ జీకే, కరెంట్ అఫైర్స్, ఆర్కిటెక్చర్ విభాగంలోని తాజా పరిణామాల గురించి తెలుసుకోవాలి. స్టాక్ జీకే విషయంలో ప్రధానంగా.. అంతర్జాతీయ ప్రాధాన్యం ఉన్న కట్టడాలు, రూపకర్తలు, కరెంట్ అఫైర్స్ అంశాలపై దృష్టి పెట్టాలి.

విస్తృత అవకాశాలు

నాటా స్కోర్ ద్వారా సీఓఏ గుర్తింపు ఇన్‌స్టిట్యూట్స్‌లో అయిదేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కోర్సులో ప్రవేశించిన వారికి.. కోర్సు పూర్తయిన తర్వాత.. ప్రైవేట్ రంగంతోపాటు ప్రభుత్వ విభాగాల్లోనూ ఉద్యోగాలు లభిస్తున్నాయి. పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్, మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ రైల్వే, పోస్ట్ అండ్ టెలిగ్రాఫ్, పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్, నేషనల్ బిల్డింగ్, ఆర్గనైజేషన్స్, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్.. ఇలా వివిధ ప్రభుత్వ విభాగాల్లో కొలువులు లభిస్తాయి.

నాటా-2023 ముఖ్య సమాచారం

దరఖాస్తు విధానం: మూడు విడతలుగా నిర్వహించనున్న నాటాకు వేర్వేరుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. -మొదటి విడత దరఖాస్తులకు చివరి తేది ఏప్రిల్ 13, 2023. పరీక్ష ఏప్రిల్ 21వ తేదీన జరుగుతుంది. హాల్‌టికెట్లు ఏప్రిల్ 18 నుంచి అందుబాటులోకి వస్తాయి.

రెండో విడత ముఖ్య తేదీలు

- ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు: మార్చి 20 – మే 13
- ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ: మే 9 – మే 13
- అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్: మే 21 నుంచి
- నాటా రెండో విడత పరీక్ష తేదీ: మే 28, 2023
- ఫలితాల వెల్లడి: జూన్ 5

మూడో విడత ముఖ్య తేదీలు

- ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు: మార్చి 20–జూన్ 24
- ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ: జూన్ 20–జూన్ 24
- అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్: జూలై 2 నుంచి
- నాటా మూడో విడత పరీక్ష తేదీ: జూలై 9
- ఫలితాల వెల్లడి: జూలై 17
- మూడు విడతల్లోనూ పరీక్షలను ఉదయం 10 నుంచి 1 వరకు; మధ్యాహ్నం 2:30 నుంచి 5:30 వరకు నిర్వహిస్తారు.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** గుంటూరు, కాకినడా, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్
- వెబ్‌సైట్: https://www.nata.in

క్లుప్తంగా...



బుధవారం హైదరాబాద్ బీఆర్కేఆర్ భవన్‌లో తనను మర్యాదపూర్వకంగా కలిసిన ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జాక్వెలిన్ హుఘ్స్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

రూ.4 కోట్ల మోసగాడు.. 28 ఏళ్లకు చిక్కాడు



వీఎస్ క్షీర్‌సాగర్

సాక్షి, హైదరాబాద్: ఓ ఆర్థిక మోసం కేసులో 28 ఏళ్లుగా తప్పించుకు తిరుగుతున్న నేరస్తుడిని తెలంగాణ సీఐడీ పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కొత్తూర్ పోలీస్ స్టేషన్‌లో 1995 నమోదైన కేసులో నిందితుడిగా వీఎస్ క్షీర్‌సాగర్‌ను అరెస్టు చేసినట్టు సీఐడీ అడిషనల్ డీజీ మహేశ్‌భగవత్ తెలిపారు. బుధవారం ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో కేసు వివరాలు వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా, కొత్తూరు మండలం నందిగాన్ గ్రామ పరిధిలో 1995లో వానిసింగ్ కంపెనీ పేరిట ఓ స్టీల్ కంపెనీని స్థాపించారు. స్థానికులకు కంపెనీలో షేర్లపేరిట మొత్తం రూ.4.3 కోట్లు సదరు కంపెనీ నిర్వాహకులు వసూలు చేశారు.ఈ మొత్తంలో రూ.4 కోట్లను1995లో ముంబైలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండోర్‌లో దాదర్ బ్రాంచ్‌లో బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేస్తున్న వీఎస్ క్షీర్‌సాగర్ కొట్టేశాడు. కంపెనీ దివాళా తీయడంతో ఎంతోమంది అమాయకులు డబ్బులు పోగొట్టుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసిన సీఐడీ అధికారులు దర్యాప్తు చేపట్టారు. నిందితుడిపై జారీ అయిన నాన్ బెయిలబుల్ వారెంటును ఎట్టకేలకు అమలు చేస్తూ నిందితుడిని ఇండోర్ పట్టణంలో అరెస్టు చేశారు. నిందితుడి అరెస్టులో కీలకంగా పనిచేసిన సీఐడీ ఇన్‌స్పెక్టర్ ఎస్ వెంకటేశ్, ఎస్సై పి నాగార్జున, హెడ్ కానిస్టేబుల్ ఎం.గోపాల్‌లను సీఐడీ అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ అభినందించారు.

24 నుంచి కొత్త సచివాలయంలోకి..

ఫైళ్లు, కంప్యూటర్లు తరలించాలని ప్రభుత్వ ఆదేశం



సాక్షి, హైదరాబాద్: కొత్తగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయంలోకి అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాల తరలింపును ఈ నెల 24 నుంచి ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ నెల 30న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు సచివాలయాన్ని ప్రారంభించనున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం బీఆర్కేఆర్ భవన్‌లో తాత్కాలికంగా సచివాలయాన్ని నిర్వహిస్తున్న విషయం విదితమే. అక్కడి నుంచి అన్ని శాఖల ఫైళ్ల, కంప్యూటర్లను మాత్రమే కొత్త సచివాలయంలోకి తరలించాలని ప్రభుత్వం సూచించింది. బీఆర్కేఆర్ భవన్‌లో ఉన్న ఫర్నిచర్‌ను తీసుకుని రావద్దని, కొత్త సచివాలయంలో పూర్తి స్థాయిలో ఫర్నిచర్‌ను ఏర్పాటు చేసినట్టు స్పష్టం చేసింది.

మార్క్‌ఫెడ్ గోల్డ్ కంపోస్ట్

40 కిలోల బస్తా ధర రూ.700

సాక్షి, హైదరాబాద్: బయో ఫెర్టిలైజర్ వ్యాపారంలోకి అడుగుపెట్టాలని మార్క్‌ఫెడ్ నిర్ణయించింది. పంటలకు రసాయన ఎరువులను తగ్గించేందుకు 'మార్క్‌ఫెడ్ గోల్డ్ కంపోస్ట్' పేరుతో సేంద్రియ ఎరువును మార్కెట్లోకి తీసుకురానుంది. వచ్చే నెలలో దీన్ని ప్రారంభించి, నెలాఖరులోగా రైతులకు అందుబాటులోకి తెస్తామని మార్క్‌ఫెడ్ వర్గాలు తెలిపాయి. 40 కిలోల బ్యాగ్ ధరను రూ. 700గా నిర్ణయించారు. వరి, మొక్కజొన్న, పత్తితో పాటు ఉద్యాన పంటలకూ వినియోగించేలా... నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం రాంపూర్ గ్రామంలో విశ్వ ఆగ్రోటెక్ ఆధ్వర్యంలో పెద్ద ప్లాంట్ నిర్మించి దీన్ని తయారు చేస్తున్నారు. ఈ సంస్థతో ఒప్పందం చేసుకున్న మార్క్‌ఫెడ్ బయోఫెర్టిలైజర్‌ను రైతులకు అందుబాటులోకి తీసుకురానుంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఎరువుల దుకాణాలతో పాటు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లోనూ వీటిని రైతులకు అందుబాటులో ఉంచాలని మార్క్‌ఫెడ్ నిర్ణయించింది.

టీఆర్ఆర్‌కు డాక్టరేట్



సాక్షి, హైదరాబాద్: టీఆర్ఆర్ విద్యా సంస్థల చైర్మన్, పరిగి అసెంబ్లీ నియోజకవర్గం మాజీ శాసనసభ్యుడు టి.రామ్మోహన్‌రెడ్డికి బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో డాక్టరేట్ వచ్చింది. ఈమేరకు ఉస్మానియా విశ్వవిద్యాలయం ఒక ప్రకటనలో వెల్లడించింది. రామ్మోహన్‌రెడ్డికి గైడ్ టీచర్‌గా ఓయూ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ప్రొఫెసర్ వి.శేఖర్ ఉన్నారు. ఓయూ తాజాగా మరో ఏడుగురికి కూడా పీహెచ్‌డీ ప్రకటించింది.

దేశంలో సెకనుకో సైబర్ దాడి

నిత్యం ఇంటర్‌నెట్‌లోకి 9 లక్షల మాల్‌వేర్

- ఆందోళనకరమన్న సైబర్ నిపుణుడు కృష్ణశాస్త్రి
- 'హాక్' సమిట్‌లో సైబర్ నేరాలపై కీలకోపన్యాసం
- స్వీయ అనుభవాలను పంచుకున్న దర్శకుడు రాజమౌళి



కృష్ణశాస్త్రి

దర్శకుడు రాజమౌళికి జ్ఞాపికను అందిస్తున్న సీవీ ఆనంద్

సాక్షి, హైదరాబాద్: దేశంలో ప్రతి సెకనుకో సైబర్ దాడి జరుగుతోందని సైబర్ క్రైమ్ నిపుణుడు పెండ్యాల కృష్ణశాస్త్రి ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే, ప్రతి 11 సెకన్లకు ఓ సంస్థ లేదా వ్యక్తిపై ర్యాన్సమ్‌వేర్ దాడి జరుగుతోందన్నారు. బుధవారం హైదరాబాద్ పోలీసులు, హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ సంయుక్తగా నిర్వహించిన హైదరాబాద్ యాన్యువల్ సైబర్ సెక్యూరిటీ నాలెడ్జ్ సమిట్ (హాక్)–2023లో ఆయన కీలకోపన్యాసం చేశారు. నగర కొత్వాల్ సీవీ ఆనంద్ నేతృత్వంలో జరిగిన ఈ సమిట్‌కు హోంశాఖ మంత్రి మహమూద్ అలీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సదస్సులో కృష్ణశాస్త్రి ప్రసంగిస్తూ... 'అనునిత్యం ఇంటర్‌నెట్‌లోకి 9 లక్షల కొత్త మాల్‌వేర్ వచ్చిపడుతోంది. వీటిలో ఏ రెండింటికీ సారూప్యత ఉండట్లేదు. కోవిడ్‌కు ముందు చిన్న, మధ్య తరహా సంస్థల్లో 53 శాతం ఈ ఎటాక్స్ బారినపడితే.. కోవిడ్ తర్వాత ఇది 68 శాతానికి చేరింది. ఈ నేరాల్లో ఐడెంటిటీ థెఫ్ట్‌తోపాటు ఉద్యోగులు చేసే డేటా చోరీలు ఎక్కువగా ఉంటున్నాయి. ఇటీవల రాజకీయ కారణాలతోనూ సైబర్ దాడులు జరుగుతున్నాయి. చిన్న, మధ్య తరహా సంస్థల్లో 65 నుంచి 70 శాతం కంప్యూటర్లను వాళ్లకు తెలియకుండానే సైబర్ నేరగాళ్లు తమ అధీనంలోకి తీసుకుంటున్నారు. వీటిని క్రిప్టోకరెన్సీ మైనింగ్ కోసం వాడుతున్నారు. ఈ తరహా సంస్థలు నిర్వహించే వారికి సైబర్ సెక్యూరిటీ ఏర్పాటు చాలా ఖరీదైన అంశంగా మారింది. ఈ ధోరణి మారడంతోపాటు డేటా లీక్ ప్రివెన్షన్ పాలసీలు అమల్లోకి రావాలి. సాధారణ హైజీన్‌తో (శుభ్రత) పాటు సైబర్ హైజీన్ అన్నది కీలకంగా మారాలి. బ్యాంకులను పర్యవేక్షించడానికి ఆర్బీఐ ఉన్నట్లు చిన్న, మధ్య తరహా సంస్థల పర్యవేక్షణకు ఏ వ్యవస్థా లేకపోవడమూ ఓ లోపమే. వీటికి పోలీసులే రెగ్యులేటింగ్ అథారిటీ కావాలి. ఏదేనీ సంస్థ లేదా వ్యక్తికి చెందిన కంప్యూటర్‌లోకి చొరబడి, డేటాను తమ అధీనంలోకి తీసుకుని ఎన్‌క్రిప్ట్ చేయడం, డీ–క్రిప్షన్‌కు డబ్బు డిమాండ్ చేయడం... ర్యాన్సమ్‌వేర్ దాడుల్లో పైకి కనిపించే సైబర్‌నేరాలు. అయితే సైబర్ నేరగాళ్లు తమ అధీనంలోకి తీసుకున్న డేటాను తస్కరిస్తుంటారు. యూరోపియన్ హ్యాకర్లు ఆయా సంస్థలకు చెందిన కస్టమర్ డేటా తీసుకుంటారు. ఈ డేటా సేకరించడం అక్కడి చట్టాల ప్రకారం తీవ్రమైన నేరం కావడంతో ఇలా చేస్తారు. భారత్‌కు చెందిన హ్యాకర్లను ఈ డేటా డార్క్ నెట్ సహా ఎక్కడైనా పట్టేస్తుంది. ఈ నేపథ్యంలోనే ఇక్కడి ర్యాన్సమ్‌వేర్ ఎటాకర్స్ ఆయా కంపెనీల సోర్స్ కోడ్‌ను తస్కరిస్తున్నారు' అని ఆయన పేర్కొన్నారు.

కొత్త కాల్స్‌కు స్పందించవద్దు

ఈ సమిట్ ముగింపు కార్యక్రమానికి హాజరైన ప్రముఖ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి, హెచ్‌సీఎస్‌సీ ప్రధాన కార్యదర్శి భరణి మధ్య ప్యానల్ డిస్కషన్ జరిగింది. తన యూనిట్‌లో పని చేసే కొండలు సైబర్ నేరంలో ఎలా మోసపోయాడు, తన స్క్రిప్ట్‌లు భద్రంగా ఉంచుకోవడానికి తాను ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటాను తదితర అంశాలను జక్కన్న వివరించారు. వివిధ సైబర్ నేరాలు జరిగే విధానం, వాటి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల్నీ వీరు చర్చించారు. '80 శాతం సైబర్ నేరాలు బాధితుల అవగాహన రాహిత్యం వల్ల, 20 శాతం దురాశ వల్ల జరుగుతుంటాయి. ఫోన్ కాల్, ఎస్సెమ్మెస్, వాట్సాప్ సందేశం... వీటిలో దేనికైనా స్పందించే ముందు ప్రతి ఒక్కరూ ఒక్క నిమిషం ఆలోచించాలి. కొత్త వారి ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దు' అని సూచించారు.

రోబోటిక్స్ ఫ్రేమ్‌వర్క్ రెడీ

- వచ్చే నెల మొదటి వారంలో ఆవిష్కరణ
- కసరత్తు పూర్తి చేసిన ఎమర్జింగ్ టెక్నాలజీస్ వింగ్
- అగ్రిడేటా మేనేజ్‌మెంట్ పాలసీ ఫ్రేమ్‌వర్క్‌పైనా కసరత్తు
- ఇప్పటికే నాలుగు కొత్త టెక్నాలజీ ఫ్రేమ్‌వర్క్‌లు విడుదల



సాక్షి, హైదరాబాద్: ప్రస్తుతం కొనసాగుతున్న నాలుగో పారిశ్రామిక విప్లవానికి కొత్త టెక్నాలజీ కీలకమని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. టెక్నాలజీకి ఉన్న భవిష్యత్ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఇప్పటికే పలు పాలసీలు, ఫ్రేమ్‌వర్క్‌లు సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా 'రోబోటిక్స్ ఫ్రేమ్‌వర్క్', 'అగ్రికల్చర్ డేటా మేనేజ్‌మెంట్ పాలసీ'లకు తుదిరూపుపై దృష్టి సారించింది. రోబోటిక్స్ ఫ్రేమ్‌వర్క్ విధి విధానాలతో కూడిన ముసాయిదాపై మార్చి 16న ఆ రంగానికి చెందిన భాగస్వాములతో ప్రత్యేక సమావేశం నిర్వహించింది. రాష్ట్రంలో రోబోటిక్స్ రంగం అభివృద్ధికి అవసరమైన సమగ్ర పాలసీకి తుదిరూపు ఇచ్చింది. ఈ నెల 25న రోబోటిక్స్ ఫ్రేమ్‌వర్క్‌ను విడుదల చేయాలని భావించినా, మే నెల మొదటి వారానికి వాయిదా పడింది. ఫ్రేమ్‌వర్క్ విడుదల సందర్భంగా పలు సంస్థలు, స్టార్టప్‌లతో ఒప్పందాలు కుదుర్చుకుంటామని ఎమర్జింగ్ టెక్నాలజీస్ వింగ్ డైరెక్టర్ రమాదేవి లంకా 'సాక్షి'కి తెలిపారు.

ఎనిమిది ఎమర్జింగ్ టెక్నాలజీలే కీలకం

రాబోయే రోజుల్లో ప్రధానంగా ఎనిమిది కొత్త టెక్నాలజీలు కీలక పాత్ర పోషిస్తాయని రాష్ట్ర ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్ అంచనా వేస్తోంది. ఏఐ, బ్లాక్ చెయిన్, క్లౌడ్, ఐఓటీ, డ్రోన్స్ అండ్ రోబోటిక్స్, ఆగ్మెంటెడ్ వర్చువల్ రియాలిటీ, స్పేస్ టెక్నాలజీ, అడిటివ్ మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నాలజీలే భవిష్యత్‌ను శాసిస్తాయని భావిస్తోంది.

4 ఫ్రేమ్‌వర్క్‌లు..4 సీఓఈలు

పరిశ్రమలు, స్టార్టప్‌లు, ఇతర సంస్థలను కొత్త టెక్నాలజీల వినియోగం, ఆవిష్కరణల దిశగా ప్రోత్సహించేందుకు ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్ ఫ్రేమ్‌వర్క్‌లను రూపొందిస్తోంది. ఇప్పటికే ఏఐ, డ్రోన్స్, స్పేస్‌టెక్, బ్లాక్ చెయిన్ ఫ్రేమ్‌వర్క్‌లను విడుదల చేసింది. ఈ ఫ్రేమ్‌వర్క్‌ల లక్ష్యాలను సాధించేందుకు ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్ నాలుగు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీఓఈ)లను కూడా ఏర్పాటు చేసింది. 'తెలంగాణ ఏఐ మిషన్', 'నేషనల్ సెంటర్ ఫర్ అడిటివ్ మాన్యుఫ్యాక్చరింగ్', 'సైబర్ సెక్యూరిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్', 'ఈ వేస్ట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభించాయి. 'స్పేస్ పార్క్' పేరిట మరో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

దేశ సంస్కృతి గొప్పదనం యువతకు తెలియాలి

గవర్నర్ తమిళిసై పిలుపు



సాక్షి, హైదరాబాద్: భారతదేశ గొప్ప సాంస్కృతిక, చారిత్రక వారసత్వాన్ని గురించి నేటి యువతరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని గవర్నర్ డా.తమిళిసై సౌందరరాజన్ అభిప్రాయపడ్డారు. పశ్చిమ దేశాల సంస్కృతి ప్రభావంతో కుంగుబాటులో ఉన్న యువతను మన సంస్కృతీ విలువల వైపు మళ్లించి ఆధ్యాత్మిక బాటలో నడిచేలా చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం విశ్వేశ్వరయ్య భవన్‌లో తెలుగు సంగమం కమిటీ ఆధ్వర్యంలో జరిగిన 'భారత్ దర్శన్' (ప్రధాని మోదీ 'ఏక్ భారత్, శ్రేష్టభారత్' కార్యక్రమ స్ఫూర్తితో చేపడుతున్న) ప్రారంభ కార్యక్రమంలో గవర్నర్ ప్రసంగించారు. తొలుత ఆమె తెలుగులోనే మాట్లాడారు. భారత్ దర్శన్ పేరిట చేపడుతున్న కార్యక్రమం ద్వారా వివిధ రాష్ట్రాలకు వెళ్లే కొద్దీ మనుషుల మధ్య స్నేహసంబంధాలు పటిష్టమవుతాయని అన్నారు. బీజేపీనేత, మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి పి.మురళీధర్‌రావు మాట్లాడుతూ భారత్ దర్శన్‌లో భాగంగా హైదరాబాద్ నుంచి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ వరకు వివిధ చారిత్రక, పుణ్యక్షేత్రాల సందర్శన ఉంటుందన్నారు. జాతీయవాదాన్ని దృష్టిలో పెట్టుకుని దర్శన యాత్ర చేపట్టామని వివరించారు.

15 నుంచి యాత్ర మొదలు

ఈ నెల 15 నుంచి 21వ తేదీ వరకు సుమారు 500 మంది హైదరాబాద్ నుంచి మహారాష్ట్ర మధ్యప్రదేశ్‌లను చుట్టివచ్చేలా కార్యక్రమం రూపొందించారు. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్, నాగ్‌పూర్ చేరుకున్న బృందానికి మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ స్వాగతం పలుకుతారు. వార్దాలో గాంధీ సేవాగ్రామ్ మీదుగా భోపాల్ చేరుకుంటారు. భోపాల్‌లో మధ్యప్రదేశ్ సీఎం శివప్రకాశ్ చౌహాన్‌ను కలుసుకుంటారు. ఉజ్జయిని మహాకాళ్, ఓంకాళేశ్వరం జ్యోతిర్లింగాల దర్శనం తర్వాత తిరుగు ప్రయాణంలో నాందేడ్ మీదుగా హైదరాబాద్‌కు చేరుకుంటారు. ఆహ్వాన కమిటీ కార్యదర్శి ఎల్. వీరగోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయకార్యదర్శులు అర్వింద్ మీనన్, సునీల్ దేవధర్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఆహ్వాన కమిటీ చైర్మన్ మాజీ సీఎస్ ఐవైఆర్ కృష్ణారావు, వైస్ చైర్పర్సన్ ఆవుల మంజులత పాల్గొన్నారు.

ఎంసెట్‌కు అదనపు కేంద్రాలు

సాక్షి, హైదరాబాద్: ఎంసెట్‌కు దరఖాస్తులు పెరగడంతో అదనపు పరీక్షా కేంద్రాల ఏర్పాటుపై అధికారులు యోచిస్తున్నారు. ఏపీలోనూ మరికొన్ని కేంద్రాలు అవసరమని గుర్తించారు. పరీక్షా కేంద్రాల పెంపుపై జేఎన్టీయూహెచ్ అధికారులు ఇప్పటికే క్షేత్రస్థాయి నివేదికలు తెప్పించారు. మరో 15–20 కొత్త సెంటర్ల ఏర్పాటు అవసరమని భావిస్తున్నారు. ఈ ఏడాది ఎంసెట్ దరఖాస్తులు 3 లక్షలు దాటిన విషయం తెలిసిందే. దరఖాస్తుల స్వీకరణకు గడువు ఉంది. దీంతో సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉండటంతో అధికారులు కొత్త సెంటర్ల వేటను ప్రారంభించారు. ఆన్‌లైన్ ఎగ్జామ్ నిర్వహించే వసతి, నిరంతర విద్యుత్, ఇంటర్నెట్, జనరేటర్ వంటి సౌకర్యాలున్న కేంద్రాలను గుర్తించే పనిలో పడ్డారు. ఇంజనీరింగ్‌కు 6 సెషన్లు, ఫార్మసీ అండ్ అగ్రికల్చర్‌కు 4 సెషన్లల్లో పరీక్షలు నిర్వహించాలని ఇప్పటికే నిర్ణయించారు. ఎంసెట్ నిర్వహించే తేదీకి ముందు.. తర్వాత, యూజీసీ నెట్, టీఎస్‌పీఎస్సీ, ఏపీ ఎంసెట్ వంటి పరీక్షలను ఆన్‌లైన్‌లోనే నిర్వహించనున్నారు. దీంతో ముందుగా నిర్ణయించిన ప్రకారం మే 10 నుంచి 14 వరకు ఎంసెట్‌ను నిర్వహించాల్సిన పరిస్థితి తలెత్తింది. దీంతో అనివార్యంగా కొత్త సెంటర్లను ఏర్పాటు చేయాల్సి వస్తోంది.

విద్య అంతా ఇక క్రెడిట్స్సే

సాక్షి, హైదరాబాద్: జాతీయ స్థాయిలో ఒకే విద్యా విధానం ఉండాలన్న ఆలోచనకు అనుగుణంగా జాతీయ క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించామని యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యూజీసీ) చైర్మన్ ప్రొఫెసర్ జగదీష్‌కుమార్ స్పష్టం చేశారు. జాతీయ విద్యావిధానం–2020కి అనుగుణంగా పాఠశాల విద్య నుంచే క్రెడిట్స్ ఇవ్వడం దీని ఉద్దేశమని చెప్పారు. నేషనల్ క్రెడిట్ ఫ్రేమ్ వర్క్ (ఎన్‌సీఆర్ఎఫ్)ను యూజీసీ సోమవారం విడుదల చేసింది. దీనిపై వస్తున్న సందేహాలపై యూజీసీ ఛైర్మన్ సమగ్ర వివరణ ఇచ్చారు. అంతర్జాతీయ స్థాయిలోనూ ఏకీకృత విధానాన్ని అనుసరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు.

ఏమిటీ ఎన్‌సీఆర్ఎఫ్?


విద్యావిధానానికి జాతీయ స్థాయి గుర్తింపు ఇవ్వడం దీని ఉద్దేశం. దీనికోసం సమీకృత క్రెడిట్ విధానాన్ని అన్ని విద్యా సంస్థలు అనుసరిస్తాయి. పాఠశాల, ఉన్నత విద్య, ఒకేషనల్, స్కిల్ ఎడ్యుకేషన్.. ఏదైనా మార్కులతో పనిలేకుండా క్రెడిట్స్‌గానే పరిగణిస్తారు. దీనికోసం జాతీయ స్థాయిలో పాఠశాల, ఉన్నత విద్య, నైపుణ్య విద్యలకు ప్రత్యేక క్రెడిట్ విధానంతో మార్గదర్శకాలను కేంద్రం విడుదల చేసింది.

క్రెడిట్ విధానం అంటే..?

వివిధ స్థాయిల్లో మార్కుల స్థానంలో క్రెడిట్స్ ఇస్తారు. ఒక విద్యార్థి సంవత్సరంలో రెండు సెమిస్టర్లలో 30 గంటల బోధన (ఏదైనా సబ్జెక్టులో) తరగతులకు హాజరవ్వాలి. ప్రతీ సెమిస్టర్‌కు 20 క్రెడిట్స్ ఉంటాయి. ఏడాదికి 40 క్రెడిట్స్ వస్తాయి. అన్ని సబ్జెక్టులు కలిపి 1200 గంటల బోధన సమయంలో విద్యార్థి 40 క్రెడిట్స్ పొందే వీలుంటుంది. విద్యార్థి 5వ తరగతి పూర్తి చేసిన తర్వాత దీన్ని లెవల్–1గా భావిస్తారు. 6–8 తరగతులు పూర్తి చేస్తే లెవల్–2, తర్వాత 9, 10 తరగతులు పూర్తి చేస్తే లెవల్–3గా, 11, 12 పూర్తి చేస్తే లెవల్–4గా గుర్తిస్తారు. స్కూల్ విద్య మొత్తంగా 160 క్రెడిట్స్ ఉంటాయి. మూడేళ్ళ బ్యాచిలర్ డిగ్రీలో ప్రతి సంవత్సరం 40 క్రెడిట్స్ చొప్పున మొత్తం 120 క్రెడిట్స్ ఉంటాయి. నాలుగేళ్ళ డిగ్రీని 6.5 లెవల్‌గా, మూడేళ్ళ డిగ్రీ తర్వాత మాస్టర్ డిగ్రీని లెవల్ 7గా, నాలుగేళ్ళ ఇంజనీరింగ్ డిగ్రీ, పీహెచ్‌డీని కలిపి 8 లెవల్‌గా చూస్తారు. పీహెచ్‌డీ పూర్తిచేసిన విద్యార్థికి మొత్తం 320 క్రెడిట్స్ ఇస్తారు. ఒకేషనల్, స్కిల్ ఎడ్యుకేషన్‌కు కూడా వివిధ స్థాయిలో (4.5 నుంచి 8 లెవల్స్) క్రెడిట్స్ ఉంటాయి.

ఏ కోర్సు చేసినా ఏదో ఒక క్రెడిట్

- పాఠశాల విద్య నుంచీ ఇదే పద్ధతి
- జాతీయ స్థాయిలో క్రెడిట్ బ్యాంక్
- అదనపు కోర్సులు చేస్తే స్థాయిలో మార్పు
- అంతర్జాతీయ విధానంతో ముందుకు
- క్రెడిట్ ఫ్రేమ్ వర్క్‌పై యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ జగదీష్‌కుమార్



క్రెడిట్స్ నిల్వ ఇలా...

ప్రతీ లెవల్‌లో విద్యార్థి సాధించిన క్రెడిట్స్ అన్నీ అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ (ఏబీసీ) టెక్నాలజీ ప్లాట్‌ఫాంలో నిక్షిప్తమై ఉంటాయి. ప్రతి విద్యా సంస్థ ఈ ప్లాట్‌ఫాం కిందకు వస్తుంది. క్రెడిట్స్ ఆధారంగానే విద్యార్థి స్థాయిని ఎన్‌సీఆర్ఎఫ్ నిర్ణయిస్తుంది. ఉదాహరణకు టెన్త్ తర్వాత ఐటీఐ పాస్ అయిన విద్యార్థి అదనంగా లాంగ్వేజ్ కోర్సు చేస్తే ఇది 12వ క్లాసుకు సమానం అవుతుంది. అతను యూనివర్సిటీలో చేరేందుకు వీలు కల్పిస్తుంది. అదే విధంగా 5వ స్థాయి విద్యార్థి బ్రిడ్జ్ కోర్సులు అదనంగా చేస్తే అదనపు క్రెడిట్స్ వస్తాయి. అతను నేరుగా 8వ క్లాసు పరీక్షకు హాజరవ్వొచ్చు. విద్యార్థి ఆన్‌లైన్ కోర్సులు చేసినా ఆ క్రెడిట్స్‌ను కూడా లెక్కలోకి తీసుకుంటారు. క్రెడిట్స్‌ను లెక్కగట్టడానికి ప్రత్యేక మార్గదర్శకాలను కేంద్రం విడుదల చేసింది. ఇవి అకడమిక్, స్కిల్, అనుభవం ద్వారా పొందే విద్యను బట్టి ఉంటాయి.

ఇవి కూడా క్రెడిట్సే..

అకడమిక్ విద్యే కాదు... క్రీడలు, ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్, మ్యూజిక్, హెరిటేజ్, ట్రెడిషనల్ స్కిల్స్, ఫైన్ ఆర్ట్స్ వంటి ప్రత్యేక కళలకూ క్రెడిట్స్ ఇస్తారు. ఇవి కూడా క్రెడిట్ బ్యాంకులో చేరతాయి. క్రెడిట్ సిస్టమ్‌ను ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో అనుసరిస్తున్నారు. కొన్ని క్రెడిట్స్‌ను అన్‌స్కిల్డ్, కొన్ని క్రెడిట్స్‌ను స్కిల్ అని అంచనా వేస్తున్నారు. దీనికి అనుగుణంగానే మన దేశమూ అంతర్జాతీయ స్థాయిలో క్రెడిట్ విధానం ఇచ్చేందుకు ప్రయత్నిస్తోంది.



20 లక్షల ఏళ్లు.. ఆగకుండా వానలు!

వాన అంటే అందరికీ ఇష్టమే. అదీ రెండు, మూడు రోజులు పడితే ఓకే.. మరి వారం పాటు దంచి కొడితే!? అమ్మో.. అంతా ఆగమాగమే అంటారు కదా! అదే కొన్నేళ్లపాటు వానలు పడితే.. అలా వేలు, లక్షల ఏళ్లపాటు కురుస్తూనే ఉంటే.. వామ్మో అనిపిస్తోందా? కానీ ఇది నిజమేనని, భూమిపై ఏకంగా 20 లక్షల ఏళ్లపాటు వర్షం పడిందని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. మరి అంత వాన ఎక్కడ పడింది? ఎందుకు పడింది? దాని వల్ల ఏం జరిగిందనే సంగతులు తెలుసుకుందామా.. – సాక్షి సెంట్రల్ డెస్క్

భూమి పొరలను పరిశీలిస్తుండగా..



1970వ దశకంలో కొందరు శాస్త్రవేత్తలు భూఉపరితలానికి సంబంధించి పరిశోధనలు చేస్తుండగా.. పురాతన రాళ్లలో అసాధారణమైన బూడిద రంగు పొరలను గమనించారు. అవి సిలికా (ఇసుక), మట్టితో ఏర్పడ్డాయని.. ప్రపంచ వ్యాప్తంగా చాలాచోట్ల ఇలా ఉన్నాయని గుర్తించారు. కార్బన్ డేటింగ్ పరీక్షలు చేసి.. సుమారు 23 కోట్ల ఏళ్ల కింద ఆ పొరలు ఏర్పడినట్టు తేల్చారు. అవి ఇసుక, మట్టి తీవ్రస్థాయిలో పీడనానికి గురై ఏర్పడినట్టు నిర్ధారించారు. ఈ పొరల మందం, అవి మొదలై, ముగిసిన సమయాన్ని అంచనా వేసి.. సుమారు 20 లక్షల ఏళ్ల పాటు నిరంతరం వాన కురవడంతో అలా ఏర్పడినట్టు శాస్త్రవేత్తలు చెప్తున్నారు.

అంతా ఒకే ఖండంగా ఉన్నప్పుడు..



➤ 23 కోట్ల ఏళ్ల కింద భూమ్మీద ఖండాలన్నీ కలిసి ఒకే అతిపెద్ద ఖండం 'పాంజియా'గా ఉండేది. అప్పటిదాకా వానలు తక్కువగా ఉండి.. వేడి వాతావరణం కొనసాగింది. ఆ సమయంలో గ్రహ శకలాలు ఢీకొనడం, భూమి పైపొరలోని టెక్టానిక్ ప్లేట్ల కదలికలు తీవ్రమై అతిభారీ స్థాయిలో అగ్ని పర్వతాల విస్ఫోటనాలు జరిగాయి. వాతావరణంలోకి చేరిన పొగ, దుమ్ము, ధూళి వల్ల ఒక్కసారిగా గ్లోబల్ వార్మింగ్ ఏర్పడింది. సముద్రాల్లో నీరు వేడెక్కి ఆవిరై.. గాలిలో ఆవిరి శాతం (హ్యూమిడిటీ) బాగా పెరిగింది. ఆ గాలులు 'పాంజియా' వైపు వీయడం, చల్లబడి వానలు కురవడం మొదలైంది. ఇదిలా 20 లక్షల ఏళ్లపాటు కొనసాగింది. ఈ పరిస్థితులు, తర్వాతి పరిణామాలకు 'కార్నియన్ ప్లూవియల్ ఈవెంట్'గా పేరుపెట్టారు.

తొలుత నాశనం.. ఆ తర్వాత సృష్టి..



➤ కార్నియన్ ప్లూవియల్ ఈవెంట్ మొదట్లో జీవరాశుల నాశనానికి దారి తీసింది. ఉష్ణోగ్రతలు, విష వాయువులు పెరగడంతో మొక్కలు, చెట్లు, జంతువులకు సమస్యగా మారింది. అగ్నిపర్వతాల నుంచి వెలువడిన విషవాయువులు, దుమ్ము మేఘాల్లో కలిసి ఆమ్ల వర్షాలు (యాసిడ్ రెయిన్స్) కురిశాయి. అటు సముద్రాల్లో నీరు వేడెక్కడం, ఆమ్లత్వం పెరగడం, ఆక్సిజన్ స్థాయి తగ్గడంతో జలచరాలూ తగ్గిపోయాయి. మొత్తంగా దాదాపు 80శాతానికి పైగా జీవరాశి అంతరించినట్టు అంచనా. అయితే కార్నియన్ ఈవెంట్ చివరిదశకు వచ్చేప్పటికి ఖండాలు విడివడటం మొదలై.. అగ్ని పర్వతాల విస్ఫోటనాలు తగ్గిపోయాయి. భూమ్మీద వేడి తగ్గిపోయింది. వానలు ఒక క్రమానికి పరిమితమై.. జీవానికి అనుకూలమైన, ఆహ్లాదకర వాతావరణం ఏర్పడింది. ఇది మొక్కలు, జంతువులు సహా ఎన్నో కొత్త జీవరాశుల పునరుత్థానానికి దారితీసింది.

డైనోసార్ల ఆధిపత్యానికి తోడ్పడి..



➤ కార్నియన్ ఈవెంట్ మొదలయ్యే నాటికే డైనోసార్లు, పలు ఇతర జీవరాశుల ఎదుగుదల మొదలైంది. ఈవెంట్ నాటి పరిస్థితులను బాగా తట్టుకోగలిగిన డైనోసార్లు.. ఈవెంట్ తర్వాత బాగా ప్రయోజనం పొందాయి. వాటిలో ఎన్నో ఉప జాతులు ఉద్భవించి జీవరాశిపై ఆధిపత్యం చలాయించాయి. ఇదే సమయంలో జీవ పరిణామం బాగా వేగం పుంజుకుంది. తాబేళ్లు, మొసళ్లు, బల్లులు వంటివాటితోపాటు పాలిచ్చి పెంచే వివిధ రకాల జీవులు (మమ్మాల్స్) అభివృద్ధి చెందాయి.

భూమ్మీద ఇప్పుడున్న జీవంలో చాలా వరకు 'కార్నియన్ ప్లూవియల్ ఈవెంట్' నాటి పరిస్థితులే తోడ్పడ్డాయని భూతత్వ, ఫోరెన్సిక్ శాస్త్రవేత్త అలస్టేర్ రఫెల్, పురాతత్వ శాస్త్రవేత్తలు (పేలియోఎన్విరాన్‌మెంటిస్ట్స్) జకొపో డాల్ కోర్సో, పాల్ విగ్నల్ వెల్లడించారు. ఈ పరిశోధన వివరాలు ఇటీవల న్యూసైంటిస్ట్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

అక్కడ 20 లక్షల ఏళ్లుగా వానలే లేవు..



➤ ఒకప్పుడు 20 లక్షల ఏళ్లు వాన పడితే.. అసలు గత20 లక్షల ఏళ్లుగా చుక్క వాన పడని ప్రాంతమూ ఒకటుంది తెలుసా.అంటార్కిటికాలో మెక్‌మర్డో డ్రైవ్యాలీగా పిలిచేచోట దాదాపు 20 లక్షల ఏళ్లుగా వాన, మంచు వంటివేవీ కురవలేదని శాస్త్రవేత్తలు గత ఏడాదే నిర్ధారించారు. అతి తక్కువ హ్యూమిడిటీ, డ్రైవ్యాలీకి చుట్టూ ఉన్న పెద్ద కొండలు, గాలులు వీచే దిశ వంటివి దీనికి కారణమని తేల్చారు.

ఐదంచెల దరఖాస్తు వ్యవస్థ

- గురుకుల కొలువుల కోసం ప్రత్యేకంగా వెబ్‌సైట్
- ఓటీఆర్‌ను అందుబాటులోకి తెచ్చిన టీఆర్ఈఐఆర్బీ
- దశల వారీగా దరఖాస్తు పూర్తికి బోర్డు సూచనలు
- ఓటీఆర్ షురూ కావడంతో వెబ్‌సైట్‌పై తీవ్ర ఒత్తిడి

ఐదు అంచెలు ఇలా..

స్టెప్–1	: రిజిస్ట్రేషన్
స్టెప్–2	: సైన్ ఇన్
స్టెప్–3	: పరీక్ష ఫీజు చెల్లింపు
స్టెప్–4	: దరఖాస్తు పూరించడం
స్టెప్–5	: అప్లికేషన్ ఫామ్ ప్రింట్

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల్లో ఉద్యోగాల భర్తీకి సంబంధించి దరఖాస్తు ప్రక్రియ ఐదు అంచెల్లో సాగనుంది. ఇందుకోసం తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు (టీటీఆర్ఈఐఆర్బీ) ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను రూపొందించింది. బోర్డు ఒకేసారి 9 నోటిఫికేషన్లు జారీ చేసి 9 వేలకు పైగా ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టిన నేపథ్యంలో.. ఒక అభ్యర్థి తన అర్హతల మేరకు ఒకటి కంటే ఎక్కువ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. దీంతో అభ్యర్థి ఆన్‌లైన్‌లో ప్రతిసారి దరఖాస్తు సమయంలో వివరాలను సమర్పించాల్సిన అవసరం లేకుండా వన్ టైమ్ రిజిస్ట్రేషన్ (ఓటీఆర్) ప్రక్రియను తీసుకొచ్చింది. గతంలో కేవలం ప్రిన్సిపాల్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు మాత్రమే ఓటీఆర్ పూర్తి చేయాల్సి ఉండేది. తాజాగా తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) మోడల్‌ను అనుసరిస్తూ ప్రతి అభ్యర్థికీ ఓటీఆర్‌ను తప్పనిసరి చేసింది.

పెద్ద సంఖ్యలో దరఖాస్తులొస్తాయనే అంచనాతో..

సుదీర్ఘ కాలం తర్వాత గురుకుల బోర్డు భారీ సంఖ్యలో ఉద్యోగాల భర్తీకి ప్రకటనలు జారీ చేయడంతో, దరఖాస్తులు కూడా పెద్ద సంఖ్యలో వస్తాయని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో దరఖాస్తు ప్రక్రియ సులభతరంగా ఉండేందుకు టీటీఆర్ఈఐఆర్బీ ఐదు అంచెల పద్ధతి అనుసరిస్తోంది. దరఖాస్తు చేయాలనుకున్న అభ్యర్థి ముందుగా బోర్డు వెబ్‌సైట్‌ను తెరిచి ఆన్‌లైన్ అప్లై అనే ఆప్షన్ ద్వారా పేజీ తెరిచి దరఖాస్తు ప్రక్రియను ప్రారంభించాలి. తొలుత ఓటీఆర్ పూర్తి చేసుకోవాలి. ఆ తర్వాత అభ్యర్థికి యూజర్ ఐడీ, పాస్ వర్డ్ తయారవుతుంది. అనంతరం ఆ వివరాలతో లాగిన్ అయ్యాక పరీక్ష ఫీజును చెల్లించాలి. ఆ తర్వాత ఎంపిక చేసుకున్న పోస్టుకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్ దరఖాస్తు పత్రంలో పూరించి సబ్మిట్ చేయాలి. చివరగా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ అయిన దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రింట్ తీసుకోవాల్సి ఉంటుంది. ఈ దరఖాస్తు పత్రం అత్యంత కీలకం. ఉద్యోగానికి ఎంపికైన సమయంలో ఈ దరఖాస్తు పత్రం అవసరమవుతుందని అధికారులు చెబుతున్నారు.

వన్ టైమ్ రిజిస్ట్రేషన్ ప్రారంభం

టీటీఆర్ఈఐఆర్బీ వెబ్‌సైట్‌లో ఓటీఆర్ ప్రక్రియ బుధవారం నుంచి అందుబాటులోకి వచ్చింది. ఈ నెల 17వ తేదీ నుంచి వివిధ ఉద్యోగాలకు సంబంధించిన దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు వెంటనే ఓటీఆర్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని స్పష్టం చేసింది. ఆధార్ కార్డు నంబర్ ద్వారా ఓటీఆర్ ఫారాన్ని తెరిచి, వివరాలను నమోదు చేసి, సంబంధిత ధ్రువపత్రాలను కూడా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. కాగా బుధవారం తొలిరోజు అభ్యర్థులు పెద్ద ఎత్తున వెబ్‌సైట్‌ను తెరిచారు. దీంతో వెబ్‌సైట్‌పై ఒత్తిడి పెరిగి పేజీ తెరుచుకోవడంలో తీవ్ర జాప్యం జరిగినట్లు తెలిసింది. దీంతో బోర్డుకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అనంతరం అధికారులు చర్యలు చేపట్టడంతో సాయంత్రానికి వెబ్‌సైట్ కాస్త స్పీడందుకుంది.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.